53995

# ప్రాచ్య - పాశ్చాత్య తత్వ పరంపర తులనాత్మక అధ్యయనం

రచయిత :

మన్నం వెంకట సుబ్బయ్య M.Sc.,

తిరుమల తిరుపతి దేవస్థానముల వారి
ఆర్థిక సహాయ సౌజన్యముతో ముద్రితమైనది.

First addition : October, 1994.

Copies : 1000

Price Rs : 20-00

... VENKATESWA...
CENTRAL LIBRARY ...
RESEARCH CENTRE
Acc. No. 53995
Date...
TIRUPATI

Published by :
M. Venkata Subbaiah
192-B, Ashok Nagar,
TIRUPATHI. Chittoor Dist.
(A.P.).

Printed by : Sree Vijaya Sai Printers.
Yerpedu - 517 619. Chittoor Dist.

# ముందుమాట

నేను Physics (భౌతిక శాస్త్రం) లో మాస్టర్ డిగ్రీ తీసికొన్నాను. metaphysics (పారభౌతిక శాస్త్రము) పైగల ఆసక్తిచే దానిని తెలుసుకొనుట కారంభించితిని. దానికై వివిధ పుస్తకములను సేకరించి చదువవలసివచ్చింది. అప్పుడే ప్రాచ్య, పాశ్చాత్య తత్వ సిద్ధాంతములన్నియు ఒకే పుస్తకరూపంలో ఉంటే బాగుంటుందని తలంపు కల్గినది. అంతేగాకుండా తెలుగు భాషలో సరళ రీతిలో అటువంటి సంకలనము ఇంతవరకు లేనందున, నాకు వీలైనంత వరకు సరళమైన భాషలో తత్వసిద్ధాంతములన్నింటిని ఒకే పుస్తక రూపములోనికి తేవటానికి నా శాయశక్తులా కృషి చేశాను.

వెనుకటి కొకరు తత్వశాస్త్రాన్ని "ఒక గ్రుడ్డివాడు కటిక చీకటిగదిలో లేని నల్లపిల్లిని వెదుక బోవటమేనని" అన్నాడు. అంటే ఫిలాసఫీ చదవడము శుద్ధదండుగ అని అతని భావం. నేడు మనలో ఎక్కువమంది భావం కూడాను. కాని ఆలోచన మానవ సహజము. దానినుండి మనం దూరము కాలేము. ఆలోచన నుండే తత్వశాస్త్రము ఉద్భవించింది. దానినుండే నేటి సమస్త విజ్ఞాన శాస్త్రాలు ఆవిర్భవించాయి. అందుకే సమస్త విజ్ఞాన శాస్త్రాలకు ఫిలాసఫీ రాణి అని అంటారు. అంతేగాక తత్వసిద్ధాంతాల ప్రభావం సామాజిక, రాజకీయ రంగాలపై విశేష ప్రభావం చూపిస్తాయి, చూపెట్టాయి కూడాను. బౌద్ధం, గీత, మార్క్సిజం ఆయా కాలములలో సమాజంపై ఎంతటి ప్రభావాన్ని చూపెట్టాయో మనందరకు తెలుసు. మానవుడు సంఘజీవి. నైతికత ఆచార వ్యవహారములు మానవసంఘ నిర్భయ జీవితానికి అత్యావశ్యకము. కావున వాటిని ప్రభావితము చేయుగల తత్వశాస్త్రాన్ని అలక్ష్యం చేయుటము తగదు.

ఈ ప్రపంచానికి మూలమేమిటి? మనలను ఎవరైనా శాసిస్తున్నారా? పాపపుణ్యాలు ఉన్నాయా? ఉంటే అవి జీవులను ఏవిధంగా ప్రభావితం చేస్తాయి? అసలు చేస్తాయా? పునర్జన్మ ఆత్మ, పూర్వజన్మ కర్మఫలం యొక్క సంబంధమేమి? అను మౌలిక ప్రశ్నలు

ప్రతి మనిషిలోనూ ఏదో ఒకసమయంలో మనస్సును తొలచి ఆలోచింప చేస్తాయి దానిని గురించి కొన్ని నిముషములైనా ఆలోచించని వారుండరుకదా! ఈ ప్రశ్నల సమాధానములకై కొందరు తమ జీవితాలనే త్యాగంచేశారు. వీటికి రకరకాల తత్త్వవేత్తలు రకరకాల సమాధానాలు చెప్పారు. ప్రతిదానిలోను పాక్షిక సత్యము లేకపోలేదు. దీనిని ఈ క్రింది ఉదాహరణముతో చెప్పవచ్చు. ఐదుగురు గ్రుడ్డివాళ్ళను ఏనుగును వర్ణించమంటే, తొండమును పట్టుకొన్నవాడు ఏనుగు పాములా ఉన్నదన్నాడట. తోకను పట్టుకొన్నవాడు తాడులా ఉన్నదన్నాడట. చెవి పట్టుకొన్నవాడు చేటలా ఉన్నదన్నాడట. కాళ్ళు పట్టుకొన్నవాడు స్తంభములాగున్నదన్నాడట. దాని శరీరమును స్పృశించలేని వాడు ఏమీ లేదన్నాడట. కాని ప్రతిఒక్కటి వర్ణనములోనూ కొంత సత్యమున్నది. కాని ఏఒక్కటి పూర్తిసత్యము కాదు. కాని ఆ వర్ణనములన్నిటిని కలగలిపి ఆలోచించగల్గితే సంపూర్ణసత్యము కొంతమేరకైనా బోధపడవచ్చుగదా! కావున ఇప్పటివరకు తెలిసిన తత్త్వసిద్ధాంతములన్నిటిని మొదట తెలుసుకొనుట మంచిదికదా! ఒకసారి న్యూటన్ "ఎందరో మహానుభావుల భుజాల మీదనుంచి చూసే అదృష్టము నాకు కల్గినందుకు గర్విస్తున్నాను" అని అన్నాడట కావున ప్రపంచ పరిశోధనములకు ముందు ఇప్పటివరకు ఇతరులు చెప్పిన భావాలను తెలుసుకొని వాటిని సంశ్లేషణ, విశ్లేషణముల నొనర్చి మన స్వీయ అభిప్రాయములను ఏర్పరుచుకొనుట లేదా ప్రకటించుట సముచితముగా నుంటుందని నా అభిప్రాయము, నూతన పాఠకులకు ఫిలాసఫీ మొదటిసారి చదివినప్పుడు అర్థము కానట్లుగా ఉన్ననూ రెండవసారి చదివేసరికి తప్పకుండా అర్థమౌతుందని, వారి మనస్సు మరింత విశాలమౌతుందని, ఒక నూతన దృక్పథము జీవితములో ఏర్పడుతుందని నా మనవి.

మన్నం వెంకట సుబ్బయ్య

E.C.I.L., TIRUPATI.

# ప్రాచ్య - పాశ్చాత్య తత్వ పరంపర- తులానాత్మక అధ్యయనం

## గ్రీకుల పూర్వరంగము

ఆదిమ మానవుడు దాదాపుగా క్రీస్తు పూర్వం 4000 సంవత్సరముల నాడు నాగరికత నేర్చుకొన్నాడు. మనకు చారిత్రాత్మకంగా తెలుస్తున్నవి నదీ తీరాలలో వెలసిల్లిన మూడు నాగరికతలు.

1) టైగ్రీసు, యుప్రెటిజ్ నదుల మధ్య మెసపుటోమియాలో వర్థిల్లిన సుమేరియన్ నాగరికత. వీరు క్రీస్తు పూర్వము 4000 — 3000 మధ్య పెద్ద పెద్ద నగరాలు నిర్మించారు.

2) నైలునదీ తీరాన వర్థిల్లిన ఈజిప్టు నాగరికత క్రీ.పూ. 4000 – 3000 మధ్య వీరు నిర్మించిన పిరమిడ్లు ఇప్పటికీ ప్రపంచములోని ఏడు వింతలలో నొకటిగా పరిగణింప బడుతున్నవి.

3) సింధునదీ తీరాన వెలసిల్లిన క్రీ.పూ. 3000 నాటి హరప్పా మొహంజదారో నాగరికత. ఆర్యుల దండయాత్రలో అవి శిధిలమై వేదయుక్తమైన ఆర్య నాగరికత ఇండియాలో వ్యాప్తి చెందింది.

తత్వశాస్త్రానికి పుట్టినిల్లు గ్రీకు దేశము అని పేరు తెచ్చుకొన్న గ్రీకు నాగరికత దాదాపుగా క్రీ.పూ. 1500 – 900 సంవత్సరముల మధ్య కాలమునాటిది. ఏ తత్వశాస్త్రం అయినా ఆయా తత్వ వేత్తల మెదడునుండి పుట్టుకురాదు. అంతకు ముందు వర్థిల్లిన నాగరికతలు, సంస్కృతులు, మతభావాలు వాటిపై ప్రభావం కల్గిఉంటాయి కావున గ్రీకుల తత్వభావాలను తెలుసుకొనిబోయే ముందు వారి మతభావాలను గూర్చి క్లుప్తముగా తెలుసుకొందాము.

గ్రీకులకు ఇతిహాసాలు హోమర్ రచించిన "ఇలియడ్" "ఒడిస్సీ" వీటికి కూడా మన భారత రామాయణములకున్నంత విలువ ఉన్నది. ట్రోజన్ యుద్ధం ఇలియడ్ యొక్క ప్రధాన ఇతివృత్తం. గ్రీకు రాజు భార్య హెలెన్ ట్రాయ్ నగర యువరాజు అతిధిగా వచ్చి హెలెన్‌ను ఎత్తుకుపోతాడు. గ్రీకు రాజు ట్రాయను ముట్టడించి పదేళ్లు యుద్ధం చేసి ఆ నగరాన్ని నేలమట్టం చేస్తాడు. దాదాపు రామాయణంలానే ఉందిగదా! ట్రోజన్ యుద్ధంలో పాల్గొన్న గ్రీకు వీరుడు ఒడీసియున్ ప్రపంచాటన సాహసగాధే ఒడిస్సీ వారిమత విశ్వాసాలన్నీ ఆ గ్రంథాలలో ఉన్నాయి. గ్రీకు దేవతల నివాసం ఒలంపస్ పర్వతం వారి దేవతల రాజు జూస్. ఆయన ఆయుధం పిడుగు. జూస్ కూడా ఇంద్రుని వలనే మానవ కాంతలను మోహించడం లాంటి తప్పుడు పనులు చేశాడు. వారి దేవతలందరు అమిత శక్తి సంపన్నులు. వారికి తక్కిన మతాల వలె సృష్టికర్తయైన దేవుడు లేడు. వారి విశ్వాసం ప్రకారము చీకటి నుండి విశ్వం ఆవిర్భవించింది. అప్పుడు భూమి, స్వర్గం ఏర్పడ్డాయి. ఈ రెండింటి సంయోగము వలనే మానవజాతి పుట్టింది కావుననే గ్రీకులకు సృష్టికర్త లేనందున మొదటగా ప్రపంచానికి మూల కారణము వెదుకుతూ భౌతిక వాదానికి ఆద్యులయ్యారు. అంతే గాక రాజుల, మతాధికారుల ప్రాముఖ్యము తక్కువగా నుండుటచే నిర్భయముగా మతవిశ్వాసాలను వదలి హేతుబద్ధంగా ప్రపంచానికి మూలమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానముగా రకరకాల భావాలను గ్రీకు తత్వవేత్తలు మొదటగా ప్రపంచానికి ఇవ్వగలిగారు.

గ్రీకులకు కూడా మన ఆటవిక యోగాచారాల వలనే ఇల్యూసినియన్, ఆర్ఫిక్ మతాచారాలు ఉన్నాయి వాటి కాదారంగా జాతరలు క్రతువులు జరుపుతూఉండేవారు. మానవుడి ఆత్మ వేరు, దేహం వేరు మానవుని లక్ష్యం అమరత్వాన్ని సాధించడం.

దేహంనుంచి ఆత్మను విముక్తి చేయడానికి నైతిక నియమబద్ధ జీవితాన్ని గడపడమే మార్గం మొదలైన భావాలన్నీ ఆర్ఫిజమ్ మతంనుంచే వచ్చాయి. ప్లేటో మీద వీరి ప్రభావం ఎక్కువగా నున్నట్లు కన్పిస్తుంది. దాదాపుగా క్రీ.పూ. 700 సంవత్సరముల కాలములోనే ఇండియా గ్రీకుల మధ్య వర్తక వాణిజ్యాలు జరుగుతున్నట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి.

## థేలీజు క్రీ. పూ. 624—546

గ్రీకుల తత్త్వ శాస్త్రానికి మూలపురుషుడు థేలీజు అని వాడుక. క్రీ.పూ. 6వ శతాబ్దికి చెందినవాడు. అతని జీవిత కాలాన్ని నిర్ణయించడానికి తోడ్పడిన చారిత్రక సంఘటన క్రీ.పూ. 585 మే 28న సంభవించిన సంపూర్ణ సూర్యగ్రహణము. దాన్ని థేలీజు ముందుగానే లెక్కగట్టి జోస్యము చెప్పాడట. మతంలోని మూఢవిశ్వాసాలను వదలి మనస్సులో రెండు ప్రశ్నలు వేసుకొన్నాడు. ఈ ప్రపంచానికి మూలకారణం ఏమిటి? ఆ మూల కారణమైన పదార్థంనుంచి ఈ ఇంద్రియ జగత్తు ఎలా పరిణామం చెందింది? వీటికి సమాధానము చెప్పటానికి చేసిన ప్రయత్నాల లోనే గ్రీకుల తత్త్వశాస్త్రానికి అంకురార్పణ జరిగింది.

ప్రపంచానికి మూలపదార్థం నీరు అని అతడు ప్రవచించాడు. నీరు ఆవిరిగా అంటే వాయుపదార్థంగా మారుతున్నది. నీటిని సూర్యుడు పీల్చుకుంటున్నాడు. అంటే నీరు అగ్నిగా మారుతుంది. తిరిగి ఆవిరి చల్లబడి వర్షంగా కురిసి నేలలోకి పోతున్నది. అంటే నీరు మట్టిగా మారుతున్నది. నీరు గడ్డగట్టి మంచు అవుతున్నది. మంచు కరిగి నీరు అవుతున్నది. అప్పుడప్పుడు నేలలోనుంచి నీటి బుడగలు వస్తున్నాయి. అంటే నేల అడుగున నీరు ఉంది బహుశా నీటిపై నేల తేలుతున్నది. నీరు లేనిదే ప్రాణకోటి మనుగడ

లేదు. ఈ విధముగా నీరు అనేక విధాలుగా పరిణామం చెందడము చూసి థెలీజు దాన్ని ప్రపంచానికి ఏకైక మూలపదార్థంగా భావించాడు. ఆధునిక విజ్ఞానం ప్రకారం చూసిన మొట్టమొదట భూమి ఉపరితలమంతా జలమయమై ఉన్నదని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. దానినుండి కొంత కాలానికి భూఖండాలు పైకి తేలాయి. ఇప్పటికి భూమి ఉపరితలంపై 70% సముద్రమయమే.

## అనగ్జిమాండర్ క్రీ.పూ. 561 – 546

ఇతడు థెలీజు శిష్యుడు. విశ్వానికి మూలాధారం నీరు అన్న గురువు వాదాన్ని ఖండించాడు. ఏదో ఒక అనిశ్చిత, అనిర్దిష్ట, అజ్ఞాత పదార్థం సమస్త స్థలాన్ని ఆవహించి ఉన్నదని, అది అనంత అనశ్వరం అని చెప్పి దానికి Apeiran (ఎపీరాన్) అని పేరు పెట్టాడు. అది మనకిప్పుడు తెలిసిన ఏ పదార్థం వంటిది కాదు. అన్ని పదార్థాలు దానిలోనుంచే వచ్చాయి అది నిర్గుణం అనగా ఏ గుణములు లేనిది. అది తొలుత ఏక పదార్థంగా ఉండేది. తరువాత అది ఉష్ణం – శీతలం, తడి - పొడి, గట్టి - మెత్తన మొదలైన ద్వంద్వ పదార్థాలుగా విడిపోయింది. ఈ ద్వంద్వాల మధ్య నిత్యం సంఘర్షణ జరుగుతుంది ఉష్ణం శీతలాన్ని జయించడానికి, తడిని పొడి ఆక్రమించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. కాని ప్రకృతిలో అన్ని ద్వంద్వాలు ఒక రకమైన నిష్పత్తిలో ఉంటాయి. అది న్యాయం (Nature Law). ఈ న్యాయాన్ని అతిక్రమించడానికి ఏ పదార్థం ప్రయత్నించినా, ప్రకృతి కలుగచేసుకొని తిరిగి సమతూకాన్ని స్థాపిస్తుంది కాబట్టి ప్రపంచమంతా జలమయం అన్న వాదన తప్పు, న్యాయ విరుద్ధమవుతుంది కనుక. అలాగే నిప్పు, వాయువు, మట్టి ఇవేవి మూలపదార్థాలు కావు. వీటికన్నిటికి మూలపదార్థమైన ఏదో అజ్ఞాత పదార్థంనుంచి ఇవన్నీ వచ్చాయి. తిరిగి దాని

లోనికే వెళ్ళిపోతాయి. ఆ పిదప కొంత కాలానికి మరల ద్వంద్వాలతో కూడిన సృష్టి ప్రారంభమవుతుంది

ఆదిమ అజ్ఞాత పదార్థం నిత్య చలన శీలం. ఈ చలనం వల్లనే దానిలోనుంచి ద్వంద్వ పదార్థాలన్నీ వేరుపడతాయి. మొదట ఉష్ణం వేరుపడింది. తర్వాత శీతలం వేరుపడింది. శీతల పదార్థాన్ని ఉష్ణపదార్థం ఆవరించి ఉండేది. ఆ వేడిమికి శీతల పదార్థం నీరుగా మారింది. పిదప ఆవిరిగా మారింది. అప్పుడు అది వ్యాకోచించి తనను ఆవరించి ఉన్న అగ్నివలయాన్ని ఛేదించింది. అలా ఏర్పడిన ముక్కలు అగ్నిచక్రాలవలె తిరుగుతున్నాయి. అవే నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడున్నూ. ఇవి తమ చుట్టూ ఉన్న వత్తిడివలన భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తూఉంటాయి. అప్పుడప్పుడు ఆ రంధ్రాలను గాలి మూసివేస్తుంది. దానితో గ్రహణాలు వస్తాయి. భూమి సమస్త విశ్వానికి కేంద్రం. అది ఒక సిలెండర్ ఆకారములో ఆధార రహితంగా నిలబడి ఉన్నది. విశ్వంలో మన ప్రపంచము ఒకటే కాదు. ఇలాంటి ప్రపంచాలు అనేకం ఉన్నాయి. సూర్యుడు భూమికంటె 28 రెట్లు పెద్దవాడు.

Note :- ఉపనిషత్తుల నిర్గుణ బ్రహ్మపదార్థం, సాంఖ్యుల అవ్యక్త ప్రకృతి కూడా అనగ్జిమాండర్ యొక్క ఎపీరన్ వంటివే.

2) ఈ నాటి కొన్ని శాస్త్రీయ సిద్ధాంతాలకు మూలబీజాలు అనగ్జిమాండర్ ఊహలలో కనిపిస్తాయి ఒక ఆధునిక సిద్ధాంతము ప్రకారం సృష్టి జరగటానికి ముందు విశ్వపదార్థం అంతా ఒక బ్రహ్మాండమైన అణురూపంలో ఉండేది. దాని పేరు ఇలెమ్ (YLEM). దానిలోని అస్థిరత్వం కారణంగా అది పేలిపోయింది. దాన్నే బిగ్ బాంగ్ (Big bang) అంటారు. ఆ ప్రేలుడుతో సృష్టి ప్రారంభమైంది. స్థలం, కాలంతో సహా ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు మొదలైనవన్నీ ఏర్పడ్డాయి. క్రమంగా నక్షత్రాలు, గాలక్సీలు

ఏర్పడ్డాయి. ఈ గాలక్సీలు మొదటి ప్రేలుడునాటి చలన వేగం వల్ల ఒకదానినుంచి ఒకటి దూరంగా పోతూ విశ్వాన్ని విస్తరింప చేస్తున్నాయి. ఎప్పటికో అవి తిరిగి తమ మధ్య గురుత్వాకర్షణ శక్తివల్ల తిరిగి దగ్గరగా చేరడము, చివరికి మళ్లీ ఒకేముద్దగా విలీనం కావడం జరుగుతుంది. ఈ సృష్టి స్థితి లయలు మరల మరల జరుగుతూపోతాయి. అనగ్జిమాండర్ కూడా ఎలా ఊహించాడో గాని, ఆదిమ కాలంలో ఏదో అజ్ఞాత పదార్థంనుంచి ద్వంద్వ పదార్థాలు వేరుపడ్డాయని సృష్టి అంతంలో అవి తిరిగి ఆ అజ్ఞాత పదార్థంలోకి వెళ్ళిపోతాయని అన్నాడు.

3) భూమి బల్లపరుపుగా కాక గోళాకృతికి దగ్గరగానున్న సిలేండర్ ఆకారంలో ఉన్నదని చెప్పగలిగాడు.

## అనగ్జి మెనీజు క్రీ పూ. 688—524

ఇతడు సృష్టికి మూలపదార్థం వాయువు అని అన్నాడు. వాయువు బాగా చల్లబడితే అగ్నిగా మారుతుంది. చిక్కబడితే గాలి అవుతుంది, ఇంకా చిక్కబడితే మేఘాలు ఏర్పడతాయి, మరింత చిక్కబడితే నీరు, గట్టిపడితే మట్టి, ఇంకా గట్టిపడితే రాయిగా మారుతుంది. వాయువు పలుచబడటం, చిక్కబడటంపై ప్రపంచమంతా ఆధారపడి ఉన్నదని చెప్పాడు.

వాయువు గట్టిపడడం వల్ల మట్టి, రాయి ఏర్పడి భూమి రూపొందింది. భూమి బల్లపరుపుగా నున్నదనియు, దానిని గాలి మోస్తున్నదని భావించాడు. గాలి పలుచబడడంవల్ల వచ్చిన అగ్ని నుంచి నక్షత్రాలు ఏర్పడ్డాయి. ఆ నక్షత్రాలు భూమిచుట్టూ తిరుగుతున్నాయి. సూర్యుడు, చంద్రుడు కూడా నక్షత్రములే నన్నాడు. మరి అవి రాత్రిళ్ళు ఎందుకు కన్పించడము లేదని ప్రశ్నిస్తే, భూమి మీదనున్న ఎత్తయిన ప్రాంతాలైన కొండల చాటుకు అవి పోవడంవల్ల కన్పించడము లేదన్నాడు.

"మెరుపు అనేది గాలి అకస్మికంగా పలుచబడడం వల్ల వస్తుంది. నీరు క్రిందబడినపుడు అది చిక్కబడి వడగళ్ళు ఏర్పడు తాయి. నీటిలో కొంతగాలి ఇరుక్కుపోతే మంచు అవుతుంది. చిక్కబడిన ఆవిరిమీద సూర్యకిరణాలు పడితే ఇంద్రధనస్సు కన్పి స్తుంది. అతివృష్టి, అనావృష్టి వల్ల భూమి తడిగానో, పొడిగానో మారిపోయినందున భూకంపాలు వస్తాయి

Note :- ఇవేవీ నిజము కాదని మనకు తెలుసు. కాని మెరుపు అనేది దేవతలరాజు జూస్ ఆయుధమని, ఇంద్రధనస్సు ఐరిస్ అనే దేవతని, భూకంపాలు పోసీడన్ అనే దేవత ఆగ్రహ చిహ్నమని భావించే ఆ రోజులలో వాటిని కథలుగా జమకట్టి వాటికి ప్రాకృతిక కారణాలను వెదుకబోవటమే గొప్ప. ఆ కాలానికి అదే గొప్ప సాహసం.

2) నెబ్యులా సిద్ధాంతము ప్రకారం కూడా ఒకానొక బ్రహ్మాండ మైన వాయుమేఘం నెబ్యులా గురుత్వాకర్షణ కారణంగా కుదిం చుకుపోయి ఇంకా ఇంకా దట్టమైపోగా సూర్యుడు, నక్షత్రాలు, గాలక్సీలు ఏర్పడ్డాయని నేడు అందరూ ఒప్పుకుంటున్నారు. అయితే వాయువు పలుచబడడంవల్ల అగ్ని పుడుతుందని అనగ్జిమెనీజు అనుకొన్నాడు. నిజానికి వాయువు మరీమరీ కుదించుకుపోగా, కేంద్రంలో పదార్థపు ఒత్తిడివలన అపారమైన వేడిపుడుతుంది. ఇప్పటికి భూమిలో కొన్ని పొరలు తొలగించుకొని పోతే అపార మైన అగ్నికోళము దర్శనమిస్తుంది.

## భావవాద పితామహుడు పితాగరస్ క్రీ.పూ. 582–500

ఇతడు ప్రముఖ గణితవేత్త, ఇతని పేరు వినని ఉన్నత పాఠ శాల విద్యార్థి ఒక్కరుకూడా ఉండరు. ఎందుకంటే లంబకోణ త్రిభుజములో కర్ణము$^2$ = భుజము$^2$ + భుజము$^2$ అను సూత్రకర్త

ఇతడే గాబట్టి. పితాగరస్ ప్రపంచానికి మూలము అంకెలన్నాడు. అంకెలలోనుంచే సమస్తం వచ్చిందని, అంకెలు లేనిదే ప్రపంచమే లేదని సూత్రీకరించాడు ఇది విచిత్రమనిపిస్తుంది. అయితే అంకెలకున్న మహాత్యముతో న్యూమరాలజీ అను జోతిష్యశాస్త్రము ఆవిర్భవించింది. మన తాంత్రికులుకూడా కొన్ని అక్షరాలకు ప్రత్యేక శక్తులను ఆపాదించి వాటిని బీజాక్షరాలుగా పరిగణించారు. మన పూర్వీకులుకూడా ఓంకారమునుంచి సమస్తజగత్తు ఉద్భవించిందని చెప్పారు.

ఆత్మ నిత్యం. దానికి చావులేదు. అందుచేత జన్మించిన ప్రతిజీవి మరణానంతరం మళ్ళీ జన్మిస్తుంది. జీవాత్మ ఈ సంసార చక్రంలో పరిభ్రమిస్తూ ఉంటుంది నైతికంగా, విసుద్ధంగా నియమితమైన జీవితము గడుపుతూవుంటే, ఎప్పటికో ఏదో జన్మలో మానవుడికి ముక్తి అనగా జన్మరాహిత్యం కల్గుతుంది. ప్రతి వస్తువుకు పొడుగు, వెడల్పు, ఎత్తు అనే మూడు కొలతలున్నాయి. వీటివలనే వస్తువులకు ఆకృతి ఎర్పడుతుంది. ఆకృతి(FORM) లేనిదే వస్తువులేదు ప్రతి ఆకృతిని అంకెలలో వ్యక్తం చేయవచ్చు పైగా ఆకృతిని అంకెలలో తప్ప వేరేవిధంగా వ్యక్తం చేయడానికి వీలులేదు, కనుక అంకెలు లేనిదే వస్తువులు లేవు. అంకె లేసత్యం. వస్తువులు మిధ్య, కనుక అంకెలకు సంబంధించిన సూత్రాలను కనుగొంటే సత్యం తెలిసిపోతుంది.

అంకెలు రెండురకాలు. సరిసంఖ్యలు అనగా 2 చే విభాగింప వీలున్నవి. బేసిసంఖ్యలు అనగా 2 చే విభాగింప వీలులేనివి. అందుచేత బేసిసంఖ్య పరిమితి (Limit) అవుతుంది. సరిసంఖ్య అపరిమితం(Unlimited) అవుతుంది. బేసి - సరి, పరిమితం - అపరిమితం, ఇవి ద్వంద్వాలు. ఇలాంటి ద్వంద్వాలను మరి ఎనిమిదింటిని ప్రతిపాదించాడు. ఏకం - అనేకం, కుడి - ఎడమ, మగ - ఆడ, చలనం-

నిశ్చలనం, ఋజురేఖ - వక్రరేఖ, వెలుగు - చీకటి, మంచి - చెడు, చతురస్రం - దీర్ఘచతురస్రం. ఇలాంటి ద్వంద్వాల చేతనే విశ్వం ఏర్పడింది. క్రిందటి అధ్యాయంలో అనగ్జిమాండర్ కూడా ప్రపంచము ద్వంద్వమయమన్నాడు కదా!

మొదటగా "అపరిమితం" అనే ఒక్కటే తత్త్వమే ఉండేదట. దానిలో ఒక బిందువు లేదా ఒకటి అనే అంకె ఏర్పడింది. దానితో "అపరిమితం" అనే ఆదిమ తత్త్వం "పరిమితం" కావటం మొదలు పెట్టింది. అలా అపరిమితంనుంచి పరిమిత ప్రపంచం ఉద్భవించింది. అపరిమితం అంటే infinity. సాధారణంగా మనం పరిమితి గల దానికంటె పరిమితిలేనిది గొప్పదని అనుకుంటాము. పిథాగరస్ దీనికి అంగీకరించలేదు అపరిమితం అనేది మనస్సుకు అందని అస్పష్ట భావన పరిమితి అనేది స్పష్టతకు, నిర్దిష్టతకు నిదర్శనం. మనకు క్లియర్‌గా కన్పిస్తుంది కనుక అదే గొప్పదట పిథాగరస్ ఎలా ఊహించాడోగాని భూమి బల్లపరుపుగా కాక, గోళాకారంలో ఉన్నదని అన్నాడు. భూమి విశ్వకేంద్రమని దానిచుట్టూ చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు పరిభ్రమిస్తూ ఉన్నాయన్నాడు.

Note :- పిథాగరస్ బోధలకు భారతీయ తత్త్వ సిద్ధాంతాలకు దగ్గర పోలికలు చాలా కన్పిస్తాయి. గ్రీకు తత్త్వవేత్తలైన ఎంపిడోక్లీజు, డెమోక్రటస్, పిథాగరస్ వంటివారు భారతదేశంలో పర్యటించి, భారత తత్త్వ సిద్ధాంతాలను అభ్యసించి ఉంటారని గ్రీకు చరిత్రకారుడు మాక్డొనెల్ అభిప్రాయపడ్డాడు. ఎందుకంటె పిథాగరస్ ప్రవచించిన మత తాత్విక గణిత సిద్ధాంతాలన్నీ క్రీ. పూ. 6వ శతాబ్దిలో ఇండియాలో వ్యాప్తిలోనున్న వేనని, ముఖ్యంగా పునర్జన్మ సిద్ధాంతాన్ని భారతీయులనుంచి సంగ్రహించాడని అతని అభిప్రాయము. ఎందుకంటె అనాటి ప్రముఖ నాగరికతలు గ్రీకు, ఈజిప్ట్, ఇండియాలు. ఈజిప్ట్ నాగరికతలోగాని, గ్రీకు నాగరికతలో

గాని ఎక్కడా ఆత్మ-పునర్జన్మ ఛాయలుగాని, భావాలుగాని లేవు. అంతేగాకుండా పితాగరస్ దక్షిణ ఇటలీలో స్థాపించిన సంఘము బౌద్ధసంఘము వంటిది. అందరూ ఒకేరకమైన దుస్తులు ధరించేవారు. ఒకేరకమైన భోజనం చేసేవారు. డెమోక్రటస్ అణుసిద్ధాంతాలు మన బౌద్ధ, జైన, వైశేషిక దర్శనాలలో చూడవచ్చు.

## నిరంతర పరివర్తనవాది - హెరాక్లిటస్ క్రీ.పూ. 535-475

ఇంతకు ముందున్న తత్వవేత్తలు ప్రపంచానికి ఏది మూల తత్వం అని ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పారు. అంతే తప్ప అసలు పరిణామం అంటే ఏమిటి? ఒకవస్తువు మరొక వస్తువుగా ఎందువల్ల ఎలా మారుతున్నది అని గాఢంగా పిరిశీలించలేదు అట్టి ఆలోచన హెరాక్లిటస్‌కు వచ్చి ప్రపంచంలో సత్యమైనది, నిత్యమైనది ఏదీలేదు మార్పుతప్ప అని చెప్పాడు.

"ఒకేనదిలో రెండుసార్లు నీవు స్నానం చేయలేవు"

"పైకి వెళ్ళేదారి, క్రిందకు వచ్చేదారి రెండూ ఒకటే"

హెరక్లిటస్ సిద్ధాంతాలలో మొదటి సుభాషితం ముఖ్యమైనది ఏవ్యక్తీ ఒకేనదిలో రెండుసార్లు స్నానం చేయలేడు. ఒకసారి మునిగి లేచేసరికి నదిలోకి క్రొత్తనీరు వచ్చేస్తుంది. అందుచేత అది క్రొత్తనది అవుతుంది. విశ్వంలో స్థిరమైనది ఏదీలేదు. ప్రతిది మరొక దానిగా మారిపోతున్నది మార్పుకు లోనుగాని వస్తువంటూ లేదు. All things are in flux అన్నీ మార్పునకు లోనవుతున్నాయి. మారనిది మార్పు ఒక్కటే అంటే ఒక వస్తువు తాను అయివుండీ, తానుగాకుండా పోతూవుంటుంది.

అనగ్జిమాండర్, పితాగరస్‌ల వలె ద్వంద్వాల సిద్ధాంతాన్ని అంగీకరించాడు. కాని ద్వంద్వాలు పరస్పర విరుద్ధతత్వాలు

కావు ఒకటేనన్నాడు; అంటే ఒకటి లేనిదే మరొకటి లేదు. భిన్నత్వం, ఏకత్వం రెండూ నిజమే కాని భిన్నత్వంలో ఏకత్వం ఉన్నది. ఏకత్వంలో భిన్నత్వం ఉన్నది, రెండూ ఒకటే. విశ్వంలో ఏకత్వం ఉన్నది. అది వైరుధ్యాల సంయోగమువలన ఏర్పడిన ఏకత్వం. అన్ని వస్తువులు ఒక వస్తువునుంచి వస్తాయి కాని ఆ ఒక వస్తువు అన్నింటి నుంచి వస్తుంది. కనుకనే మంచి - చెడూ ఒకటే. పైకి పోయేదారి క్రిందకు వచ్చేదారి ఒకటే ప్రతిది దాని వ్యతిరేక తత్వంగా మారుతుంది అంటే ప్రతిది వ్యతిరేక తత్వాల సంయోగము అన్నమాట. ప్రతిది ద్వంద్వాల ఏకత్వంవల్ల ఏర్పడుతుంది.

తాను కనుగొన్న నిత్యపరివర్తన అనే కేవలతత్వానికి ప్రత్యక్ష ప్రతీకగా అగ్నిని ఊహించాడు. అగ్నిశిఖ చూడండి స్థిరంగా నిలకడగా ఉండదు. క్షణక్షణం చలిస్తుంది నిత్యచలనం, నిత్యజ్వలనం దానిస్వభావం. అంటే అది నిత్యచలనశీలము కలిగినది. అగ్ని అన్నిటిని మండిస్తుంది. తను తానుగానే వుంటూ, అన్నిటినీ తానుగా మారుస్తుంది. బంగారాన్ని ఏ వస్తువుతోనైనా కొనవచ్చు, ఏ వస్తువునైనా బంగారంతో కొనవచ్చు విశ్వాగ్ని ఇదివరకు ఉంది ఇకపై ఉంటుంది. అగ్ని సచేతనం కనుక అది చైతన్య స్వరూపం అదే దైవం కూడాను.

**Note:-** మన బౌద్ధ క్షణిక వాదం కూడా ప్రపంచము నిరంతర పరివర్తన మయమని అంగీకరిస్తుంది.

2) ఉష్ణశక్తి లేనిదే Matter అనేది లేదు. ప్రతి వస్తువులోను ఉష్ణం ఉంటుంది. ఎంతోకొంత ఉష్ణం ఉన్నంతకాలము ఆ వస్తువులోని కణాలు చలిస్తూనే ఉంటాయి. ఆ ఉష్ణాన్ని – 273°c (absoluti zero) కి తీసుకు వెళ్ళినట్లయితే కణాల చలనం ఆగిపోతుంది. కాని అది ఇంతవరకు సాధ్యము కాలేదు. ఇకముందు సాధ్యము కాకపోవచ్చుకూడా, కనుక ఉష్ణము లేదా అగ్ని మూలమన్న అతని సిద్ధాంతానికి తిరుగులేదు.

## పార్మెనిడేజు క్రీ పూ. 540–470

ఇతడు హెరాక్లిటస్ సిద్ధాంతాన్ని శీర్షాసనం వేయించాడు. ప్రపంచంలో మార్పులేనే లేదు ఏదీ మారదు మారుతుందని అనుకోవటం భ్రమ మార్పు ఎలా సాధ్యం? ఒక వస్తువు ఒకసారి ఉండి తరువాత లేకపోవడము ఎలా జరుగుతుంది? ఇది తార్కిక వైరుధ్యం కాదా! అని ప్రశ్నించాడు. ఒక వస్తువుకు గల కొన్ని లక్షణాలు మరికొన్ని భిన్న లక్షణాలుగా ఎలా మారుతాయి. అలా మారుతాయంటే ఒక వస్తువు ఉన్నదని, అదే సమయంలో లేదని అనవలసి వస్తుంది. ఆ వస్తువు శూన్యంనుంచి వస్తుందని శూన్యంగా మారగలదని అంగీకరించవలసి వస్తుంది. ఇది ఎలా సాధ్యం. శూన్యంనుంచి ఏదైనా ఎలావస్తుంది. ఒక వస్తువు ఉండనైనా ఉండాలి లేదా లేకుండానైనా పోవాలి. అంతేగాని మధ్యమ మార్గము లేదు. తర్క విరుద్ధమైన దేదీ ప్రపంచములో ఉంటటానికి వీలులేదు. ఏదైతే ఉన్నదో అది మారదు. అది యదార్థమై ఉంటుంది. అది నిత్యమై, నిరవధికమై, అవిచ్ఛిన్నమై, సజాతీయమై, వైవిధ్యరహితమై, చలనరహితమై, మార్పులేనిదై ఉంటుంది.

అయితే ప్రపంచములో మార్పు, వైవిధ్యం, అనేకత్వం, పుట్టడము, చావడము అన్నీ చూస్తున్నాము కదా! మార్పులేనిదే ఇవన్నీ ఎలా సాధ్యమౌతాయి అన్న ప్రశ్న వస్తుంది. ఇతడు అవన్నీ భ్రాంతి అంటాడు. అవన్నీ అసత్యమైనవి. భ్రాంతివల్ల అలా కనుపిస్తాయి. ఇంద్రియజగత్తు (Sensible world) నిజంగా లేదు. అది అభాస (appearance) మాత్రమే. ఏదైతే ఉన్నదో దాన్ని ఎవరూ సృష్టించలేదు. ఎవరూ నశింపజేయలేరు అదిపూర్ణం, అపరిమితం, నిశ్చలం, అది ఇదివరకు వుండేది అనికాని, ఇకముందు వుండగలదని గాని అనుకోరాదు. ఎందుకంటె అది ఈ క్షణంలో ఉన్నది. మొత్తంగా, అవిచ్ఛినంగా, ధారావాహికంగా Con-

tinious) ఉన్నది. లేనిదానినుంచి, అంటే అసత్ నుంచి అది రావడానికి వీలులేదు. అది అవిభాజ్యం, సజాతీయము (homogeneous) అంటే దానిలో అదికానిది ఏమీలేదు అది అవిచ్ఛిన్నంగా ఉన్నది. దాని తర్వాతకూడా అదే ఉన్నది.

ఆలోచన అనేది వున్న దానిగురించే అయిఉంటుంది. కనుక వస్తువువేరు ఆలోచనవేరు కాదు వస్తువులేనిదే దాన్ని గురించిన ఆలోచన ఉండదు. ఏదీలేకుండా శూన్యమైన ఆలోచన సాధ్యము కాదు. లేనిదాన్ని గురించి తెలుసుకోలేవు, తలచుకోలేవు కనుక తలుచుకుంటున్నది ఉన్న దానిగురించే అదే నిజమైనది ఒక్కటే. ఇతడు కూడా సుగుణోపాసకుడే. అంటే తాను దర్శించిన యాదార్థ్యాన్ని సాకారమైనదిగా ఊహించాడు. దానికి ఆకృతి, విస్తృతి (extension)వున్నవన్నాడు. అది అవిచ్ఛిన్నం, పూర్ణము మాత్రమే గాక గోళాకృతికలదై ఉంటుందన్నాడు. ఎందుకంటే గోళంలో మాత్రమే కేంద్రబిందువు నుంచి అన్నివైపులకు సమానంగా విస్తరించి వుంటుంది. అప్పుడు గోళం బయట ఏమిఉన్నది అన్నప్రశ్న వస్తుంది. దానిని అపరిమితమైన గోళం అన్నాడు దాని తర్వాత శూన్యం అనేదిలేదు. అదే ఉన్నది.

ఇతడు చలనం అసంభవం అన్నాడు. ఒక వస్తువు తనులేని చోటికి వెళ్ళడం కదా చలనము అంటే. తానులేనిచోటు లేదు కనుక, అంతటా తానే ఉన్నది కనుక చలనం సాధ్యంకాదు. తాను ఉన్న చోటికి వెళ్ళడంకూడా సాధ్యంకాదు ఎందుకంటే తనకు తానే అడ్డువస్తుంది. శూన్యం అంటే లేనిది కనుక శూన్యంలోకి వెళ్ళలేదు కనుక చలనం అసాధ్యం. ఇక్కడ వస్తువంటె అతడూహించిన యదార్థమైన అపరిమితమైన గోళం.

Note :- ఇతని యాదార్థ్యము యొక్క వర్ణన మన ఉపనిషత్తుల నిర్గుణ బ్రహ్మను పోలిఉన్నది. కాని అతడు దానిని సాకారమైన గోళాకారముగా వర్ణించాడు.

## జీనో క్రీ.పూ. 490–430

అస్తిత్వం లేదా సత్తా (being) ఒకటేనని దానిలో బాహుళ్యం mulliphility లేదని కదా పార్మెనిడేజ్ అన్నాడు. ఇది గణిత రీత్యా తర్కానికి నిలువదని పితాగరస్ అనుయాయులు ఖండించారు. కాగా తనగురువును ఈ విమర్శలనుండి కాపాడడానికి పార్మెనిడేజు శిష్యుడు జీనో ప్రయత్నించాడు. పార్మెనిడేజు చెప్పినట్లు యాదార్థ్యం (reality) అనేవి ఒకటిగా అవిభాజ్యంగా లేదు అనుకోండి అప్పుడు reality సావధికం finite గావచ్చు లేదా నిరవధికం infinite కావచ్చు. ఇది అసంభద్ధం కాదా అని జీనో ప్రశ్నించాడు. దీన్ని నిరూపించడానికి అతడు పేర్కొన్న పేరడాక్సులు ఇవి.

1) ఒక నిర్ణీత స్థలంనుంచి మరొక నిర్ణీత స్థలంకు వెళ్ళడం అసాధ్యం.
2) అకిలీజు తాబేలును దాటి ఎప్పుడూ పోలేడు.
3) కదలని బాణం.
4) సగం సమయం రెట్టింపు సమయానికి సమానము

ఒక ప్రతిపాదన స్వయం విరుద్ధంగా అసంబద్ధంగా కనిపిస్తే దానిని Paradox లేదా విరోధాభాస అంటారు.

### 1) ఒక నిర్ణీత స్థలంనుంచి మరొక నిర్ణీత స్థలానికి వెళ్ళడం అసాధ్యం:-

మనం ఒక నూరు మీటర్ల పరుగుపందెం ఏర్పాటు చేశామనుకోండి. పోటీలో పాల్గొనే వ్యక్తి నిర్ణీత కాలంలో 100 మీటర్లు పరుగెత్తాలి కదా! అంటే అతను ముందు 99 మీటర్లు పరుగెత్తాలి. 99 మీటర్లు పరుగెత్తటానికి ముందు 98 మీటర్లు పరుగెత్తాలి. అలా చెప్పుకుంటూపోతే అతను ముందు 1 మీటరు దూరం పరుగెత్తాలి. దానికి ముందు 0.5 మీటర్లు పరుగెత్తాలి. దానికి ముందు 0 25 మీటర్లు పరుగెత్తాలి. అలా చెప్పుకొంటూ

పోతే దానికి అంతంలేదు. ఎందుకంటె స్థలాన్ని అంతులేనన్ని విభాగాలు చేయడానికి వీలున్నది. కనుక అతడు ఆ అంతులేనన్ని infinite distances లలో ప్రతిభాగాన్ని దాటాలి. అతనికి ఇచ్చిన కాలం పరిమితమైనది. దాటవలసిన భాగాలు అపరిమితమైనవి. కనుక పరిమితి కాలంలో అనంతమైన భాగాలను ఎలా దాటగలడు? కనుక నిర్ణీత సమయంలో అతడు 100 మీటర్లు పరుగెత్తడం అసాధ్యం.

2) అకిలీజు – తాబేలు :– అకిలీజు మహావీరుడు తాబేలు చిన్నగా నడుస్తుంది కనుక తాబేలును 10 మీటర్లు ముందు నిలబెట్టి అకిలీజుకు తాబేలుకు పరుగుపందెం పెట్టామనుకోండి. పోటీ ప్రారంభములో తాబేలు 10 మీటర్లు ముందుందికదా! అకిలీజు ఆ 10 మీటర్లు దాటే సరికి తాబేలు కొంతదూరము ముందుకుపోయి ఉంటుంది. ఆ స్థలాన్ని అకిలీజు దాటే లోపల తాబేలు ఇంకొంచెము ముందుకు పోతుందికదా! ఆ కొంచెము దూరము అకిలీజు దాటేలోపల తాబేలు ఇంకాకొంచెము ముందుకు పోతుంది కదా! ఈ విధముగా అకిలీజు తాబేలను దాటి ఎప్పుడూ ముందుకు పోలేడు అని జీనో అంటాడు.


3) కదలని బాణం :– ప్రపంచంలో చలనం అనేది లేదని చెప్పటానికి ఉద్దేశించినది. కదులుతున్న బాణం నిజంగా కదలటం లేదంటాడు. మనం బాణం వేశామనుకోండి. ఆ బాణం ఏ నిర్దిష్ట క్షణంలోనైనా తన పొడవుతో సమానమైన స్థలంలో ఉండవలసిందే కదా! అంటే ఆ క్షణంలో అది నిశ్చలంగా ఉంది. దాని వేగము గంటకు సున్నామైళ్ళు. మరుక్షణంలోకూడా దాని వేగము సున్నామైళ్ళే. అంటే ఆ తర్వాత వచ్చే అన్ని క్షణాలోను దాని వేగము సున్నామైళ్ళే కదా! అంటె బాణం కదలటం లేదన్న మాటేగదా! అర్థంకాలేదు కదూ!

మనం వేసిన బాణం తన ప్రయాణ కాలంలో ఏ క్షణంలో నైనా సరే తను ఉన్నచోటునైనా ఉండాలి. లేదా లేని చోట నైనా ఉండాలి ఉన్నచోటే ఉన్నదంటే అది ఆ క్షణంలో కదలటం లేదన్న మాటేగదా! ఎందుకంటె అది కదులుతున్న పక్షంలో ఉన్నచోట ఉండలేదుకదా! పోనీ లేనిచోట ఉన్నదని అనుకుందామంటె అది ఎలాసాధ్యం? ఒక వస్తువు తను లేనిచోట ఎలా ఉంటుంది. కనుక ఆ నిర్దిష్ట క్షణంలో బాణం కదలటం లేదన్నమాటే అలాగే మరుక్షణం కూడాను, అలానే ఈ చలన రాహిత్యం తర్వాత వచ్చే అన్ని క్షణాలకు వర్తిస్తుంది.

ఆధునిక భాషలో చెప్పాలంటే సినిమా ఒక నిశ్చలన చిత్రం. విల్లునుంచి బయలుదేరిన బాణాన్ని కెమెరాతో వివిధ క్షణాలలో ఫోటో తీసామనుకోండి అలా వచ్చిన ప్రతి ఫోటోలోను బాణం నిశ్చలంగా ఉంటుంది. అయినా తెరపై బాణం కదులుతుందంటే ఆనాటి జీనో ప్రకారం అది భ్రాంతి మాత్రమే.

4) <u>సగం సమయం రెట్టింపు సమయానికి సమానం :—</u>

ఒక వస్తువు కదులుతుందంటె అది తాను ఉన్న చోటినుంచి తన పొడవును పూర్తిగా దాటిపోవడమే కదా! జీనో ఒక మీటరు గల వస్తువును తీసుకొంటాడు. మనం సులభ పరిచయం కోసం రైలును ఉదాహరణముగా తీసుకొందాము.




10 Seconds = 5 Seconds

రైలు A తన పొడవును పూర్తిగా దాటిపోవడానికి 10 నిముషములు పట్టిందనుకోండి. కాని అదే రైలు తనకు వ్యతిరేక దిశలో అదే స్పీడుతో వచ్చే రైలును దాటునప్పుడు తన పొడవును 5 నిముష

ములలోనే పూర్తి చేసుకోగలదు. అంటే రైలు A తన పొడవును ఒకసారి 10 Seconds లోను మరొకసారి అదే స్పీడులో 5 సెకండ్లు లోనే పూర్తి చేసుకొన్నది గదా! అంటే సగము సమయము, రెట్టింపు సమయము ఒకటేగదా!

Note :- ఈ Paradox లన్నీ ఎంతగా విస్తారంగా నిజజీవితానికి విరుద్ధంగా కన్పిస్తాయి. వీటిని సాపేక్ష సిద్ధాంతముతోగాని పూర్వ పక్షం చేయటానికి కుదరదు.

## మెలిసస్ పార్మెనిడేజు శిష్యుడు

యాదార్థ్యం reality గోళాకృతిలో ఉండటానికి వీలు లేదన్నాడు. ఏ వస్తువుకైనా ఆది అంతం అనేవి ఉంటే అవి శాశ్వతం గాని, అనంతం గాని కాజాలవుకదా! యాదార్థ్యం అనేది స్థలం (Space) లో నిరవాధికంగా విస్తరించి ఉంటుంది. దాని వెలుపల శూన్యం అనేది లేదు. కనుకనే యాదార్థ్యం కదిలేందుకు స్థలమే లేదు. దాన్ని పరిమితం చేసేందుకు దాని తర్వాత శూన్యం లేదు- ఇదీ ఇతని సిద్ధాంతము.

## ఎంపిడోక్లీజు క్రీ. పూ. 490—435

ఇంతవరకు ప్రపంచానికి మూలపదార్థాన్ని ఒకరు నీరు, ఒకరు వాయువు, ఒకరు అగ్ని అని అన్నారు కదా! ఇతడు ప్రపంచానికి మూలపదార్థం ఒకటే కాదు. నీరు, అగ్ని, వాయువు, భూమి అను నాలుగు మూల పదార్థాలున్నాయన్నాడు. పై నాలుగు మూల పదార్థాల కలయిక వలనే సమస్త విశ్వం ఏర్పడింది. అని అతని భావన. ఆకాశం అనేది కాని, శూన్యం అనేది కాని లేవన్నాడు. అయితే ఆ చతుర్భూతముల సంయోగానికి లేదా వియోగానికి కారణమైన ఏవో శక్తులుండాలికదా! అవి ప్రేమ ద్వేషం

అనే శక్తులని భావించాడు. ప్రేమశక్తి బలీయంగా వున్న కాలంలో అది ద్వేషశక్తిని తరిమివేస్తుంది. ఆ సమయంలో చతుర్భూతాల కలయిక జరుగుతుంది. విశ్వసృష్టి జరుగుతుంది. రెండవ యుగంలో ద్వేషశక్తిది పై చేయి అవుతుంది చతుర్భూతాలు క్రమంగా విడిపోతాయి విశ్వం అంతరిస్తుంది. ఇలా స్థితి లయలు పునరావృతమవుతూ ఉంటాయి. ఇతడు కూడా విశ్వం ఒక మహాగోళమని భావించాడు. అయితే పార్మెనిడేజు వలెగాక చలనం కలదని అది రాగద్వేషాల వల్ల కలుగుతుందని చెప్పాడు.

Note :- మన జైన మతములో కూడా చలనానికి ధర్మం, నిశ్చలనానికి అధర్మం కారణమని చెప్పి ఉన్నారు.

ఇతడు చంద్రుడికి స్వయం ప్రకాశము లేదని భావించాడు. అయితే సూర్యుడికి కూడా స్వయం ప్రకాశము లేదని అన్నాడు కాని సూర్య గ్రహణానికి కారణము భూమికి సూర్యునికి మధ్యగా చంద్రుడు రావటమేనని సరిగ్గా ఊహించాడు. కాంతి మనం కనిపెట్టలేనంత వేగంగా ప్రయాణం చేస్తుందన్నాడు. వాయువులో ఒత్తిడి పెరిగి నీటిని పిండినట్లుగా వాన కురుస్తుంది. ఒత్తిడి వల్ల అగ్నిని పిండినట్టు అయి మెరుపులు వస్తాయి. విశ్వంతో పాటు భూమికూడా తిరుగుతున్నది మొత్తం విశ్వం అతివేగంగా తిరగటము వల్లనే భూమి, గ్రహాలు తమస్థానాలలో నిలకడగా ఉండగలుగుతున్నాయి. దీనికి ఉదాహరణగా ఒక పొడుగాటి తాడు చివర నీటితో నిండిన గిన్నెను కట్టి గిరగిరా తిప్పితే నీరు ఒలికి పోకపోవడాన్ని పోల్చొన్నాడు. పురాణాలలోని దేవతలు లేరన్నాడు. మొత్తం విశ్వమే దేవుడని భావించాడు. ఆ కారణముగా మతవాదుల మూలమున కారాగార శిక్ష అనుభవించాడు

రాగద్వేషాలు కలిసి చతుర్భూత మిశ్రమాన్ని మథించగా ఏర్పడిన సేంద్రియ సంయుక్త పదార్థం నుంచి అన్ని జీవులు పుట్టా

చేసాన్నాడు. మొదటగా వృక్షజాతులు, తర్వాత జంతువులు పుట్టాయన్నాడు. మొదట్లో మెడలు లేని తలలతో, భుజాలు లేని చేతులతో, నుదురు లేని కళ్ళతో జీవులు జన్మిస్తాయి. అలా మొండి అవయవాలతో పుట్టిన జీవులు తమకు తగిన రూపాలకోసం వెదుకుతూ తిరుగుతాయి. కొంత కాలానికి అయా అవయవాలు తమకు తగిన జంటలు దొరకగానే అతుక్కుపోతాయి. ఈ విధంగా జీవ పరిణామ వాదాన్ని ఊహించాడు.

## అనగ్జాగరస్ క్రీ. పూ. 500

పార్మెనిడీజు వలె సత్పదార్థాన్ని ఎవరు సృష్టించలేదు. అది అంతములు లేనిది నిత్యము పూర్ణము. ఇతడు కూడా మార్పు లేదన్నాడు శూన్యం లేదన్నాడు. అయితే పార్మెనిడీజు విశ్వగోళాన్ని, అసంఖ్యాక సూక్ష్మగోళాలుగా బ్రద్దలు కొట్టాడు. ప్రతిశకలానికి పార్మెనిడీజు పేర్కొన్న అనాదిత్వా, అనశ్వరం, పూర్ణత్వం, శూన్యరాహిత్యం, పరివర్తన రాహిత్యం, చలనరాహిత్యం వంటి లక్షణాలను ఆపాదించాడు.

అసంఖ్యాక శకలాల కలయికతో, రకరకాల ఏర్పాటుతో రూప్రపంచము ఏర్పడి ఉందని అందుకే లోకంలో ఇంత వైవిధ్యం నిరంతర పరివర్తన కనిపిస్తున్నాయన్నాడు. ఒకరకంగా ఇతడు హెరాక్లిటస్ పరివర్తన వాదాన్ని, పార్మెనిడీజు పరివర్తన రాహిత్య వాదాన్ని సమన్వయం చేశాడని చెప్పవచ్చు. ప్రతి వస్తువును అనంతంగా విభజిస్తూ పోవచ్చు. అలా విభజించగా వచ్చిన ప్రతి శకలంలోనూ ఎంపిడోక్లిజ్ పేర్కొన్న చతుర్భూతాల లక్షణాలన్నీ కలసిఉంటాయి. కాని అగ్ని లక్షణాలు ఎక్కువగానున్న శకలాలు కలిస్తే అగ్ని ఏర్పడుతుంది. అలాగే వాయువు, నీరు, భూమికూడాను.

నిర్జీవ పదార్థాలలో మనస్సు అనేది ఉండదు. సజీవ పదార్థాలలో మనస్సు తప్పకుండా ఉంటుంది. సజీవ నిర్జీవ పదార్థాల మధ్య భేదాన్ని కల్పించేది మనస్సే. చలనానికి కారణం మనస్సు విశ్వచలనానికి కారణం విశ్వమానసం అంటే విశ్వానికి కూడా మనస్సు ఉంది.

చంద్రునికి స్వయం ప్రకాశం లేదు. సూర్యకాంతితో ప్రతిఫలించడం వల్ల చంద్రుడు ప్రకాశిస్తున్నాడన్నాడు. అలాగే సూర్య చంద్ర గ్రహణాలను కూడా సరిగ్గానే ఊహించాడు. సూర్యుడు దేవుడు కాదని అగ్నిశిల అని అలాగే నక్షత్రాలు కూడా అగ్నిశిలలేనన్నాడు. నక్షత్రాలు అపారమైన దూరంలో ఉన్నందున వాటి వేడి తెలియడం లేదన్నాడు చంద్రుడు కూడా భూమి లాగానే మట్టి రాళ్లతో కూడిన ప్రదేశమని, అక్కడ జీవరాశి ఉన్నదని ఊహించాడు.

Note :- ఆ కాలంలో ఇవన్నీ ఇంత కరెక్టుగా ఊహించాడో ఆలోచిస్తే ఆశ్చర్యమేస్తుంది కదా! ఇతడు కూడా మతవాదుల వలన కారాగార శిక్ష అనుభవించాడు. ఒకరకంగా అణువాదానికి ఆద్యుడయ్యాడు.

## డెమొక్రాటస్ క్రీ.పూ. 460—370

అసంఖ్యాక శకలాలతో ప్రపంచము ఏర్పడిందని, ఆ శకలాలకు చలనం కల్గించే శక్తులు ప్రేమ, ద్వేషం అని ఎంపిడోక్లీజు అన్నాడు. మనస్సు లేదా విశ్వమనశ్శక్తి వాటిని కదిలిస్తుందని అనగ్జాగరస్ అన్నాడు. కాగా డెమొక్రాటస్ మరియు తదితర అణువాదులు చలనం అనేది శకలాల స్వతః సిద్ధ లక్షణము అని ఉద్ఘాటించారు. ఆ సూక్ష్మ శకలాలనే atoms అణువు అంటారు. అవి అచ్ఛేధ్యాలు, అవిభాజ్యాలు అణువుకు అణువుకు మధ్య శూన్య

స్థలం ఉన్నది. జగత్తు అంతా అణువులతోను, శూన్యంతోను నిర్మితమైంది. పృథ్వి, జలం, వాయువు, అగ్ని మూలపదార్థాలు కావు. అవి తమకంటె సూక్ష్మ శకలాలతో తయారవుతాయి. ఆ శకలాల లోపల శూన్యం లేదు. అణువులకు రంగు, రుచి, వాసన, శబ్దం వగైరా గుణాలేవీ లేవు. కాని వాటికి ఆకృతి బరువు పరిమాణము మాత్రము ఉన్నాయి. అణువుకంటె సూక్ష్మ వస్తువు లేదు. ఒక వస్తువును ముక్కలుగా ఛేదించుకుంటూ పోగా ఇక ఛేదించటానికి వీలులేనంత చిన్న శకలాలు మిగులుతాయి. అవే అణువులు. పార్మెనిడేజు చెప్పినట్లు యాదార్థ్యం reality, అనాది, అనంతమని, అది మార్పుచెందదని అణువాదులు అంగీకరిస్తారు. అంటే వీరి దృష్టిలో యాదార్థ్యం అణువులే. అవి శాశ్వతంగా ఉంటాయి. వాటిలోపల ఎటువంటి మార్పు లేదు. పార్మెనిడేజు శూన్యం చలనం లేవన్నాడు. కాని వీరి దృష్టిలో శూన్యం ఉన్నది. ఆ శూన్యంలోనే అణువులు చలిస్తాయి. ప్రతి వస్తువుకు బాహిరమైన మార్పు తప్పదు. అణువులు శూన్యం ఇవే పరమ సత్యాలు. అణువు అనేది పూర్ణం. అది కానిది శూన్యం. ఈ రెండే లోకములోని నిత్య, సత్యాలు. వాటి బరువు ఆకృతిలలోని భేదాలవల్ల వస్తువులలో వైవిధ్యం కలుగుతున్నది.

కొన్ని అణువులకు కొక్కెలుంటాయి. కొన్నిటికి రంధ్రాలుంటాయి. కొన్ని ఎత్తుగా, కొన్ని లోతుగా ఇలా వివిధ ఆకృతులలో ఉంటాయి. అణువులకు స్వతఃసిద్ధ చలనము ఉన్నది. వాటి చలనానికి బాహ్యకారణం ఏదీ లేదు. అవి స్వతః సిద్ధాలు, స్వయంభువులు. అవి ఒకదానితో ఒకటి ఢీకొని వీలైన ఆకృతులలో దగ్గరగా చేరి సంయోగము చెందుతాయి. ఈ విధంగా అగ్ని, మట్టి, నీరు, వాయువు ఏర్పడుతాయి. అనేక ప్రపంచాలు ఏర్పడుతాయి. భూమి తేమగా ఉండే రోజులలో జీవం ప్రారంభమైంది. జీవుల

దేహాలలో వేడికి కారణం అగ్ని అణువులు దేహమంతటా సమంగా వ్యాపించి ఉండటమే, మానవుడి ఆత్మలో అగ్ని అణువులు ఎక్కువ. రెండు ఇతర అణువుల మధ్య ఒక ఆత్మాణువు చొప్పున దేహమంతటా ఉంటాయి. మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆత్మాణువులతో కూడినవి. శ్వాస ఉన్నంతవరకే ప్రాణం ఉంటుంది. మనిషి చని పోయినపుడు ఆత్మాణువులు చెల్లాచెదురవుతాయి.

ఇంద్రియ జ్ఞానం ఎలా కలుగుతుంది? రంగు, రుచి, వాసన, శబ్దం వంటి గుణాలు ఆయా వస్తువులలో లేవు. ఆయా వస్తువులు మన జ్ఞానేంద్రియాల పైకలిగించే మార్పులవల్ల ఆయా గుణాలు ఆ వస్తువులలోనే ఉన్నవనే భ్రాంతి కలుగుతున్నది. అందుచేత ఇంద్రియ జ్ఞానము సరైన జ్ఞానం కాదు, నమ్మతగింది కాదు. విశ్వంలో ఏదీ యాదృచ్ఛికంగా జరుగదు. ప్రాకృతిక నియమాల ప్రకారమే అన్నీ జరుగుతాయి. కాని విశ్వానికి ఒక ప్రయోజనం అంటూ లేదు. దేవతలను బలుల ద్వారా, పూజల ద్వారా ప్రసన్ను లను చేసుకోవడము భ్రమ అని చెప్పాడు.

మానసిక ప్రశాంతివల్ల, నిర్భయత్వం వల్ల సుఖం ప్రాప్తి స్తుంది. దైహిక సౌఖ్యాల వల్ల, సంపదలవల్ల మానసికానందం లభించదు. అవి క్షణికాలు. పొందినకొద్దీ కావాలనిపిస్తుంది. కోర్కెలు వీలైనంత తగ్గించుకుంటె ఆశాభంగము కలుగదు. న్యాయం, ధర్మం, సౌజన్యం ఇవన్నీ సుఖాన్ని కల్గిస్తాయి. అసూయ ద్వేషం వంటి గుణాలవల్ల దుఃఖం కల్గుతుంది. శిక్ష పడుతుందేమో నన్న భయంవల్ల చెడుపని మానడంగాక, అది మన కర్తవ్యం అనే జ్ఞానంతో మంచి పనులు చేయాలి చెడు ఆలోచనలు కూడా రాకూడదు. మంచి పనులు చేసేవాడికి భయం, అశాంతి కలుగవు. వాడు నిత్య సంతోషిగా ఉంటాడు.

Note :- ఆధునిక అణు సిద్ధాంతి ప్రకారము కూడా అణువులలో

బకువుల భేదాలవలననే వివిధ మూల పదార్థాలు ఏర్పడుతున్నాయి. అణువులలో గుణాత్మక భేదాలేమీ లేవు. అయితే అణువులు అచ్ఛేద్యాలన్నాడు. కాని నేడు అణువులను ఛేధించవచ్చు. Atombomb ఆ సూత్రం పైనే ఆధారపడి ఉంది. అణువును విడగొడితే ఎలక్ట్రాన్లు ప్రోట్రాన్లు, న్యూట్రాన్లు అను సూక్ష్మ శకలములతో నిర్మితమైనవి.

2) సమానాంతర కాల, బౌద్ధ, జైన, న్యాయ వైశేషిక దర్శనములలో కూడా అణుసిద్ధాంతాలను చూడవచ్చు.

## సోఫిస్టులు క్రీ. పూ. 481–375
## (ప్రొటాగరస్, గార్జియస్, కాలిక్లేజు, థ్రేసిమేకస్)

ఇంతకు ముందలి తత్త్వవేత్తలందరూ ప్రపంచానికి మూల పదార్థములను కనుగొనటానికి ప్రయత్నించారు. కాని మానవుడిని, మానవుడి మనస్సును అలక్ష్యం చేశారు. వీరి సుభాషితం "మానవుడే అన్నిటికి కొలమానం" Man is the measure of all things. వీరు మానవుని విశ్వకేంద్రలో నిలిపారు. వైయక్తిక వాదము Individulism నకు వీరు మూలపురుషులని చెప్పవచ్చు. సోఫిస్టులంటె విజ్ఞానులని అర్థము.

సార్వజనీనం, సార్వకాలికం అయిన సత్యము లేదు. ఎవడి సత్యము వాడిది. ఎవరికి ఏది సత్యమని తోస్తే వాడికదే సత్యం. నీవు చెప్పేది నీకు సత్యమైతే నేను చెప్పేది నాకు సత్యం. ఈ రెండింటిలో ఏది సత్యమో నిర్ణయించగల విశ్వజనీన ప్రమాణం ఏదీ లేదు. అలాగే కాలక్రమేణా సత్యం మారిపోతుంది. నీకు నిన్న నిజమనిపించింది. నేడు నిజమని అనిపించకపోవచ్చు. ఏదైనా ఒకటి నిజం అంటున్నామంటే అది నిజం అనిపించినంతసేపే అది నిజం. ఆ తర్వాత అది నిజం కాకపోవచ్చు. కనుక సత్యం అనేది మనిషి మనిషికి గంటగంటకు మారిపోతుంది. మరి సత్యాన్వేషణ

ఈ తత్త్వ మీమాంసలెందుకు అధిక సంఖ్యాకులు అంగీకరించే అభిప్రాయం ఎక్కువ నిజం కాకపోయినా, ఎక్కువ మంచిదని అర్థం చేసుకోవాలి (పదుగురాడు మాట పాడియై ధర చెల్లు) పరమ సత్యాలు అంతిమ సత్యాలు, కేవల సత్యాలు లేవు ఇంద్రియాల ద్వారా లభించే జ్ఞానం ప్రామాణికం కాదు, అది నిరంతరము మారిపోతూ ఉంటుంది. అలాగే మనస్సు ద్వారా లభించే జ్ఞానం కూడా విశ్వాసనీయమైనది కాదు మనస్సు ఉన్నదాన్ని, లేని దాన్ని కూడా ఊహించగలదు. అందులో ఏది సత్యమో తెలుసు కోగల శక్తి మనస్సుకు లేదు. అందుచేత సత్యం అనేది లేదు. అంతేకాదు అసలు ఏదీ లేదు (Nothing exists)

ఒక వేళ ఏదైనా సత్యం ఉన్నప్పటికిని దాన్ని మనం తెలుసు కోలేము అది అజ్ఞేయము ఒక వేళ సత్యాన్ని మనం తెలుసు కొన్నప్పటికి దాన్ని ఇతరులకు తెలియజేయలేము. ఎందుకంటె మనం తెలుసుకొన్నదాన్ని ఇతరులకు చెప్పాలంటె దానికి భాష కావాలి భాష అంటె శబ్దం శబ్దం ద్వారా సత్యాన్ని ఇతరులకు ఎలా చెప్పగలము. వారు సత్యాన్ని సత్యంగా అర్థం చేసుకోగల రని నమ్మకమేమిటి? ఉదాహరణకు ఆ పువ్వు ఎర్రగా వుందంటూ మనుకోండి. ఎరుపు అనేశబ్దం ఎదుటివాడి చెవికి వినబడుతుంది. కాని ఎరుపు అనేది కంటికి కనిపించే రంగు. ఎరుపు అనే శబ్దం ద్వారా మనం దేన్ని ఉద్దేశించామో, దానియొక్క జ్ఞానమే అవతల వాడిలో కలుగుతున్నదని ఎలా చెప్పగలము? పోనీ ఒక గుడ్డి వాడికి పువ్వు ఎర్రగా ఉన్నదని చెబితే, అతనికి ఎరుపురంగుని గురించిన జ్ఞానమును కలుగచేయటం అసాధ్యం. కనుక శబ్దం వేరు, శబ్దార్థం వేరన్న మాటేకదా!

వీరు ఇదే సూత్రాన్ని నీతికికూడా వర్తించారు. కేవల నీతి అనేది లేదు. కాలిక్లీజ ప్రకారము "నీతి అనేది బలవంతులైన

కొద్దిమందిని నిగ్రహించి అదుపులో ఉంచడానికి బలహీనులైన అధిక సంఖ్యాకులు కలసి ఏర్పరిచిన కట్టుబాటు." థేసిమేకస్ ప్రకారము.

"నీతి అనేది కొద్దిమంది బలవంతులు అధిక సంఖ్యాకులైన బలహీనులను అణచి వుంచడానికి సర్మించిన వ్యవస్థ" అధికారంలో ఉన్నవాడు ఏది నీతి అంటె అదే నీతి చారిత్రకంగా చూస్తే సోఫిస్టులను స్వేచ్ఛాలోచన (Free Thinking) ధోరణికి కారకులైనారు. ఏది సత్యం, ఏది అసత్యం అను మౌలికమైన ప్రశ్నలు వేసుకొన్నారు. ఇవే ప్రశ్నలను వేసి సత్యాన్వేషణను నిర్మాణాత్మకమైన మార్గానికి మళ్ళించిన మహా మనిషి సోక్రటేజు.

## సోక్రటేజు క్రీ. పూ. 470 – 399

ఇతడు ప్రధానంగా నైతికవాది. నీతికి సత్ప్రవర్తనము, మానవుని శ్రేయస్సుకు అగ్ర ప్రాదాన్యమిచ్చాడు. తన భావాలను గాని, సిద్ధాంతాలనుగాని గ్రంథస్తం చేయలేదు. ఇతని శిష్యుడు ప్లేటో ద్వారా మాత్రమే కొన్ని తెలుస్తాయి. "నాకు తెలిసింది ఒక్కటే నాకు ఏమీ తెలియదని" అనేవాడు. ఇతని వాద పద్ధతిని గతి తార్కిక వాదమంటారు. ప్రశ్న వేయటం, సమాధానం రాబట్టడము, దాన్ని పూర్వపక్షము చేసి మరొక ప్రశ్నను వేయుట – ఈ విధంగా ఆ ప్రక్రియ నడుస్తుంది. ప్రతి విషయముమీద కనిపించిన ప్రతివారితోను వాదిస్తూ ఉండేవాడు. "ఇతరులు తినడానికి బ్రతుకుతారు. నేను బ్రతకటానికి తింటాను!" అనేవాడు. రేపటిగురించి చింతనలేదు. కోరి పేదరికాన్ని వరించాడు. "ఆహారానికి రుచి కలిగించేది ఆకలి" అనేవాడు. ఉంటే తినేవాడు, లేకపోతే పస్తులుండేవాడు.

ఏ విషయమైనా సరిగ్గా నిర్వచించటమే జ్ఞానం అంటాడు.

జ్ఞానమే నీతి అనేవాడు ప్రేమ, స్నేహం, ధైర్యం మొదలైన సద్గుణాల మౌలిక స్వభావాన్ని గుర్తెరిగితే మానవుడు వాటిని తప్పక అలవరచుకుంటాడని, ఉత్తమ జీవితాన్ని గడపగలడని అతని నమ్మకము. కనుక సరియైన జ్ఞానానికి అధిక ప్రాముఖ్య మిచ్చేవాడు ప్రేమ అంటె దివ్య సౌందర్యానుభూతికోసం మానవాత్మ అర్రులు చాచడం. ప్రేమికుడు సౌందర్యాన్ని దర్శించడమేగాక, దాన్ని సృజించాలని, శాశ్వతీకరించాలని, భౌతిక దేహంలో అమరత్వ బీజాన్ని ప్రతిష్ఠించాలని తహతహలాడుతాడు. అందువల్లనే స్త్రీ పురుషులు పరస్పరం ప్రేమించుకుంటారు. అందుకే తల్లి దండ్రులు సంతానాన్ని ప్రేమిస్తారు. ప్రేమ ద్వారా మనం శాశ్వతీకరించ గోరుతున్న ఈ సౌందర్యం ఏమిటి? అది వివేకం, సచ్ఛీలం, ఆత్మ గౌరవం, ధైర్యం, న్యాయం, విశ్వాసం ఒక్క మాటలో చెప్పా లంటే సౌందర్యం అంటే సత్యం. దేవుని ఎద్దకు మనలను సరాసరి చేర్చేదే సత్యం.

ఇతడు నాస్తికుడని ప్రచారాన్ని చేసి, మరణశిక్ష విధిస్తారు. రాజకీయ పరిస్థితిపై విమర్శలను కుప్పించడము కూడా దానికి ఒక కారణమైంది. మృత్యువును ఆనందంగా ఆహ్వానిస్తాడు. చిద్విలా సంగా విషము మ్రింగి మరణిస్తాడు. మృత్యువుకు ఇతడిచ్చిన నిర్వచ నము విచిత్రమైనది. మృత్యువంటే చైతన్య రహితమైన శూన్య స్థితి అయినా కావాలి లేదా మానవాత్మ ఇహలోకం నుంచి పర లోకం పయనించడమన్నా కావాలి. చైతన్య రహితస్థితే మృత్యు వనుకోండి. అంటే అది కలలుకూడా రాని గాఢ సుషుప్తివంటి స్థితి కావచ్చు మానవులకు అటువంటి సుషుప్తి ఎప్పుడో గాని రాదు మృత్యువంటే అదే అయితే అంతకంటె కోరతగిన దేమున్నది అలా కాక మానవాత్మ పరలోక ప్రయాణమంటారా అప్పుడు ఆత్మ అనశ్వరమవుతుంది. జైలునుంచి పారిపొమ్మని స్నేహితులు

కోరితే, నేను నా జీవితంలో కొన్ని సిద్ధాంతాలకు, నీతి నియమాలకు కట్టుబడి ఉన్నాను. ఇప్పుడు ప్రాణాలపై తీపితో పారిపోతే నా సిద్ధాంతాలను, నీతినియమాలను నేనే కాలదన్నినట్లుగాదా! అది దేశద్రోహం అవుతుంది. వ్యక్తికంటె దేశం గొప్పది. దేశం కోసం ప్రతివ్యక్తి త్యాగం చేయాలంటాడు.

## ప్లేటో క్రీ. పూ. 427–347

హెరాక్లిటస్ – ప్రపంచములో మార్పు చెందనిది ఏదీ లేదని, ప్రతిదీ క్షణ క్షణ పరివర్తన శీలమన్నాడు కదా!

పార్మెనిడీజ్ – అసలు మార్పు చ నం లేదన్నాడు. ప్రపంచానికి మూలమైన యాదార్థ్యం నిత్యం పరిపూర్ణమన్నాడు.

పితాగరస్ – ప్రపంచము సంఖ్యామయమన్నాడు. ఆత్మ అనశ్వరమని పునర్జన్మ ఉన్నదన్నాడు కదా!

సోక్రటీజు – నైతికధర్మ భావానికి ప్రథమ స్థానాన్ని ఇచ్చాడు. ఇతడు (ప్లేటో) వీటన్నిటినీ ఒప్పుకొని తనదైన భావవాదాన్ని ప్రతిపాదించాడు. ప్రపంచంలో ప్రతిదీ క్షణక్షణం మారిపోతున్నది. ఈ నిముషంలో ఉన్నది మరొక నిముషంలో ఉండుటలేదు ఇంతగా నిరంతర పరివర్తన చెందే ప్రపంచం గురించి మనకు నిజమైన నిశ్చితమైన జ్ఞానం ఎలా సాధ్యం? పైగా ఇంద్రియ గోచరమయ్యే వస్తువులన్నీ సాపేక్షాలు అంటె ఒకరికి సుందరముగా కనిపించేది ఇంకొకరికి సుందరంగా కన్పించడములేదు. ఒకరి న్యాయం ఇంకొకరికి కాదు. అలాగే అధికత్వం, అల్పత్వం, వేగం, చలి, వేడి, కాఠిన్యం, మెత్తన, రంగు, రుచి, ధ్వని మొదలైనవన్నీ సాపేక్షాలే. ఇంద్రియ జగత్తు (Sensory world) లో అన్ని సాపేక్షాలే దీనిని గురించి నిజమైన నిశ్చితమైనజ్ఞానం ఎలాసాధ్యం?

నిజమైన జ్ఞానం, నిజంగా నిశ్చితంగా ఉన్నదాన్ని గురించే సాధ్యం కాని మరికు ఇంద్రియ గోచరమయ్యే ప్రపంచంలోని వస్తువులన్నీ ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఏ వస్తువు తను తానుగా ఉండటం లేదు. మరొకటిగా మారుతున్నది. కనుక ఆ వస్తువు కాసేపు ఉన్నట్లుగా కనబడుతుంది తప్ప నిజంగా లేదన్న మాట. దానికి అభాస (Appearance) తప్ప అస్తిత్వం (existence లేదన్నమాట దీని గురించి నిశ్చితమైన జ్ఞానం సాధ్యం కాదు. దానిని గురించి అభిప్రాయము మాత్రమే సాధ్యం

నిజమైన జ్ఞానం నిజంగా నిశ్చితంగా వున్నదాన్ని గురించే సాధ్యం అనుకున్నాము కదా! మరి ఆవిధంగా నిజంగా నిశ్చితంగా అస్తిత్వం కలిగినవి ఏవైనా ఉన్నాయా? నిస్సందేహంగా ఉన్నాయి. నిజానికి అవే ఉన్నాయి. తక్కినవన్నీ ఉన్నట్లు కనబడుతున్నాయి. అలా నిజంగా అస్తిత్వం యాదార్థ్యం కలిగిన వాటిని ఆకృతులని (formes), భావాలు (ideas) అని ప్లేటో పేర్కొన్నాడు. భావం అంటే ఏమిటి?

ఉదాహరణకు ఒక సుందరమైన వస్తువును తీసుకోండి దాని అందం సాపేక్షమే, కాని సౌంధర్యం అనే భావం (idea) శాశ్వతం, నిరపేక్షం. అలాగే న్యాయం అనేది కూడా ఒకరికి న్యాయమైంది మరొకరికి అన్యాయం. ఇప్పుడు న్యాయమైనది రేపు అన్యాయం అంటే న్యాయం అనేది సాపేక్షం. కాని న్యాయం అనే భావం (idea of Justice) శాశ్వతం నిరపేక్షం, ఈ శాశ్వత భావాలవల్లనే మనకు తాత్కాలిక సాపేక్ష అభిప్రాయాలు కలుగుతున్నాయి ఈ భావ వాదాన్ని ప్లేటో ఇంద్రియ గోచరమౌతున్న సమస్త ప్రపంచానికి వర్తింప చేశాడు. దీనినే సార్వత్రిక సిద్ధాంతం (Theary of Universals) అంటారు. ఇంద్రియ గోచరమౌతున్న వస్తువులన్నీ ప్రత్యేక వస్తువులు (Particulars). కాని వాటికి సంబంధించిన భావాలు సార్వత్రికాలు (universals)

ఉదాహరణకు మనం మొదటిసారిగా గోవు అనే జంతువును చూశామనుకోండి అది మనకు ఒక జంతువుగా అవగాహన అవుతుంది తప్ప మరేమి స్ఫురించదు. ఆ తర్వాత మరికొన్ని అదేరకమైన జంతువులను చూస్తాము. అప్పుడు వాటిని ఒకే జాతికి చెందిన జంతువులుగా గుర్తిస్తాము. అపుడు వాటికి గోవులనే నామము పెట్టి వాటిలో కామన్ గా ఉండే గోత్వాన్ని [Cowness] గుర్తిస్తాము. ఆ పిదప ఎన్ని గోవులను చూసినా మనకు వాటిలోని గోత్వమే మనకు కనిపిస్తుంది. ఒక ప్రత్యేకమైన గోవు నశించినా లేదా అన్ని గోవులు నశించినా గోభావం మాత్రము నశించదు. కాబట్టి గోవులు తాత్కాలికాలు, సాపేక్షాలు, కాని గోభావం మాత్రం నిత్యమైనది. కాబట్టి గోభావం[Universal]. అదేవిధంగా తక్కిన ప్రాపంచిక వస్తువులన్నీ కూడాను. సుందర వస్తువులు నశించినా సౌంధర్యభావం నశించదు. ఒక ధర్మకార్యం నశించినా ధర్మభావం నశించదు. కాబట్టి ఈ భావాలు నిత్యమైనవి. ఎందుకంటె అవి అశరీరమైనవి, అభౌతికమైనవి[non material]. ఈ సార్వత్రిక భావాలతో కూడినదే నిజమైన జగత్తు ప్రత్యేక వస్తువులతో కూడినది ఇంద్రియ జగత్తు. అది అభాస మాత్రమే కనుక దాన్ని గురించి అభిప్రాయము మాత్రమే కలుగుతుంది. జ్ఞానం అనేది అపుడు, ఇప్పుడూ, ఎల్లప్పుడు వుండే భావజగత్తును గురించే కలుగుతుంది కనుక ఆ భావజగత్తును తెలుసుకోవడమే నిజమైనజ్ఞానం. భావాలు అభౌతికం, అగోచరం. కనుక వాటిని బుద్ధి ద్వారానే గుర్తించగలము. వివేచన ద్వారానే వాటిని తెలుసుకొనగలము.

అసలైన సత్పదార్థాలు (Real things) భావాలే అయితే ఈ దృశ్యజగత్తు ఎక్కడినుండి వచ్చింది? భావాలు వచ్చింది. ఈ దృశ్య జగత్తునుంచేగదా! అది నిజంగాఉన్నట్టే కనబడుతుందికదా! ఇక్కడ ప్లేటో దేవుడిని ప్రవేశపెట్టక తప్పలేదు. భావాలనుంచే ఈ

ఇంద్రియ వస్తువులన్నీ వచ్చాయని ప్లేటో అంటాడు. మట్టితో బొమ్మలు చేసేవాడి దగ్గర ఒక మూస ఉంటుంది. దానితో బొమ్మలు చేస్తాడు. ఎన్నివందల బొమ్మలు చేసినా ఆ మూస మారదు. బొమ్మలు విరిగి పోయినా, సరిగ్గా రూపురేఖలు రాక పోయినా మూస మాత్రం అలాగే ఉంటుంది. బొమ్మలు అశాశ్వతము, మూస శాశ్వతము. భావం అనేది మూసవంటిది. కనుక అది శాశ్వతం. దానిలోంచి ఉత్పన్నమయ్యే ప్రత్యేక భౌతిక వస్తువులైన బొమ్మలు అశాశ్వతాలు. దేవుడు భావాలనే మూసలను తీసుకొని వాటి సహాయంతో వివిధ వస్తువులు నిర్మిస్తున్నాడు. అయితే ఆ భావాలు దేవుడు సృజించినవి కావు. దేవుని మనస్సులోనివి కావు. దైవం, భావం సమాన ప్రతిపత్తి కలిగినవి. భావాలను దేవుడు సృజించనట్లే, భావాలు దేవుడిని సృజించలేదు. భావాలు దేవుడు సృజించినవి కానట్టే మన మనస్సులో పుట్టినవి కూడా కావు. అనేక గోవులను చూడటంవల్ల కాదు మనకు గోవుభావం కలిగేది. గోవు భావం వల్లనే మనం వివిధ గోవులను చూడగలుగుతున్నాము. గోభావం అలాగే ఇతర భావాలు స్వయంసిద్ధాలు, మనోతీతాలు, తర్కవివేచనకు మాత్రమే అందుతాయి.

అన్ని భావాలు సమానమైనవేగాని కొన్ని ఎక్కువ సమానమైనవి అన్నిటికంటె ఎక్కువ స్థానంలో సత్యం, శివం, సుందరం [Truth, Good, Beauty] అనే మూడు భావాలు నిలిచాయి. తిరిగి వీటిలో శివం అనే భావానికి అత్యున్నత స్థానమిచ్చాడు. సూర్యుడు లేకపోతే వస్తువులు లేవు. సూర్యకాంతి వలనే వస్తువులు దృగ్గోచరమవుతున్నాయి అలాగే శివం వల్లనే తక్కిన భావాలు, వాటి నుంచి ఇంద్రియ జగత్తు వచ్చాయి. శివం వల్లనే తక్కిన భావాలను, వాటివల్ల ఇంద్రియ వస్తువులను గ్రహించగలుగుతున్నాము.

అయితే మనం భావాలను ఎలా తెలుసుకోగలుగుతున్నాము?

జ్ఞానం అనేది ఉన్నదాన్ని గురించే సాధ్యమనుకుంటే, జ్ఞానవిషయం [object of knowledge] అదివరకే ఉన్నదన్నమాట. ఈ జ్ఞానం మనకు ఎలా కలుగుతున్నది. అంటే మన ఆత్మ భౌతిక శరీరంలోకి ప్రవేశించటానికి ముందు భావ జగత్తులో భావాలతో సహజీవనం చేస్తూ ఉండాలి. భౌతిక ప్రపంచములోనికి మనం శరీర ధారులమై వచ్చాక పూర్వస్మృతి పోతుంది. జ్ఞానం మరపున బడుతుంది. దాన్ని తిరిగి మనకు జ్ఞాపకం చేసేదాన్నే విద్య అంటాము. మన ఆత్మ భౌతిక శరీరం ధరించటానికి ముందు స్వతహాగా ఉన్న జ్ఞానాన్నే విద్య మనకు జ్ఞాపకం చేస్తుంది.

మొదట్లో ఆత్మలన్నీ భావాల స్వర్గంలో భావాలతో సహజీవనం చేస్తూ ఉండేవి. ప్లేటో ఇక్కడ ఆత్మను రథికుడుగా పోల్చాడు. ఆత్మ ఎక్కిన ఆ రథానికి కోర్కె [desire] అనే ఒక గుర్రము, ఉద్వేగం [spirit] అనే మరొక గుర్రము పూన్చి ఉన్నాయి. ఆ రథంపై ఆత్మ అత్యున్నతమైన "శివం" అనే భావం ఉన్న స్వర్గానికి పోవాలని ప్రయత్నిస్తుంది. కొన్ని ఆత్మలు ఆ శివం ఉన్న స్వర్గానికి వెళ్తాయి, కాని చాలా ఆత్మలు గుర్రాలను నిగ్రహించలేక భూలోకానికి పడిపోయి జన్మలెత్తుతాయి. తమ పూర్వస్మృతిని కోల్పోతాయి.

Note :- మన కఠోపనిషత్తులో కూడా ఒక శ్లోకం ఉన్నది.

ఆత్మానాం, రథినం విద్ధి శరీరం రథమేవతు
బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవచ

ఆత్మ రథికుడు, శరీరం రథము, బుద్ధి సారథి, మనస్సు పగ్గం అని అర్థం.

## అరిస్టాటిల్ క్రీ. పూ. 384 – 322

ప్లేటో శిష్యుడు, ఆదర్శవాది ప్లేటో, అరిస్టాటిల్ వాస్తవిక

వాది వైజ్ఞానికుడు. దాదాపు క్రీస్తుశకం 1500 సంవత్సరముల వరకు అంటే దాదాపు 1800 సంవత్సరాలు అతని విజ్ఞాన శాస్త్రములనే పాఠ్యశాలలలో భోధించారు. కాబట్టి అతని భావాలను తప్పకుండా తెలుసుకోవాలి.

ఆకృతులు, భావాలు మాత్రమే నిజంగా ఉన్నాయని, ఇంద్రియ గోచరమవుతున్న జగత్తు ఒక అభాస మాత్రమేనని ప్లేటో వాదము. ప్లేటో భావాలు శాశ్వతము వస్తువులు అశాశ్వతము అని చెప్పాడు గదా! దీనిని అరిస్టాటిల్ ఖండించాడు. గోవులలో గోత్వం అనే సామాన్య లక్షణం గోభావం ఉన్నమాట నిజమేగాని నేలవిడిచి సాము లేనట్లు, గోవులను విడిచి గోభావం విడిగా ఉండదు. ఒక ఎర్రని పువ్వు ఉన్నది ఎరుపు అనేది ఆ పూవులోనే ఉంటుంది తప్ప విడిగా ఉండదు. ఆ వస్తువు లేకుండా ఎరుపు దానంతట అది మన అనుభవంలోకి రాదు. ప్లేటో ప్రతిపాదించినట్లు సార్వత్రికాలు, ఆకృతులు, భావాలు విడిగా మన ఇంద్రియానుభవంలోకి రావు. అవి ఆయా ప్రత్యేక వస్తువులతోనే కలిసి మన అనుభవం లోకి వస్తాయి. అటువంటప్పుడు అవి ప్రత్యేక వస్తువులకు కారణం ఎలా అవుతాయి. భావాలు శాశ్వతం, ప్రత్యేక వస్తువులు అశాశ్వతం ఎలా అవుతాయి?

వస్తువు లేకుండా ఆకృతి ఉండదు. అలాగే ప్రతి వస్తువు ఆకృతిని కలిగి ఉంటుంది నిజంగా ఉన్నది ప్రత్యేక వస్తువులే. అంటే ఈ బల్ల, ఆ బల్ల ఈ గోవు, ఆ గోవు – ఇవే యదార్థంగా ఉన్నాయి. అయితే వాటి ప్రత్యేకత [individuality] వాటి ఆకృతి వల్లనే సిద్ధిస్తున్నాయి. అందుచేత ఒక విధంగా చూస్తే బల్లలోని ద్రవ్యం mater కంటె బల్ల ఆకృతే ప్రధానమైనది. దాన్ని మనం బల్ల అని ఎందుకు పిలుస్తున్నాము? బల్ల ఆకృతిని బట్టేగదా! అయితే ప్లేటో ప్రత్యేక వస్తువు నిజంగా లేదన్నాడు. ఉన్నట్లు కని

పిస్తుందన్నాడు. కాని అరిస్టాటిల్ ప్రత్యేక వస్తువే నిజంగా ఉందన్నాడు. ఎందుకంటె బల్లలోని ద్రవ్యం [matter] లేనిదే బల్ల ఆకృతికి ఆలంబనం ఏది? కనుక ద్రవ్యం [matter] దాని ఆకృతి రెండూ నిజంగా ఉన్నాయి. రెండూ యదార్థాలే. రెండూ అవినాభావ సంబంధము కలిగి ఉంటాయి. ఆ రెండింటి కలయికతోనే ప్రత్యేక వస్తువు ఏర్పడుతుంది.

ఇక మార్పు సంగతికి వస్తే ప్రపంచములో ప్రతి వస్తువు మారిపోతున్న మాట నిజమే ఒక వస్తువుకు ఇప్పుడొక ఆకృతి ఉంటుంది. తరువాత మరొక ఆకృతి వస్తుంది. మొదట విత్తనం, తర్వాత చెట్టు, తర్వాత పూలు కాయలుగా మారుతుంది. ఇన్ని మార్పులలోను మారనిది ద్రవ్యం (matter). ఆ ద్రవ్యమే ఒకసారి ఒక ఆకృతి మరొకసారి ఇంకొక ఆకృతి ధరిస్తున్నది. ఇక్కడ వస్తువు మార్పు చెందుతున్నదంటే దాని ఆకృతి మరొక ఆకృతిగా మారుతున్నదనిగాదు ఏ ఆకృతి మరొక ఆకృతిగా మారదు. ఒక ఆకృతి పోయి మరొక ఆకృతి వస్తుంది. కాబట్టి ద్రవ్యంగాని, ఆకృతులుగాని శాశ్వతంగా ఉండేవే.

దీన్ని అర్థం చేసుకోవాలంటె గర్భితస్థితి [Potentiality], వాస్తవస్థితి [actuality] అనే సూత్రాలను ఆలంబనం చేసుకోవాలి. మామిడి టెంకనుంచి మామిడిచెట్టు వస్తుంది. అంటె మామిడి టెంకలో మామిడిచెట్టు గర్భితంగా ఉన్నదన్నమాట. అలా లేకపోతే ఆ టెంకనుంచి ఏ వేపచెట్టో, తుమ్మచెట్టో రావచ్చుకదా! మామిడిటెంక గర్భితస్థితి అయితే మామిడిచెట్టు వాస్తవస్థితి. ఒక చోట కొన్ని ఇటుకలు ఉన్నాయి. వాటిని కొన్ని వరుసలలో పేర్చితే గోడ అవుతుంది. చెల్లాచెదురుగానున్న ఇటుకలు తమ వాస్తవస్థితిని గోడలో అభివ్యక్తం (realise) చేసుకుంటున్నాయి. ఇలాగే ఏ వస్తువును చూసినా దానిలో గర్భితస్థితి, వాస్తవస్థితి

రెండూ ఉన్నాయి. మామూలు మట్టికి ఇటుకలు వాస్తవస్థితి. ఇటుకలకు గోడలు వాస్తవస్థితి. గోడలు ఇంటికి వాస్తవస్థితి. ఇలా చెప్పుకుంటూ పోవచ్చు. కాబట్టి ఈ రెండు రకాల స్థితులు సాపేక్షాలే, గర్భిత స్థితినుంచి వాస్తవస్థితికి పోతున్నకొద్దీ వస్తువులో ఆకృతి ప్రాధాన్యం పెరుగుతూ పోతుంది. చివరకు ఒక వస్తువు పూర్తి పెరుగుదలను పొందినప్పుడు దాని ఆకృతి, దాని ప్రయోజనం సిద్ధిస్తాయి. దానిలోని గర్భిత ప్రయోజనాలన్నీ వాస్తవస్థితిని పొందుతాయి.

సరే ప్రతి వస్తువు మార్పుచెందుచున్నది. అంటే చలిస్తుంది. మరి ఈ మార్పులకు చలనానికి కారణం ఏమిటి? అరిస్టాటిల్ దీనికి నాలుగు కారణాలను పేర్కొన్నాడు.

1) భౌతిక కారణం:- కుండకు మట్టి భౌతిక కారణం, కంచు విగ్రహానికి కంచుముద్ద భౌతిక కారణం.

2) ఆకృతిక కారణం - శిల్పి కంచుతో విగ్రహాన్ని తయారుచేయాలనుకున్నాడనుకోండి అంటే అతని మదిలో విగ్రహ ఆకృతి మెదులుతుంది.

3) నిమిత్త కారణం :- శిల్పి, పనిముట్లు

4) అంతిమ కారణం:- శిల్పి పనిచేయడానికి ఏదో ఒక లక్ష్యం, ప్రయోజనం ఉండాలికదా! విగ్రహసృష్టియే ఆ లక్ష్యం. పూర్తిఅయిన విగ్రహం అంతిమ కారణం. కనుక ఆ విగ్రహం వాటన్నింటికి కారణమైంది.

భౌతిక పదార్థం, ఆకృతి, కలిసేసరికి చలనం కలుగుతుంది. కాని ఆ చలనం లక్ష్యరహితం కాదు, అర్థరహితము కాదు. భౌతిక పదార్థము తన ఆకృతిని లేదా వాస్తవస్థితిని చేరుకోవడానికి ఆసక్తి

చెందడం వల్ల చలనం అనేది ఉద్భవిస్తున్నది. ఇది ఎలా? భౌతిక పదార్థము తనంతటతాను చలించలేదు. కంచుముద్దలో విగ్రహం గర్భితంగా వుంటుంది. కాని ముద్ద తనంతటతాను విగ్రహంగా పరివర్తన చెందలేదు. ఎందుకంటె ముద్ద ప్రత్యేకించి విగ్రహంగానే మారనక్కరలేదు. కంచు బిందెగానో, కంచు పళ్ళెముగానో లేదా ఏ ఆకారంగానైనా మారడానికి అవకాశం ఉంది. కనుక తను ఏ ఆకృతి ధరించాలో నిర్ణయించేది కంచుముద్దకాదు. అంతిమ కారణం. నిమిత్తకారణం, ఆకృతిక కారణం — ఇవి అదేవరుసలో కంచుముద్ద పరివర్తనకు ఆధారాలవుతాయి. అందువల్ల మరొక విధంగా చూస్తే అంతిమ కారణమే ఆది కారణమవుతుంది. అంటే ఏ అంతిమ ప్రయోజనం కోసం చలనం ప్రారంభమైందో ఆ అంతిమ ప్రయోజనమే ప్రథమ కారణం first cause అవుతుంది. కంచు విగ్రహం ప్రథమ కారణము దానికోసమేగదా శిల్పి తన పరికరములతో పని మొదలుపెడుతున్నాడు. దానికోసమేకదా విగ్రహ ఆకృతిని ఊహిస్తున్నాడు. దానికోసమే కదా కంచు ముద్దను తీసుకొన్నాడు. కనుక కారణంలోనే కార్యముంది.

ప్రపంచములో ఇటువంటి పరిణామాలు చలనాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. కాని ఈ మొత్తం చలనాలకు ప్రథమ కారణం ఏదోఒకటి ఉండి ఉండాలికదా! అలాంటి ప్రథమ కారణం లేకపోతే అసలు మొదటగా చలనం ప్రారంభమై వుండేదేకాదు. అలాంటి ప్రథమకారణం తాను చలించదు. మార్పుచెందదు. తాను కూడా చలిస్తే ఆ చలనానికి కారణం మరల వెదుకవలసి వస్తుంది. కనుక ప్రథమ కారణం ఏదైతే ఉందో అది తాను చలించకుండా, తక్కిన అన్ని చలనాలకు కారణమవుతున్నదని ఊహించుట ఉత్తమం. ఆ ప్రథమ కారణాన్నే అరిస్టాటిల్ నిశ్చల చాలకుడు (ఈశ్వరుడు) అని పేర్కొన్నాడు.

ఉదాహరణకు కొండపై గుడిలో దేవుని విగ్రహము ఉన్నది. అది కదలదు కాని ఆవిగ్రహాన్ని అర్చించటానికి భక్తులు కొండ ఎక్కి వెడతారు. విగ్రహము తాను కదలకుండా భక్తులను కదలించింది. ఈశ్వరుడు సమస్త ప్రపంచానికి గమ్యం లక్ష్యం కనుక ఆయనను చేరడానికి ప్రపంచములోని ప్రత్యేక వస్తువులన్నీ తహ తహ లాడుతున్నాయి. ఆ తహతహ వాటిలో చలనం కలిగిస్తున్నది. ఆయన చలించడు, జగత్తును చలింపచేయాలన్న కోర్కె కూడా ఆయనలో ఉండదు. అట్టి కోర్కె ఉన్నదంటే ఆయనకూడా చలించినట్లే. కావున కేవలం ఆయన ఉనికి వల్లనే సమస్త చరాచర జగత్తు ఆయనవైపు చలిస్తుంది.

ఈశ్వరుడు సృష్టికర్త కూడా కాదు ప్రపంచాన్ని సృష్టించాలంటే అలా సృష్టించాలనే కోర్కె కలగాలి. అంటే ఈశ్వరుడు చలించాలి. అపుడు ఈశ్వరుని చలనానికి కారణంకోసం అన్వేషించాల్సిన అగత్యం ఏర్పడుతుంది. భౌతిక పదార్థానికి చలనం తప్పదు. కనుక ఈశ్వరుడు భౌతిక పదార్థము కాదు కనుక ఆయనకు కోర్కెలుండవు. చలించనక్కర లేదు. ఆయన కేవల భావం, శుద్ధ ఆకృతి, పరిపూర్ణ వాస్తవం ఆయనలో గర్భితస్థితి లేదు. ఆయన అనాద్యనంతుడు. సృష్టికూడా అనాద్యనంతం. చలనం కూడా అనాద్యనంతం. ఈశ్వరుడు మానవుల ఆరాధనకు, ప్రార్థనలకు చలించడు.

పూర్తిగా గర్భితస్థితిలో ఉండేది ఆకృతిరహితమైన శుద్ధ ద్రవ్యం. అలాగే పూర్తిగా వాస్తవస్థితిలో ఉండేది ద్రవ్యరహిత శుద్ధ ఆకృతి. శుద్ధ ద్రవ్యం మొదటగా నాలుగు మూల పదార్థాలుగా మారుతుంది. అవి మట్టి, నీరు, అగ్ని, వాయువు అయితే ఐదవ మూలపదార్థాన్ని కూడా ఊహించాడు. దానికి ఈథర్ (విహాయసం) అని పేరు పెట్టాడు. ప్రతి వస్తువుకు కొంత విస్తృతి

ఉంటుంది. అది కొంత స్థలాన్ని ఆక్రమిస్తుంది. దానికి ఒక పరిమితి (Limit) ఉంటుంది. ఆ వస్తువు పరిసరాలు దాని పరిమితిని నిర్ణయిస్తాయి. మొత్తం విశ్వానికి పరిసరాలు లేవు. అంటే విశ్వం వెలుపల స్థలం (Space) లేదు. కనుక విశ్వం స్థలంలోపల లేదు. స్థలమే విశ్వంలోపల ఉన్నది. డెమొక్రటసీ చెప్పినట్లు అణువులు, శూన్యం లేవు. Space గాని, విశ్వంగాని అనంతాలు కావు, పరిమితాలు. అనంత స్థలాన్ని గాని, అనంత విశ్వాన్ని గాని ఊహించలేము. చలనము అంటె ఒకవస్తువు ఒక చోటినుండి మరొక చోటికి వెళ్ళడం. ఈ చలనం వల్లనే కాలం time ఏర్పడుతుంది. స్థలాన్ని ఆక్రమించే వస్తువులు లేనప్పుడు, స్థలం Space అనేది ఎలా ఉంటుంది? మట్టి, నీరు బరువైనవి కనుక క్రిందకు పడిపోతాయి. గాలి, అగ్ని తేలికయినవి కనుక పైకి పోతాయి. చలనం రెండు రకాలు. సూటిగా వెళ్ళే వస్తువు ఒకచోట బయలుదేరి మరొక చోట ఆగిపోక తప్పదు. రెండవది వృత్తాకార చలనం. ఇది ఖగోళ చక్రంలోని వస్తువులకు సహజసిద్ధమైన చలనం. సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు ఉన్నతమైనవి కనుక అవి వృత్తాకారంలో తిరుగుతున్నాయి. (అతని దృష్టిలో సరళరేఖా చలనము కంటె వృత్తాకార చలనం శ్రేష్ఠమైనదంట). భూమి సమస్త విశ్వానికి కేంద్రం. భూమినుంచి పైకిపోతే చక్రాకారంగా ఉన్న ఆవర్తాలు (circles) వస్తాయి. ఉల్లిపాయ కొన్ని పొరలతో ఏర్పడినట్లు, భూమి కేంద్రంగా ఒకదానిపై ఒకటిగా ఉన్న ఆవర్తాలతో విశ్వం ఏర్పడింది. వివిధ ఆవర్తాలలో వరుసగా చంద్రుడు, బుధుడు, శుక్రుడు, సూర్యుడు, కుజుడు, గురువు, శని ఉన్నారు. ఇంకా పైకిపోతే నిశ్చల నక్షత్రాలు ఉన్న ఆవర్తం వస్తుంది. నక్షత్రాల ఆవర్తం వెనుక దేవుడు మొత్తం విశ్వాన్ని ఆవరించుకొని, తాను చలించకుండా సమస్త విశ్వానికి చలనం కల్గిస్తున్నాడు.

జీవానికి నిర్జీవానికి మధ్య విభేదం ఆత్మ ఉండటము లేక పోవడంతో ఏర్పడుతుంది. ఆత్మ అనేది పంచభూతాలు (మట్టి నీరు అగ్ని వాయువు ఈథర్) రకరకాలుగా కలియడం వల్ల ఆత్మలలో రకాలు ఏర్పడుతున్నాయి వృక్షాలలో ఒకరకం ఆత్మ, జంతువులలో ఒకరకం, మానవులలో వేరొకరకం ఉంటాయి. ఆత్మ ఎక్కువ తక్కువలను బట్టి జీవజాతులలో తేడాలు కల్గుతున్నాయి. మానవుడు ఆలోచన కూడా గల బౌద్ధిక జంతువు అతనిలో జీవం పరిపూర్ణ వాస్తవత్వం పొందుతున్నది. ఇతడు జీవశాస్త్రంలో ప్రత్యేక కృషి చేశాడు, 500 పైగా జంతుజాతులను పరిశీలించి వాటిని వర్గాలుగా జాతులుగా విభజించాడు. పక్షులకు, పాములకు దేహ నిర్మాణంలో పోలికలను కనుగొన్నాడు. మానవులకు జంతువులకు గల పోలికలను కనుగొన్నాడు. తిమింగలాలను స్తన్య జంతువులలో వర్గీకరించాడు. వానరాలకు మానవులకు గల సారూప్య లక్షణాలను కనిపెట్టాడు. ఇలా పరిణామ వాదానికి దగ్గరగా వచ్చినప్పటికి, సృష్టిలో జీవజాతులన్నీ యథాతథంగా ఆదినుంచే ఉన్నవని అతడు విశ్వసించాడు. పరిణామ వాదాన్ని గ్రహింపలేక పోయాడు. ఆ ఘనతను డార్విన్ పొందాడు. ఇలా మొదటగా సమస్తాన్ని విశ్లేషించిన వైజ్ఞానికుడుగా ఈ అరిస్టాటిల్ గుర్తింపబడ్డాడు.

**Note :-** నక్షత్రాలు నిశ్చలంగా లేవు. అవికూడా అమిత వేగంలో చలిస్తున్నాయి. భూమి విశ్వకేంద్రంలో లేదు. సూర్యుడు కేంద్రంగా బుధ, శుక్ర, భూమి, కుజ, గురు, శని గ్రహాలు తిరుగుతున్నాయి. తేలిక వస్తువులకంటె బరువైన వస్తువులు వేగంగా నేలపై బడవు. గలీలియో రెండు చిన్న బరువులున్న గోళములను ఎత్తునుండి వదలగా రెండూ ఒకసారే నేలపై పడ్డాయి. ఖగోళ వస్తువులకు వృత్తాకార చలనం సహజసిద్ధము కాదు. ఆకర్షణ శక్తి

వలనఅలా తిరుగుతున్నాయి. అయితే ఒక విషయంలో మాత్రం ఐన్ స్టీన్ కు దగ్గరగా వచ్చాడు. ఐన్ స్టీన్ కూడా విశ్వం పరిమిత మని భావించాడు. వస్తువులున్న చోటే స్థలం space ఉంటుందని, వస్తువులమధ్య దూరమే స్థలమని ఐన్ స్టీన్ నిర్వచించాడు.

## ఎపిక్యూరస్ క్రీ. పూ. 341 – 270

ఇతడు నాస్తికుడు, భౌతికవాదే కాని విశృంఖల వాది కాడు. వ్యక్తిగా ఎపిక్యూరస్ మహోన్నతుడు, దయాశీలి, స్నేహమయి. జీవితలక్ష్యము సుఖసంపాదన. బ్రతుకును సుఖమయము చేసుకో వాలి. ఎలా? సుఖం అనేది ప్రత్యేకంగా ఉండదు దుఃఖరాహిత్యమే సుఖం. కోర్కెలు లేకపోవడమే సుఖానికి మార్గం. మనోనిశ్చలత, మనఃప్రశాంతి, మనోనిగ్రహం కల్గి ఉండటము మార్గం. సుఖం కోసము ప్రయత్నించడంలో సుఖంలేదు. సుఖంకోసం అన్వేషించక పోవడంలోనే సుఖం ఉన్నది. బాధ ఉపశమించినపుడు సుఖం కల్గు తుంది. అతిగా సుఖాలు అనుభవించటం వల్ల బాధలు కల్గుతాయి. ఇంద్రియానుభవాలన్నిటిలోను మితిని పాటించాలనే వాడు. బాధ అనివార్యమైతే దానిని ధైర్యంగా అనుభవించాలి. మనిషికి శాంతి లేకుండా చేసేది బాహ్యప్రపంచము. భౌతిక జీవితమే కాదు, మూఢ విశ్వాసములు, మరణభయం వర్జించాలి. అలాగే అలౌకిక శక్తుల భయంకూడా విసర్జించాలి. మరణానంతరం స్వర్గనరకాల భయం, బాధలు కూడదు. ఎందుకంటె మరణం తర్వాత ఆత్మ అనేది ఉండదు. దేహంతోపాటే ఆత్మ నశిస్తుంది. మరణం శాశ్వత నిద్రతో సమానం. అయినప్పుడు మరణానికి ఎందుకు భయపడాలి. జీవితం ఎంత సహజమో, మరణం అంతే సహజము. సరిహద్దులులేని శాంతి లోకానికి సింహద్వారము మరణము. దేవతలు ఉన్నా మన ప్రార్థనలు వారినికదిలించలేవు. వారు మనలను గమనిస్తున్నా

రని, శిక్షిస్తారని, కరుణిస్తారని అనుకోవడం భ్రమ మన సుఖమే మన లక్ష్యం.

ఈ సమస్త విశ్వం అణునిర్మితం. కాని డెమొక్రాటెస్ చెప్పినట్లు అణువులు చెల్లాచెదురుగా చలిస్తూ పరస్పరం ఢీకొట్టుకోవడం వల్ల ఏకం కావు. అరిస్టాటిల్ చెప్పినట్లు బరువైన వస్తువులు వేగంగాను తేలిక వస్తువులు నెమ్మదిగాను క్రింద పడతాయి. అలాగే బరువైన అణువులు వేగంగాను, తేలికయిన అణువులూ నెమ్మదిగాను శూన్యాంతరాళంలో పైనుంచి క్రిందికి సూటిగా వర్షము చినుకులవలె పడిపోతూ ఉంటాయి. అయితే గాలికి ఎండుటాకులు అటునిటు చెదిరిపోయినట్లు మధ్య మధ్యలో అవి ప్రక్కలకు చలిస్తాయి. అలా చలించటంలో అణువులు ఒకదానినొకటి అతుకుకొని వివధవస్తువులుగా ఏర్పడుతాయి. నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుడు, చంద్రుడు, అలా ఏర్పడినవే. అణువుల నెవ్వరూ సృష్టించలేదు. అనాదిగా ఉన్నాయి. స్వయంభువాలు. వాటికి చలనం స్వతః సిద్ధము, బహుశా వాటికి యదేచ్ఛ (Free will) ఉన్నది. వాటిని ఏకం చేసే అదృశ్యశక్తి ఏదీలేదు. అఖరుకు దేవతలుకూడా మానవులవలె అణుసంయోగ జనితులే. దేహంవలె ఆత్మకూడా అణునిర్మితమే. దేహం నశించగానే ఆత్మకూడా విచ్ఛిత్తి పొందుతుంది. ఆ తర్వాత ఏమీ మిగులదు.

భూమి మొదటగా ఒక మట్టి ముద్దలా ఉండేది, దానిపై పచ్చిక చెట్లూ మొలిచాయి. పశువులు, జంతువులూ రూపొందాయి. మొదట ఎన్నో వికృతాకారాలు జన్మించాయి. వాటిలో పరిసరాలకు అనుగుణంగా లేనివి నశించాయి, అనువైన ఆకృతులు కల్గినవే వృద్ధి పొందాయి? ప్రకృతి ఎన్నో తప్పులు చేసి సరిదిద్దుకొన్నది. ఈ విషయంలో ఎపిక్యూరస్ డార్విన్ పరిణామ వాదానికి దగ్గరగా వచ్చాడు. పరిణామ క్రమంలో అఖరున మానవుడు

పుట్టాడు. మొదట నగ్నంగా మృగంవలె అనాగరికంగా బ్రతికాడు. నెమ్మదిగా గుహానివాసం ఏర్పరుచుకొన్నాడు. గుంపులుగా బ్రతకటం నేర్చుకొన్నాడు. సామూహిక జీవనం వల్ల మాట్లాడటం నేర్చుకొన్నాడు. స్నేహం, ప్రేమ, దయ అలవర్చుకున్నాడు. ఆత్మ రక్షణకు ఆయుధాలను చేశాడు. క్రమంగా వ్యవసాయం, వర్తక వ్యాపారాలు, నౌకాయానం, రాజకీయాలు అభివృద్ధి చెంది నాగరిక జీవితంలోకి ప్రవేశించాడు.

Note :- ఆదేకాలంలో మన దేశంలో కూడా పక్కా భౌతిక నాస్తిక వాదులు, చార్వాకులు లేదా లోకాయత వాదులుగా పిలువబడుతూ జీవించియున్నారు. ఇతని వాదము కూడా లోకాయత దర్శనాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

### స్టాయిక్ తాత్వికులు — ఎపిక్టెటస్ క్రీ. శ. 50–120

స్టాయికులు మన భగవద్గీతలో చెప్పినటువంటి స్థితప్రజ్ఞులు. సుఖదుఃఖాలను, జయాపజయాలను సమానంగా పరిగణించేవాడు స్థితప్రజ్ఞుడు. దుఃఖంలో అనుద్విగ్నంగాను, సుఖం పట్ల అనాసక్తంగాను ఉండి రాగ భయ క్రోధాలను విడిచిపెట్టాలి. ఎపిక్యూరస్ సౌఖ్యమే జీవితలక్ష్యమని, బాధానివారణే సౌఖ్యమని నిర్వచించాడు కదా! వీరు ఇందుకు భిన్నం. సుఖదుఃఖాలు బాహ్యప్రపంచానికి చెందినవి. బాహ్యప్రపంచ పరిస్థితులపై ఆధారపడినవి. అవి మనం కావాలంటె రావు, పోవాలంటెపోవు. వాటంతట అవి వస్తాయి, పోతాయి. వాటితో మనకు నిమిత్తంలేదు. మన మనస్సు మన స్వాధీనంలో ఉండాలి. మన మనస్సును స్వేచ్ఛగా ఉంచుకోవాలి. సహనశక్తిని పెంపొందించుకోవాలి. తామరాకుపై నీటి బొట్టులాగా అంటీ అంటనట్లు ఈ ప్రపంచములో మనిషి జీవించాలి. యోగంలో ఉండి కర్మలు చేయాలి. కర్మకోసమే కర్మ, ఫలితం కోసం కాదు. ప్రేమ, ద్వేషం, అనురాగం, భయం అన్నిటినీ అణచి

వేయాలి. మన మానసిక వికారాలను జయించాలి ఉద్రేక రహితంగా, అనాసక్తంగా ఏదైనా చేయవచ్చు. చెడు అనేది మనం చేసే పనిలో లేదు మన మనస్సులో ఉంది. మంచి ఫలితాలనిచ్చే పనినైనా అనాసక్తితో చేయకపోతే అది చెడు పనే అవుతుంది. అంటే కీర్తికోసము చేసే మంచిపనులు మంచి అనిపించుకోవు. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది దేవుడు ఎవడిని ఎలా పుట్టిస్తే వాడు అలా బ్రతకాలి మనకు అలవికాని దాని కోసము అర్రులు చాచరాదు.

మన బుద్ధిబలం, సంకల్పబలం, స్వేచ్ఛాబలం – ఇవి దేవుడు మనకిచ్చిన వరాలు ఏ బాహ్యపరిస్థితులు వాటిని చెనకలేవు. ఒకడు నిన్ను ప్రవాసానికి పంపవచ్చు కాని నీవు ప్రవాసానికి సంతోషంగా వెళ్ళకుండా ఎవడూ ఆపలేడు. ఒకడు నీకు మరణశిక్ష విధిస్తే, నిన్ను మృత్యువును ధైర్యంగా ఎదుర్కొనకుండా ఎవడూ ఆపలేడు. నిన్ను ఏడవమని, బాధపడమని ఎవడూ బలవంతం చేయలేడు. ఎవరైన నిన్ను బందిస్తే సంకెళ్ళు నీ శరీరాన్నే బందించగలవేమోగాని నీ మనస్సును కాదు నీ మానసిక శాంతి, స్వేచ్ఛ, ధైర్యం ఇవి పూర్తిగా నీ సొంతం నిర్లిప్తత ఒక్కటే ఆదర్శ మానసిక స్థితి.

Note :- మనకర్మ సిద్ధాంత ప్రభావం వీరిపై ఎక్కువగా నున్నట్లున్నది.

క్రీస్తు మొదటి శతాబ్దంలో గ్రీకు నాగరికత పతనమై పోయింది. రోమన్ సామ్రాజ్యంలో గ్రీసు ఒక అంతర్భాగమైంది. రోమ్ చక్రవర్తి నీరో కాలంలో పాలకుల క్రౌర్యంనుంచి, చిత్రహింసలనుంచి తమను తాము ఓదార్చుకోవటానికి ఈ స్టాయిక్ దృక్పధం ప్రజలకు బాగా తోడ్పడినది. దీని ప్రభావం తొలిరోజులలో క్రైస్తవ మతానుయాయులపై కూడా ఉంది. రోమన్ పాలకులు వందలాది క్రైస్తవులను వినోధార్థం క్రూర మృగాలకు బలిచేసే

పోరు. బౌద్ధానికి ప్రస్తుతను వారికి స్టాయిక్ దృక్పథం చేర్పింది తొలిరోజులలో క్రైస్తవ మతం, రోమన్ సామ్రాజ్య సమైక్యానికి అడ్డు వస్తుందన్న ఉద్దేశంతో దానిని అణచివేయటానికి క్రూర పద్ధతులు పాటించారు. అయినా క్రైస్తవమతం విశేషవ్యాప్తి పొందింది. ఆ తర్వాత క్రీ. శ. 400 కాలంలో రోమన్ పాలకులు కూడా క్రైస్తవ మతాన్ని స్వీకరించారు అప్పటినుండి క్రీ. శ. 1500 సంవత్సరముల వరకు క్రైస్తవ మతాధికారుల ప్రాబల్యం క్రింద తత్త్వ శాస్త్ర పురోభివృద్ధి, ఇటు వైజ్ఞానిక పురోభివృద్ధి పూర్తిగా అడుగంటి పోయాయి

క్రమ క్రమంగా మధ్యయుగం అంతరించి నవీనయుగంలో విలీనమైంది. పోప్ అధికారంపై మార్టిన్‌లూథర్ 1483 – 1546 తిరుగుబాటు చేశాడు. మత విశ్వాసాలను ప్రశ్నించటం ప్రారంభమైంది. విశ్వకేంద్రం భూమి కాదని సూర్యుడని కోపర్నికస్ 1530లో నిరూపించాడు. అతని సిద్ధాంతాలను కెప్లెర్ గలీలియో బలపరిచారు. ఈ విధంగా నవీనయుగం ప్రారంభమైంది. విజ్ఞాన శాస్త్రాలు, జైత్రయాత్ర ప్రారంభించాయి. ఆ నవీన విజ్ఞానాన్ని తనలో ఇముడ్చుకొని నూతన తత్త్వ సిద్ధాంతాలు కూడా రాను ఆరంభించాయి. మనము నవీన యుగంలోకి పోబోయేముందు, మన దేశంలో అప్పటివరకు వికాస మందిన తత్త్వ దర్శనములను తెలుసుకొని తర్వాత నవీన తత్త్వ యుగంలోకి అడుగెడుదాం.

## వేదాలు ఉపనిషత్తులు క్రీ॥ పూ. 2500–500

ఆర్యులకు పూర్వము భారత దేశంలో వెలసిల్లిన నాగరికత హారప్పా, మొహంజదారో అని ఇంతకు ముందే అనుకున్నాము గదా! ఆర్యులు రాకముందు ద్రవిడులు, నాగులు జీవిస్తూ ఉండే వారు. ఆదిమ మానవునకు మతసంబంధమైన సమస్యల గురించి ఆలోచించటానికి అవుసరమైన విశ్రాంతి, మానసిక స్థాయి రెండూ

లేవు తర్వాత మతభావాలు వృద్ధి అయినాయి ప్రకృతిని స్త్రీగా ఆరాధించే ఆచారం ఏర్పడ్డది. గ్రామ దేవతలుగా నేటికి ఆరాధింపబడుచున్న పోలేరమ్మ, నాంచారమ్మ, మరిడమ్మ ఇత్యాది దేవతా విగ్రహాలు పలు హరప్పా శిథిలాలలో లభ్యమయ్యాయి. పురుష దేవతలు శివుడు, లింగాకారాలు దొరికాయి. సృష్టికి మూలకారణాన్ని కనుగొనుటకు నాటి మానవుడు చేసిన ఆలోచన అత్యున్నత మిక స్థాయికి చెందినది. పురుష జననేంద్రియారాధన దీనికి నిదర్శనము. ఆర్యగణాలు మధ్య ఆసియా నుండి భారతదేశానికి వచ్చాయి. పశువులు మేపుకుంటూ, గుర్రాలపై నెక్కి విల్లంభులతో యుద్ధాలు చేస్తూ మొదట సింధునదీ తీరంలో స్థిరపడి గంగా, యమునా తీరాలకు విస్తరించారు. మన ప్రాచీన నాగరికతలు కూలిపోయాయి.

ఆర్యుల మత భావాల వెలిబుచ్చే గ్రంథాలే వేదాలు, ఇవి క్రీ. పూ. 2500 సంవత్సరముల నాటివి. ద్రావిడులవలె పాములను, చెట్లను, స్త్రీ దేవతలను పూజించకుండా ప్రకృతిలోని అగ్ని, వాయువు, సూర్యుడు, భూదేవి, వానదేవతయిన ఇంద్రుడు మొదలైన వారిని వీరు పూజించేవారు. ఆనాటికి అదే గొప్ప అభివృద్ధి. ఋగ్వేదంలో అగ్నిని అనేకరకాలుగా కీర్తిస్తూ పొగడబడి ఉంది. తమ నిత్య జీవితానుభవాలను ఉత్ప్రేక్షించి, సూక్తాల రూపంలో వెలిబుచ్చగల వారి మేధాశక్తి ఫలితమే వేదరచన. అక్కడక్కడ మెరుపులవలె వారి తాత్విక భావాలుకూడా వేదాలలో ఉన్నాయి. కాని ఎక్కువభాగము ప్రకృతి శక్తుల వర్ణనము ప్రార్థనలే. ఉదా:- ఋగ్వేదంలో ఇలా 1) ఓ అగ్నీ ఈ శవాన్ని కాల్చవద్దు, మాడ్చవద్దు, దాని చర్మాన్ని ముక్కలు ముక్కలుగా చీల్చకుము. ఓ జాతవేదుడా ఈ శరీరాన్ని కష్టపెట్టకుండా ఒక్కసారిగా భుజించి పితృలోకానికి అతనిని చేర వేయుము. నీవు భుజించి ఈ శరీరాన్ని

పితృలోకానికి చేర్చిన తర్వాత అతను దేవతల ప్రకారం నడచు కొంటాడు. చనిపోయిన వానికళ్ళు సూర్యునిలో చేరుగాక. ఊపిరి గాలిలో కలియుగాక. మిగితాది నీటిలో కలియుగాక.

అగ్ని తరువాత ప్రధాన దేవత ఇంద్రుడు. ఆర్యుల శత్రు వుల నందరిని అతడు సంహరిస్తాడు వీరు గాక పృధ్వీ, సోమ, అశ్వీన్, వరుణ, సూర్య మొదలైన దేవతలు కూడా వర్ణింప బడ్డారు. అధర్వణ వేదంలో ఇలా 2) పరమ సత్యము ధర్మ సూత్రము ఈ భూమిన ధరిస్తున్నది. యజ్ఞయాగాదులతో ఇది పవిత్రమౌతున్నది. భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు అధి నేతమైన భూదేవి మమ్ములను కాపాడుగాక! భూమిని ఇంద్రుడు రక్షిస్తున్నాడు. ఓ భూదేవి నీ మంచు పర్వతములు కొండలు నాకు క్షేమం కలిగించుగాక! భూదేవీ నీ శరీర మెక్కడ? కటిభాగమేది? బొడ్డు ఏది? నాకు ఈ వివరాలేమీ తెలియవు. కాని నీవు తల్లివి నేను నీ కుమారుడను. ఇంద్రుడు తండ్రి మీరు నాకు క్షేమము కల్గింతురుగాక!

వేద సూక్తాలలో ప్రార్థనలతో పాటు అక్కడక్కడ సందే హం తాత్విక చింతనకూడా లేకపోలేదు. ఒక వేదసూక్తం ఇలా ఉంది. మొదట మనుష్యుడు ఎలాపుట్టాడు, ఎముకలులేని పదార్థం లోనుంచి ఎముకలు గల వ్యక్తి ఎలా కలిగాడు, ఈ భౌతికకు ప్రాణం, ఆత్మ ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసు కొనేందుకు ఎవరైనా ఇంద్రుని దగ్గరకు వెళ్ళారా. ప్రకృతి అంతా నియమ బద్దంగా నడుస్తుంది. ఆ నియమమే "ఋత్" అని వర్ణించ బడింది, ఉపనిషత్తులలోని కర్మ సిద్ధాంతానికి మూలం ఈ ఋత్ భావమే. పదార్థం శాశ్వతమైన అనాది. ఆ పదార్థంలోనుంచి దేవుడు ప్రపంచాన్ని సృష్టించాడు.

తన శరీరాన్ని గురించి అతి ప్రాథమిక జ్ఞానం కూడా అది

మానవునికి లేదు. కలలు ఎందుకు వచ్చేవో వారికి తెలియదు. మానవ శరీరాన్ని అంటిపెట్టుకొని ప్రత్యేకంగా ఒక ఆత్మ ఉన్నదని, ఆలోచన స్పర్శజ్ఞానం మొదలగు లక్షణాలు ఆత్మకు మాత్రమే చెందినవనీ, శరీరానికి చెందినవి కావనీ, అందుకనే కలలు వస్తున్నాయని నమ్మారు. మరణానంతరం ఆత్మ శరీరాన్ని వదలిపోతుందనుకున్నారు. మానవునికి, ప్రకృతికి గల సంబంధాలను గ్రహించలేకపోవటం మతభావాల పుట్టుకకు మూలకారణం. మానవ శరీరానికి — అతని ఆలోచనకు గల సంబంధాన్ని గుర్తించలేక పోవటం ఆత్మ భావానికి మూలకారణం.

ఋగ్వేదం :— ఆర్యుల ఆనంద పారవశ్యం, ప్రకృతి ఆరాధన ప్రధానంగా కనబడుతుంది.

సామవేదం:— ఋగ్వేద ఋక్కులను వివిధంగా గానం చేయాలి అన్న విషయం తప్ప అదనంగా ఏమీ లేదు. అలా గానం చేస్తే ఫలితం లభిస్తుందన్న నమ్మకము ఏర్పడ్డది. గానం చేయటానికి పురోహిత వర్గం వచ్చింది

యజుర్వేదం:— యజ్ఞవేదిక ఎత్తు పొడవు, దానిపై ఉంచవలసిన ధాన్యములు మొదలగు కర్మకాండను వివరిస్తుంది.

అధర్వణవేదం:- పై విషయాలతో పాటు ఆటవిక తెగల మూఢ నమ్మకాలు, దయ్యాలు, ప్రయోగాలు ఉన్నాయి.

ఆస్తికులు వీటిని పరమ పవిత్రమైన భగవద్దత్తమైన ప్రామాణ్య గ్రంథాలంటారు. ఇవి మౌఖికంగా తరతరాలకు వారసత్వంగా వచ్చినవి గావున శ్రుతులని కూడా పిలుస్తారు. ఇందులో ఆనాటి పశుపాలకులైన ఆర్యుల కోర్కెలు, ఆశయాలు, ధాన్యం, సంపద, పశువులు, ఆయువు, ఆరోగ్యం, సంతానం, యుద్ధంలో జయం కలగాలని కోరిన కోర్కెలే ఎక్కువగా కన్పిస్తాయి. ఐనప్పటికీ వేదములంటె ఏర్పడిన పూజ్యభావం వల్ల ఋగ్వేదంలో సార

హీనంగా ఉన్న తాత్విక భావాలను ఆధారంగా తీసుకొని, తర్వాత వచ్చిన ఆస్తిక తత్త్వములన్నిటికి వేదమే ఆధారమని, ప్రతి దర్శనానికి వేద ప్రామాణ్యమున్నదని చెప్పటం జరిగింది.

పురోహితుడు సామవేదంలోని ఋక్కులు లేదా సామాలను స్వరమాధుర్యంతో పాడుతూఉంటే చెవులకే ఆనందాన్ని కల్గిస్తాయి. శ్రవణానందంగా ఉండే ఆ సామాలు అతి ప్రాచీన కాలం నుంచీ వస్తున్న మంత్ర శక్తిని తమలో ఇముడ్చుకొన్నట్లు కన్పిస్తాయి. ప్రపంచమంతటా ఉన్న ఈ మంత్రాలలో ఒక దానికి మరొక దానికి మధ్య ఆశ్చర్యాన్ని కలిగించేంత పోలికలున్నాయి. ఉత్తర అమెరికా రెండ్ ఇండియన్స్, ఆఫ్రికా నీగ్రో జాతి వారిలోను, మంగోలియన్లలోను, ఐరోపా పల్లెలలోను, ప్రాచీన ద్రవిడుల లోను, అధర్వణ వేదంలో ఉన్న మంత్రాలను పోలి ఉన్నట్టి మంత్రాలు ఉన్నాయి. హిప్నాటిజం అంటే మాటలద్వారా ఎదుటి వాని మనస్సును నియంత్రించటమేగదా! ఆనాటి మంత్రాలలో ఉన్న శక్తి ఆర్యులను ఉత్తేజపరచి యుద్ధానికి పురికొల్పి వారి జయానికి ప్రధాన భూమిక నిర్వహించేవి. ప్రపంచమంతా ఒక అలౌకిక శక్తిపై ఆధారపడి వుంటుందని, ఆ శక్తిని ప్రార్థనద్వారా గాని మంత్రముల ద్వారాగాని, యజ్ఞం ద్వారాగాని వశపరచుకోగలమని నమ్మేదే మతం.

<u>ఉపనిషత్తులు</u> :— భారతదేశంలో మొట్టమొదట భావవాదాన్ని స్పష్టంగా వివరించిన గ్రంథాలు ఉపనిషత్తులు. ఇవి క్రీ పూ. 1000 సంవత్సరముల నుండి 500 సంవత్సరముల వరకు రచింపబడ్డాయి. ఋగ్వేదానికి - ఉపనిషత్తులకు మధ్య దాదాపుగా 1000 సంవత్సరముల కాలము గడచింది. వేదాలకు వచన వాఖ్యాన గ్రంథాలుగా బ్రాహ్మణాలు వచ్చాయి. కర్మకాండ వీనిలో పరాకాష్ట నొందింది. వానితోపాటు మరొక ధోరణి తల

ఎత్తింది. కర్మకాండ ప్రధానమైనది కాదని, ప్రపంచ రహస్యాన్ని సృష్టికి మూలకారణం కనుక్కో-వాలంటే కర్మకాండతో నిండి యున్న సమాజాన్ని వదలి దూరంగా అడవులలో దీర్ఘాలోచనతో అధ్యయనం చేయాలని తలచి అడవులకు వెళ్ళి ఆశ్రమాలు కట్టుకొని తత్వ విచారణ ప్రారంభించారు నాలుగు వేదాలకు అనుబంధాలుగా అరణ్యకాలు (అరణ్యాలలో మాత్రమే అభ్యసింప దగ్గ గ్రంథాలు) వ్రాయబడినవి. ఇందులో సగం కర్మకాండ, సగం తత్వచింతన ఉన్నాయి. ఈ పరిణామం పూర్తిచెంది తత్వ విచారణే ప్రధానంగా పెట్టుకొన్న ఉపనిషత్తులు వచ్చాయి. ఉపనిషత్తులంటే గురువు దగ్గర కూర్చుని నేర్చుకోవలసిన విజ్ఞాన గ్రంథములని అర్థము.

ప్రాచీన ఆర్యులలో వర్ణవిభజన లేదు. కాని వేదాలు - ఉపనిషత్తులు మధ్య కాలంలో అనేక సాంఘిక మార్పులు వచ్చాయి. వర్ణవిభజన ఏర్పడింది. పని విభజన నైపుణ్యం. భౌతిక శ్రమకు మానసిక శ్రమకు విభజనకు నాందియైనది. యేదోవర్గ ఆవిర్భావానికి నాంది ఏర్పడింది. భావవాద రూపకల్పనకు ఇదొక కారణము. ప్రకృతి శక్తులను యథాతదంగా పూజించే ధోరణి వెనుకకు త్రిగ్గి ఊహాప్రధానమైన దేవతలు ఏర్పడ్డారు. ఆ భావవాదం ఇంకా అభివృద్ధి చెంది నిరాకారనిర్గుణ బ్రహ్మ భావం ఉపనిషత్తులలో ప్రకటితమైంది. వర్ణవ్యవస్థ నిరంకుశ రాజరికం స్థిరపడిన మీదట బ్రాహ్మణ క్షత్రియ వర్గాలు అతిదారుణంగా క్రింది వర్గాలపై పెత్తనం సాగించాయి. అనేక సాంఘిక తిరుగుబాట్లు జరిగాయి. యజ్ఞయాగాదులు కర్మకాండలపై నిరసన మొదట క్షత్రియులలో తలఎత్తింది. ఎందుకంటె యజ్ఞయాగాదులలో పశుహింస ప్రధానం. ఖర్చు రాజులపై నుండేది. కావున ఈ కర్మకాండ నాపివేయడం సామాజికావసరమైంది. ఇదికూడా తాత్త్విక

రంగంలో భావవాదానికి పునాది అయింది. ఉపనిషత్తుల కాలానికి కర్మకాండల ప్రధానత తగ్గింది. వర్ణ కాఠిన్యము తగ్గింది.

| వేదాలు | బ్రాహ్మణాలు | అరణ్యకాలు | ఉపనిషత్తులు |
|---|---|---|---|
| ఋగ్వేదం | ఐతరేయ బ్రాహ్మణం | ఐతరేయ అరణ్యకం | ఐతరేయ ఉపనిషత్తు |
| | కౌశతకీ బ్రాహ్మణం | కౌశతకీ అరణ్యకం | కౌశతకీ ఉపనిషత్తు |
| సామవేదం | తాండ్య | జైమినీయ | ఛాందోగ్యోపనిషత్తు |
| | షడ్వింశ | | కేన ఉపనిషత్తు |
| | జైమినీయ | | |
| యజుర్వేదం | శతపథ బ్రాహ్మణం | తైత్తిరీయ | బృహదారణ్యకోపనిషత్తు |
| | తైత్తిరీయ | | ఈశ ఉపనిషత్తు |
| | | | తైత్తిరీయ ఉపనిషత్తు |
| | | | మైత్రి ఉపనిషత్తు |
| | | | శ్వేతాశ్వతర ఉపనిషత్తు |
| అథర్వణ వేదం | గోపథ | — | ప్రశ్న ఉపనిషత్తు |
| | | | ముండక ఉపనిషత్తు |
| | | | మాండూక్య ఉపనిషత్తు |

ఇందులో ప్రధానమైనవి చాందోగ్యోపనిషత్తు, బృహదా రణ్యకోపనిషత్తులు. ఇందులో మైత్రి, మాండూక్య, శ్వేతాశ్వతర ఉపనిషత్తులలో గౌతమ బుద్ధుని ప్రస్తావన ఉన్నది. కనుక, బుద్ధుని తర్వాత అనగా క్రీ. పూ. 500 కాలములో రచింపబడినవని గుర్తించబడినది.

ఉపనిషత్తులలో ఒకే ఒక తాత్విక భావం కాని సిద్ధాంతము కాని లేవు. పలువురు పలువిధాలుగా చెప్పారు. అయినా అందులో ప్రధానమైంది పరబ్రహ్మ - ఆత్మ ఒక్కటే సత్యము నిత్యము అన్న సిద్ధాంతము. మనకు సహజంగా కన్పించే బాహ్య భౌతిక ప్రపంచానికి స్వంత ఉనికి లేదన్నారు. జగన్మిధ్యావాదం వివరింపబడింది. శుద్ధ చైతన్య స్వరూపమే ఆత్మ అని కొన్నిటిలో చెప్పబడింది. చాందోగ్యలో ఒక కథ ఇలా ఉంది.

తండ్రి – ఆ మర్రిపండు తీసుకురా    కొడుకు - తెచ్చాను తండ్రీ

తండ్రి – దానిని పగులకొట్టు    కొడుకు – అలానే తండ్రీ

తండ్రి – ఇప్పుడేమి చూస్తున్నావు    కొడుకు - అసంఖ్యాకమైన విత్తనాలను తండ్రీ

తండ్రి - ఒక విత్తనాన్ని పగులగొట్టు    కొడుకు - అలానే తండ్రీ

తండ్రి – ఇప్పుడేమి చూస్తునావు    కొడుకు - ఏమీ చూడటం లేదు తండ్రీ

కనుక ఓ కుమారా! నీకు కనబడని ఆ శూన్యం నుండి ఈ మర్రి విత్తనము. అందులోనుండి ఈ మహావృక్షము పుట్టినవి. అలానే ఆ శూన్యంలోనుంచే నీవు, నేను, ఈ చరాచర ప్రపంచము పుట్టినది. ఓ శ్వేతకేతూ! అదే ఆత్మ అదే పరమాత్మ. అలానే ఆత్మను గురించి ఇంద్ర - ప్రజాపతి సంభాషణ కథకుడా అందులో ఉంది.

ఇంద్రుడు – ఆత్మ అంటే ఏమిటి?

ప్రజాపతి — వృద్ధాప్యం, మరణం, ఆకలి, దుఃఖము, ఆకారము ఏవీ లేనిది ఆత్మ.

ఇంద్రుడు — నిదర్శనము కావాలి.

ప్రజాపతి — అద్దంలో కనబడే ప్రతిబింబమే నీ ఆత్మ.

ఇంద్రుడు — కాని నా ప్రతిబింబము నావలనే ఆకారం రూపురేఖలు కల్గియున్నది కదా!

ప్రజాపతి — కొంచముసేపు ఆలోచించి, నీ కలలో కనబడే నీ రూపమే నీ ఆత్మ.

ఇంద్రుడు — కలలు పగటిపూట రావుకదా! రాత్రిళ్ళు ఎల్లప్పుడు రావుకదా! అపుడు నా ఆత్మ ఏమైనట్లు పైగా కలలో కనబడే ఆత్మకు నా భౌతిక రూపానికి పోలిక ఉన్నది కదా! అలాంటప్పుడు ఆత్మ నిరాకారమైన దెట్లా అవుతుంది?

ప్రజాపతి — చాలాసేపు ఆలోచించి, కలలురాని నిర్వికారస్థితి ఆత్మ అంటాడు. ఇలాంటి సంభాషణలు ఉపనిషత్తు లలో చాలా ఉన్నాయి

ఆత్మ-పరమాత్మను మేధాశక్తి ద్వారా నిరూపించడం సాధ్యం కాదని, అంతరాత్మ ప్రబోధం ద్వారానే బ్రహ్మజ్ఞానము పొందగలమని, జ్ఞాని అయినవాడు బాహ్యదృష్టిని వదలి కళ్ళు మూసుకొని అంతర్దృష్టి నలవర్చుకొని ఆత్మను తెలుసుకుంటాడని చెప్పబడింది. ఆత్మను చూడాలి, ఆత్మను వినాలి, ఆత్మను గురించి యోచన చేయాలి, ఆత్మను ధ్యానించాలి, దానివలన ప్రపంచాన్ని గురించిన సమస్త జ్ఞానం లభ్యమవుతుందనియు, అలా ఆత్మావలో కనం చేసిన వారికి సమస్తమైన ప్రపంచాలు ఆధీనంలో ఉండి సమస్తమైన కోరికలు తీరుతాయి అని చెప్పబడింది. మద్దెల ఒక టయినా అందులోనుంచి రకరకాల ధ్వనులు ఏలావస్తాయో ధ్వను

లను బట్టి అది శంఖధ్వని ఇది వేణుధ్వని అని ఎలా అయితే గుర్తి స్తామో ఆదేవిధంగా ఈ సమస్త ప్రపంచం నుండి ఆత్మను గ్రహించాలి. ఈ ఆత్మస్వరూపము ఒక మహాభూతమని విజ్ఞాన ఘని అని చెప్పారు. ఈ విజ్ఞాన ఘనమైన ఆత్మను పరమార్థంగా భావించినప్పుడు లౌకిక జ్ఞానము నిరుపయోగమని తెలుసుకుంటామన్నారు. ఉదాహరణకు నారదుడు సనత్కుమారుని సమీపించి ఆర్యా! నాకు వేదాలు ఇతిహాసాలు, వ్యాకరణ మంత్ర విద్య, ఘణాంక శాస్త్రము, తర్కశాస్త్రం, నీతిశాస్త్రం, లలితకళలు మొదలైనవన్నీ తెలుసు అయినా సంతృప్తి లేనందున నిన్నాశ్రయిస్తున్నాను అని చెప్పగా సనత్కుమారుడును దీనికి తగినట్లే ఈ విద్యలన్నీ కేవలం నామమాత్రాలని, వీటికి అతీతంగా ఆత్మ ఉన్నదని దానిని గురించి తెలుసుకోమంటాడు. ఆత్మ ప్రపంచమంతా వ్యాపించి యున్నది. ఆత్మ సత్యమైనప్పుడు, శరీరము బాహ్య ప్రపంచపు లౌకిక జ్ఞానము మిథ్య [ప్లేటోకూడా అనుభవ జ్ఞానమంతా మనోజన్యమైన భ్రాంతియేగాని యదార్థం కాదన్నాడు కదా!]

దేన్నయినా తెలుసుకోవాలంటె దాని రూప గుణాదులను గురించి తెలుసుకోవాలి. అది పలానా విధంగా ఉంటుందని చెప్పగలగాలి. అది చెప్పలేక ఒకవైపు ఆత్మను గురించి తెలుసుకోవాలని చెప్తూనే, మరొకవైపు ఆత్మను గురించి తెలుసుకోలేమని చెప్పారు. ఆత్మ అదికాదు, ఇదికాదు అని అభావంగా వర్ణించారు. దీన్నే నేతివాదం అంటారు. ఆత్మను గ్రహింపలేము కనుక అది గ్రహింపబడదు. ఆత్మ అవినాశి కనుక అది నశించదు. ఆత్మకు అవధులు లేవు కనుక అనంతం. దీనికి హానికలుగదు కనుక నిత్యం. మన జ్ఞానమంతా ద్వంద్వముగా ఉంటుంది. ఆత్మ శుద్ధ జ్ఞాన స్వరూపం కనుక అందులో ఏ విధమైన ద్వంద్వాలకు తావులేదు. కాబట్టి ఆత్మను గురించి తెలుసుకోలేము. ఎక్కడ ద్వంద్వానికి

తావుంటుందో అక్కడ ఒకరు మరొకరిని చూస్తారు. ఒకరు మరొకరిని వింటారు. ఒకరు మరొకరికి ఇస్తారు - ఇక్కడ అంతా ఆత్మమయమైనప్పుడు, సమస్తము ఆత్మమయమైనప్పుడు ఎవరు ఎవరిని చూస్తారు? ఎవరు ఎవరిని వింటారు? ఎవరు ఎవరికి ఏమి ఇస్తారు? నీవెవరు? నేనెవరు? గ్రహీత ఎవరు? గ్రహించేది ఎవరు? అంతా బ్రహ్మమయమే. యాజ్ఞవల్క్యుడు భార్య మైత్రేయితో ఇలా అంటాడు.

భార్య భర్తను ప్రేమించేది భర్తకోసము కాదు, తనకోసమే అంటె తన ఆత్మకోసమే (Self manifestation) భర్త భార్యను ప్రేమించేది భార్యకోసము కాదు, తనకోసమే అంటే తన ఆత్మకోసమే. దంపతులు పిల్లలను ప్రేమించేది పిల్లలకోసము కాదు, తమకోసమే అంటె తమ ఆత్మలకోసమే. అంటే మనలను అభివ్యక్తీకరించుకోవడానికే మనం ఒకరినొకరిని ప్రేమించుకుంటున్నాము. అంటే ఆత్మ పరమ సత్యమనీ, ఏ విషయంనైనా మనం అవగాహన చేసుకొన్నట్లయితే ఆ విషయం వెనుక ఆత్మావగాహన ఉంటుందని, ఆత్మావగాహనమైన వారికి ప్రతిదీ తెలుస్తుందని అలా లేనివారు అజ్ఞానులై ఉంటారని చెబుతాడు. పదార్థం నిర్జీవమైంది. దీనిని శక్తివంతం చేసి ప్రాణం పోయాలి, ఆ పని పరమాత్మ మాత్రమే చేయగలదు. పదార్థం కూడా పరమాత్మలోని భాగమే. పదార్థం యొక్క ప్రాథమిక రూపాలు నిప్పు, నీరు, భూమి మొదట్లో ప్రజాపతి ఒక్కడే ఉన్నాడు. ఒంటరితనాన్ని భరించలేని ఆ ప్రజాపతి (బ్రహ్మ - పరమాత్మ) సాలీడు తనలోనుండి దారాన్ని బైటకు తీసినట్లు, నిప్పులోనుండి అగ్నికణాలు వచ్చినట్లు ప్రపంచాన్ని సృష్టించాడు. ప్రజాపతి అనాది సిద్ధుడు.

పరమార్థమును వర్ణించుటలో ఉపనిషత్తులు వివిధరకములుగా ప్రకటించినవి, కొన్నిచోట్ల వ్యవహార ప్రమాణము కలిగ

మైన నిర్గుణ తత్త్వము గాను, కొన్నిచోట్ల మనము ఉపాసించి పూజింపతగ్గ సాకారుడైన ఈశ్వరునిగాను, కొన్నిచోట్ల శూన్య మని వర్ణింపబడెను. దీనివలన నిర్గుణ బ్రహ్మముయొక్క లీలా స్వరూపమే ప్రపంచ మను సిద్ధాంతం ఈశ్వరుని బాహ్యస్వరూపమే ప్రపంచం అను సిద్ధాంతం, ప్రపంచమంతా మిథ్య. శూన్యము అను సిద్ధాంతములను అవి బలపరచినవి. ఈ భావముల నాధార ముగా చేసుకొని శంకరుని అద్వైత సిద్ధాంతము, రామానుజుని విశిష్టాద్వైతం నాగార్జునిని శూన్య సిద్ధాంతం తర్వాత బయల్వెడనవి [మానవుని యొక్క అతీంద్రియ దృష్టికి గోచరించునది నిర్గుణ బ్రహ్మము, పరిమితమైన మానవ బుద్ధికి గోచరించునది ఈశ్వర రూపము, సంశయాస్పదునికి గోచరించునది శూన్యత్వము. ఇవి మూడును ఒకే పరమ సత్యముయొక్క భిన్నరూపములు].

అజాత శత్రువు గార్గ్యకు ఈ విధంగా బ్రహ్మోపదేశం చేస్తాడు. సహజంగా వుండే సాధారణమైన చైతన్యాన్ని మొద్దు బారేటట్లు చేస్తూ, స్వప్నంలోకి, స్వప్నంలోనుంచి గాఢ సుషుప్తి లోకి పోయినట్లయితే బ్రహ్మ నిజస్వరూపాన్ని తెలుసుకోవచ్చునని చెబుతాడు. సాలెపురుగు దానిలోనుండి వచ్చే దారము మీదనే ఎలా ఆధారపడి ఉంటుందో అలాగే ఈ ఆత్మలోనుంచే సమస్త ప్రాణులు సమస్త ప్రపంచాలు వచ్చాయి. ఇదే పరమసత్యం. ఈ ప్రాణమయ ఆత్మ, నఖశిఖపర్యంతము, కొయ్యలో అగ్ని ఉన్నట్లు, ఒరలో కత్తి ఉన్నట్లు వ్యాపించి ఉంటుంది. బ్రహ్మ అనిర్వచనీయమనీ, ఇంద్రియజ్ఞాన పరిధికి అతీతమని, ప్రతి జీవికి నిత్యమూ అనుభవంలో ఉంటుందని అన్నారు. అంటే బ్రహ్మను భూతిని పొందినప్పటికీ అలా పొందినట్లు మనకు తెలియదన్నారు. నిక్షిప్తంగా నిధి ఉన్న ప్రదేశానికి మనం అనేక మార్లు పోయి నప్పటికి అక్కడ ఒక నిధి నిక్షిప్తంగా ఉన్నట్లు మనకెట్లా తెలియదో

అదేవిధంగా బ్రహ్మానుభవాన్ని జీవులు ప్రతినిత్యము పొందుతున్న ప్పటికీ, అలా పొందుతున్నామన్న జ్ఞానం జీవులకు ఉండదన్నారు. ఒక గాఢ సుషుప్తావస్థలో మాత్రమే బ్రహ్మానంద భూతిని పొంద గలమన్నారు.

నిద్రావస్థలో జీవి నిమ్నోన్నతాలకు వెళతాడు. దైవ స్వరూపంగా అనేకమైన రూపాలను తానే ఏర్పరచుకొంటాడు. ఒకప్పుడు స్త్రీల సంగమంలో ఉన్నట్లు మరొకప్పుడు నవ్వుతున్నట్లు, భయంకరమైన దృశ్యాలను చూస్తున్నట్లు అనుభవిస్తున్నట్లు చూస్తాడు. అది అతని స్వప్నావస్థ. అక్కడ జీవి స్వయం ప్రకాశ ముగా నుంటుంది. స్వప్నావస్థలో ఆత్మ భౌతిక వాసనలనుండి విముక్తిని పొంది ఉంటుంది. అది స్వయం ప్రకాశమానంగా ఉండ టం వల్లన స్పష్టంగా అది తన రూపాన్ని చూడగలదు. స్వప్నాను భవంలోని పదార్థాలను ఆత్మే సృజించినందువల్ల వాటికి ఆత్మగతే తర ఉనికి లేదు. స్వప్న పదార్థాలన్నిటిని ఆత్మ సృజించుతుందని, ఆత్మకు ఆశక్తి కలదనీ చెప్పినారు. జాగృతావస్థనుండి స్వాప్నిక జగత్తులోకి పోవడమనేది భౌతిక బంధాల విముక్తిగాను, దాని నుండి గాఢ సుషుప్తావస్థ (నిర్వికారస్థితి) లోకి పోవడాన్ని భవ బంధాల విముక్తిగా ఉపనిషత్కారులు భావించారు. ఆ స్థితిలో బ్రహ్మానుభవమవుతుందని భావించారు. మరణం కూడా గాఢ సుషుప్తావస్థ లాంటిదేనన్నారు. అయితే కామక్రోధాదులు లేకుండా అవిద్యారహితంగా మరణించిన వారికే ఈ శాశ్వత బ్రహ్మానందం లభిస్తుందన్నారు.

ఒక ఆకుమీద ఉంటూ అదే ఆకును భక్షిస్తూ ఆ ఆకు చివర దాకా వచ్చిన గొంగళిపురుగు ఆ ఆకును వదలివేసి మరొక ఆకుపైకి ఏవిధంగా శరీరాన్నంతా కూడగట్టుకొని పోతుందో, అదేవిధంగా ఆత్మ కూడా ఈ శరీరాన్ని వదలి మరొకదానిపై యత్నిస్తుంది.

అతని పూర్వజన్మ కర్మలను బట్టి అతను మరొక దేహంలోకి ప్రవేశిస్తాడు. పుణ్యకార్యాలు చేసినవారు పుణ్యులుగాను పాపకార్యాలు చేసినవారు పాపులుగాను జన్మిస్తారు. కోరికలు లేనివారు, ఆత్మకాములు, తృప్తకాములు కనుక బ్రహ్మస్వరూపులే కనుక బ్రహ్మంలో ఐక్యమవుతారు. ఈ విధంగా వేదాలలో లేని కర్మ - పునర్జన్మ సిద్ధాంతం మొదటగా ఉపనిషత్తులలో దర్శనమిచ్చింది. ఇది ప్రజల నైతిక ప్రవర్తన కొరకై మొదట చెప్పిఉండవచ్చు.

Note:- రాజుల కూటములోనే ఉపనిషద్దర్శనము ఆరంభమైందని, దానికి ఉదాహరణగా నారదుడు సనత్కుమారుని వద్దకు, గౌతముడు పాంచాల రాజు వద్దకు, గార్గి అజాతశత్రువుని వద్దకు బ్రహ్మజ్ఞాన సముపార్జన కొరకై యాచించడాన్ని ఉదహరిస్తున్నారు. అంతేగాకుండా వర్ణవ్యవస్థ ఆనాటికి సడలిందని, ఉపనిషత్కర్తలైన కొందరు శూద్రులు మహీదాసు, సత్యకామ జాబాలిని వర్ణిస్తున్నారు. ఐతే కీత్ ఈ విధంగా అభిప్రాయపడ్డాడు. ఉపనిషద్దర్శనమంతా బ్రాహ్మణ సంప్రదాయాన్ని చెబుతోంది. అయితే రాజులు చేసిన ఘనకార్యాలను అవి ఎందుకు ఏకరువు పెట్టాయి. బ్రాహ్మణులు అవి తమ గౌరవానికి భంగం కలిగించేవిగా తలచలేదన్నాడు. అలా తలచినట్లయితే ఈ ప్రస్తావనలు అందులో ఉండేవికావు. బ్రాహ్మణముల కాలంలో వారిమధ్య పోటీ వచ్చినట్లుగా కన్పిస్తున్నప్పటికీ, ఉపనిషత్తుల కాలంనాటికి వారు రాజీపడినట్లుగా తెలుస్తుంది. అంతేగాకుండా రాజుల ప్రాపకాన్ని వారు బాగా పొందుతున్నందువల్ల, వారి దాతృత్వాన్ని కాంక్షిస్తున్నందువల్ల ఈ కథలూ గాథలూ తమ గౌరవానికి భంగము కల్గిస్తున్నవిగా బ్రాహ్మణులు భావించలేదు. వారే ఈ కథలు కల్పించి వ్రాసినా ఆశ్చర్యపోవనవుసరము లేదు. ఈ రెండు కులాలు పరస్పరాశ్రితాలు. రాజుల దాతృత్వాన్ని, బ్రాహ్మణగ్రహీత్వాన్ని ధర్మశాస్త్ర కర్తలు హేతుబద్ధం చేసినారు.

## ప్రాచీన నాస్తిక భౌతిక వాదం - లోకాయతులు - చార్వాకులు క్రీ. పూ. 600

ఆనాడు కర్మకాండ యజ్ఞయాగాదులతో వర్ణవిభాగముతో నున్న ఆర్యమతము ఉచ్ఛస్థితిలోనున్నది. విజ్ఞానకాంతి, తత్త్వజిజ్ఞాస బహుముఖ వికాసముల నొంద నారంభించినది. విచిత్ర విరుద్ధ భావసంపుటములు, నీచ మంత్రోపాసనము, సంశయము, స్వైరవృత్తి, తపోనిరతి మిశ్రమమైన కాలము జైన బౌద్ధులు మరణానంతర సమస్యలను గురించి ఆలోచించుట నిరర్థకమని తలచి స్వచ్ఛమైన ధర్మానుష్ఠాన జీవనము ప్రధానమని నమ్మిరి. సంశయవాదియైన సంజయుడు, ఆత్మను గురించి తెలుసుకొనుట అసంభవమని తలచి శాంతిసాధన మార్గాన్వేషణకు తన శక్తినంతా వినియోగించెను. అజిత కేశ కంబలియను నాస్తికుడు తపస్సాధ్యమైన జ్ఞానము అసత్యమని నిరసించి మానవుడు చతుర్భూత కల్పితుడనియు మరణమున నా భూతములు విడిచిపోవునని వాదించెను. పురాణ కాశ్యపుడను ఔదాసీన్య మతస్థుడు ధర్మభేదముల నంగీకరింప క ఆత్మ క్రియాహీనమని, అది కారణము లేని జన్మకలదని వాదించెను. మస్కరి గోగోశాలి అను విధివాది (Falalirt) జీవితము, మరణము మానవుని అధీనములో లేవనియు వస్తువులన్నీ తమలోని హితమైయున్న శక్తిచే నిత్యపరివర్తమానములగుచు మరణించు వరకు జీవించుచుండునని వాదించెను. కకుద కాత్యాయనుడు పంచభూతములైన భూజలాగ్ని వాయువులకు ఆత్మకున్న భేదము గుణాత్మకమనియు, భిన్నరూపములను కల్పించుచు నశింపచేయుచున్న శక్తులు దేవుడు కాదని, సుఖము దుఃఖములు మాత్రమేనని నిర్ణయించాడు. చార్వాకులు గౌతమబుద్ధుని కంటె ముందే జీవించినవారు. వారి అభిప్రాయములను తెలుసుకొందాము.

సూర్యుడు మంచి వానికి చెడ్డవానికి సమానముగానే ప్రకా

శించుచున్నారు. ప్రకృతి శాశ్వతమైనది. మానవులలో ఎక్కువ మంది దుర్బల హృదయులగుటచే తమ్ము స్తోత్రము చేయు వారిని కాపాడును. నిరసించువారిని నాశమొనర్చు దేవతలున్నారని నమ్మెదరు. అది అవివేకమే. ప్రపంచమున నెచటగాని దేవతలు వచ్చి దర్శనమిచ్చిన సందర్భమేమియు లేదు. ఎవరి ప్రమేయము లేకుండనే ప్రకృతి తన కార్యముల నెరవేర్చుచున్నది. కృషిద్వారా ప్రజలు పంటలు పండిస్తున్నారు. స్త్రీ పురుషుల కలయిక ద్వారా సంతానము కలుగుతుంది. ఇక దేవుని అవసరమేమీ? ఈ ప్రాథమిక దృష్టిలో కాయత వాదానికి పునాది. కర్మ కాండను, విప్రి ఆచారాలను వీరు ఏ విధంగా అవహేళన చేసేవారో ముందుగా చూద్దాం.

1) ఎక్కడో చచ్చి స్వర్గాన మీ తండ్రి ఉన్నాడని, ఇక్కడ ఆకులో ఇంత అన్నము పెడితే ఆ చనిపోయిన వ్యక్తి ఆకలి తీరుతుందని కదా మీ విశ్వాసము. అలాగయితే పొలంలో పని చేసుకొనే వ్యక్తి ఆకలి తీరడానికి ఇంట్లోనే ఒక విస్తరిలో అన్నం పెట్టరాదా! అక్కడివరకు ఎందుకు మోసుకు వెళ్ళటం? రెండవ అంతస్థులోనున్న వాని ఆకలి తీర్చడానికి క్రింద అంతస్థులోనే అన్నము పెట్టవచ్చు గదా!

2) బ్రాహ్మణులు తృప్తిగా భోజనం చేస్తే స్వర్గంలోనున్న పితరులు సంతృప్తి పడతారని అంటున్నారు. అలాగయితే మీ వాళ్ళు దూర ప్రయాణాలకు వెళ్ళేప్పుడు తమతో ఆహార పదార్థాలు మోసుకు వెళ్ళడం ఎందుకు? వారి బదులు మీరే ఇంటిలో తుష్టిగా భోంచేస్తే చాలదా!

3) ఒకరోజున చార్వాకుడొకడు చెరువులో నిలబడి రెండు చేతులతో నీటిని గట్టుకు ఆవలనున్న పొలంలో చల్లుతున్నాడు. కాని నీళ్ళన్నీ చెరువులోనే పడుతున్నాయి. దారిన వస్తున్న బ్రాహ్మణుడు ఎగతాళి చేయగా నీవు నదిలో నుంచొని ఇన్ని నీళ్ళు

దోసిట్లో పోసుకొని ఎక్కడో పరలోకంలోనున్న పితరులకు తర్పణ వదులుతున్నావే, నీ కంటె నేను తీసిపోయానా! అని అంటాడు.

4) యజ్ఞ పశువుగా మేకను వధిస్తే ఆ మేక స్వర్గానికి పోతుందని మీరంటున్నారు కదా! మీ మాటల్లో మీకు విశ్వాసముంటే మేక బదులు మీ తండ్రినే యజ్ఞపశువుగా చేయరాదా! స్వర్గాన్ని తేలికగా తండ్రికి సమకూర్చిన వారవుతారు. మరణానంతరము ఎవరైన ఇంకొక లోకమునకు పోవునెడ నీ లోకమున తనకై వచ్చుచున్న బంధువులను చూడ నొక్కసారైనా వలరాడు!

5) ఊపిరితిత్తులో చనిపోబోతున్న వానిని ఒక జాడీలో మూత పెట్టి, ఆ జాడీని మంటలలో కాల్చి, అతడు చనిపోయిన తరువాత మూత తీసి చూద్దాం. ఏదైనా బయటకు వస్తే ఆత్మ ఉన్నదని తెలుస్తుంది. కానీ అలా ఏమీ కన్పించడము లేదే. లేదా మరణించబోయేవాడి బరువును తూద్దాం. చనిపోయిన తర్వాత కూడా తూద్దాం. ఆత్మ కనుక శరీరంలో ఉండి మరణించిన తర్వాత వాయురూపంలో మనకు కన్పించకుండా బయటకు పోతున్నట్లయితే బరువు తగ్గాలి. కాని తగ్గుటలేదే, కనుక ఆత్మ లేదు.

6) పుణ్య జీవితాన్ని గడిపే బ్రాహ్మణులు పరివ్రాజకులు మరణ మంటే బయపడుతున్నారేగాని దాని నెవరూ ఆహ్వానించుట లేదు. మరణానంతరం సుఖప్రదమైన పరలోక సుఖాలు లభిస్తాయని ఈ పుణ్యజీవులు నిజంగా భావిస్తే, వాటిని వీరు నిజంగా నమ్మితే, వారు ఆత్మ హత్యయైనా చేసుకొని చనిపోయి స్వర్గ సౌఖ్యాలను పొందుటకేల ప్రయత్నించరు? మరణము మోహదాయకమని ఉపనిషత్తులు కూడా చెప్తున్నాయి కదా! మరణానంతరం ఏమి అవుతుందో తెలియదు కాబట్టి వారికి మరణమంటె భయము. ప్రాణమంటె తీపికూడా నున్నది. అందువలన కర్మగాని, కర్మఫలం గాని, ఆత్మగాని, పుణ్యపాపాదులుగాని ఏమీ లేవని తెలుస్తుంది.

ఇవన్నియు బ్రాహ్మణుల స్వార్థంకోసం, వారి భుక్తిమార్గం కోసము వారిచే కల్పించబడినవి.

చార్వాకుల జీవిత దృక్పథము ఈ విధంగానుండేది. పైన పొట్టు ఉన్నదన్న కారణాన్న గింజలను పారవేస్తున్నామా! చేపలకు ముళ్ళు ఉన్నవన్న సాకుతో తినడం మానివేస్తామా! దొంగలు పంటలు కాజేస్తారని పండించటం మానివేస్తామా! అదే విధంగా జీవిత సుఖాలు అనుభవించటం వల్ల కష్టాలు పరలోకంలో శిక్షలు వస్తాయన్న భయంతో జీవితాన్ని నిరాకరించరాదు. తిండి, బట్ట, యిల్లు సంసారం వీటివల్ల కలిగే సుఖాలన్నీ అనుభవించవలసిందే, తప్పులేదు. శరీరాన్ని కష్టపెట్టి నీరు, ఆహారం మాని వాయుభక్షణ చేస్తూ తపస్సు చేయవలెననీ, అదే మోక్షానికి మార్గమనీ, ప్రపంచంలో సుఖించడం పాపాన్ని కలిగిస్తుందనీ చెప్పినవన్నీ వికృత సిద్ధాంతాలు. పరలోకం, ఆత్మ, పునర్జన్మ లేవు. ఇప్పుడే సుఖించు అన్నది వీరి తత్త్వము దీనివలన చార్వాకులు సుశిక్షితచార్వాకులు, ధూర్త చార్వాకులుగా విడిపోయారు. అప్పుచేసి అయినా పప్పుకూడు తిను లేదా బలప్రయోగంతో లాక్కొని అనుభవించు అన్నరీతిలో ధూర్త చార్వాకులు బయలుదేరారు. జ్ఞానియు, మూర్ఖుడు దేహము నశించినపుడు సమానముగానే నశింతురు.

ప్రపంచం అనాది సిద్ధం. దీనిని ఎవరూ సృష్టించలేదు. పరమాత్మ సృష్టించాడనటం అవివేకము పదార్థాలు నాలుగు రకాలు భూమి, అగ్ని, జలం, వాయువు. జీవాణువు మొదలు తత్త్వవేత్త వరకు సర్వప్రాణకోటియు జడపదార్థములైన ఈ చతుర్భూతముల కల్పితములు. ఈ నాలుగు పదార్థముల సంయోగ వియోగాల వల్లనే ప్రపంచ పరిణామం జరుగుతుంది. కలయిక, విడిపోవటం, పదార్థం యొక్క సహజ స్వభావము. పదార్థానికి ప్రాణంలేదు. కనుక భావవాదులు ప్రాణం ఆత్మవల్లనే కలుగునంటారు. అది

తప్పు. పదార్థ పరిణామ క్రమంలో అంతకు పూర్వం లేని కొత్త లక్షణాలు రావచ్చు. ఉదాహరణకు తమలపాకు, సున్నం కలిపితే ఎర్ర రంగు వస్తుంది. ఆ ఎరుపురంగు కొత్త లక్షణమే కదా! అలానే తాటిరసం కుండలో నిలువచేస్తే పులిసి కల్లు అవుతుంది. అంటే తాటిరసానికి అంతకుపూర్వం లేని నిషా ఇచ్చే స్వభావం వస్తుంది కదా! ఇదే విధంగా పదార్థ పరిణామక్రమంలో ఒక అనుకూల దశలో చైతన్యం ప్రాణం ఏర్పడ్డాయి. నిర్జీవ ప్రకృతినుంచి సజీవ ప్రపంచము ఏర్పడింది. ఇది సహజంగా జరిగిన పరిణామం. నాలుగు భూతముల సమ్మేళనముచే నుదయించునది బుద్ధి. కాలేయమునుండి ఆమ్లరస మెట్లు ద్రవించునో, మేధనుండి ఆలోచన అట్లే వచ్చును. ఆత్మ దేహామునుండి వేరని తెలుపనవసరము లేదు. దేహాము నుండి విడిగానున్న ఆత్మను ఎవరు చూసిరి! స్థూలదేహామే ఆత్మ అని కొందరు, ఇంద్రియ వర్గమే ఆత్మ అని కొందరు, శ్వాసయే ఆత్మ అని కొందరు, బుద్ధియే ఆత్మ అని కొందరు చార్వాకులు నిర్వచించిరి. అయితే అందరూ జడపదార్థ రూపాంతరమే ఆత్మ అని ఒప్పుకున్నారు. దీనిని సమర్థించుటకు ఉపనిషత్తులలోని వాక్యము నే ఉపహరించిరి. ఈ భూతములనుండి యుదయించి అది నశించును. అది నశించిన వెనుక బుద్ధియు మిగులదు.

తపస్సు ద్వారా ఆత్మజ్ఞానం సంపాదించగలమనీ, అదే నిజమైన జ్ఞానం అని చెప్పే భావవాద వ్యాఖ్యానమును నిరాకరించి, ఇంద్రియ పరిజ్ఞానం ఒక్కటే జ్ఞాన సంపాదనకు మార్గమని నిర్ధారణ చేశారు. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఒక్కదానినే గుర్తించారు. ఆత్మ, పునర్జన్మ మొదలైన అలౌకిక విషయాలను సమర్థించుటకుపయోగించు అనుమాన ప్రమాణము (Inference), శ్రుతి ప్రమాణము లను నిరాకరించారు. అనంతర భారతీయ విజ్ఞానమందు చార్వాక వాదము తీవ్ర నిరసనకు పాలైనది. ద్రష్ట లేనిదే దృశ్యము లేదు.

అంటే చూచువాడు లేనిచే చూడబడు వస్తువులేదు. కావున దృశ్యమునుండి ద్రష్ట జనించెననుట అసంగతము అంటె భౌతిక పదార్థములనుండి జీవి జనించెననుట అసంగతము అన్న సుప్రసిద్ధ శాస్త్రీయ వాదము బయలు దేరినది. చార్వాక వాదములైన "దేహసంబంధములేని ఆత్మ ఉండజాలదు, జడప్రకృతి నుండి జీవముదయింపగలదు" లకు ఈ విధముగా సమాధానమీయబడినది.

1) దేహ సంబంధములేని జీవమును మనము చూడలేనంత మాత్రమున జీవము దేహరహితమై ఉండజాలదని చెప్పుటకు మన కధికారము లేదు. జీవ వికాసమునకు శరీరమొక సాధనము కావచ్చు. కాంతిని, కాంతిలేనిదే చూడజాలము. అంత మాత్రముచే మన చూపే కాంతియనిగాని, చూపునకు కాంతి లక్షణమున్నదని నిర్ణయించుట తగదు.

2) జీవము శరీర లక్షణమైనచో జీవముండజాలదు. ఏలన ద్రష్ట దేనిని తెలియుచున్నదో దాని లక్షణము కాజాలదు. అనగా ద్రష్ట, ముగాని దృశ్యలక్షణముగాని కాదు.

3) జీవము దేహగుణమైనచో, జడపదార్థగుణము లితరులకు గోచరించునట్లే, ఒకని జీవమింకొకనికి గోచరించవలెను. కాని మన అనుభవంలో ఎవని జీవము వానికి స్వగతానుభవమేగాని ఇతరులు విలోకింప సాధ్యమగుటలేదు.

**Note :-** నేటి నవీన విజ్ఞానులు కూడా జడపదార్థంనుంచి మొదట ప్రాణం, ఏకకణజీవి అమీబాగా సముద్రంలో ఉత్పన్నమైందని అది సహజ పరిణామం అని అంగీకరిస్తున్నారు. రసాయన శాస్త్ర ఉదాహరణలద్వారా ఈ విషయాన్ని ఆనాడే చెప్పగల్గిన చార్వాకులకు జోహార్లు అర్పించవలసిందే. అంతేగాక ఆనాడు బ్రాహ్మణ జాతిచే పీక్కు తినబడుతున్న ప్రజలకు కనువిప్పు గల్గించ ప్రయత్నించిన సాంఘిక విప్లవ కారులుగా వీరిని పేర్కొనవచ్చు.

## జైనమతము మహావీరుడు క్రీ. పూ. 599 – 527

నేటికి కూడా సజీవంగా ఉన్న మతం జైనం. బుద్ధునికి పూర్వమే ప్రారంభమైంది. జినుడు అంటె జయించినవాడు, జైనులకు తుది ప్రవక్తయైన వర్ధమానుడు లేదా మహావీరుడు నేటి భీహారైన మగధరాజు యొక్క ద్వితీయ కుమారుడు. పెద్దల అనుమతితో 28వ ఏటనే సన్యసించి ఆధ్యాత్మిక జీవనము గడిపెను. వర్ణవ్యవస్థ ఖండన, యజ్ఞ కర్మకాండల నిషేధము, దైవ ప్రశంస లేకపోవుట, వేద ప్రమాణ నిరాకరణ, అహింసను పరమ ముఖ్య ధర్మముగా భావించుట ముఖ్యలక్షణములు.

ఉపనిషత్తులు ఆత్మ సత్యము, శాశ్వతము అని చెప్పినవి. బౌద్ధులు ప్రపంచములో శాశ్వతమైనది ఏదీ లేదు, సర్వం మార్పుకు లోనవుతుంది. ఆత్మ అనేది మానసిక స్థితుల మాట, క్షణికదశా సంపుటి అన్న క్షణిక వాదాన్ని ప్రవేశపెట్టారు. వీరి అనే కాంత వాదం ఈ రెండు వాదాలకు మధ్యస్తంగా ఉంటుంది. శాశ్వతం ఎంత సత్యమో, మార్పును అంతే సత్యమన్నారు. అందువలన సత్ మార్పు లేకుండా శాశ్వతంగా ఉండేది కాదని, అది సృష్టి స్థితి లయాదులకు లోనయ్యే ఉంటుందని చెప్పినారు. పదార్థాల ఉనికికి ఆధారమైన ద్రవ్యం మాత్రమే శాశ్వతమైనదని, పదార్థాల్లో ఉండే గుణాలు లక్షణాలు మాత్రమే మార్పు చెందుతూ ఉంటాయన్నారు. ఉదా :— మట్టి భౌతిక పదార్థం ద్రవ్యంగా శాశ్వతంగా ఉంటుంది. కాని అది కుండ కావచ్చు, కూజా కావచ్చు లేదా మూకుడు కావచ్చు అది రకరకాల ఆకృతులలోనికి మారవచ్చు. అంటె ద్రవ్యం శాశ్వతం, గుణాలు మారుతుంటాయి వస్తువు దాని గుణము విడదీయరానివి. వస్తువు లేని గుణముగాని, గుణము లేని వస్తువుగాని లేవు.

మనస్సు - శరీరముల ద్వైతమును వారంగీకరించిరి. జీవికిని-

పుద్గలము (Matter) నకు గల సంబంధం ద్రష్టకు - దృశ్యము నకు గల సంబంధమే. ప్రతి జీవియు దేహాత్మ కల్పితము. ఆత్మ కర్తృత్వము గల భాగస్వామి. దేహము నిష్క్రియాత్మకమైన భాగము. కేవలము మనస్సే సత్యమను భావవాద సిద్ధాంతమును, కేవలము దేహమే సత్యమను లోకాయత భౌతికవాద సిద్ధాంతమును, వాని వాని లోపములను దేహమునకు మనస్సునకు అన్యోన్య సంబంధ సహకారములున్నవని చెప్పి పరిహరించిరి

సమస్తమైన ద్రవ్యాలను జైనులు రెండు గణాలుగా విభజించారు. జీవద్రవ్యం - అజీవద్రవ్యం ఏది వివిధ పదార్థాలను చూచునో తెలియునో సుఖమునుకోరి దుఃఖమునకు బయపడునో, పరోపకారార్థి ఫలముల ననుభవించునో అదియే జీవము అదే చైతన్యము, జీవాత్మ, ఆత్మ, జీవం వగైరా.

అజీవ ద్రవ్యం

కాలం | ఆకాశం | ధర్మం/చలనం | పుద్గలం

సమస్త పదార్థాల ఉనికికి ఆకాశం, ధర్మం - అధర్మం, పుద్గలం అవశ్యకంగా ఉండాలన్నారు. ప్రతి వస్తువు కొంతస్థలము ఆక్రమిస్తుంది. స్థలము ఆకాశం వలన ఏర్పడుతుంది. వాటి కదలికలకు ధర్మం తోడ్పడితే, వాటి విశ్రాంతికి అధర్మం తోడ్పడుతుంది. చేప కదలికకు నీళ్ళు ఎలా సహకరిస్తాయో, అదేవిధంగా ధర్మం చలనానికి, అధర్మం అచలనానికి తోడ్పడుతాయి. కాలం ఒక నిరవధికమైన గమనము భూతమునుండి భవిష్యత్ లోనికి పోవుచున్న అవిచ్ఛిన్న స్వరూపము. ఆద్యంత రూపములు లేని అవిచ్ఛిన్న కాలమునకు, మన వ్యవహారమునకున్న విభాగింప తగ్గ కాలము గంటలు సెకండ్లుకు భేదము గుర్తింపబడినది. మొదటి దానిని కాలమనియు, వ్యవహారమునకున్న దానిని సమయమని పిలిచిరి. కాలమును చక్ర

మనికూడా పిలిచిరి. కొంత కాలమునకు రూపములన్నియు నశించును కావున దానిని నాశనరూపమనికూడా పిలిచిరి.

పుద్గలము (Matter)

- భూమి
- అగ్ని
- వాయువు
- నీరు

ఈ చతుర్భూతములు అన్నియు అణునిర్మితాలు, అణువులు తడిగా గాని పొడిగాగాని ఉంటాయన్నారు. వాటి కలయిక వలన పదార్థాలు ఏర్పడుతాయి. అణువులు పరిణామాన్ని కల్గి ఉంటాయి. అణువునకు, ఆది, మధ్య, అంతములు లేవు. అణువు సూక్ష్మము, నిత్యము, అతీతము. దేనినుండి జనించలేదు. ప్రతి అణువు ఒకే బరువు, రంగు, రుచి, వాసన కలిగి యుండును. పరస్పరాకర్షణము వలన సంయోగముచే ద్రవ్యములుదయించును. అణువుల చలనము ఆకాశమును ధర్మాధర్మములను కల్గించును. అణువులు స్థిరస్వభావములు కావు. పరిణామము పొంది నూతన లక్షణముల నావిష్కరించుచుండును. భూ జలాగ్ని వాయువుల కనుగుణముగా భిన్న లక్షణములుగల అణువులు లేవు. ఒకే లక్షణముగల అణువులు వివిధ రూపసంయోగములచే వివిధ భూతములను కల్పించుచున్నవి. ఈ విషయములో భూతములెన్ని ఉన్నవో అన్ని రకములు గల అణువులున్నవను న్యాయ వైశేషిక సిద్ధాంతమును వదలి డెమొక్రాటిస్‌తో ఏకీభవించారు.

పుద్గలం రెండు రకాలు – స్థూల పుద్గల ద్రవ్యం, సూక్ష్మ పుద్గల ద్రవ్యం. ఈ సూక్ష్మ పుద్గల ద్రవ్యాన్నే కర్మ అన్నారు. అంటే కర్మ భౌతికరూపమని అది పాపపుణ్యాల రూపంలో ఉంటుందని భావించారు. జిడ్డుగా ఉన్న పదార్థానికి మకిలి ఏవిధంగా చేరుతుందో అదేవిధంగా ఆత్మను కర్మ అంటిపెట్టుకొని ఉంటుందన్నారు. వృక్షాలు, జంతువులు, పంచభూతాలన్నింటిలోను

జీవం ఉంటుందని వీరు భావించారు. ప్రపంచములో జీవములేని ప్రదేశమే లేదు, అతి సూక్ష్మాణువునందు అనంతకోటి జీవరాశి ఇమిడి ఉన్నది. దూరమునుండి మన మొక మత్స్యములతో కూడిన కూపమును చూచినచో అందు అస్పష్టమైన నీటి కదలికయే కన్పించి మీనముల స్పష్టాకృతి గోచరించని విధముననే లోకమంతయు బాహ్యదృష్టికి స్పష్టముగా కన్పించునేగాని నిజముగా లేశమాత్రమైనా జీవరహిత ప్రదేశము లేదు. ఆకాశంలో కూడా జీవరహిత ప్రదేశము లేదు.

కర్మ పదార్థము దానియొక్క సహజ స్వభావము ననుసరించి కావలసిన మార్పులను తానే చేసికొనును. జీవుడున్నట్లే కర్మ నియతి ననుసరించి వచ్చు అపరిశుద్ధ జ్ఞాన దశలనుండి తన జ్ఞానము నందలి మార్పులను తానే కల్పించుకొనుచుండును. రెండును సర్వ స్వతంత్రమైన రెండు శక్తులై యున్నవి. జీవి, కర్మ పదార్థము ఏక స్థల సాహచర్యముచే కలియును మనస్సునకిందు క్రియా సంబంధము లేదు. ఈ కర్మ పదార్థము ఆత్మయొక్క తేజస్సునకవరోధమై యుండును. జీవులు మూడు రకములు. నిత్యసిద్ధజీవులు, ముక్తులు, బద్ధజీవులు ముక్తజీవులకు దేహములుండవు. ప్రపంచ వ్యాపారములతో సంబంధము లేకుండా సర్వబంధములనుండి విడివడి లోకాతీత స్థితి కలిగి సుఖించుచుందురు. నిత్యసిద్ధులు పూర్ణ పావన మూర్తులై పదార్థదోషము లేదా కర్మము ఈషణ్మాత్రమంటక యుందురు. వీరి యందు ఆత్మ-పదార్థ సంబంధ పాశము తెగిపోయినది వీరు అనంత చైతన్యము, అనంత జ్ఞానము కలిగియుందురు. బద్ధజీవులు కర్మపదార్థంతో ఆవరింపబడి కోరికలకు బలియై అంతములేని పునర్జన్మ పరంపరలలో దగుల్కొని యుందురు. అజ్ఞానమువలన జీవుడు తాను పదార్థమని భ్రాంతిచెందును కర్మ ఈ భ్రాంతికి కారణము.

జీవములోకల కర్మపదార్థమే జీవిజన్మ కారణము. జీవికి

సహజముగాగల జ్ఞానము కలుషితమగుటకు ఇదియే కారణము.
మోక్షసిద్ధి చేరువరకు జీవి ఎన్నడు కర్మపదార్థమునుండి బయట
పడదు కనుక ముక్తికోరువారు కర్మపదార్థమును, ఆత్మకు అధీ
నము చేయవలెను. అంతరాత్మ శుద్ధమగుటయే మోక్షమార్గము.
దీనికి ధర్మ నియమాచరణమే మార్గము. ఆత్మకు కొలతలున్నవనియు,
పెరుగుట తరుగుటకు అవకాశమున్నదని చెప్పబడెను అది గర్భ
మున ప్రవేశించినప్పుడు చిన్నదియై శరీరముతో క్రమాభివృద్ధి
చెంది జీవితాంతమున నది మరల సూక్ష్మమై ఇంకొక జన్మ పొందు
చుండును. శరీరమందు ఆత్మ సర్వాంతర్యామి పద్మరాగమణి క్షీర
పాత్రములోనుంచినప్పుడు మణి కాంతి క్షీరమునకు కూడా కల్గినట్లే
ఆత్మ తన శరీరములోనుండి, శరీరమునకు కూడా చైతన్యము
నిచ్చుచున్నది.

నైతిక బాధ్యత నంగీకరింపని తత్త్వములన్నిటిని జైన
తత్త్వము నిరాకరించెను. ప్రకృతి లేదా దేవుడు కర్త అను సిద్ధాం
తములు నైతిక బాధ్యతను స్వీకరించవు. ఆత్మ కర్త కాదను సిద్ధాం
తమువలన నైతిక నియమావళి నిరర్థకమగును. సృష్టి లయల కొక
దేవుని అవుసరము లేదు. స్థితిగల వస్తువులకు నాశనము లేదు.
శూన్యమునుండి పదార్థ సృష్టి జరుగనేరదు. వానికి సహజముగా
నున్న గుణరీతుల చేతనే వస్తువులుద్భవించి అదృశ్యములగుచున్నవి
పదార్థముల పరస్పర సంయోగములచే నూతనగుణ కల్పనములు
చేయబడుచున్నవి. ఆస్తికుడు తలచునట్లు ప్రథమ కారణ
మూహింప నవుసరము లేదు. సృష్టి క్రియాహీనుడగు దేవుడెట్లు
తటాలున సృష్టిక్రియ నారంభించునో యూహించుట సాధ్యము
కాదు. అట్లే దేవుడు జగమును సృజించెననుకొన్నచో నాతడే
పదార్థమును ఊతగాగొని సృజించెనను క్లిష్ట సమస్య లేర్పడును.
దేవుని సంకల్పమున కనుగూలముగానే సృష్టిలోని పదార్థము

బున్నియు వర్తించుచున్నవన్నచో వానికి దేవుడు భిన్నగుణముల నేల ఇచ్చెను? మాత్సుకొనుటకు వీలులేని ప్రత్యేక లక్షణములనేల భిన్న పదార్థములు కలిగియున్నవి? లోకమందున్న ప్రతి వస్తువుకు ఒక కారకుడుండుట అవసరమున్నచో ఆ కారకుని కింకొక కారకుడు కావలసివచ్చును. ఈ వాదమునుండి బయటకు వచ్చు విధానము స్వయం స్థితిగల దేవుడున్నాడని, స్వయంప్రకాశముగల సత్పదార్థమున్నదని నమ్మినచో, నట్టి దేవుళ్ళు, సత్పదార్థములు అనేకములున్నవని నమ్ముటకు అభ్యంతరమేమిటని జైనులు ప్రశ్నింతురు. సృష్టిశక్తిగల దేవుడొకడు లేకున్నను ప్రతి జీవియు పరిపూర్ణ జ్ఞానసిద్ధుడైనప్పుడు పరమాత్మయగును. ఆత్మయందు నిగూఢమైయున్న పూర్ణశక్తి యొక్క పూర్ణమునైన ప్రదర్శనమే దేవుడు ప్రకృతి, ఆత్మ, దేవుడు ఒకే వస్తువుయొక్క భిన్నరూపములు పరిపూర్ణ సిద్ధిపొందిన ఆత్మగాక వేరు దేవుడు లేడు. ధర్మ నియమాచరణకు ఐదు మార్గముల నుపదేశించెను.

1) అహింస
2) దానము సత్యవచనము
3) చౌర్యాదులు లేని మర్యాద జీవనము
4) మనోవాక్కాయలందు శౌచ్యము
5) ప్రపంచ విషయాభిమాన త్యాగము

జైనులు అహింసకు అధిక ప్రాధాన్యమిత్తురు. ఆహారానికై సైతము జంతుహింస చేయరాదు. రాత్రిళ్ళు భోజనంచేస్తే పురుగులు చనిపోతాయి కనుక సాయంత్రమే భోజనం చేయాలి. భూమిని దున్ని పంటలు పండించటం వల్ల భూమిలోని పురుగులు చనిపోతాయి కనుక వ్యవసాయం పనికిరాదు అందువలననే జైనమతం వ్యాపార వర్గాలలో మాత్రమే ప్రాచుర్యం పొందింది. ఏ జీవికైనా కష్టము కలుగునేమోయని తాము నడుచు త్రోవను తుడుచుచు పోవుట,

ఊపిరి పీల్చునప్పుడు ఏ జీవియైనా ఆఘ్రాణింపబడి మరణించునేమో యని ముఖమునకు గుడ్డకప్పుకొనుట, నీటిని వడయకట్టి త్రాగుట, తేనెను విసర్జించుట మొదలగు అభ్యాసములేర్పర్చిరి.

జ్ఞానము పంచవిధములని జైనులు అంగీకరించిరి.

1) మతి — ఇంద్రియ జ్ఞానము, ఇందులో జ్ఞాపకము, సంజ్ఞ, పరిశీలనము అనుమాన ప్రమాణము అంగీకరించబడినవి. కావున ఇంద్రియములు, మనస్సుతో తెలియునది మతిజ్ఞానము.

2) శ్రుతి — సాక్ష్యము, శబ్దములు, ప్రమాణ గ్రంథములనుండి గ్రహించు జ్ఞానము.

3) అవధి — దూరశ్రవణము
4) మనఃపర్యాయము:— అంతర్వాణి

} వీటిని ఆటవికులనుండి తీసుకొన్నారు. ఇప్పటికి కొంతమంది హఠయోగులు, కోయవాళ్ళు ఈ విద్యల ద్వారా జ్యోతిష్యం చెప్తున్నారు.

5) కేవలము:— శుద్ధజ్ఞానము. వస్తువుల యదార్థస్థితిని తెలుపునది సరియైన జ్ఞానము.

చైతన్యం జీవుని ముఖ్య లక్షణం. దర్శనము, జ్ఞానములు రెండును చైతన్య రూపములు. వస్తువుల విశేష గుణములతో సంబంధము లేని సామాన్య లక్షణములను మన ఇంద్రియములతో తెలియుట దర్శనము. జ్ఞానము బుద్ధి సంజాతము ఇంద్రియ వేదనల నుండి వస్తుజ్ఞానమును రూపొందించునది బుద్ధి. వీరు వస్తువులు నిశ్చయముగా ఉన్నవందురు (భౌతిక వాదము) చైతన్యమునకు వేరుగా, అతీతముగా నొక సత్య వస్తుజాలమున్నదనియు, వది దర్శనముతో చూచి, జ్ఞానముతో తెలియుచున్నదని జైనులు చెప్పిదురు వస్తుగుణ సంబంధములు మన అనుభవంలో ప్రత్యక్ష ప్రకాశములగుచున్నవే గాని, మానసికాలోచనాదికముల నుండి

జనించుటలేదు. మొదట వస్తురూపం ఇంద్రియములకు తగిలి ద్రష్టకు దృశ్యమునకు సంబంధమేర్పడును. తరువాత ద్రష్టయొక్క చైతన్యము స్పృశించబడును. తరువాత మనస్సు వస్తువిశేష వివరములను ఇతర వస్తువులతోడి సామ్యమును తెలియగోరును. తర్వాత భూత వర్తమాన జ్ఞానము మేళవించి వస్తు స్వరూపము తెలియును. దీనివలన మనస్సులో నొకముద్ర ఏర్పడి దానివలన నట్టి వస్తువులను జ్ఞాపకముంచుకొని తిరిగి గుర్తించుచున్నాము. దీపము తన స్వరూపమును, వస్తురూపమును కూడా తెలియు చేయునట్లు జ్ఞానము తన రూపమును, జ్ఞేయ వస్తురూపమును కూడా చూపును. జ్ఞానములేని జీవులులేవు ఏలన జ్ఞానము లేని జీవి అచేతనమగును. అజ్ఞాన జీవులందు ముందు దర్శనము తర్వాత జ్ఞానముండును. అట్టి జ్ఞానం దోషపూరితం కావచ్చు. ఆత్మ పరిపూర్ణ స్థితిలో శుద్ధజ్ఞానము, దర్శనము ఏకకాలికములు జ్ఞానమంతయు ఆత్మయందున్నది. కామ మోహాది ఆవరోధములను దొలగించినచో జ్ఞానము బహిర్ముఖమగును. కామ మోహములు ఆత్మశక్తిని పూర్ణముగా తన ధర్మము నెరవేర్చనీయవు.

ఒక వస్తువును గూర్చి మనము తెలుపు అభిప్రాయ దృక్పదము సయము మన కోరికలననుసరించి మన భావము లాయాదృక్పదములకు చెందినవై సాపేక్షములగును. మనమున్న జ్ఞాన దశల ననుసరించి ఒకే సత్యము భిన్నరూపములలో గోచరించును. ఇక్కడ వారు ఏనుగును గ్రుడ్డివాళ్ళు వర్ణించిన విధమును ఉదహరింతురు. ఈ ప్రత్యేక దృక్పదములు పూర్ణ సత్య సంగ్రహణ సమర్థములు కావు. మన దృక్పదములననుసరించి సత్యస్వరూపము ఉండునన్న విషయమును జైనమతము మూలసిద్ధాంతముగా చేసినది. సత్యము యొక్క సామాన్య స్వరూపము భిన్నసాపేక్ష దృశ్యములుగా లభించును.

కారణ కార్య సిద్ధాంతమును గూర్చి చర్చించునపుడు, కారణములోనే కార్యమున్నదని వేదాంత సాంఖ్యములంగీకరించినవి. కార్యము కారణేతరమైన నూత్న రూపమని న్యాయ వైశేషికులు చెప్పిరి. ఈ రెండును భిన్న దృక్పదములనుండి చెప్పిన భావములని జైనులు వాటిని సమన్వయించిరి. సువర్ణము కారణము సువర్ణ హారము కార్యము. రెండూ బంగారమే అనుకుంటె రెంటికీ భేదములేదు. కాని సువర్ణమునందు కంటె స్వర్ణహారమున నొక నూతన సృష్టి ఉన్నదని తలచినచో రెంటికి భేదమున్నది. రెండు దృక్పదములనుండి చెప్పిన ఈ రెండు భావములు భావనముచే కల్పితములగుటచే అసంపూర్ణములే యగును. ఈ దృక్పద వైవిధ్యము వారి స్యాద్వాదము లేక సప్తభంగి సిద్ధాంతమునకు మూలము. అనుభవ జ్ఞానమంతయు సంశయాస్పదమని తలచిన ఈ దృష్టిని స్యాద్వాదమనిరి. ప్రతి నిర్ణయము మనకొక సంశయాత్మకమైన "బహుశ కావచ్చును" అను స్యాత్ నిచ్చును. ఒక వస్తువును గూర్చి నిస్సందేహముగాను, నిత్యముగాను, ఇదమిత్థమని చెప్పజాలము. సత్యస్వభావము అత్యంత క్లిష్టము అస్పష్టమైనదని ఈ సిద్ధాంతము చెప్పును. ఒక వస్తువును గూర్చిగాని, వస్తులక్షణమును గూర్చిగాని నిర్వచించు విధానములు ఏడువిధములు.

1) బహుశా ఆ కుండ ఎర్రగా ఉన్నది (స్యాత్ - అస్తి)
2) బహుశా ఆ కుండ ఎర్రగా లేదు (స్యాత్ -నాస్తి) ఆ కుండ ఎరుపు క్షణ క్షణము తగ్గిపోతుంది. కనుక దాని అసలు రంగు ఏది అన్నప్పుడు
3) బహుశా ఆ కుండ ఎర్రగా ఉన్నది - లేదుకూడా (స్యాత్ అస్తిచ నాస్తిచ)
4) బహుశా దాని రంగును తెలుసుకోలేము (స్యాత్ అవ్యక్తం)
5) బహుశా ఆ కుండ ఎర్రగా ఉన్నది. అయినా దాని రంగు ఇది

అని చెప్పలేము. (స్యాత్ అస్తిచ - అవ్యక్తం)

6) బహుశా ఆ కుండ ఎర్రగా లేదు. అయినా దాని రంగు ఇదీ అని చెప్పలేము. (స్యాత్ నాస్తిచ - అవ్యక్తం)

7) బహుశా ఆ కుండ ఎర్రగా ఉన్నది. లేదు కూడా అయినా ఏమీ చెప్పలేము (స్యాత్ అస్తి నాస్తి అవ్యక్తం)

ఈ ఏడు చరణాలలో చివరకు వచ్చిన నిర్ణయం ఏమీ చెప్పలేమని

శంకర రామానుజులు దీనిని ఖండించిరి వెలుతురు చీకటి కలసియుండవు. భావము అభావము మొదలగు పరస్పర విరుద్ధ ధర్మములు ఒకే వస్తువునకు ఏక కాలమందు ఉండజాలవు. కాని జైనులు చెప్పిన దేమన్న ప్రతి వస్తువు స్వభావ వైవిధ్యము కలద నియు, భిన్నత్వములో ఏకత్వమనియే చెట్టు కొమ్మలు కదులు చున్నవి కనుక చెట్టు కదులుతున్నదని చెప్పవచ్చు. కాని స్థావర మైన కారణముచే చెట్టు కదలటం లేదని కూడా చెప్పవచ్చు ఒక వస్తువుయొక్క స్వతః స్థితిని, దానికి అన్యవస్తు సంబంధస్థితిని స్పష్ట ముగాను వేరుగాను తెలుసుకొనవలెను.

## బౌద్ధమతము క్రీ పూ. 563—490

బౌద్ధ మత ప్రవక్తయైన గౌతముడు హిమాలయ పర్వత ప్రాంతానికి దాపుగానున్న గణతంత్ర రాజ్యమైన శాక్యవంశస్థుల రాజధానియైన కపిలవస్తు నగరంలో రాజకుమారునిగా జన్మించెను. బాల్యం నుండి భూత దయ, కరుణ, అహింసాపరాయణుడు, జిజ్ఞాసాపరుడై ఉండెడివాడు. యుక్త వయస్కుడైనంతనే తండ్రి వివాహము చేసెను. రాహులుడను కుమారుడు కల్గెను. అయి నను రాజ్యవ్యవహారములలో ఆసక్తి పెరగలేదు. సంసారబంధం అతని తత్త్వ జిజ్ఞాసను ఆపలేకపోయింది. క్షణభంగురమైన జీవి తమునుండి, దుఃఖమయమైన ప్రపంచము నుండి సమస్త మానవా

ళ్ళకి తగునోపాయము కనుగొనవలెనన్న కరుణాంతరంగముతో భార్యాబిడ్డలను వదలి తన 30వ ఏట అడవులకు వెళ్ళెను. మొదట సన్యాసియై, బిచ్చమెత్తుకొనుచు స్వయముగా కల్పించుకొన్న తత్త్వ నిర్ణయములచే ఆత్మశాంతి నొంద ప్రయత్నించెను. తర్వాత ఆరు సంవత్సరములు నియమ నిష్ఠలతో తపస్సు చేశాడు. శరీరం శుష్కించడం తప్ప సమస్యలకు పరిష్కారం దొరకలేదు. తర్వాత తపోదీక్షను వదలి బుద్ధగయలో ఒక రావిచెట్టు క్రింద కూర్చుని తన లక్ష్యమును మనస్సున బంధించి ఏడు వారములుండెను. ఆ సంకల్ప బలముచే నాతనికి జ్ఞానోదయమైనది. తర్వాత 40 సంవత్సరములు ప్రచారము చేసి మల్లదేశంలోని కుసినార వద్ద మరణించెను.

అనాటికి వేద ఉపనిషత్తు, జైన, చార్వాక, ఆదిమ మంత్ర తంత్ర వాదములచే లోకము కోలాహలముగా నున్నది. స్వార్థపరులైన పురోహితుల మాయలోపడి లోకులు కర్మకాండలు చేయుచుండిరి. ఏకేశ్వర వాదము మానవుని బాధ్యతను దేవునిపై వేయు మాంద్యముగా పరిణమించెను. అతడే కర్త కనుక మంచి చెడ్డలకు బాధ్యుడాతడే. నాస్తికులు సంశయాత్మకులు కొందరు దుర్వర్తనులైయుండిరి కావున బుద్ధుడు మానవాతీత ధర్మముకంటె మానవధర్మము వలననే లోకము బాగుపడునని తలచినాడు దేవునితో సంబంధము లేకుండా మానవుడు తన మోక్షమునకు తానే కర్త, బాధ్యుడని చెప్పినచో సంఘము బాగుపడునని తలచినాడు. మోక్షము జపతపములవలనగాని, కర్మకలాప యజ్ఞయాగాదుల వలనగాని రాదనియు సంపూర్ణ సచ్ఛీలము సత్కార్మాచరణములపై నాధారపడి యున్నదని చెప్పెను. ఉపనిషత్తులు పరబ్రహ్మ కిచ్చిన స్థానమును బుద్ధుడు ధర్మమునకిచ్చెను వ్యక్తులఉన్నత అధోస్థితులకు కారణము జన్మములు కావనియు శీలములేనని చాటి చెప్పెను. నిరర్థకతత్త్వవిచారములను కట్టిపెట్టి దైవతత్త్వప్రసంగ

లేకుండా ధర్మదీక్షా తత్పరతకు అగ్రస్థానమిచ్చెను. బౌద్ధమతము నాస్తిక మతమను విమర్శకూడా లేకపోలేదు. బుద్ధుడు నాస్తికుల విమర్శన దృష్టినిస్వీకరించెనేగాని ఆత్మ మోక్షము లేవని చెప్పలేదు సోఫిస్టులకు - సోక్రటీస్‌కు గల సంబంధమే నాస్తికులకు బుద్ధునకి-గలదు. తన ఆత్మానుభవము చే బుద్ధుడు నాలుగు విషయములు సత్యమని చెప్పెను. 1. దుఃఖము 2. దుఃఖనివారణము 3. దుఃఖ మనివార్యము 4. దుఃఖ నివారణోపాయము. జీవితముదుఃఖానుభవము జన్మము దుఃఖము, జరదుఃఖము, మరణముదుఃఖము, అనిష్ట ప్రాప్తి దుఃఖము, ఇష్ట వియోగము దుఃఖము, తృప్తి చెందని ఏ కామమైనను దుఃఖమే. ఆకాశమందుగాని సాగరగర్భమునగాని పర్వత గుహాంతర్గత మందుగాని మృత్యువు ప్రవేశింపజాలని స్థలమేదియు లేదు. సర్వము నశించును ఈ సత్యము నెరుగని అజ్ఞానమే సర్వ దుఃఖములకు మూలము. శోక దుఃఖ కారణము ఏలన మనము అనిత్యము పరివర్తన శీలము, అశ్వరములైన వానినే కోరుదుము, మనము కోరిన వస్తువుయొక్క అనిత్యత్వమే మనకు ఆశాభంగము, విచారము, కలుగ చేయుచున్నది. సుఖములన్నియు క్షణికములు. బుద్ధుడు లోకములో సర్వముఅశాశ్వతమన్నాడు. ఆత్మ అనేది శాశ్వతమైనచో అది ఈ లోక వస్తువు కాదన్నాడు. దేహము ఇంద్రియ వ్యాపారములు చేతనత్వము అన్నియు అశ్వరములు-అనాత్మ స్వరూపములు-అసత్యాభాసములు దుఃఖహేతువులు మనము జీవమనుకొనునది శుష్క-క్రియాసంపుటి-

పరిణామవాదము:- హెరాక్లిటస్ వలె బుద్ధుడును సర్వము ఎడతెగని మార్పులోనున్నది. మార్పే నిత్య సత్యమునని చెప్పాడు. ఇంద్రియగోచరమవుతున్న లోకము క్షణక్షణము మారుతున్నది. ఆత్మలు జీవితములు, నిత్యము మార్పు నొందుతున్న సంకలన శక్తులు ప్రవాహరూపములు ద్వశ్య అదృశ్యరూప పరం పరల

సముచ్చయమే జీవితము అగ్నిజ్వాల ఎడతెగనిదై కనబడుతున్నను ప్రతిక్షణము అది నూత్న జ్వాలయే. ఒక జ్వాలపోయి మరొకజ్వాల వచ్చుచున్నది. తొలి మలి రూపాలకు సామ్యం ఎలా కొనసాగుతుందని అడిగితే వస్తు నిర్మాణంలో సామ్యంవల్ల అని చెబుతారు. కారణం, ఫలితమైన కార్యం సమంగా ఉంటాయి. కనుక పాతది కొనసాగుతున్నదని భ్రమ కల్గుతుంది. అగ్ని జ్వాలలో నిత్యం ఒక వెలుగు అంతరిస్తుంది. అదే పరిమాణం కల్గిన మరో వెలుగు ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది. కనుక అదే మంట అన్న భావం కలుగుతోంది. అలాగే నదిలోకి కూడా నిత్యము క్రొత్తనీరు వచ్చుచుండును. పరివర్తనమే సత్యగర్భము ప్రపంచమునకు నిత్యతగాని ఏకత్వము గాని లేవు. అదిఉన్నది, అది లేదు అనునవి రెండు విరుద్ధ ద్వంద్వ భావములు ఈ ద్వంద్వభావమునుండే ప్రపంచము జనించుచున్నది.

ఒక బుద్ధుడిలా అంటాడు. ఈ లోకమున వస్తువులన్నియు మన కళ్ళముందే పుట్టుచున్నవి. కావున అవి లేవనుటకు వీలులేదు కాని మనముందే అవి నశించి రూపరహితములై పోవుచున్నవి. కావున అవి నిత్యము ఉంటాయనుటకు వీలులేదు. కాని కచ్చితా సత్యము ఈ రెండింటికి మధ్యస్థితి అనాద్యనంతమైన పరివర్తనమే ఉన్నది. ఈ పరివర్తనము ఒక క్షణము ఆగి ఒక వ్యక్తి ఏర్పడు కాలము ఎన్నడూ తటస్థింపదు. కాలము నిరవధిక ప్రవాహరూపము నామరూపములచే ఒక వస్తువును గుర్తించు లోపుననే అది మారిపోయి మరియొక వస్తువగుచున్నది. పరివర్తన ప్రవాహములో కొన్నిచోటులందు గుర్తుపెట్టుకొని ఈ గుర్తులమధ్య మందున్నవి వస్తువులని తలచుచున్నాం బిడ్డడు-యువకుడు-వృద్ధుడు ఒకడే. బీజము-వృక్షము నొకటే వేయేండ్లమనుగడగల వటవృక్షమైనను ఒక చిన్న బీజమునుండి ఉత్పన్నమైన అంకురమే. మన దేహము ఆత్మకారణమైన చేతనశక్తి, క్షణక్షణము

మారుతున్నను, అవి పూర్వరూపము లేవని భ్రమ చెందుచున్నాము. వేగముగా త్రిప్పబడుచున్న నిప్పుకర్ర పూర్ణమైన జ్వాలాచక్రమువలె కనబడినట్లే పరివర్తనవేగాతిశయము చేత వస్తువొక స్థిరరూపమని భ్రాంతి జనించుచున్నది.

కొన్ని దశా పరంపరలనొక వస్తువని చెప్పుదురు. అందు మొదటి దశ రెండవదశకు కారణమందుము. ప్రతివస్తువు అవిచ్ఛిన్నపరివర్తనముల సంపుటి. ప్రతిపరివర్తనమునకు పూర్వపరివర్తనమే కారణము. ప్రపంచమంతయు కారణబద్ధమైనది. కారణకార్యములు ఒకే ప్రవాహముయొక్క పూర్వాపరదశలను తెల్పును. ఈమార్పులకన్నిటికి ఆధారభూతమైన ఒక మార్పులేని వస్తువు లేదా దేవుడు ఉన్నాడని సమస్త భావవాదులు చెబుతారు. కాని బుద్ధుడు అలాంటిది ఏమియు లేదనియు, మార్పులన్నిటికి ఆధారము కారణ ధర్మమే ననియు మార్పు స్వయం పరివర్తనము గలదని చెప్పెను. అంకురములనుదయింప చేయునదిగా బీజమున్నది. నిత్యవస్తువు లిట్టి క్రియాశక్తిని కలిగిఉండవు. నిత్యవస్తువంటె పరిణామం చెందకుండా ఉండాలి కదా! బీజము చెట్టుగా మారుతుందంటె బీజము నిత్యవస్తువుకాదు. పోనీ వస్తు మూల ప్రకృతి మార్పు లేనిదనియు, కొన్ని ఇతర పరిస్థితులలో మార్పు ప్రదర్శించుచున్నదని చెప్పినచో వారిట్లు చెప్పుదురు. ఒక పనిని చేయుటకు ఒక వస్తువుకు శక్తిఉన్నచో నాపని నది చేయును. చేయకున్నచో ఆ శక్తి లేనట్లే. కొన్ని పరిస్థితులు అట్టి మార్పును కలిగించుచున్నవనినచో, నా పరిస్థితులు ఉన్నవిగాని నిత్యవస్తువు కాదు. స్థితి అనగా కారణ సామర్థ్యమైనచో వస్తువులన్నియు అనిత్యములు.

దొరలుచున్న ఈ జగచ్చక్రమునకు మొదట కదిలించిన ప్రథమకారణమేది? ఇంద్రియ గోచరమైన ప్రపంచము దేనిపై నాధారపడియున్నదన్న ప్రశ్నలుదయింపక మానవు. అనుభవాంశ

ములనే బుద్ధుడు స్వీకరించెను. మూలకారణము ఊహాశక్యము కాదు కనుక దానిని గురించి ఆలోచించ వలసిన అవసరము లేదంటాడు. ప్రజ్వలించుచున్న అగ్ని మధ్యముననుండి దహింపబడుచున్న వేళ దానినుండి బయటపడు మార్గమునుగురించి ఆలోచిస్తామేగాని అగ్నికి కారణమేమిటని ఆలోచించముకదా. కనుక సమాజ పునరుద్ధరణే ధ్యేయముగా పెట్టుకొన్న బుద్ధుడు ఊహాతీత విషయములను గురించి సమయము వ్యర్థపరచ నిచ్ఛగించ లేదు. లోకము తన అవసరముచే నడుచుచున్నది. లోకమున మార్పే గాని మార్పుల కాధారమైన నిత్యసత్పదార్థము కనుపించుట లేదు. కావున నిత్యపరివర్తన కారణ ధర్మ సూత్రమే సత్యము.

Note:- లోకమనగా కారణ పరంపరమే మైనచో కారణబద్ధము గానిదేది? ఒక వస్తువు అనిత్యమని చెప్పినప్పుడు నిత్యమైనదేది? అన్న ప్రశ్నలు వచ్చును. ఎట్లైనా నొక నిత్య సత్పదార్థము నంగీకరింపక తప్పదు అరిస్టాటిల్ ననుసరించి మార్పులు దేనివో ఆ వస్తువుండక తప్పదు. నిత్యవస్తువు లేనిచే కాలగతమైన సంబంధములుండవు. పరివర్తనములో "అ"తరువాత "ఆ"వచ్చినదనగా "అ" పూర్తి అయిన వెనుక "ఆ" ప్రారంభమైనదన్నమాట. అ, ఆ లకు సంబంధమే లేదు ఈ రెంటికి కలుపున దొకటి రెంటికి సామాన్యమై యున్నచో అప్పుడు సంబంధమేర్పడును, అట్టి సంయోగశక్తి లేదా కర్త లేనిచో 'అ' అదృశ్యమైనగాని 'ఆ' ఆరంభింపకూడదు. పూర్వాపర దశా సామాన్యలక్షణ మొకటి ఉండి తీరవలెను. బౌద్ధుల క్షణిక వాదమును శంకరుడిట్లు ఖండించాడు. బౌద్ధుల దృష్టిలో అంతయు క్షణికము రెండవక్షణము వచ్చుసరికి మొదటిక్షణములో నున్న వస్తువు లేదు. పూర్తిగా క్రొత్తదైన ఇంకొక వస్తువు ఉదయించు నంటారు. అందుచే మొదటిది రెండవదానికి కారణమని చెప్పజాలము రెండవది మొదటిదాని కార్యమనికూడా చెప్పవీలులేదు.

ఉత్తర వస్తు జన్మమునకుముందే పూర్వవస్తువు అదృశ్యమైనది. అందువలన ఉత్తరవస్తువు పూర్వ వస్తువు కారణముచే ఉత్పన్నము కాలేదు శూన్యమునుండి వస్తువు జనింపదు. ఈ విమర్శ సరియైనదే నని గ్రహించి అనంతర బౌద్ధులు వారి వాదమును మార్చుకొని ఈ విధముగా చెప్పిరి.

మార్పులన్నిటికి వెనుక నొక నిత్యవస్తువున్న దనియు మారుచున్నది. ఆ వస్తువుయొక్క గుణ విశేషములు మాత్రమేనని చెప్పిరి. అందుచే బౌద్ధం మొదటి క్షణములోని వస్తువు ఉత్తర క్షణములో ఉండదని చెప్పుచున్నదనుట తప్పు. నిత్య పరివర్తమాన శీలమైన జగత్తులో నిత్యవస్తువును దర్శించుట అసంభవమని బౌద్ధం ఉపనిషత్తులంగీకరించినను, ఉపనిషత్తులో సత్పదార్థమున్నదని చెప్పగా బుద్ధుడు అది మనస్సున కతీతమగుటచే, చూడజాలని విషయమగుటచే మౌనమువహించెను కావున నాస్తికునిగా పరిగణించరాదు. బౌద్ధం నాస్తికమైనచో ఆ కాలంలో ఇంత ప్రజాదరణ పొంది యుండెడిది కాదు. పునర్జన్మ, కర్మనిర్వాణమునందు వారికి గల నమ్మకము వారు నాస్తికులుగాదని ఋజువుచేయుచున్నది. అంతేగాక శిష్యులలో ఒకసారి ఇలా అన్నాడు. "పుట్టనిది, ఆరంభము లేనిది, చేయబడినది, అద్వితీయమైనది ఉన్నది క్రమముగా కా అదియే లేకున్నచో జరామరణాది స్థితినుండి మనకు విముక్తి లేదు."

<u>జీవము - ఆత్మ:</u>—వ్యక్తిత్వమునకు ముఖ్యాధారములు నామరూపములు నామము మానసికావస్థలకును రూపము భౌతిక పదార్థాంసములకు చెందియున్నది. మనస్సు, శరీరములు అన్యోన్యాధారములు కోడి తన గ్రుడ్డును వేరుగాను, డొలకను వేరుగాను ప్రసవింపనట్లే అవి పరస్పరాధారాలు మానసిక భౌతిక గుణసంయోగముచే వ్యక్తి ఏర్పడుతున్నాడు ప్రతి వ్యక్తియు వస్తువుల వలనే నొక సముచ్ఛయము. బౌద్ధులు దీనినే సంస్కారమందురు. శరీరము శాశ్వత

మైన ఆత్మగాదు. ఏలన శరీరము నశించుచున్నది. భావన ధర్మన జ్ఞానములు ఆత్మగావు. ఏలన వాటి కాధారమైన చేతనత్వమే నశించుచున్నది. కావున మనరూప భావ దర్శన చిత్త వికారము లన్నియు అనిత్యములు. కావున ఆత్మవాదులవు అజ్ఞానులు దేహము నందు ఒక ఆత్మ ఉన్నట్లును లేదా దేహమువంటి రూపముగల ఆత్మ స్వరూపమున్నట్లును లేదా ఆత్మ ఒక భావమని లేదా భావమందు ఆత్మ ఉన్నదని తలుతురు. మానవునిలో మార్పు లేని నిత్యలక్షణ మేదియు మాకుగోచరించుటలేదు. పంచ స్కంధముల కూర్పే యున్నది. వ్యక్తిత్వమునకు కారణములైన భౌతిక శరీరము మనస్సు తప్ప మానవునియందు ఇంకేమీ కన్పించుటలేదు. శరీరసంబంధము లేని ఆత్మ ఒకటున్నదని చెప్పుట కర్మసిద్ధాంతమునకు వ్యతిరేకమని బౌద్ధులు తలచిరి. ఏలన సర్వకర్మలకాయాత్మయే కారణమని తలచి మానవులు కర్తవ్యముల నెరవేర్చుట మానివేయుదురు. బుద్ధుడు ఆత్మ అదికాదు ఇదికాదు. అని చెప్పాడేగాని ఏదిఅంటె మౌనము వహించాడు. జీవాత్మ కాధారమై నిగూఢమైయున్న పర మాత్మ మన జ్ఞానమున కగమ్యము. కొందరది ఉన్నదందురు. ఇత రులకు లేదనుటకుకూడ అధికారము కలదు. కనుక ఆత్మ అస్తిత్వ నాస్తిత్వ చర్చను విడనాడమనిచెప్పెను. వ్యవహారమున నున్న జీవాత్మయే మన మెరిగినది. తదీతమైన పరమాత్మ మనకు తెలి యదు. నిత్యమగు ఆత్మ నిరాధార కల్పన మనియు, అవిచ్ఛిన్న గుణపరంపరా సముచ్ఛయమే జీవాత్మ అని నాగసేనుడు నిర్ణ యించాడు. ఆత్మలేదను నాస్తికవాదము ఇతనివలన సుస్థిరత గాంచినది.

నాగసేన - మిళింద రాజ సంభాషణములో ఈ విధముగా నున్నది. జీవ పదార్థంలో 32విభాగాలున్నాయి వీటన్నిటి కలయిక ఫలితంగా మానవ శరీరం ఏర్పడుతున్నది. నేను అనే భావన

అప్పుడు కల్గుతుంది. అనేక విడిభాగాలు చక్రాలు, గుర్రాలు, పగ్గం, ఇరుసు, సారథి-ఇవన్నీ కలిస్తే రథము అంటున్నాము. ఇవన్నీ విడిగా ఉంటే రథం అని పిలువముగదా! రథానికి సంబంధించిన జ్ఞాపకం మాత్రం ఉంటుంది. అలాగే అనేక భౌతికపదార్థాలు కలిస్తే శరీరం దాంతోపాటు చైతన్యం నేను అనే భావన ఏర్పడ్డాయి అవన్నీ నశిస్తే నేను ఎక్కడుంది భావ పరంపరా ప్రవాహమే ఆత్మ ఈ వివిధ దశలకు ఒకే సామాన్య లక్షణముండుట చూసి దానికే ఆత్మ అని పేరుపెట్టి పిలుస్తున్నాము. వివిధ భాగముల కలయికలో రథము నిజముగా నున్నదని తలచినట్లే మానసిక దశల వెనుక నిజమైన ఆత్మయున్నదని తలుచుచున్నాము. కొన్ని భౌతిక పదార్థ గుణముల సంపుటి శరీరమెట్లో, అట్లే కొన్ని మానసికావస్థల మొత్తమును ఆత్మ అని పిలుచుచున్నాము దేహము నిత్యము కానట్లే మనస్సుకూడా నిత్యమైన ఆత్మ కాదు. అది ఒక అలంకారపదము మాత్రమే చేతనత్వముకూడా ఒక ప్రవాహము ద్రష్ట నిత్యుడు కాడు. అతని జీవితము క్షణ మాత్రమే ఉత్తరక్షణములో నిలకొకడుదయించి పూర్వక్షణ పురుషునితో సంబంధము కలుపుకొని పని చేయును ఆ క్షణమునకు ద్రష్టకు జ్ఞానమున్నది. పూర్వ ద్రష్ట అనుభవమును గ్రహించి తన వ్యాపారముల నడుపుకొనుచున్నాడు. ద్రష్ట ఈ విధముగా క్షణిక చేతనుడు ఒకేచక్ర పరిధిలో (Circumference) అనేకమైన బిందువులు (Point) ఉన్నవి, కాని అవి మిక్కిలి సమీపములై కలిసి యుండుటచే నది యొక పరిధి అని ఎట్లు తలచుచున్నామో అట్లే మన క్షణికానుభవము లత్యంత సన్నిహితములై యుండుటచే నేకత్వమున్నదని భ్రాంతిని పొందుచున్నాము. ప్రతి మనుజుడును నిజముగా అనంతమనుజ పరంపరమే వివిధావస్థల సమూహమొక వృక్షమని చెప్పి, దానికి ఫలములుద్భవించినప్పుడు ఆ వృక్షము ఫలించినదని ఎట్లు చెప్ప

చున్నామో అట్టే విధముగా భిన్నావస్థల సముచ్ఛయములైన రూపములను మానవుడనియు, అవి సుఖదుఃఖములు పొందినచో మానవుడు సుఖదుఃఖముల పొందెనని చెప్పుచున్నాము.

Note :- శంకరుడు ఈ వాదమును ఖండిస్తూ మన అనుభవము క్షణికము కాదు. అది యొక నిత్యవ్యక్తికి చెందినది. నిత్యవ్యక్తియే లేనిచో గతస్మరణము స్మృతి సాధ్యములుగావు. ఒకడు నిన్న చేసిన పనిని నేడుస్మరించుచున్నాడు ఆ స్మరణమునకు సమానవ్యక్తిత్వము గల ఒకే మనస్సు అవుసరముగదా! కనుక గతమును వర్తమానములో దర్శించుటకొక నిత్య ద్రష్టనుండితీరవలెను. పోనీ రెండను భవముల సమానత్వముపై నట్టి స్మృతి లభించుచున్నదని వాదించినను నా సమానత్వమునకై సమానముగా అనుభవము పొందగల ఒక సమానవ్యక్తి అవుసరము మరియు మనలను మనమే అనుమానింపనవుసరములేదు. నిన్న చూసిన ''నేనే'' నేను చూచుచున్న నేనగునా కాదా అని సంశయింప పనిలేదు. అందుచే మన దర్శనములు, నిర్ణయములు క్షణికములు గాక నిత్యము లైనన్నాడు. వివిధ దర్శనములే మనస్సైనచో దర్శించుచదెవరు ఒక దర్శన మింకొక దర్శనమును దర్శింపదు. అనుభవపరంపరలో నొక అనుభవము కానటువంటి ఒక ద్రష్ట ఆ అనుభవ పరంపరకు కర్త అనుభావము జ్ఞానమునకవుసరము నిత్యాత్మభావము ఏకాత్మ లేనిదే పాపపుణ్యములు ఏవరికి చెందునను సమస్యగలదు. క్షణికవాదమున తప్పు చేసినవాడప్పుడే పోయి శిక్షానుభవమున వేరొకడున్నాడు. అని చెప్పుచో నెట్లుపొసగును అనంతర బౌద్ధులు శిక్షానుభవమునకు వలయు జీవసమానత్వమున్నదని చెప్పిరి. జీవి కేవలము పరస్పర సంబంధములేని దశాపరంపరగాదు. అది ఒక అవిచ్ఛిన్న భౌతిక మానసిక నైతిక సజీవ దశాసంపుటి. బిడ్డడు, యువకుడు, వృద్ధుడు ఒకడుకాదు ప్రతిదినము మనము నూతన

పురుషులకే కాని పూర్తిగా జ్ఞాతనులమూ కాము ఎడతెగని మార్గులో విడదీయరాని ఆ విచ్ఛిన్నత్వము (Continuity) కూడానున్నది. స్మృతి అనునది వేరుగా లేదనియు వర్తమాన దశలో గతానుభవమంతయు అవిచ్ఛిన్నముగా ప్రవహించుచుండు ననియు నిర్వచించిరి.

ప్రతీత్యసముత్పాదవాదం:- దుఃఖానికి కారణమేమిటి? కార్యకారణ వాదమువలె ప్రతికార్యానికి ఒక కారణమున్నట్లే దుఃఖానికి కూడా కారణం ఉండాలి దానికి 12 కారణాలను బౌద్ధులు పేర్కొన్నారు.

| | | |
|---|---|---|
| అవిద్య | షడాయతనాలు | మోహము |
| సంస్కారం | స్పర్శ | భావ |
| విజ్ఞానం | వేదన | జాతి |
| నామరూపములు | తృష్ణ | జరామరణాలు |

అజ్ఞానములేక అవిద్యనుండి సంస్కారములు సంస్కారములనుండి విజ్ఞానము దానినుండి నామరూపములు వానినుండి షడాయతనాలు (వాక్కు, నేత్రము, చెవి, జిహ్వ, వాసన, మనస్సులు) వాటి నుండి ఇంద్రియ సంయోగము దానినుండి వేదనము (అనుభవము), దాని నుండి కామము కోరికలు, వానినుండి జన్మము దానివలన జరా మరణాలు, వియోగ విచారదుఃఖ దైన్యాదులు కలుగుచున్నవి. కావున చివరకు జన్మనాశనముచే దుఃఖమునశించును జీవనేచ్ఛయే మన జీవితములకు మూలము జీవనేచ్ఛానాశనమే నిర్వాణము

అవిద్య:- అసత్యమైన "నేను అను అహంకారమునకు మూలము జీవనాసక్తిని కలుగ చేయునది కర్మహేతువు కర్మ సారథియుకూడాను జీవనాసక్తి సర్వదుఃఖ మూలము.

సంస్కారము:- పుణ్యపాప ఫలితములు కల కర్మ అని అర్థము విశాలమైన అద్దములో నూతన జన్మకు కారణ భూతమైన సంకల్ప శక్తి లేక జీవశక్తి అనికూడా చెప్పవచ్చును.

విజ్ఞానము:- ఇప్పుడు మనం విజ్ఞానం అంటె Knowledge అని అర్థం చేసుకుంటాము కాని వారి దృష్టిలో ఇంద్రియ జ్ఞానంకు సంబంధించినది మాత్రమే మరణంవలన, శరీర వేదన దర్శ నాదికములు నశించునుగాని పూర్వోత్తం జన్మములకు సంధాన హేతువగు విజ్ఞానము నశింపదు.

వేదనమునుండి జన్మపరంపరలకు కారణమైన తృష్ణ జనించును ఎవరు తృష్ణను జయింతురో వారి దుఃఖము పద్మ పత్రముల వెంట నీటి బిందువులు రాలిపోవునట్లు రాలిపోవును తామరాకుపై నీటి బిందువులంటవు వేళ్లు గట్టిగానున్న వృక్షమును నరికినను అది చిగిర్చి ఎట్లు పెరుగునో అట్లే తృష్ణ మూలము నాశనముగాని వారికి తిరిగి తిరిగి దుఃఖములు కల్గుచుండును. మనజీవస్థితికి కారణము అవిద్యయే.

దుఃఖమునుండి విముక్తి పొందుటకు నైతిక జీవనమే మార్గము మన అహంవినాశమే మోక్షము పరమలక్ష్యము. నిర్వాణమే గావున తల్లక్ష్యసిద్ధికి గొనిపోవు కర్మలును పునర్జన్మ నరికట్టు పద్ధతులుగల జీవితమే యోగ్యమైనది. సంకల్పము మానవునియొక్క విశిష్టగుణము దానిమూలముననే నాతడు దుర్మార్గుడో సన్మార్గుడోనగుచున్నాడు నిర్వాణము పొందుటకు అష్టాంగ ధర్మములు చెప్పిరి.

సత్రమ విశ్వాసములు:- వీనికి జ్ఞానము అవసరము

సత్రమ ఆశయములు:- సర్వులందు ప్రేమకలిగి జీవించుతలపే నిజమైన మానవధర్మము.

సత్రమ వచనములు:- అబద్ధములాడకుండుట పరుష వాక్యములు వ్యర్థప్రసంగములు మానుట.

సత్రమ ప్రవర్తనములు } ఉద్దేశ పవిత్రత వినయ వర్తనము ధర్మజీవ
సత్రమ జీవనప్రవృత్తి } నము స్వార్థరహితులై సర్వభూతదయ కలిగియుండుట.

| | |
|---|---|
| సక్రమ ప్రయత్నము<br>సక్రమ మనఃప్రవృత్తి<br>సక్రమ సంతోషము | మానసిక క్లేశములను నిగ్రహించు అభ్యాసమే సక్రమ యత్నము. |

విజ్ఞానము, ప్రజ్ఞ మానవాలోచనము యొక్క భిన్నరూపములని తెలుపబడెను. అజ్ఞానులు విజ్ఞానమును జ్ఞానులు ప్రజ్ఞను పెంపొందించుకొందురు ఇంద్రియ జ్ఞానము బుద్ధి జ్ఞానము (విజ్ఞానము)లను విస్తరించి సంస్కరించుటయే విజయము. ప్రజ్ఞ లేక ఆత్మదృష్టి ఒక శిష్యునితో బుద్ధుడిట్లు చెప్పెను. ఆనందా నేను ఏకాకినై ప్రజ్ఞా సమాధిలో నుంటిని. ఆస్థితిలో ప్రపంచవస్తు దర్శనమునుండి అనంతమైన ఆత్మదర్శనసీమకుపోయి అచటనుండి శూన్యములోనికి పోతిని. అచట నాకు దివ్యదృష్టి లభించినది అట్టి దివ్యదృష్టితో భూత వర్తమాన భవిష్యత్ లోకములు మనుజులెట్లు వచ్చిపోవుచున్నారో చూడగల్గితిని. ప్రజ్ఞదశానంతరం ధ్యానము నిశ్చలసమాధియున్నవి. అహంభావమును నాశ మొనర్చి సత్యములో లయింపచేయు దృఢయత్నమే ధ్యానము తన అహంకారమును నాశన మొనర్చుకొన్న వారిని దేవతలైనను జయించలేరన్నాడు.

బుద్ధుడు తనకు పూర్వమునున్న కర్మసిద్ధాంతమును పునర్జన్మను అంగీకరించెను. తాము చేసిన కర్మలలోని భేదముల వలన మానవులందరు ఒకే రీతిగా లేరు. కర్మ జీవుల శీలమునుండి ఉత్పన్నమైనది. గతము వర్తమానమును బంధించినను భావిదశను మన సంకల్పమునను సరించి నిర్మించుకొనవచ్చును. కర్మఫలితము అనుభవించువరకు పునర్జన్మావసరముండును. పునర్జన్మరాహిత్యమే మోక్షము. అయితే ఆత్మదేహాంతర యాత్ర చేయుటగాని ఒకేవ్యక్తి పునర్జన్మ పరం పరలనందుటగాని బౌద్ధంలో లేదు. దేహాంతరములో యాత్ర చేయునది ఆత్మకాదు శీలము పూర్వజన్మ శీలము నూతన జన్మమునకు వలయు సామాగ్రినిచ్చునని

చెప్పబడెను. కర్మ బలముచే మరణించుచున్నవాని విజ్ఞానము నూతన జీవదశలనుద్భవింపచేసి ఒక సూక్ష్మ దేహాధారమున నూతన దేహపరిణామము పొందును. జీవిత వ్యాపార సంబంధమైన కర్మశక్తియే గాక బ్రతుకవలెనన్న కాంక్ష లేక మోహముకూడా పునర్జన్మ కారణమని తెలియుచున్నది. నిర్వాణమనగా దైవసాయుజ్యముచే లభించు ఆనంద అవస్థ అని వీరు అంగీకరించరు. అట్లైనచో జీవన కాంక్ష పూర్తిగా నశింపక మిగిలియుండును నిర్వాణ ప్రాప్తివలన తృష్ణ అవిద్య నశించును. పునర్జన్మయుండదు. నిర్వాణమనగా జీవపూర్ణత్వమనియు సుఖదుఃఖాతీతమైనది వ్యానంద స్థితి అని చెప్పబడెను. నిర్వాణమనగా మరణమని నాశనమని తలుపరాదు.

దైవము:— దేవతల వలన భయముతో ప్రార్థనలతో వారి అనుగ్రహము పొందవచ్చునన్న విశ్వాసముతో కూడిన సామాన్య ప్రజల బానిసత్వ బుద్ధిని తొలగించవలెనన్న దేవతాభావనిర్మూలనమే మార్గమని తలచాడు. దున్నచో అన్నిటికి అతడే కర్త మానవునికి కర్తృత్వము లేదు మరి ధర్మజీవనము సత్ప్రవర్తనాభ్యాసము వృథాయగును. దేవునిపై భారము వేసి స్వయంకృషిపై నాధారపడు ధైర్య సంపద విడనాడు మూర్ఖాచరణ పద్ధతిచూసి దైవనిర్మూలన మవశ్యమని తలచెను ఒక గడియారము గడియారము చేయువాడున్నాడని ఎట్లు సూచించునో అట్లే జగము దేవుడున్నాడని సూచించుచున్నదని చెప్పు తర్కమును బౌద్ధులంగీకరింపరు బీజము వృక్షముగా మారునట్లే దేవునిలో అవుసరము లేకుండా సృష్టి జరుగవచ్చును. గ్రుడ్డునుండి కోడి కోడినుండి గ్రుడ్డు పరంపరగానే ఏ ఇతర సహాయము లేకుండా నెట్లుదయించుచుండునో అట్లే కర్మ బద్ధమైన సంసారము ఒక చక్రమువంటిది. ఆ చక్ర సంచలనశక్తి ఆ చక్రములోనే యున్నది. వస్తువులెట్లు జనించుచున్నవో తెలియుటకు వస్తువులను దాటి వేరొక చోటికి

పోనవుసరము లేదు. కారణ కార్య పరంపరలు అనాద్యనంతముగ్లై జరుగుచున్న వనుకున్న చో సృష్టి ప్రథమ కారణ సమస్యయే పోవును నిష్కారణముగా పని చేయు కర్మ సూత్ర నియతియే సర్వ సృష్టి జాలమును నడుపుచున్నది. మనుజుని మానవత్వ సహజ దోరణిచే లోకమంతియు నొక మానవత్వలక్షణముగల శక్తివలన నడుచు చున్నదని తలపింప చేయుచున్నది. జగత్పరిణామ క్రమము మనకు ప్రత్యక్షము మార్పులకు లోనగుచున్న దృశ్యముల వెనుక నున్న నిత్య సత్యమును కర్మ లనుడు. ధర్మమనుడు, బ్రహ్మ పదార్థ మనుడు, ఏ పేరపిలిచినను దాని సత్యమునకు భంగము వాటిల్లదు. ఒక నిష్కారుణ సూత్రనియమము కర్మలేదా ధర్మము నంగీకరింప కున్న యెడల పరిణామ ప్రదర్శన ఒక ఉద్దేశరహితమైన ఇంద్ర జాల ప్రదర్శన అగును, చరాచర ప్రకృతి నిర్మాణసూత్రము ధర్మమనియే అతని అభిప్రాయము దేవుడు లేడనుటకు ఇలా వాదించేవాడు.

ఈ ప్రపంచము ఈశ్వర సృష్టి అయినట్లయితే మార్పు వినాశము ఉండకూడదు. మంచి, చెడు, తప్పు, ఒప్పు, దుఃఖం ఉండరాదు. ఎందుకంటె అవన్నీ దేవునినుంచే వచ్చిఉండాలి. కాని సుఖం దుఃఖం, ప్రేమ ద్వేషం అన్నీ వ్యక్తుల మనస్సు లలో ఉద్భవిస్తున్నాయి ఇవన్నీ ఈశ్వరసృష్టి అయితే ఈశ్వరు నికి కూడా సుఖదుఃఖాలు అనురాగద్వేషాలు ఉన్నాయన్న మాట. ఈ లక్షణాలన్నీ ఉంటే అతడు సర్వసద్గుణ సంపన్నుడు ఆదర్శ ప్రాయుడెలా అవుతాడు శివుడాజ్ఞ లేనిదే చీమైన కుట్టదు అంటారు. ఈశ్వరుడు సృష్టికర్తయై అందరూ ఈశ్వరుని ఆజ్ఞలకు బద్ధులు కావలసిఉంటే ధర్మానుష్టానమునకవుసరమేమి! అన్నియు దేవుడే చేయించును సత్కర్మము దుష్కర్మము నొకటే యగును. దేవుడు నట్టి కర్మలు చేయువాడేనగును.

కష్ట దుఃఖముల కింకొక కారణ మున్న చో దేవుడు కాక

ణము కానిదింకొకటి ఉన్నదన్నమాట అయినచో అంతయు ఆ ఇంకొక కారణముచే జనించెనని ఏల చెప్పరాదు? ఈశ్వరుడు కర్త యైనచో నాతడొక ఉద్దేశముండియో లేకుండగనో పనిచేయును. అతనికొక ఉద్దేశమున్నచో అతడు పరిపూర్ణుడు కాడు ఏలన ఉద్దేశము ఒక లేనిదానిని గోరి దానివలన తృప్తి నొందచూచును. అతడు ఉద్దేశము లేనివాడైతే అతడు పిచ్చివాడైననూ కావాలి లేదా శిశువైననూ కావాలి ఏలన శిశువులు ఉన్మాదులు మాత్రమే ఏ ఉద్దేశము లేకుండా పనులు చేయుచుందురు. ఈశ్వరుడే కర్తయైనచో సదా భక్తి పరులై యాతనిని ధ్యానించవలనేగాని అవుసరము వచ్చినప్పుడే ప్రజలేల వానికి మొరపెట్టుకొందురు. అనేక దేవతల నేల పూజించుచున్నారు. ప్రజలను అధర్మ కార్యములచేయ నట్లేల ప్రోత్సహించుచున్నాడు. మత ప్రమాణ గ్రంథముల కాధారము నాతడే అయినచో పరస్పర విరుద్ధ భావముల నేల ప్రకటించెను. దేవుడు విలాసము కొరకు దుష్టులను పుట్టించి వారికి నరకమును కలుగచేయుచున్నాడని చెప్పుటలో అర్థమేమున్నది.

దేవుడు గ్రహించుటకు శక్యముగానంతటి గొప్పవాడైనచో వాని గుణములు నట్లే మన భావముల కతీతము కావలెను అందుచే అతనిని మనమెరుగజాలము మరి సృష్టి కర్తృత్వ మాతని గుణమని మన మెలా గ్రహింపగలము? పరమాత్మ అనగా లోకవస్తువులతో నెట్టి సంబంధము లేనిదైనచో దాని నెట్లు కనుగొనుట? ఎందుకంటె ప్రపంచమంతయు కారణకార్య సంబంధ బంధురమని మన మెరుగుదుము సంబంధ శూన్యమైన దేదియు లేదు నుండబోదు దేనిపై నాధారపడక దేనికీ సంబంధింపక యున్నది. పరస్పర సంబంధములుగల వస్తుజాలముల నెట్లు దయింపచేయుచున్నది. పరమాత్మ ఏకమైనచో ఒక కారణమునుండి భిన్నవస్తువుత్పత్తి కావాలి కాని నిజ వ్యవహారమున భిన్న కారణములనుండి ఒక

వస్తువు సృష్టి యగుచున్నది. ఉదా:- శరీరము పంచభూతముల సమ్మేళనము పోనీ పరమాత్మ లనేకములైనచో వాని పరస్పర సంబంధమెట్టిది. పరమాత్మ సర్వవ్యాప్తియై సర్వమును నిండి యున్నచో అది జడపదార్థములను చేయలేదు. ఏలన పరమాత్మ జీవము సర్వవ్యాప్తమైయున్నది. మరి జడపదార్థములు ఎక్కడ నుండి వచ్చినవి. జీవములేని జడపదార్థములను మనము చూచు చున్నాము కదా. అంటె పదార్థంలో దేవుడు లేడా! మరి ప్రపంచ ములో దేవుడు లేని ప్రదేశమున్నట్లే కదా!

పరమాత్మ నిర్గుణమైనచో అది సృజించిన వస్తువులు నిర్గుణములు కావలెను. కాన సర్వవస్తువులు గుణములు కలిగి యున్నవి. అందుచే పరమాత్మ ఈ ప్రపంచమునకు కారణము కాజాలదు పరమాత్మ మార్పులేని నిత్యసత్యమైనచో నతడు సృష్టించిన వస్తువులుకూడా మార్పులేకుండా నుండవలెను కాని లోక ద్రవ్యములన్నియు మారుతూ చివరకు నశించుచున్నవి.

Note:- ఇంచుమించుగా నొక వెయి సంవత్సరములు బ్రాహ్మణ మతము జాతీయ మతమై విలసిల్లగా బౌద్ధ మతము దానిని జీర్ణింప చేసి రెండు శతాబ్దులలో భారత రాజ ధర్మమై ప్రకాశించినది. పాపపరిహారమునకు నాతడెట్టి జనాకర్షక తేలిక పద్ధతుల చూపులు గాని మోక్షమును పంచిపెట్టుచున్నానని డంభములుగాని చేయ లేదు. అతుడుపదేశించిన సర్వమానవ సౌభ్రాత్వము, వర్ణ వివక్ష నిర్మూలన, యజ్ఞయాగాదుల కర్మకాండల నిరసన, సంఘము నందలి వారి ఆచారవ్యవహారములు వినయశీల సంపదలు రాజాధరణ జన సామాన్యమునకు రుచించి బౌద్ధమత విజయానికి మూల కార ణములైనవి.

బౌద్ధమత శాఖలు:- భారతీయ సంస్కృతిలో బౌద్ధమతం హింధూ మతంలోని లోపాలను సరిదిద్దు కొనుటకు కారణమైంది.

అప్పటివరకు యజ్ఞయాగాదులే ధ్యేయముగా పెట్టుకొన్న బ్రాహ్మణ మతముకూడా వాటిని తగ్గించి సర్వభూతదయా, దైవ భక్తి ముఖ్యములని ప్రచారము ప్రారంభించినది. అంతేగాకుండా బుద్ధుడుకూడా విష్ణువు అవతారములలో నొక అవతారమని ప్రచారము చేయ నారంభించుటతో భారత వర్షమున బౌద్ధమత మృతికి ఘంటానాదము ప్రయోగింపబడి ది. పూర్వ బౌద్ధక్షీణదశ బౌద్ధ మహాయాన శాఖా సముద్భవము, బ్రాహ్మణ మత పునర్వికాసము ఏక కాలమందే జరిగినవి. బ్రాహ్మణమతము ననుసరించి మహాయానులుకూడా బుద్ధుని దేవునిగా చేసి పూజింపనారంభించిరి. యోగ దైవ భక్తి తత్వముల నభివృద్ధి చెసిరి. పూర్వ బౌద్ధమతము ప్రకటించిన కొన్ని నిరుత్సాహకర భావముల విసర్జించి ప్రజాహృదయము నాకర్షించు మత తత్వమును ప్రదర్శింపకున్నచో తాము జయప్రదము కాజాలరని నిశ్చయించిరి. హిందూ మతమునకు చెందిన యోగతత్వము ఉపనిషత్తులను భగవద్గీతాతత్త్వముల సమన్వయించి పురాణములను రచించి ఎట్లు ప్రజాహృదయమును చూరగొనినవో అట్లే తామును చేయుటయుక్తమని మహాయానులు తలచిరి దానితో బుద్ధిమంతులకు దానిలోని గొప్పదనం కన్పించకుండా పోయింది. బుద్ధుడు స్త్రీలనుకూడా సంఘ సభ్యులుగా చేర్చుకొని తప్పుచేశాడు వారి మూలమున శ్రమణకుల నియమనిష్టలు సన్నగిల్లినవి చివరకు బౌద్ధ ఆరామాలన్నీ లంజ దిబ్బలుగా పేరు తెచ్చుకొన్నవి. బుద్ధుడు మరణించిన మరుక్షణమే బౌద్ధంలో శాఖలు ఏర్పడ్డాయి మహాయానులు హీనాయానులుగా చీలిపోయారు. మహాయానులు తిరిగి యోగాచారులు మాధ్యమికులు గాను, హీనాయానులు వైభాషికులు సౌత్రాంతికులు గాను చీలారు.

వైభాషికులు :- అన్నీ (సర్వం) అస్తిత్వాన్ని కలిగి ఉంటాయని

అంగీకరించారు కనుకనే వీరిని సర్వాస్థి వాదులనికూడా పిలిచారు. వస్తు స్వభావమును తెలుపుటకు అనుభవమే సాక్షి అని అన్నారు. వస్తువులతో ప్రత్యక్ష సంపర్కము వలన జనించు ప్రత్యక్షజ్ఞానమే అనుభవమని వారి మతము బాహ్య ప్రపంచము మనకు అగోచరము అనుట యుక్తము కాదు. వస్తువులు రెండు విధములు:- దర్శింపబడినవి, అనుమానింపబడినవి అంటె ప్రత్యక్ష ప్రమాణము అనుమాన ప్రమాణముల నంగీకరించారు. బాహ్య ప్రపంచము మానసిక భావ ప్రపంచము. స్వతంత్ర స్థితి కలవందురు. మనస్సునకు వస్తు జ్ఞానమున్నది. ద్రవ్యదర్శనములో వస్తువులున్నవి వస్తు మూలపదార్థము మూడు కాలములందు నిత్యమైయున్నది. కారణ సిద్ధాంతమును విడిచిపెట్టిరి వీలన కారణ కార్యములు ఒకే వస్తువు యొక్క రెండు రూపములని వారి భావము. మంచుకు, ఆవిరికి, జలమే మూలద్రవ్యము బాహ్యరూపము క్షణికమే గాని మూల ద్రవ్యము నిత్యమైనది, కారణము ఎన్నడు నశింపదు. అది కార్య రూపముగా మారినప్పుడు అవస్థయే మారినది మట్టికుండగా మారినప్పుడు మృణ్నామము పోయి పాత్రనామము వచ్చినదేగాని మట్టి సమానమే వస్తువునకు నాలుగు అవస్థలున్నవి ఉత్పత్తి, స్థితి, శిథిలత, మరణము. మన దర్శనము వాని అస్తిత్వమునకు కారణము కాదు. మనము కళ్లు మూసుకొన్నంత మాత్రమున లేదా చూడనంత మాత్రమున అక్కడున్న వస్తువు అక్కడ లేకుండా పోదు, మనస్సుతో సంబంధము లేని వస్తువుల మూల పదార్థము నిత్యమైనదని వైభాషికులు సౌత్రాంతికులు కూడా నంగీకరింతురు. వ్యవహార ప్రపంచము సత్యమనిరి పరమాణు సంయోగములచే నేర్పడిన వే బాహ్యవస్తువులు అణుసిద్ధాంతము నిరువురు అంగీకరించిరి అణువు షణ్ముకములు కలదనియు దానిలోనున్న అవరణ మొకటేనని వైభాషికుల వాదము. మనము శిరోజ సముదాయ

మును చూడగలమే గాని ఏక శిరోజమును చూడ జాలనట్లే అణు సముదాయమును చూడగలము కాని ఏకాణువును చూడలేము. వీరు ప్రపంచ ద్వయము నంగీకరింతురు. భాజనలోకమనగా వస్తువులతో నిండినది. సత్వ లోకమనగా జీవులతో నిండినది. మొదటిది రెండవ దాని కుపకరించును. గతం వర్తమానానికి దాటితీసిన వెంటనే నశిస్తుందని సౌతాంత్రికుల వాదము కాగా కొనసాగుతుందని వైభాషికులంటారు.

సౌతాంత్రికులు:- బాహ్య ప్రపంచం వాస్తవం, వాస్తవికత అంటూ ఒకటి లేనిదే అసలు జ్ఞానం కాని భ్రమ కాని ఎలా కలుగుతుంది. భౌతిక వస్తువులాంటిది. అనే మాటలోనే భౌతిక వస్తువు ఉనికి స్ఫురిస్తుంది వస్తువులను గూర్చి మనకు కల్గిన మానసిక వేదనల చే వాని ఉనికిని మనము గ్రహించుచున్నాము, నిజముగా బాహ్య వస్తువులు లేని యెడల మూలమే లేని భావ ముదయించుట అసంభవము నేను కుండను చూస్తున్నాను అని అంటాము. వస్తు జ్ఞానం ఎలా ఏర్పడుతుంది అందుకు నాలుగు అంశాలు తోడ్పడాలి. వస్తువు వస్తువు చైతన్యం విచక్షణ సహాయకాంశము. చీకటిలో కుండను చూడలేము. వెలుతురు సహాయకాంశము. ఇన్ని అంశాలు కలిస్తే వస్తు జ్ఞానం ఏర్పడుతుంది. ఫలితంగా మనోఫలకంపై వస్తు ప్రతిబింబము ఎర్పడుతుంది. వస్తువు లేనిదే ప్రతిబింబము లేదు. జ్ఞానానికి గీటురాయి ఏమి? ఆచరణ ఫలితాన్నిచ్చే జ్ఞానం వాస్తవమైనది.

క్షణిక వాదానికి వీరు విశేష ప్రాధాన్య మిస్తారు కాలం నిరంతరం ఇందులో అస్తిత్వం ఉంది. క్షణికత్వం కూడా ఉంది. అస్తిత్వాన్ని వదలివేసి క్షణికత్వాన్ని మాత్రమే గుర్తిస్తే భావ వాదంలోకి పోతాము. అలాగాక క్షణికత్వాన్ని వదలి అస్తిత్వాన్ని మాత్రమే గుర్తిస్తే వైభాషికులవలె జడవాదం వైపు పోతాము.

వీరు వైభాషికులు మాధ్యమికులకు వ్యతిరేకంగా జైనులవలె మనస్సు తన్ను గూర్చి తానాలోచింప గలదనియు అందుచే మనము ఆత్మావలోకన శక్తిని కలిగి ఉన్నామని సెలవిచ్చిరి. వస్తువులు భూత వర్తమాన భవిష్యత్ మూడు కాలములలో అస్తిత్వాన్ని కలిగి ఉంటాయని వైభాషికులన్నట్లు గాకుండా, ప్రతిదీ కేవలము వర్తమాన అస్తిత్వాన్ని మాత్రమే కలిగి ఉంటుందన్నారు. మార్పు చెందుతూఉండే యథార్థానికి బదులు స్వలక్షణాన్ని పేర్కొన్నారు. దారాన్ని చూచినపుడు దారంయొక్క స్వలక్షణాన్ని గుడ్డనుచూచినప్పుడు గుడ్డ స్వలక్షణాన్ని చూస్తాం.

సృష్టికి కారణము ఒకడే అయినచో నాతడు ప్రథమ కారణమున సృష్టి అంతయు ఒకే కాలమున ఒక్కసారిగా సృజించియుండవలెను కాని జీవులొక్కసారిగా ఉదయించుచుండుట లేదు. భిన్న కారణములతో భిన్న కాలములలో భిన్నజీవులుదయించుచున్నవి. దేవునికి భిన్న సంకల్పములున్నచో భిన్న కారణములున్నవని అంగీకరించవలెను. అందుచే సృష్టికి కారణ పరంపర ఉన్నదనియు దేవుడొక్కడే కారణము కాదని తెలియుచున్నది.

యోగాచారులు - బుద్ధులైన వారియందు బోధి సత్వరూపమున దర్శింపబడిన పరమ సత్యము యోగాభ్యాసము వలనగాని లభింపదని చెప్పుటగాన నీ శాఖకు యోగాచారశాఖ అనిపేరు వచ్చినది. వీరిది ప్లేటోవలె సంపూర్ణ భావవాదం క్రీ॥ శ॥ 200 సం॥ ల కాలంలో ప్రాచుర్యం పొందారు భౌతిక ప్రపంచం అవాస్తవం భావ ప్రపంచం మాత్రమే వాస్తవం అయితే ఈ ప్రపంచాన్ని గురించిన భావాలు ఎలావర్పడుతున్నాయి? ఈ భావాలు అనాదిగా మన చైతన్యంలో ఉన్నాయి. కుండకు సంబంధించిన ముద్ర ఒకటి అనాదిగా మన చైతన్యంలో ఉంది కుండ కనపడగానే ఆ ముద్ర

ప్రజ్వలిత మవుతుంది. కొంత కాలానికి కుండనశిస్తుంది. కాని కుండ అనేభావంనశించదు కనుక వస్తువు తాత్కాలికం అసత్యం, భావం, శాశ్వతం, సత్యం ఇలాంటి భావాలన్నీ కలిసినదే ఆలయ విజ్ఞానం తర్కశాస్త్రాన్ని ఆధారంగాతీసుకొని వీరు భౌతిక ప్రపంచ అవాస్తవికతను నిరూపించ ప్రయత్నించారు.

మన జ్ఞానమునకు విషయములు మనోభావములైనచో, నాలోచించు ద్రష్టకు బాహ్యములైన వస్తువుల ప్రతిబింబములే లభించిన కారణమున బాహ్య వస్తువుల నిజరూపము మనకు తెలియుట సుసాధ్యము కాదు. మనకు తెలిసిన వస్తువులు ప్రతిబింబములే మనము వస్తు సంభందములేని భావములతో నారంభించి దానికి వస్తు సంభందము నా వెనుక కల్పించినచో అవి నిజమని ఎట్లు నిర్ణయింపనగును. కనుక బాహ్య జగత్ అస్తిత్వము మిద్య మాత్రమే. మనకు తెలిసిన బాహ్యవస్తువు నిజమైన స్థితినుండి వచ్చినదా, కాదా, అవి స్థితినుండి రాలేవు ఏలన ఒక దానినుండి ఉదయించినది నిత్యము కాజాలదు. వస్తువులు క్షణికములైనచో అవి ఒక్క క్షణము మాత్రమేనుండును జ్ఞానము కార్యము కావున నది కారణ మదృశ్యమైన వెనుక ఎలా లభించును ఎందుకంటె వస్తువు క్షణికముకదా! జ్ఞానముదయించుటకు ముందే వస్తువు నశించుచున్నది. కానీ మనము వస్తువులను దర్శించుచున్నాము కావున మన కొక వస్తువును దర్శించుటకు వస్తువుండ నవుసరము లేదు. ఒక వేళ వస్తువులున్నను అవి భావరూపములోనే మనకు గోచరించుటచేత మనకు భావములే ముఖ్యము. మనకవుసరమైనవి భావములే కనుక బాహ్యవస్తు అస్తిత్వమును మన మూహింప నవుసరము లేదు. మన మనస్సుకు వేరుగా వస్తువు లేమియు లేవు. ఉన్నది భావములు మాత్రమే. బాహ్యమున గోచరించు రూప పరంపర లన్నియు నిజముగా మన మనో వ్యాపారములే.

ఎందుకంటె కర్రపొడవు దాని ముఖ్యగుణము కాదు. వీలన అది దగ్గరగా నున్న వారికి ఒక పొడవుతోను, దూరముగా నున్న వారికి ఒక పొడవులోను కన్పడును. కనుక దానిపొడవు చూచు వాని ననుసరించియు కర్రయొక్క స్థానము సంభంద వేగము ననుసరించికూడా మారుచున్నది. మన మనస్సులో నున్న దానినే బాహ్యప్రకృతిలో ఉన్నట్లు ఊహించు చున్నాము, మనకుగల బహువిధ భావములకు కారణమేమని అడిగినచో పూర్వ భావసంస్కారములే అట్టి కారణమని చెప్పెదురు. స్వప్నములో మనో కల్పితముచే నిజముగా లేనటువంటి వివిధ వస్తువులను చూచుచున్నాము కదా! జాగ్రదావస్థయు నట్టిదే యని చెప్పనగును. "సర్వం బుద్ధిమయం జగత్" అనేది వీరి సిద్ధాంతం. పచ్చటి రంగు. ఆరంగును గురించి జ్ఞానం వేర్వేరు రంగు లేని జ్ఞానమెలా కలుగు తుందని సౌత్రాంతికుల ప్రశ్న? జ్ఞానం లేకపోతే రంగు ఉన్నదో లేదో అది ఏ రంగో ఎలా తెలుస్తుంది. కనుక జ్ఞానం ముఖ్యం అన్నది వీరి వాదన.

సగుణమైన సత్యస్వరూపమే ఆలయ విజ్ఞానము, నిత్యము పరివర్తనమునకు లోనగుచున్న ఆ విజ్ఞానము అవిచ్ఛిన్నమైనది. ఆలయ మనగా నిత్యము మారుచూ పెంపొందుచున్న జీవాత్మ అని చెప్పబడినది. అది ప్రతిబింబములను నిత్యము స్వీకరించుచు తనయందు ముద్రితములై యున్న కర్మబీజములచే వానిని వికసింప చేయుచు నెడతెగని ప్రవృత్తిలో నుండును. ప్రతి మానవునియందు నిట్టి పూర్ణ విజ్ఞాన రాశి సాగరమువలెనున్నది. కాని మానవుడు దానిని పూర్తిగా నెరుగడు మనలో పరమాత్మ ఉన్నంత మాత్రమున మనకు ముక్తి లభింపదు. కట్టె యొక్క మండు స్వభావము అగ్నికి హేతువు. కాని మనము దానికి నిప్పు అంటించవలెను. అదే విధముగా మనలోనున్న పరమాత్మ మోక్షహేతువైనను

ధర్మ జ్ఞానాభ్యాసముతో, యోగాభ్యాసముతో దానిలో లీనము కావలెను. అదే నిర్వాణము విజ్ఞానమే ప్రపంచస్వరూపము ప్రకృతి వస్తువులు దానికి ఇతరరూపములు ఆలోచించు కర్తకును, వస్తువులకును సుస్థిరమైన భేదములేదు. విజ్ఞానమును తీసివేసినచో సర్వం శూన్యం. అయి విజ్ఞానం ఒకటే ఏకైక సత్పదార్థము. అది జ్ఞాని జ్ఞేయము కూడా నైయున్నది.

Note:- శంకరుడు, మన విజ్ఞాన కార్యములన్నియు వస్తుశూన్యములైనచో శూన్యత్వ జ్ఞానము ను శూన్యమేనగు''వని విమర్శించాడు, స్వప్నములోని దృశ్యములు స్వప్నముతో పోవును. కాని జాగ్రదావస్థలోనివస్తువులు నిత్యములు. భేదమే లేనిచో స్వప్నంలో చంద్ర మండలానికి వెళ్లినట్లు కలగంటాము. మెలుకువ వచ్చినప్పుడు మనము పరుండిన మంచముమీద ఉన్నామేగాని చంద్ర మండలం మీద కాదుగా. సర్పమనునది లేనిచో రజ్జువునందు సర్పభ్రాంతియే నశించదు అందుచే బాహ్యవస్తువులుండి తీరవలెను. అన్నము తినుటవలనలభించు రసజులశక్తి భోజనభావాను భవముచే లభించు నని ఎవరూ అనరు కదా!

<u>మాధ్యమికులు లేదా శూన్యవాదులు</u>:- ప్రపంచానికి మూలకారణం అంటూ ఏమీలేదు శూన్యం తప్ప అరటి బోదెలోని పొరలన్నీ తొలగించుకుంటూపోతే చివరకు మిగిలేది శూన్యమే. ఇది క్రీ॥శ॥ 200సం॥లలో ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునినితో విఖ్యాతిపొందింది. సర్వదృశ్యములు సత్యం అనునది ఒక వాదము, సర్వం మిధ్య అనునది మరొక వాదం. ఈ రెండింటి మధ్యమ మార్గాన్ని అంగీకరిస్తారు కనుక వీరిని మాధ్యమికులన్నారు

దాన్ని కాని. దీన్ని కాని ఆధారం చేసుకొని ఉత్పన్న మయ్యేది ఏదికూడా స్వతః ఉత్పన్నం కాదు. అంటె దానికి స్వతః ఉనికిలేదు. దేనికయితే కారణం ఉంటుందో అది యదార్థంకాదు

అప్పు తెచ్చుకొన్న ధనంతలన వెంటనే ఏ విధంగా భాగ్యవంతులము కాలేమో అదే విధంగా ఒక ఆధారాన్ని అంటిపెట్టుకొని ఉండే దానికి యదార్థమైన ఉనికి ఉండదు. ప్రాచీన బౌద్ధం ఉత్పన్నమైన ప్రతిదానికి ఏకోఒక కారణ ముంటుందని చెప్తుంది గావున కారణం ఉన్నది యదార్థం కాదు. గావున పదార్థాలన్నీ వస్తువులన్నీ యదార్థాలు కాదు. సత్పదార్థ మనగా స్వభావముగలది. పరతంత్రత లేనిది. పరతంత్రమైనదల్లా శూన్యము అనగా స్వభావ శూన్యము ఇతర భావవాదులతో పాటు అవిద్య వలనే బాహ్యప్రపంచము ఉన్నట్లు గోచరిస్తుందన్నారు. ప్రజ్ఞ కలగడంతో అవిద్య నశిస్తుంది. మిగిలేది శూన్యమే ఉపనిషత్తులు బాహ్యప్రపంచాన్ని మిధ్యగా చెప్పి పరమసత్తాను బ్రహ్మను వర్ణిస్తే మాధ్యమికులు అదే దారిలో బాహ్యప్రపంచాన్ని మిధ్యలనియు పరమ సత్తాను శూన్య మన్నారు. ఆశూన్యాన్ని అనిర్వచనీయమని, మార్మికమని, రహస్య మని చెప్పినందువల్ల వారితో వాదించడం కష్టమని శంకరుడన్నాడు. సత్యమనేది పరిణామరహితంగా ఉంటుంది. జగత్తునిజమైనదైనచో దానియందు మార్పు లెన్నడునుండజాలవు, జగత్స్వభావము పరిణామ యుక్తమగుటచే దానిని సత్యమని అంగీకరింపజాలము.

1. గతిలేక చలనములేదు ఒక వస్తువు ఒకే కాలమున రెండు స్థానములయందు ఉండదు. కనుక చలనములేదు (జినో పార డాక్స్ కూడా అదే చెప్తుంది) అలాగా మార్గము లేదా దారిని రెండుగా విభజించవచ్చు ఇదివరకే గతించినది. రానున్నది మొదటిది గతించినది. రెండవదింకను రాలేదు అందుచే నడుచుట దుర్లభము గతియే లేనప్పుడు గతిసల్పువాడెవ్వడు కనుక మార్పు చలనము అర్థశూన్యములే.

2. ఉత్పత్తి, స్థితి, నాశనములు వేర్వేరుగా నొక సంస్కృతమునకు లక్షణములుగానున్నచో అవి కలసి ఏక కాలమున ఒకే

వస్తువు నందెట్లుండగలవు కాంతియు అంధకారమును ఒకేక్షణమందు లేవట్లో, ఉత్పత్తి, స్థితి, లయములుకూడా ఒకే క్షణమందు ఉండవు కనుక సంస్కృతములు నిజము కాదు

3. భూత, వర్తమాన, భవిష్యత్, దశలుగల కాలము కూడా అర్థ రహితము గత విషయము సందేహ వార్త భవిష్యత్, స్పష్టముగా చెప్పరానిది. ఈ క్షణమే మనకు స్పష్టముగా అనుభవములోనున్నది. కాని భూతభవిష్యత్‌లు లేని వర్తమానము ఉండదు. కావున కాలమనునది కేవల శూన్యంనుండి కల్పితమైన భావరూపం మాత్రమే.

4. నిర్గుణ పదార్థము లేదు. వస్తువు గుణములకు వేరైనుండజాలదు గుణము లేని వస్తువుగాని, వస్తువు లేక గుణముగాని ఉండవు. మనకు ఇంద్రియములు లేకపోతే గుణములను గ్రహింపలేము. గుణములు మన ఇంద్రియములపై ఆధారపడి యుండుటచే గుణములుకూడా స్వతంత్రములు కావు. కావున వస్తువులు గుణములపై ఆధారపడి యుండుటచే వస్తువులును స్వతంత్రములు కాదు. కనుక అన్యోన్యాదారభూతములైన వస్తుగుణములు పూర్ణ సత్యము కాదు, అలానే అన్యోన్యాధార భూతములైన జ్ఞాన జ్ఞేయములు కూడా సత్యము కాదు.

5. ఒక కాలమున లేక దేశమున నున్న దృశ్య మింకొక కాలమున లేక దేశమున నున్న ఇంకొక దృశ్యముతో సామీప్య సంబంధము కలిగియుండవచ్చును కాని దేశ కాల సంబంధములు వ్యవహారికములగుటచే పారమార్థికముగా పూర్వా పరములు నిజములు కావని స్పష్టము [ఇక్కడ దేశము అంటే మనం అర్థం చేసుకొనేCountry కాదు ప్రదేశము Space అని అర్థమువచ్చును.]

6. అంశము ($\frac{1}{4}\frac{1}{2}\frac{1}{3}$) etc, నకు పూర్ణమునకు (1)గల సంబంధము నూలునకు వస్త్రమునకు గల సంబంధము వంటిటి దారములు

లేని వస్త్రముగాని వస్త్రము లేని దారములుగాని యుండజాలవు. రెంటిలో నేదియు సత్యము కాదు. అంశలు లేకుండా పూర్ణము లేదు. పూర్ణము లేకుండా అంశలు లేవు. కాని ఈసంబంధం కేవలం ఒక సంవృత్తి లేదా భ్రాంతి ప్రపంచములోని వస్తువు లెవ్వియు పారమార్థిక సత్యములు కావు అవి పరస్పర సంబంధ మాత్రములై యున్నట్లు గోచరించును.

7. గుణములకు వేరై వస్తువులు లేనట్లు మనస్సుకు వేరై ఆత్మ లేదు. అవిచ్ఛిన్న క్షణిక మానసిక దశా పరంపరమే ఆత్మ దర్శనాదిక్రియలు స్వతంత్రముగా నడుచుచున్నచో ఆత్మతో పని ఏమి? బాహ్యమునకు గోచరించు లక్షణముల వెనుక జగత్తునకు నిజమైన ఆధార మొక జడ పదార్థరూపమున లేనిచో భావముల వెనుక భావముకాని ఆత్మ ఏల ఉండవలెను.

8. విజ్ఞానము యొక్క స్వస్వరూపమెట్టిదో మనకు తెలియదు అది ఒక ప్రవాహము భావపరంపరలను మనకు ప్రదర్శించు నొక క్షేత్రము. కర్మ ననుసరించియే కర్త యను శబ్దమును, కర్త ననుసరించియే కర్మ అను శబ్దమును వచ్చినవి. పారమార్థికముగా చూచినచో కర్తయును లేదు కర్మయు లేదు ఈ విధముగా యోగాచారుల నిత్య ఆలయ విజ్ఞానమును తిరస్కరించిరి.

చెట్టు విత్తును, విత్తు చెట్టును జనింప చేయుచున్నవి. ధర్మ నము స్వయంస్థితి కలదికాదు. ఇదివరకే చూడబడిన దానిని నీ విప్పుడు చూచుటలేదు. రాబోవుదానినీ నీ విప్పుడు చూచుటలేదు. గతములో కాని భవిష్యత్తులో కాని చూడపడనివస్తువున కస్తిత్వము లేదని చెప్పవలెను. ఈ క్షణములో లేని కుండ మరు క్షణములో నుండ లేదు, మార్గము, గమనము మార్గగామియు నసత్యములైనట్లే ద్రష్ట, దర్శనము దృశ్యములుకూడా అసత్యములు. కాని దర్శనము, దృశ్య విషయములు పరస్పరాధారమైన అస్తిత్వమును కలిగి

యున్నవి కాని ఒకేవస్తువు భిన్న వ్యక్తులకు వేరుగాను, నొకే వ్యక్తికి భిన్న కాలములలో భిన్నముగాను గోచరించుచున్నవి కావున అసత్యములు.

చావులేదు, పుట్టుక లేదు, భేదము లేదు, నిత్యత్వము లేదు, అనేకత్వము లేదు, ఏకత్వము లేదు, ఉత్పత్తి లేదు, స్థితి లేదు, లయము లేదు. ఏదియును సత్యము కాదు. దీనికి ప్రత్యక్షసాక్ష్యమవు సరము లేదు. ఉన్న దానికి సాక్ష్యము చూపెట్టాలి గాని లేని దానికి అవుసరము లేదు. ప్రపంచమునకు క్షణిక దృశ్య రూపమున్నది. వస్తువు లనిత్యములుగావు - నిత్యములునుగావు. గుణముల యొక్కయు వాని సంబంధముల యొక్కయు భావపరంపర లే జగము మన మీా అర్థ శూన్యములగు సంబంధములను నమ్ముతు న్నాము సంబంధముల వలన జగదస్తిత్వమునందు భ్రాంతి జనించు చున్నది. కార్య కారణములు పూర్ణము - అంశము స్వయం స్థితి కలవికాక పరస్పరాధారములై జగత్ కల్పనము చేయుచున్నవి.

సత్యం రెండురకాలు. ఒకటి సంవృతి సత్యం సంవృతిఅనగా సత్యమును కప్పివేయునదని అర్థము ఇది బాహ్య ప్రపంచానికి సంబంధించిన లౌకిక సత్యం రెండవది పారమార్థిక సత్యం ఇది మౌలికమైనది ఆదే శూన్యం అద్వితీయమైనది. నిత్యమైనది. పారమార్థిక సత్య జ్ఞానమే నిర్వాణహేతువైనను అది వ్యవహార సత్య జ్ఞానము ద్వారానే సాధ్య మగును సంవృతి జ్ఞానము మాన వుని బుద్ధి వ్యాపార ఫలితము ఇదియే ప్రపంచ దృశ్యమునకు కారణము.

స్వప్నగతుడు తన స్వప్నానుభవమును ఎట్టి తర్కవాదము వలనను నిర్మూలింపజాలడు. ఏలన స్వప్న వస్తువు ఉన్నదనుటకు గాని లేదనుటకుగాని ఉపయోగింపబడు ప్రతిహేతువు స్వప్న వస్తువు వలనే అభావ దోషము కలిగియుండును కాని మనము

మేలుకొన్నంతనే స్వప్న వస్తువు అసత్యమని తెలియునూ అదే విధముగా మనము పరమార్థమును తెలిసికొనగానే సంవృతిజ్ఞానము అసత్యమని తెలియును సంవృతి జ్ఞాన వాదము నెంతచేసినను సంవృతిని నిర్మూలింపజాలము. దానికి నిర్వాణమే మార్గము శూన్యతమే సర్వాధార భూతము దేవుడు శూన్యమని పిలువబడుటలో అక్రమమేమియు లేదు. ఏలన విజ్ఞానమునకు సంబంధ శూన్యమైనది అంటె విజ్ఞానము కానిది శూన్యమే బుద్ధుడిట్లు శిష్యులతో చెప్పి ఉన్నాడు "ఏ భావయొక్క అక్షరములకును వశముగాని సత్యమును వర్ణించుటెట్లు? తెలియుటెట్లు? సర్వాతీతమైనదియు 'శూన్యతా' నామమున చెప్పబడునదియు నగునద్దానిని గూర్చి ఈ మాటలు చెప్పుటయు తప్ప మన మిపుడు దర్శించుచున్న వస్తువులు గతములో శూన్యము సర్వవస్తుస్వభావమును శూన్యమే లేని వస్తువుల నున్నట్లు భావింప చేయునది అవిద్య.

Note:- వైభాషికులు ద్వైతతత్వములో నారంభించి వస్తువుల ప్రత్యక్ష దర్శనము జ్ఞానమని తలచిరి సౌతాంత్రికులు వస్తువులు భావముల ద్వారా తెలియునని చెప్పి మనస్సునకు వస్తువులకు మధ్య తెర ఉంచారు. యోగాచారులు భావముల కవ్వల లేదా తెరవెనుక వస్తువులే లేవనిరి. మాధ్యమికులు మనస్సు కూడా భావమేననియు అదియు అనిత్యము క్షణికమనిరి తాత్వికముగా చూచినచో వైభాషికుల పదార్థద్వయ సిద్ధాంతము సౌతాంత్రికులు వద్దకు వచ్చునప్పటికి మనస్సువైపు బలమెక్కువై గోచరించును యోగాచారులు బాహ్యజగత్తును విసర్జించి సర్వ వస్తుకేంద్ర స్థానమును మనస్సునకిచ్చిరి మాధ్యమికులు జీవాత్మలు గాని వస్తువులుగాని మనస్సుగాని పారమార్థికముగా అసత్యములనిరి. అద్వితీయ సత్యము ఆత్మజ్ఞానము కలిగిన సుగుణరూపమైన ఆలయ విజ్ఞానమని యోగాచారులు నమ్మిరి. మాధ్యమికులు

ఆత్మ - అనాత్మ రెండును సమానముగా అసత్యమనిరి సుగుణ రూపము పారమార్థిక సత్యము కాదు. శూన్యమే అద్వితీయ సత్యము.

Note:- బౌద్ధ జైన మతముల తిరుగుబాటు భారతీయ విజ్ఞాన చరిత్ర యందు ఒక నూతన యుగహేతువైనది. బౌద్ధులకు తర్క-శాస్త్రమే ప్రధాన క్షేత్రము. కావున హిందూ మతములో కూడా మతవిశ్వాసముల కాధారమైన అతీంద్రియ ప్రమాణములను వదలి తమ సిద్ధాంతములను తర్క విజ్ఞాన విషయ పరిశీలనముకు లోబడి జీవితానుభవమునకు అనుగుణములైన సహజ పద్ధతులద్వారా ప్రత్యర్థుల నెదొర్కొన వలసి వచ్చినది. తద్వారా హిందూ మతములో వెలువడిన శాఖలే గౌతముని న్యాయము, కణాదుని వైశేషికము, కపిలుని సాంఖ్యము, పతంజలియోగము, జైమిని పూర్వమీమాంస, బాదరాయుని ఉత్తరమీమాంస వీటన్నిటిని షడ్దర్శనములు అనిపిలుస్తారు. వీటిలో మీమాంసతప్ప మిగిలినవాటకి పెద్దగా వేదముతో సంబంధము లేకున్నను, నాస్తిక దర్శనములుగా పరిగణింతురో యన్న భయముతో అన్నియు వేదప్రమాణమున్నవని చెప్పుకొనినవి. ఈ దర్శనములన్నియు బౌద్ధ సంశయ వాదమును నిరసించి అవిచ్ఛిన్న క్షణికదశాపరంపరకు వ్యతిరేకముగా శాశ్వత సత్యమను అచల ప్రమాణద్రవ్యము నొకదానిని నిర్మింప ప్రయత్నించినవి. దానిని కొందరు ప్రకృతియనియు, కొందరు అణువులని, కొందరు మాయ యని చెప్పిరి. దేనికి ఆది ఉన్నదో దానికంత మున్నది సంసారమొక చక్రము వంటిది సృష్టి, స్థితి, లయాత్మకములగు యుగములు కాలచక్రమున పరిభ్రమించుచుండునని సర్వదర్శనములు అంగీకరించినవి. ఆత్మ, పునర్జన్మ, మోక్షం, వర్ణాశ్రమ ధర్మములను అన్ని దర్శనములు ఆమోదించినవి ఇప్పుడు వానిని పరికిద్దాం.

# న్యాయ - వైశేషికములు

ఇవి క్రీ పూ. 400 సం॥నుండి వ్యాప్తిలోనుండి క్రీ. శ 300 లలో సంకలన మొనర్పబడి యుండునని తలచుచున్నారు ఇవి భౌతిక వాదములు, న్యాయము తార్కిక రంగమునకు వైశేషికము భౌతిక రంగమునకు ప్రాధాన్య మిచ్చినవి చివరకు రెండును కలసి పోయినవి వైశేషిక దర్శనము న్యాయ దర్శనముకంటె ప్రాచీనమైనదిగా తోచును కణాదుడు బుద్ధునికంటె పూర్వము వాడని పెక్కురు భావింతురు. కణాదునికి ఉన్న మరో పేరు ఉలూకుడు ఉలూక అంటే గుడ్లగూబ మన సంప్రదాయంలో ఒక కథ ఉంది. పూర్వం ఒక మహర్షి శివుని అనుగ్రహంకోసం తపస్సు చేయగా శివుడు గుడ్లగూబ రూపంలో వచ్చి అణు సిద్ధాంతాన్ని భోదించినట్లు కథ ఉన్నది దర్శన జ్ఞానాన్ని భోధించటానికి శివుడు అటువంటి అసాధారణ రూపాన్ని ఏల ధరించవలె? గుడ్లగూబ గ్రీకు దేవతా చిహ్నమైనందువల్ల, డెమొక్రిటస్ అణుసిద్ధాంతాన్ని మన వైశేషికులు స్వీకరించారనడానికి ఈ కథే నిదర్శనమని ప్రముఖ చరిత్ర కారుడు రాహుల్ సాంకృత్యాయన్ అభిప్రాయపడ్డాడు. ఆనాటికి ఇరు దేశాల మధ్య వర్తక వాణిజ్యాలు జరుగుతున్నందువల్ల ఎవరినుండి ఎవరు దాన్ని గ్రహించారనేది చెప్పడం చాలా కష్టం. ముందుగా వైశేషిక అణుసిద్ధాంతాన్ని తెలుసుకుందాము.

అణుసిద్ధాంతము:- సర్వ భౌతిక పదార్థములును భూమి, జలము, అగ్ని, వాయువులను చతుర్భూతములచే కల్పితములు అని ఉపనిషత్తులుకూడా తలచినవి కాని భూజలాగ్ని వాయువులు మార్పులును భాగములును కలవగుటచే మార్పులేని, విభాగించరానిది, నిత్యమైనది ఇంకొకటి ఆ చతుర్భూతములకు ఆధారముగా నున్నదని తెలుపబడెను. ఆభావమే అణుసిద్ధాంతమునకు నాంది. అవియే

అణువులు, నిత్యములు, పరివర్తన శూన్యములు, అగోచరములు, కారణరహితములు, అవిభాజ్యములు. అణువులు అత్యల్ప పరిమాణమును కలిగియున్నవి వస్తు పరిమాణములోని భేదములకు కారణము కొన్ని అణువులు కలియుటయు, విడిపోవుచుండుటయే అణువులే సర్వ కార్యములకు ఉపాదాన కారణములు.

డెమొక్రాటస్ అణువులు ఒకే గుణము, వివిధ పరిమాణములు కలిగినవి. కాని కణాదుని అణువులు వివిధ గుణములు కలిగినవి. చతుర్భూతముల కనుగుణముగా చతుర్విధములైన గుణములు గల అణువులున్నవని చెప్పబడెను. రూప, రస, గంధ, స్పర్శలలో వివిధమైన అణువులు వివిధమైన గుణములు కలిగియున్న వనిరి. అణువులు మర్త్యకములన్న జైనవాదముతో వీరంగీకరింపరు. అణువుకు లోపల లేదు వెలుపల లేదు. అవి స్థలము నాక్రమించవు అణువులకు సహజముగా చలనము లేదు. వాని చలనములకు బాహ్య అదృష్టశక్తులు కారణమని చెప్పిరి. [డెమొక్రాటసీ అణువులు సహజచలన సిద్ధములు, కావున వారి సిద్ధాంతమున బాహ్యశక్తి లేదా దేవుడు సృష్టి కవుసరము లేదు] అణువుల సంయోగాల వియోగాలవల్ల మార్పు సృష్టి జరుగుతూ ఉంటుంది. ఈ మార్పు అదృష్ట శక్తులవల్ల జరుగుతుంది. మార్పు వాస్తవం, సృష్టి వాస్తవం అదృష్ట శక్తుల ప్రకారం సృష్టి జరిగేటట్లు దేవుడు చూస్తూ ఉంటాడు. ప్రజాక్షేమం కోరిన రాజు నిత్యవ్యవహారాలలో అనవసర జోక్యం కల్గించుకోకుండా సాక్షీభూతుడుగా నున్నట్లే, దేవుడు కూడా ఉంటాడు.

ఒక మట్టికుండను కాల్చినపుడు అది నశించి అణువులుగా విడిపోవును. వేడితగులుట వలన అణువులకు ఎరుపు రంగు వచ్చును, అట్టి ఎర్రని అణువులు తిరిగి సంయోగము పొంది నూతన ఎర్రని కుండగా మారుచున్నది ఈ కార్యమంతయు క్షణములలో జరిగిపోవుటవలన మనకది గోచరించదని వైశేషికులంటారు. కాని

నైయాయికులు రంగు మార్పు కుండ అణువులందును కుండయందును ఒకే కాలమందు కలుగునందురు ఈ ఇరువురి అణుసిద్ధాంతముల మధ్యనున్న భేదమిది ఒక్కటే.

సంసార పరిభ్రమణ యాతననుండి జీవకోటికి విశ్రాంతి నొసగదలచి దేవుడు జీవులను తనలోనికి తిరిగి తీసికొన గోరును. దేవుని శారీరిక జనించినంత మాత్రముననే అణుచలన కారణమైన అదృష్ట శక్తులు నశించి దేహేంద్రియాదులు చతుర్భూతములు నశించును, అణువులు విడిపోవును. ప్రళయ కాలమందు, అణువులు ఏ కార్యములును త్పత్తి చేయక నిశ్చలముగానుండును. చతుర్భూత అణువులును, పుణ్యాపాప వాసనా యుక్తములైన జీవాణువులును, వేరుగా చలనము లేకుండాఉండును. తిరిగి ఈ జీవాణువుల అనుభవము నిమిత్తము దేవుడు లోకమును సృజించ కోరును. పరమేశ్వరేచ్ఛచే అణువులలో చలనముదయించి జీవుల పూర్వజన్మ సంస్కారములతో సంయోగము చెంది సృష్టిఏర్పడును. తనకు సుఖ దుఃఖ కారణములైన ధర్మా ధర్మములు జీవాత్మ లక్షణములు అదృష్టము - జీవుల ద్రవ్యముల వలవ సృష్టి నుదయింపచేసి క్రమగతి కాధారమై పూర్వకృత కర్మ ఫలములను జీవులకు లభింపచేయును.

ఈ విధంగా అణువులు శాశ్వతమని చెప్తూ ఉపనిషత్తుల శాశ్వతవాదాన్ని, వాటికలయిక విడిపోవటం క్షణికమని చెప్తూ బౌద్ధుల క్షణిక వాదాన్ని మేళవించారు. కుండలోని భాగాలను కలుపుటకు కుమ్మరి ఏ విధంగా అవుసరమో అణుసమూహాల కలయికకు ఒకకర్త అదృష్ట శక్తి లనెడు దేవుడిని ప్రవేశపెట్టారు [పార్మెనిడీజు మార్పులేదన్నాడు హెరాక్లిటస్ అంతామార్పే నన్నాడు. ఈ రెంటెని సమన్వయ పరచటానికి డెమొక్రటస్ అణువాదం ఉదయించినది. అయితే అది దేవుడిని ప్రవేశపెట్టకండా

అణువులు సహజ చలన సిద్ధాలన్నారు.]

శంకరుడు వీరి అణుసిద్ధాంతాన్ని ఖండిస్తూ ప్రళయ కాల మందు అణుచలన ముదయించుట దురూహ్యము. అదృష్టశక్తి కారణమైనచో అది ఎక్కడ నివసించియున్నది. అదృష్టశక్తి జీవుల పుణ్యపాపములకు ఫలితముల నిచ్చునదే కాని సృష్టి, లయ సంబంధము కలదిగాదు. అణువులు నిత్యక్రియాత్మకములో నిత్య నిష్క్రియాత్మకములో కావలెను. నిత్యక్రియాత్మకములైనచో విలయమే లేదు. నిత్య నిష్క్రియాత్మకములైనచో సృష్టి అసాధ్యము.

పదార్థములు:- బౌద్ధం అన్యోన్య సంబంధ బలముననే అన్నియు అస్తిత్వము కలిగి ఏదియును స్వయం స్థితి లేనిదై యుండునని చెప్పును. కాని వీరు భౌతిక ప్రపంచం వస్తువులు స్వయంస్థితి కలిగినవి యదార్థములని నమ్మిరు దేన్నయితే చూడగలమో పేరుపెట్టిపిలువగలమో తెలుసుకోగలమో అదే పదార్థం పద+అర్థము- తెలిసికొన దగిన అర్థము. సకలానుభవ విషయము లన్నియు పదార్థములే పదార్థములు ఏడు విధములని చెప్పిరి. 1. ద్రవ్యము, 2. గుణము, 3. కర్మ, 4. సామన్యము, 5, విశేషము, 6. సమవాయము, 7. అభావము. ఇందులో ద్రవ్యగుణకర్మలు యదార్థ స్థితి కలిగినవి మిగిలినవి బుద్ధి వ్యాపారములు అస్తిత్వముకల దానికి కొన్ని లక్షణము లుండును. కొన్ని లక్షణములు కలిగియుండునప్పుడే ఒకటి స్థితి కలదం దురు. ద్రవ్యములున్నవి. అవి గుణములను కలిగియున్నవి. గుణాల వలె కర్మకూడా ద్రవ్యాన్ని ఆశ్రయించే యుండును. గుణాలు నిత్యలక్షణము లైనవి కర్మ అనిత్య లక్షణమైనది.

కర్మ:- కర్మ అనగా చలనము ఇది జగత్తులో అవినాశమైన లక్షణము, ఇదొక స్వతంత్ర పదార్థము ఐదురకాల చలనాలను అంగీకరించారు, ఊర్ధ్వ చలనము (పైకిపోయేచలనము) క్రిందకు పోయే

చలనము, సంక్షిప్త చలనము అనగా ముడుచుకొనుట, వ్యాకోచ చలనము, సాధారణ చలనము (కదులుట).

సామాన్యము:- అనేక వస్తువులలో నొకే గుణమున్నచో అది సామాన్యమగును. సామాన్యం అనేది ఒక జాతికి వర్తిస్తుంది. మానవత్వం అనేది మనుషులందరికీ ఉండే సామాన్య గుణం గోవులలో గోత్వం సామాన్యం ప్లేటో వలె వ్యక్తులకంటె, గోవులకంటె గోత్వం, మానవత్వం నిత్యమైన వన్నారు. కావున సామాన్యమనునది నిత్యమైన స్వతంత్ర పదార్థము.

విశేషము:- వస్తువులు అన్యోన్యమెట్లు భిన్నములో విశేషమువల మనము తెలుసుకుందుము. ఏ విశేషమైన గుణం ఉండటంవలన ఒక వస్తువు మరొక వస్తువుకంటె భిన్నంగా కన్పిస్తుందో అదే విశేషము. గోవులమందలో ఎర్ర ఆవు వేరు, తెల్ల ఆవు వేరు, ఇక్కడ ఎర్ర తెల్ల, అనునవి విశేషములు.

సమవాయము:- అవినాభావసంబంధము కలిగి, అన్యోన్యాధారభూత సంబంధముచే కలిసియున్న సమవాయ సంబంధమున్న దందురు. జీవునియందు ధర్మము సుఖము ఉన్నవి. కాని అవి పరస్పరాధార భూతములు కావు నేలపై పండుఉన్నది. అది నేలకు పండుకు మధ్య సంయోగము సూచిస్తాందేగాని సమవాయము కాదు. చెట్టు కొమ్మన పండుఉన్నది. అదిసమవాయ సంబంధము. ద్రవ్యానికి-గుణానికి, చలనము - చలించు వస్తువునకును, వ్యక్తికిజాతికి. పూర్ణమునకు-దాని అంశలకు, కారణ-కార్యములు మధ్య సమవాయ సంబంధముండును. విభాగము వలన సంయుక్తవస్తువులు విడిపోవును, సమవాయ సంబంధము నిత్యమైనది. సమవాయ సంబంధముగల వస్తువులు నశించుటవలనగాక మరెన్నడు విడిపోవు ఉదా: ఎర్రని కుండ. ఎరుపుకు కుండకు మధ్యగల సంబంధము సమవాయ సంబంధం.

అభావం:- ఇది రెండురకాలు ఒకటి మరొకదాంట్లో లేదు అని చెప్పటం సంసర్గాభావం. ఒకటి మరొకటికాదు అని చెప్పటం అన్యోన్యాభావం. సంసర్గాభావం తిరిగి మూడురకాలు. ప్రాగభావం ప్రధ్వంసాభావం అత్యంతాభావం 'ఇటుకలతో ఇల్లునిర్మించబడినది' అనే వాక్యార్థం చూద్దాం ఇల్లు ప్రస్తుతానికి లేదు భవిష్యత్ లో నిర్మించబడుతుంది. కనుక ఇంటియొక్క అభావానికి మొదలు లేదు. కాని ఇల్లు నిర్మింపబడిన తర్వాత (ఇల్లు లేదు అనే అభావం) అంత మౌతుంది. ఇది ప్రాగభావం.

''ఒక కూజా ముక్కలై పోతుంది.'' కూజా ముక్కలు కాగానే అభావం ప్రారంభమౌతుంది. ఈ అభావానికి మొదలు ఉంది కాని తుది లేదు. కావున ఇది ప్రధ్వంసాభావం.

''గాలిలో రంగు లేదు'' భూత భవిష్యత్ వర్తమాన కాలంలో ఎన్నడూగాలిలో రంగుఉండదు. ఈ అభావం శాశ్వతం. ఇది అత్యంతాభావం.

అభావాన్నికూడా ఒక ప్రత్యేక ద్రవ్యవిషయంగా పరిశీలన జరపటం వైశేషికుల ప్రత్యేకత. అభావం అంటె అర్థము ఒకటి లేక పోవటము.

గుణము:- గుణము ద్రవ్యమందుండును. ద్రవ్యాశ్రితం. స్వత సిద్ధంగా ఉండలేదు. ద్రవ్యము లేక గుణములు లేవు. గుణములు స్థిరములైనవి, నిత్యములైనవి, ఇరువదినాలుగు రకములైన గుణములు గుర్తించిరి. రూపము, రసము, గంధము, స్పర్శ, సంఖ్య, పరిమాణము, పృథక్త్వము, సంయోగము, విభాగము, పరత్వము అపరత్వము, బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నం, గురుత్వం, ద్రవ్యత్వం, స్నేహము, ధర్మం, అధర్మం, శబ్దం, సంస్కారములు మొదలైనవి.

ద్రవ్యము:- గుణకర్మలను తనలో కలిగియుండి తనతో సమా

నాస్తిత్వ కారణరూపమైనదే ద్రవ్యము. అది గుణముల కాధార మైనది. గుణములు ద్రవ్యముతో సమవాయ సంబంధము కలిగి యుండును. ఇతర పదార్థములు సామాన్య విశేష సమవాయ అభావములకు గుణములులేవు గుణములకు ద్రవ్యము ఆధారము కాని ద్రవ్యమునకు గుణములు ఆధారము కాదు ద్రవ్యములు 9 రక ములని విభజించిరి.

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, దేశము Space కాలము, మనస్సు, ఆత్మ మొ॥ నవి. ఇందులో భూమి, నీరు, రూప రస-స్పర్శ గుణములను కలిగియున్నవి. అగ్ని, రూప-స్పర్శ గుణాలను కలిగిఉన్నది వాయువు స్పర్శ గుణాన్ని మాత్రమే కల్గి యున్నది. ఆకాశం శబ్దగుణాన్ని కలిగియున్నది. చతుర్భూతముల కలయికకు తోడ్పడిన అణుసమూహాలు శాశ్వతమని, చతుర్భూత ములద్వారా ఏర్పడిన వస్తువులు అశాశ్వతమన్నారు. దేశ కాలా కాశములు సర్వ వ్యాప్తి కలవియు, అత్యధిక పరిమాణము కల్గి సర్వద్రవ్యముల కవకాశ మిచ్చునవియై యున్నవి.

విశ్వవ్యాప్తమైన కాలము ఏకము, నిత్యమైన అవిచ్ఛిన్న ద్రవ్యము, వ్యవహారిక కాలములైన సంవత్సరములు ఘడియలు కల్పితములు. అది సంచలనములకు కారణమగు విశ్వశక్తి కాదు. సర్వసంచల నములకు అది ఆధారము మాత్రమే. వస్తూత్పత్తి, స్థితి, వినాశ ములవంటి ప్రకృతి పరివర్తనములకు ముఖ్యావసరరూపం అనంతర వైశేషికులు నైయాయికులు దానిని అనుభవరూపముగా భావించిరి. కాలము ఒక విధముగు అనుభవ మనియు దర్శింప బడిన వస్తువు యొక్క లక్షణముగా నది గోచరించుననియు తలచిరి. వస్తువులు కాల వశమున చరించుచు దేశవశమున స్వస్థానముల నిలుచు చున్నవి. ఆకాశము నిష్క్రియము. మూర్తములైన వస్తువు లన్నియు అందు నిబద్ధములై యున్నవి.

ఆత్మ విషయములో ఇమ్ఫురిభావం ఒకటే భౌతిక పదార్థము లకుభిన్నంగా ఉంటుందన్నారు. ఉపనిషత్తుల ఆత్మ సర్వస్వం, సదా చైతన్యం. వీరి ప్రకారం ఆత్మ అన్నివేళలా చైతన్యంగా ఉండదు. శరీరంతో సంబంధాన్ని కలిగి యున్నప్పుడే చైతన్యంగా ఉంటుంది అప్పుడుకూడా దీర్ఘ నిద్రావస్థలో ఆత్మ చైతన్యరహితంగా ఉంటుందన్నారు. ఆత్మ యదార్థమైన ద్రవ్యం. దాని గుణములే కామ, ద్వేష, సంకల్ప, సుఖ, దుఃఖజ్ఞానములు 'నే' నను విషయమే ఆత్మ (ప్రత్యక్ష ప్రమాణము). గత భిన్నానుభవములన్నియునా వే అను జ్ఞానము వలన ఆత్మ అవిచ్ఛిన్నత తెలియుచున్నది. ఆత్మ లేదనువారికి ప్రతిజ్ఞానక్రియయు వేరై గత స్మరణము అసంభవము కావలెను. బౌద్ధులు చెప్పునట్లు ఒకజ్ఞానక్రియ వేరొకజ్ఞానక్రియను స్మరించును అన్నచో ఒకరి దేహము ఇంకొకని దేహానుభవములను స్మరించు వంటివియు లేదా పొందుట వంటిదియే నగును. శరీరమే ఆత్మ అనిగాని విజ్ఞాన మని గాని చెప్పరాదు. విజ్ఞానము శరీరము నకు ముఖ్య గుణమైనచో విజ్ఞానములేని శరీరములు ఎన్నడు వుండ రాదు. కాని శవములకు శరీరమున్నది, విజ్ఞానములేదు. పోనీ విజ్ఞానము దేహగుణమైనచో అది ఇతరులకు గోచరించవలెను దేహాతీతములగు నాత్మ లేకున్నచో నైతిక నియమావళియు వ్యర్థమగును.

మనస్సునకు భావములకు ఇంద్రియములకు శరీరమునిలయము. ఆత్మ మనస్సనియు చెప్పరాదు. ఏలన ఆత్మ మనస్సు నొక సాధనముగా ఆలోచించుటకుపయోగించును. దేహమువలనే మనస్సును అణు కల్పిత మగుటచే అది ఆత్మ కాజాలదు. ఆత్మ ఒక్కటే కర్త ద్రష్టమునై యున్నది. ఆత్మ నిత్యమైనది అనంతమైనది. పునర్జన్మ నంగీకరించిరి. ఆత్మకు దేహముతోడి సంయోగము జన్మమనియు, వియోగము మరణమనిరి. జీవులసంఖ్య అనంతము జీవులలో భిన్న

త్వముఃనకు కారణము పూర్వకర్మానుగతమైన దేహాభిన్నత్వమే. మోక్షమనగా విజ్ఞానక్రియా రాహిత్యము. దేహము, మనస్సు, బుద్ధి, ఇంద్రియములనుండి ఆత్మ విడివడుట వైశేషికులు మోక్షావస్థలో జీవి గుణావస్థా రహితమై నిర్మలాకాశమువలె, సర్వగుణ విముక్తి పొందియుండునన్నారు. నైయాయికుల ననుసరించి మోక్షావస్థ జ్ఞానానంద భరితము. యోగాభ్యాసంవలన అతీంద్రియ శక్తులు కల్గునన్నారు.

వైశేషికులు దేనికి హేతువు లభింపలేదో దానికి కారణము అదృష్టమనిరి. ఇనుము నయస్కాంతము ఆకర్షించుట వాయుసంచార లక్షణము అణువుల ప్రాథమిక చలనము, అగ్నిజ్వాల ఊర్ధ్వగమనము మొదలగువాటి కన్నిటికి అదృష్ట శక్తులే కారణము. అనంతర వైశేషికులు ఈశ్వరాస్తిత్వము నంగీకరించిరి. ఈశ్వరుడు అదృష్ట శక్తి ద్వారానే తనసంకల్పము నేనవేర్చునని చెప్పిరి. ప్రళయంలో కూడా జీవాణువులు పదార్థాణువులు ఆత్మాణువులు నశించవు. ఇవి ఈశ్వరునికిసైతం అతీతాలు. తిరిగి జీవులక్షేమాన్ని కోరి జగత్తును సృష్టిస్తాడు కర్మనియతి ననుసరించి లోకములో దుఃఖము నుంచినాడనియు. దుఃఖము హేయపదార్థముః కాదనియు, అదిలోకజ్ఞాన హేతువని సమర్థించిరి. కొన్ని నియమాలను కల్పించి ప్రపంచాన్ని యంత్రమువలె చేసినాడు ప్రపంచము ఆ నియమాల ప్రకారం సాగుతుంది. కాని తానెట్టి జోక్యం చెసుకోడు చేసుకోలేడు చేసుకుంటె తన నియమాలను తానే ఉల్లంఘించి నట్లవుతుందికదా?

<u>న్యాయుల జ్ఞాన సిద్ధాంతము</u>:- సమస్తమైన జ్ఞానం ముఖ్యంగా అనుభవజ్ఞానం. భ్రాంతి జన్యమని భావ వాదులందరూ చెబుతారు, యథార్థ వస్తు ప్రపంచాన్ని అంగీకరించినందువల్ల, దీనిని నిరాకరించటానికి, జ్ఞానం ఎప్పుడు ప్రామాణికంగా ఉండేది. ఎప్పుడు అప్రామాణికంగా ఉండేది. వివరించడానికై వీరు ప్రమాణ

శాస్త్రాన్ని నిర్మించతలచారు. జ్ఞానం దానంతటఅది ప్రామాణ్యమూ కాదు. అప్రామాణ్యము కాదు దాని ప్రాముఖ్యం. ఖావాన్ని న్నం చేసిన పరిస్థితులకు బాహ్యంగా ఉన్నవాట్టిపై ఆధార పడి ఉంటుంది. జ్ఞానము నిర్దుష్టమో దోషయుక్తమో ప్రమాణము వలన తెలియును. మనము విషయ స్వరూపము పరిశీలించుటకు ముందు మనకు గల జ్ఞానోప కరణముల సామర్థ్యమును తెలిసికొన వలెను. మనకు జ్ఞానము ఈ 4 ప్రమాణముల మూలమున తెలియు చున్నది. ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, ఉప మాన ప్రమాణము, శబ్ద ప్రమాణము

<u>ప్రత్యక్ష ప్రమాణము –</u> ఎట్టఎదుట గోచరించునది ఇంద్రియ దర్శనము చే లభించునది పంచేంద్రియములైన శరీరము, నేత్రము, చెవి, నాలుక, ముక్కులచే విషయము తో ప్రత్యక్ష సంపర్కము వలనలభించు జ్ఞానము నిర్దుష్టము, సుస్పష్టమని గౌతముడు నిర్వ చించెను. మనస్సు శరీరమున కందుబాటులో లేనపుడు జ్ఞానము లేదు. దర్శనమునకు మనస్సు ముఖ్యాధారము. శబ్దము గాలిలో పయనించి చెవితో సన్నివేశము పొందును. జీవాత్మ దేహ మంతయు వ్యాపించి యుండును కావున అదియు శబ్దముతో సాంగ త్యము పొందును. ఒకటికంటె ఎక్కువ ఇంద్రియములకు వాని విషయములతో ఏక కాలమున సంపర్కము కల్గినప్పుడు అన్ని విషయముల దర్శనములు ఏక కాలమున ఉండవు. ఏలన మనస్సు ఒక విషయ సంపర్కముపై పనిచేయుచునప్పుడు ఇతర విషయ సంపర్కములు పని చేయవు. కాని దృశ్యములు వేగముగా ఒకటి వెనుక నొకటి దర్శింపబడుచుండుటచే, దృశ్యములన్నియు ఏక కాలముననే దర్శింపబడినట్లు భ్రాంతి జనించును. మనము ఒక గుండు సూదిని కాగితపు దొంతరలో గ్రుచ్చినప్పుడు, అన్నిటిని ఒకే సారి గ్రుచ్చితి మని భ్రమింతుము కాని నిజమునకు సూది

ఒకటి వెనుక నొకటి గ్రుచ్చుచున్నది. కావున మనస్సు ఒక ఇంద్రియముతో కలసియున్నప్పుడు ఇంకొక దానితో కలిసి ఉండ లేదు అందుచే మనస్సు అణుమాత్ర పరిమాణము కలిగి ఉన్నదని చెప్పిరి. అట్లుగాక సర్వవ్యాపకమైనచో నేకకాలమున అన్ని ఇంద్రియములతో సంయోగము పొందలేకుండుటకు కారణము లేదు. అంతరంగిక విషయములగు ఊహలను వాంఛలను దర్శించునది. తెలుపనది మనస్సే కనుక వాత్స్యాయనుడుకూడా ఇంద్రియములలో చేర్చినాడు. ప్రతి జీవాత్మకు ఒక విశిష్టమైన మనస్సు కలదు. అది నిత్యము, సూక్ష్మము, పరిమాణశూన్యమైనది. ఒక ముద్రిక యొక్క ఆకృతి లక్కపై ఎట్లు ముద్రితమగునో అట్లే బాహ్య వస్తు రూపము మనస్సుపై ముద్రిత మగునని తెలుపబడెను

ఒక దర్శన మేర్పడుటకు దర్శించు వానికి బాహ్యముగా వస్తువులుండవలెను. వస్తువును చూచునప్పుడు వస్తువును దాని గుణమును వేర్వేరుగా చూడజాలము. ఎర్రనికుండ, ఇక్కడ కుండ ఎరుపురంగును ఒకేసారిచూస్తాం నేత్రము, శ్రోత్రము తమ విషయములతో ప్రత్యక్ష సంయోగము పొందకున్నను దూరమున నుండు వస్తువులను చూచునని బౌద్ధులు చెప్పిరి. నేత్రేంద్రియ మనగా కనుగ్రుడ్డు మాత్రమే కాదనియు, నందలి తేజస్సు అనియు అందుండి ఒక కిరణముపోయి విషయముతో సంయోగము నొందుననియు, అందుచేతనే దర్శనమందు దిక్కు, దూరము స్థానములు తెలియుచున్నవని వీరు చెప్పిరి. వస్తు దర్శనము ఇంద్రియ-విషయ సంయోగమువలనే లభించును. నిద్రించువాడు కరతాళధ్వని విని లేచును. ఇది అప్రయత్న వ్యాపారము, అందుచే దీనికి కారణము అదృష్టమనిరి.

ఒక వస్తువును దర్శించునప్పుడు అది నామ సహితముగా తెలియ నవసరము లేదు. నామము వ్యవహార వినియోగము

మాత్రమే ఒక పండును చూస్తాం, అది ఒక పండు అని మాత్రమే తెలిస్తుంది. దాని పేరు మనకు ఇంతకుముందే తెలిసియుండినచో మనకు నామ సహిత దర్శనము కల్గును. నామరహిత దర్శనమును నిర్వికల్పక దర్శనమనియు, నామసహిత దర్శనమును సవికల్పక దర్శనమనిరి. నామార్థ జ్ఞానమున్న వారికైనను మొదట నిర్వికల్పక దర్శనము కల్గి, పూర్వమెరిగిన నామము అంతరంగమునుండి బహిర్ముఖమైనప్పుడు అది సవికల్పక దర్శనమగును ఈ విధముగా దర్శనమును రెండుగా విభాగించినప్పటికి, మొదట దర్శనము, తర్వాత భావము, తర్వాత నిర్ణయము కలుగుటను చెప్పు జైనసోపానవాద దర్శనసిద్ధాంతమునకు వీరు పాల్పడలేదు

మనకు అనుభూతమైన ఒక వస్తువును గూర్చి మనమేమైనా చెప్పబోవు నాక్షణముందే దాని నొకవేరు వస్తువుతో సంబంధము గూర్తుము. అప్పుడా వస్తువు దాని స్వభావమును గొంతకోల్పోయి బుద్ధి కల్పనాచ్ఛాదితమగుచున్నది. మనము విన్నది రొదయే అంతే సత్యము అది తుమ్మెద రొదయో, ఆవిరి యంత్రనాదమో అనునది మన ఊహ. సవికల్పక దర్శనములో మనము సత్యవస్తువునకు రూపాంతర కల్పనము చేయుదుము. అందుచే అది అసత్యమని బౌద్ధులు చెప్పుదురు. కాని సవికల్పక దర్శనము స్వతః నిర్వికల్పక దర్శన జాతికే చెందినదని వీరు అందురు. సంబంధములు శూన్యమునుండి హఠాత్సంభవములు కావు. అవి నిర్వికల్పక దర్శనములో గర్భితములైయున్నవి. సవికల్పక దర్శనమందు అవి సువ్యక్తమగును. పూర్వస్మృతులున్నంత మాత్రమున ఇంద్రియ వ్యాపారమున కాటంకము కలుగదు. నిర్వికల్పక దర్శనముచే గ్రహింపబడు దానిని సవికల్పక దర్శనము మరల గ్రహించుటచే అది అసత్యము కానేరదు. సామాన్య విశేష లక్షణముల జ్ఞానము నిర్వికల్పక దర్శనమందు అస్పష్టముగాను, సవికల్పక దర్శనమందు సుస్పష్ట

ముగా నుండును. వ్యక్తి గతలక్షణముకంటె, వస్తుసామాన్య లక్షణమును ప్రత్యక్ష దర్శనములో గ్రహించుచున్నాము కనుక నిత్యమైనది.

మనస్సు అన్యథా వర్తించుచున్నప్పుడు లేదా జీవాత్మ భావోద్రిక్తమైయున్నప్పుడు భ్రాంతి దర్శనముండును భ్రాంతిహేతువులు. మూడు రకములు (1) ఇంద్రియదోషము - చూపుసరిగ్గా లేకుండుట, కలుషితనేత్రము మొ॥నవి. (2) సంప్రయోగదోషము. ఒక వస్తుభాగమే గోచరించుట (3) సంస్కారదోషము-మానసిక వ్యాపారదోషము అనవసరమైన స్మృతులు సవ్య దర్శనమును నిరోధించట మనము ఒక రజ్జువును చూచునప్పుడు పూర్వ సర్ప స్మృతి వలన సర్ప భ్రాంతి జనించుచున్నది.

స్వప్నములు జీవాత్మకు, మనస్సుకు సంయోగము కలిగి పూర్వానుభవముయొక్క ఆంతరంగిక సంస్కారముల సాయమున కల్గునని కణాదుని అభిప్రాయము. ఇంద్రియములు నిద్రావశములై నిర్వ్యాపారములై మనః కల్పితములగు నాంతరంగిక దర్శనముల వలన కల్గునని ప్రశస్తపాదు నభిప్రాయము పూర్వజ్ఞాన సంస్కారము వలనను, దేహారోగ్య అవస్థల వలనను, అదృష్ట శక్తుల వలనను స్వప్నములు జనించునని చెప్పబడెను. నవ్యన్యాయులు లౌకిక, అలౌకిక ప్రత్యక్షాలను అంగీకరించారు. అలౌకిక దర్శనమే యోగదర్శనము గాఢాంధకారములోని వస్తువులను కూడా పిల్లులు చూడగలవు. అనవరత ధ్యాన సాధనముచే మనము ఇంద్రియాతీత దృష్టిని వికసింప చేసుకొని, తన్మూలమున పరోక్ష వస్తువులను గతభావిదశలను దర్శింపవీలగును ఇట్టి యోగదృష్టి యోగులకు సహజమైనది. యోగదృష్టిలో దోషరహిత పూర్ణజ్ఞానముండును.

<u>అనుమాన ప్రమాణము</u> :— మనము కొన్ని సార్లు నిప్పును-పొగను సంబంధముకలదిగా చూచియుండుటచే ఎప్పుడైనా పొగను చూచి

నచో నిప్పుఉండి ఉంటుందని అనుమానిస్తాము దీనినే అనుమాన ప్రమాణమందుము మేఘములను చూచి వర్షించునని తెలుస్తాము ఇక్కడ కారణము చూసి కార్యమును ఊహిస్తాము. పొంగిన ఏటిని చూచి వర్షము కురిసియుండు ననుకొందుము. ఇక్కడ కార్యమును చూసి కారణమును ఊహిస్తాం కొమ్ములుగల జంతువునుచూచి దానికి తోక ఉండునంటాము. ఇది అనుభవ సామాన్యముపై ఆధారపడియున్నది. గ్రీకుల బౌద్ధుల తర్కములో మూడు వాక్యములేయుండును.

1. ఎక్కడ పొగఉంటుందో అక్కడ నిప్పు ఉంటుంది — సాధ్య
2. ఆ కొండమీద పొగ కన్పిస్తున్నది - పక్ష
3. కనుక ఆ కొండమీద నిప్పుఉన్నది - నిగమనము

కాగా వీరి తర్కములో 5 వాక్యములుంటాయి

1. కొండమీద నిప్పుఉన్నది - ప్రతిజ్ఞ
2. పొగవచ్చుచున్నది కనుక — హేతువు
3. ఎచట నిప్పుఉండునో అక్కడ పొగఉండును - ఉదాహరణము
4. కనుక ఆ కొండమీద పొగ నిప్పుతో కూడియుండాలి - ఉపనయము
5. కావున కొండమీద నిప్పుఉన్నది - నిగమనం

యుక్తముగు అనుమానహేతువు, ఉదాహరణములపై ఆధారపడియుండును. దర్శింప పడు విషయము హేతువు. సర్వ సామాన్య ధర్మము లేక ప్రతిపాదన ఉదాహరణ. ఈ రెండు యదార్థములు కానిచో అనుమానము కూడా యదార్థము కాజాలదు. సామాన్య ప్రతిపాదన ఎట్లు లభించును. నిప్పుఉన్న చోటులందెల్ల పొగచూచినచో చాలదు, నిప్పులేని చోటులందెల్ల పొగలేదనియు చూడవలెను. ఎర్రగా కాలియుండు ఇనుము నందు నిప్పుఉన్నది కాని పొగలేదు. తడి కర్రతో కూడిన

నిప్పునకు మాత్రమే పొగ ఉండును. సిద్ధాంత నిర్ణయములకు అవుసరమైన ఉదాహరణములను ఎల్లప్పుడు ప్రకృతి మనకివ్వజాలదు. అందుచే వ్యతిరేక సాక్ష్యమునకు అవుసరమగు తర్క పద్ధతిని కూడా ఉపయోగించుకోవచ్చునని చెప్పిరి.

1) అగ్ని తప్పనిసరిగా పొగననుసరించి యుండ నక్కరలేదు

2) కాని పొగకు అగ్నియే కారణమని అంగీకరింప తప్పదు.

ఉపమానము — ఇదివరకు మనకు బాగుగా తెలిసిన ఒకవస్తువుతో పోల్చుటవలన మనకు కలుగు సామ్యముచే మనకొక వస్తుజ్ఞానము నిచ్చునది ఉపమానము. గవయ మొకగోవువలె నుండునని విని దానిని చూసినప్పుడు గవయమని తెలుసుకొందుము.

శబ్దప్రమాణము: — మనము చూడనట్టియు, పరీక్షింపనట్టియు పనేక విషయములను జ్ఞానులైన ఇతరుల వాక్ప్రమాణముపై నాధారపడి అంగీకరింతుము. దీనినే శబ్దప్రమాణమందురు. విశ్వాసము దీనికి మూలము గ్రంథములలోని విషయములుకూడా దీని క్రిందకే వచ్చును.

సందేహము: — దర్శనలోపము దర్శనాభావలోపముచే నిది కల్గును. మనము చూచిన లక్షణము పెక్కు వస్తువులతో సంబంధము కలిగి యుండుటచే రెండురకముల భావముల నుదయింపచేయును. అదియే సందేహ కారణము. రెండు భావములలో ఒక భావము వదలివేసి మనమొక భావముపై మనస్సు త్రిప్పినచో దానినుండి ఊహ లభించును. సందేహావస్థలో ఊహకు ఎక్కువ ప్రాబల్యముండును. మరపుకూడా ఒక సందేహావస్థ అని చెప్పపడెను. సందేహము అన్వేషణకు ప్రోత్సాహజనకము. ఏలన అది మనకు తెలియని దానిని తెలియుకోర్కె కల్గించును.

తర్కము: — తర్కమునందు మనమొక వ్యతిరేక ప్రతిపాదనముతో నారంభించి దానివలన నెట్టి దోషములు సంభవించునో

చూపుదుము ఉదా:- ఆత్మ నిత్యము కాకున్న యెడల అది పూర్వ కర్మఫల మనుభవింపజాలదు. పునర్జన్మ లేకదగును. మోక్షము నొందజాలదు. అందుచే ఆత్మ నిత్యము ఇది పరోక్షజ్ఞానమార్గము వీరుతర్కములో వివిధ పద్ధతులను కూడా వివరించిరి.

జల్పము:— అవతల వ్యక్తిని ఏదో ఒక విధంగా ఓడించవలెనని చేసేవాదన.

వితండము:- తన వాదాన్ని చెప్పక, ఎదిరి వాదాన్ని ఖండించి, తద్వారా తనవాదం సరియైనదని ప్రకటించుట.

హేత్వాభాసము:— పైకి సకారణంగా కన్పించినా వాస్తవానికి అకారణమైనది.

ఛలము:— ఒకమాటను ఎదిరి ఒక అర్థంలో వాడగా నీవు మరొక అర్థంలో వాడి ఖండించటం.

జాతి:— ప్రశ్నను దాటవేసి సమాధానము ఈయడము.

నిగ్రహస్థానం:— ఓటమికి కారణ భూతమైన పొరపాటు అవగాహన.

కారణ కార్యవాదము:— బౌద్ధులు భిన్న కారణముల కలయికతో ఒక కార్యమేర్పడు నని చెప్పి కారణ నానాత్వము నంగీకరించిరి. వీరు ఒక కార్యమునకు ఒకే కారణము ఉండునందురు. కానిచో అనుమానప్రమాణము జ్ఞాన ప్రమాణము కాజాలదు. ఉదాహరణమునకు పొంగిన ఏటికి రెండుకారణముల నూహింపవచ్చును. 1) వర్షము కురిసియుండుట 2) కట్టతెగిపోయియుండుట. వీరు మన పరిశీలనాలోపము చే భిన్న కారణముల నూహించుచున్నా మందురు కార్యమును సునిశితముగా పరిశీలించినచో నిజమైన కారణమును తెలుసుకొనగలము. వర్షముచే పొంగిన ఏటికిని, కట్టతెగి ప్రవహించు ఏటికిని మనం భేదం గుర్తించగలము. వర్షప్రవాహము వేగమెక్కువై, బురదనీటితో, సుడులుతిరుగుతూ, వృక్షఫలశాఖా

దిశములతో నుండును. కావున కార్య విశేషమునుబట్టి నిజమైన కారణమును గ్రహింపవచ్చునందురు. కుమ్మరి కుండకు ప్రధాన కారణం దండచక్రాదులు సహకారులు మాత్రమే. దర్శనక్రియలో ద్రష్టము, దృశ్యము రెండును అవుసరములే కాని ముఖ్య కారణము ఇంద్రియ-విషయ సంయోగము. ఏది లేకున్న నిశ్చిత కార్య సిద్ధిలేదో అదే కారణము. భౌతికజగత్తులోని పరివర్తనములన్నియు అంశాసంయోగ వియోగములచే ఏర్పడుచున్నవి. ప్రకృతిమూల ద్రవ్యము మార్పుచెందదు కాని సంయోగ వియోగాది పరివర్తనములు ప్రతిక్షణము మార్పుచెందుచుండును. ఇది కార్యము ఉద్భవించుటకు ప్రధాన హేతు వగును. అనంతర న్యాయులు కార్యము ప్రాగభావ ప్రతియోగియని నిర్వచించిరి.

నూనెగింజలో నూనెఉన్నది. లేనిచో నూనెగింజలను మర్దించినపుడు ఇంకేమైనా రావచ్చుగదా! కనుక కారణమందు కార్యము సూక్ష్మరూపమున నున్నదని సాంఖ్యులు, వేదాంతులు చెప్పుదురు. సాంఖ్యులు కారణ కార్యములు అభేదములనిరి. ఏది లేదో అది ఎన్నడూ ఉత్పత్తి నొందజాలదు. మనమెంత ప్రయత్నించినను నీలిరంగును పసుపురంగుగా మార్చలేము. నూనెయు నూనెగింజలు కలిసియున్నట్లే కారణము నిత్యము కార్యముతో కలిసియుండును. లేనివస్తువులతో సంయోగము అసాధ్యము కావున కార్యము కారణ మందుండక తప్పదు.

కాని వీరు కార్యము, కారణము వేరు వేరు. కార్యము కారణమందు పూర్వముండదు. అదిక్రొత్తగా ఉదయించును. దీనినే అసత్కార్యవాదము లేదా ఆరంభవాదము అని అంటారు. పరిణామంలో క్రొత్త గుణాలు గల వస్తువులు ఏర్పడుతుంటాయి. ఇలా ఏర్పడటానికి వస్తువుల మధ్యగల సమవాయ సంయోగ సంబంధాలే మూలకారణాలు. జడపదార్థంలోనుంచి చైతన్యం

క్కలాగే ఏర్పడుతుంది. ఆరంభవాదం గుణాత్మకమార్పును అనగా పురోగమనాన్ని అంగీకరిస్తుంది. సత్కార్యవాదంవలె క్రొత్తదనాన్ని నిరాకరించదు. పూర్ణము తదంశలసముచ్ఛయము కాదు. పూర్ణము తదంశలకంటె వేరైనది అని వీరంటారు. కారణ కార్యములు అభేదములైనచో కారణము ఎంత స్థలము నాక్రమించుచున్నదో. కార్యమును అంతే స్థలము నాక్రమించవలెను వస్తువులు నిత్యము నూత్నముగా ఉదయించి నశించుచున్న ప్రకృతి సత్యమును కాదనుటకు అవకాశము లేదు, పాలు పెరుగుగా మారినప్పుడు పాలు మార్పునొందినవేగాని నశించలేదని చెప్ప వీలు లేదు కారణ కార్యములకు భేదమే లేకున్నచో ఒకటి కార్యమనియు ఒకటి కారణమనియు చెప్పవీలు లేదు. ఈ రెండు వాదములును భిన్న దృక్పథములనుండి యుక్తి యుక్తములే.

<u>సత్యం:</u>— మన అనుభవంలోని వస్తుజాలము కేవలము దృశ్యపరంపరమే వస్తువులను కూర్చిన క్షణిక భావములే యున్నవను బౌద్ధ సిద్ధాంతమును వీరంగీకరింపరు. దర్శన మనగా మనము చూచు వస్తువెదుటనుండవలెను. వస్తువు ద్రష్టయొక్క అనుభవముతో నిమిత్తము లేకుండా స్వతంత్రమైనదియైయుండును. మన అనుభవమునకు ఆధారము వస్తువుగాని, వస్తువు అస్తిత్వమునకు మన అనుభవము ఆధారము కాదు. క్షణకాల దృశ్యములున్నచోట క్షణికత్వము నంగీకరింపగలముగాని లేనిచోట అనగా శిలలు, కుర్చీలు మొదలగు వానియందు క్షణికత్వము నంగీకరింపలేము. సకల వస్తువులు నిత్యము లనుభావముకూడా దోషయుక్తమే ఏలన వస్తువుల ఉత్పత్తి వినాశములను చూచుచున్నాము.

జ్ఞానేంద్రియాలు సరియైన జ్ఞానాన్ని ఇస్తాయన్న నమ్మకమేమిటి అని అద్వైతులు ప్రశ్నిస్తారు. కలలోకొన్ని వస్తువులు కనబడుతాయి. జాగ్రదావస్థలో అవన్నీ అసత్యాలని తేలు

తున్నాయి. అలాగే సమాధి అవస్థలో జాగ్రదావస్థలోని మన జ్ఞానం మిథ్య అని అసత్యమని తెలుతుందని కావున బాహ్య ప్రపంచం మిథ్య అని వారు అంటారు. దానికి వీరు సమాధి ఏ కొద్ది మందికో చెందినది. అది నిజమో లేక వారి భ్రమ జనితమో చెప్పలేము. అట్టి సమాధిని ప్రాతిపదిక చేసుకొని జాగ్రదావస్థను నిరాకరించటంతప్పు; అంతేకాక కలలో ఏనుగు కన్పిస్తుంది. ఏనుగు అనేది అసత్యం కాదు కలలో చూసిన ప్రతిబింబాన్ని ఆ సమయంలో నిజమని నమ్మిన నీ చిత్త విభ్రమం అసత్యం. జాగ్రదావస్థ రాగానే ఆ చిత్త విభ్రమం తొలగి పోతుంది

వీరు జ్ఞానసిద్ధాంతంలో వాస్తవిక దృష్టిని ప్రదర్శించారు. సత్యానికి గీటురాయి, ఆచరణ ప్రవృత్తి సామర్థ్యం. ఈ సూత్రమే ఆధునిక ప్రాగ్మాటిజంకు పునాది. మనకు గోచరించుచున్న వస్తు గుణములు సరియైనవేనని మనము వెంటనే నిశ్చయింపజాలము. సూర్యుడు కదులుతున్నట్లు మనకు కన్పిస్తుంది, నిజానికి కదులుట లేదు, భూమి నిశ్చలంగా కన్పిస్తుంది. నిజానికి తిరుగుతుంది. కావున సర్వదర్శనములు సత్యమైనవని నిర్ణయించుటకు వీలు లేదు. మన జ్ఞానముయొక్క యాదార్థ్యమును వివేక పరిశీలనముతో ప్రమాణముల మూలమున నిర్ణయింపవలెను. ఒకరకమైన భావం నిజమా! అబద్ధమా! అను సంశయము కల్గినప్పుడు ఆచరణలో పెట్టినప్పుడు అది సత్యమైనది కానిది తెలుస్తుందన్నారు.

ఉదా:— పంచదార అక్కడఉంది. అది ఉప్పో పంచదారో నీకు తెలియదు. నాలుకమీద వేసుకో. అది తియ్యగా ఉంటె పంచదార లేకపోతే ఉప్పని తెలుస్తుంది కదా! ఆచరణద్వారా నీ నిర్ణయము నిజమో అబద్ధమో తెలుస్తుందికదా మనము జలమును చూచి దగ్గరకు పోయినప్పుడు దాహము తీర్చినచో మన జలజ్ఞానము సత్యము, లేనిచో అది ఎండమావి యగును. అసత్యమైనది కార్య

సిద్ధినొసగదు ఈ విధముగా కార్యమునుండి కారణములను గ్రహింతుము.

## సాంఖ్యము

సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషికసూత్రాలకు భారతీయ తత్వ చరిత్రలో ప్రత్యేక స్థానమున్నది. ఇవన్నీ భౌతిక వాదాలు. సాంఖ్యము అతి పురాతనమైనది క్రీ. పూ 7 వ శతాబ్దిలోనే ఆరంభమైంది. సాంఖ్య తత్వ చిహ్నాలు ఉపనిషత్తులలోను, భగవద్గీతలో కూడా దర్శనమిస్తాయి. బౌద్ధ ప్రభంజనముతో సాంఖ్యం తాత్కాలికంగా అడుగున పడ్డది. బౌద్ధంపై చేయి అయింది, అంటే బౌద్ధ తత్వ శాస్త్ర ఆదిక్యత నిరూపణ అయింది అని కాదు. బౌద్ధంలోని సాంఘిక విప్లవం, యజ్ఞయాగాదులు ఖండన, కులభేద నిర్మూలన, గతిశీలదృష్టి ప్రజల నెక్కువగా ఆకట్టుకున్నది. ఆ ప్రభంజనములో భౌతిక ప్రపంచ వాస్తవికతను బౌద్ధులు గుర్తిస్తున్నారా లేదా అను తాత్విక సమస్య అడుగున పడిపోయింది ఆ సాంఘిక విప్లవ ధోరణులు వెనుకకు తగ్గి, వాటి లోని భావవాద అవాస్తవిక తాత్విక సూత్రాలు మిగలటంతో వాటి బలహీనత స్పష్టం కాసాగింది. ఈ తాత్విక బలహీనతను ఆధారం చేసుకొని భౌతిక వాదాలైన సాంఖ్య, న్యాయ వైశేషికములు ప్రాబల్యం సంతరించుకోసాగాయి. ఈశ్వరకృష్ణుడు క్రీ పూ 100-300 మధ్య సాంఖ్యానికి గ్రంథరూప మిచ్చాడు. ప్రాచీన సాంఖ్యం దేవుని పూర్తిగా నిరాకరించింది. ప్రపంచం వాస్తవ మని, అది ఎవరిచేత సృష్టించ బడలేదని, ప్రపంచానికి మూలము అణువులని వైశేషికులు. అలాంటిసూక్ష్మ ప్రకృతి కారణమని సాంఖ్యమూ వాదించాయి. సరియైన జ్ఞానాన్ని కల్గిస్తుంది కనుక దీనిని సాంఖ్య వాదమన్నారు.

<u>సత్కార్యవాదం:—</u> ఈ కార్య కారణ వాదాన్ని సత్కార్య వాద మంటారు. నువ్వుగింజలను పిండితే నూనెవస్తుంది. నూనె ఎక్కడినుండి వస్తుంది. గింజలోనే సూక్ష్మ రూపంలోఉంది ఇప్పుడు వ్యక్తమయింది. గింజలోనూనె అవ్యక్త రూపంలోఉంది. ఇంతకుపూర్వం లేనిది క్రొత్తగా రాలేదు. అంటె కార్యము కారణములోనే ఉన్నది. అంతకు పూర్వమే కారణంలో సూక్ష్మరూపంలో ఉన్నదానిని కార్యాచరణ వ్యక్తం చేయుగలదేకాని క్రొత్తదానిని సృష్టించలేదు కావున న్యాయవైశేషికులు చెప్పు అసత్కార్య వాదం, కారణం-కార్యం వేరు వేరు అనువది తప్పు. నిర్దిష్ట కారణాలనుండి మాత్రమే నిర్దిష్ట కార్యములు ఏర్పడగలవు. పాలలో నుంచి మాత్రమే పెరుగు ఏర్పడగలదు. ఇంక దేనినుంచి పెరుగు రాదు. అంటె ఏదో ఒక రూపంలో కార్యం, కారణంలో నిగూఢమై ఉన్నదనేకదా అర్థము! కాకపోతే ఏ కారణంలో నుంచైనా ఏకార్యమైనా ఏర్పడాలికదా! పాలలోనుంచి పెరుగు మాత్రమే ఎందుకురావాలి. నూనె ఎందుకు రాకూడదు? పోనీ పెరుగు క్రొత్తగా పుట్టిందందామా అసత్తులోనుండి సత్తు ఎలాపుట్టగలదు అసత్తుకు ఉనికి లేదు. ఇంతకు పూర్వంలేనిది ఎలా పుట్టగలదు, గగన కుసుమం ఉత్పత్తికాదు శూన్యంనుండి సత్తు పుట్టలేదుకదా! కనుక సత్తు ఎల్లకాలం ఉన్నది. దానికి తుది మొదలు లేదు.

సత్కార్యవాదమునుసరించి కార్యకారణములు ఒకే వస్తువు యొక్క వ్యక్తావ్యక్త రూపములు, వస్తువు సృజింపపడదు. ఆవిష్కరింపపడుతుంది. ఎందుకంటె లేనిది పుట్టుటలేదు. సూక్ష్మరూపంలో కారణంలోఉన్నది. కార్యరూపంలో ఆవిష్కరింప పడుచున్నది. కార్యము కారణములో నున్నను దాని నావిష్కరించుటకు ఇంకొక శక్తి అవుసరము. నువ్వులను మర్దించినగాని నూనెరాదు సహకార శక్తిలోపించిన యెడల కార్యము తృప్తికాదు. ఈ సహకార

శక్తులు దేశము, కాలము, రూపము లేదా ద్రవ్యాకార విశేషము లని చెప్పిరి. సూక్ష్మరూపము, స్థూలరూపముగా నావిష్కృత మగుట కేవలము బాహ్యలక్షణ పరిణామము. కాలమువలన వస్తువు లలో కలుగు పరిణామం అవస్థాపరిణామమందురు. సర్వదేశము లందు సర్వకాలములందు ప్రపంచం మార్పులకు లోనగుచునే యున్నది

ప్రకృతి–పురుషుడు:— ప్రపంచము ముఖ్యంగా భౌతికం కాబట్టి దానికి కారణం కూడా భౌతికంగానే ఉండాలని భావించారు. వారు ప్రకృతి లేదా ప్రధానం అనే భౌతికాన్ని అంగీకరించారు. అది సూక్ష్మరూపంలో ఉంటుందనీ, ప్రత్యక్షానికి గోచరించదని చెప్పి దానిని వారి భాషలో అవ్యక్తంఅన్నారు. సర్వపదార్థములకు మూల కారణము అణువులనియు వివిధపదార్థములకు భిన్నములైన అణువు లను వైశేషికులూహించగా, సాంఖ్యులు సర్వపదార్థములకు మూలకారణమైన ప్రకృతి ఏకమనిరి. ప్రపంచము ఏక పదార్థమైన ప్రకృతినుండి జనించినదనియు, నట్టి పదార్థాములోని సూక్ష్మాంశ ముల భిన్న సంయోగములచే భిన్నాకృతులు ఏర్పడిన వని చెప్పిరి. అణువులు పదార్థ పరిణామాన్ని మాత్రమే వివరించగలవు. కాని సూక్ష్మమైన మనస్సు బుద్ధి వీని పరిణామాన్ని వివరించలేవు. కావున అణువులకంటె సూక్ష్మమైన ప్రకృతి సృష్టికి మూలము.

ఏది మూలరూపములలో అంతర్నిహితమై లేదో అది ఎన్నడు కార్యరూపమున ఆవిష్కృతము కాజాలదు. క్రొత్తది పుట్టలేదు అని వీరి సిద్ధాంతమని చెప్పియున్నాముకదా! కావున ప్రకృతి మూల కారణమై సర్వకార్యములందు సర్వవస్తువులయందు ఆవిష్కరింపబడుతున్నది. ప్రకృతికి ఇంకొక కారణము లేదు భిన్న ద్రవ్యములందుండి జనించుచున్నవి. కావున అది అది కారణము ప్రకృతియొక్క పరిణామమే ప్రపంచమనిరి. దానిని ప్రధానమని

పిలిచినందులకే. వస్తువులు, కారణజన్యములు - పరాధీనములు - అనేకములు- దేశకాల పరిమితములు- అనిత్యములు కాగా ప్రకృతి, కారణరహితము-స్వతంత్రమైనది-ఏకము - సర్వవ్యాప్తి కలిగి నిత్యము నై యున్నది. వస్తువులు అవ్యక్తరూపములలో ప్రకృతియందు న్నవి. బాహ్యప్రపంచమంతయు ప్రకృతియందు అంతర్నిహితమై యున్నది. పురుషుడు లేక ఆత్మ లేదా చేతనాశక్తి ప్రపంచమునకు కారణము కాజాలదు. ఏలన చైతన్యము ఎన్నడూ జడ పదార్థము కాజాలదు. పురుషునికి కర్తృత్వము లేదు. జీవునిలో అహంకారమే కర్త అహంకారముకూడా ప్రకృతినుంచే జనించె నని వీరు చెప్పిరి.

ప్రకృతికిగాని, బుద్ధికిగాని అహంకారమునకుగాని, జీవులకు గాని, మూడు గుణములున్నవని చెప్పిరి. అవి సత్వ, రజో, తమో, గుణములు. ప్రకృతిపరిణామము, దానియందున్న మూడుగుణముల ఘర్షణచే జరుగునని చెప్పబడెను. అనిశ్చలమైన ఈ మూడు గుణాల కలయికచే ఈ భౌతిక ప్రపంచము సమ్మిళితమైయున్నది. ప్రతి పదార్థములోను ఈ మూడు గుణాలుంటాయి. అయితే వివిధ పదార్థాలలో ఏదోఒక గుణం అధికంగాఉంటుంది. ఆ గుణముల హెచ్చుతగ్గులచే వివిధ పదార్థములు వివిధములై యున్నవి. ఈ మూడు గుణములు విడిగానుండవు. కలిసియే యుండును. ఈ త్రిగుణ సిద్ధాంతమే వీరి విశిష్టత. ఇప్పుడు ప్రకృతి పరిణామాన్ని ఆ గుణాల లక్షణాలను తెలుసుకుందాము.

సత్వగుణం:- ప్రీతి, సుఖం, ప్రకాశత్వం, జ్ఞానం మొదలగు వాటిని కలుగ చేయునది.

రజోగుణం:- అప్రీతి, దుఃఖం, ప్రవృత్తి, చలనం, కామము,కోరికలు

తమోగుణం:- విస్మయం, అలసత్వం, మాంద్యం, అజ్ఞానము.

శిలలలో తమస్సు ఎక్కువగానుండును. చలనము గలవానిలో

రజోగుణము ఎక్కువ, అవ్యక్త స్థితిలో ప్రకృతి ఉన్నప్పుడు ఈ మూడు గుణాలు సామ్యావస్థలో ఉంటాయి, అనగా సమానంగా ఉంటాయి. ఈ సామ్యావస్థకు భంగం వాటిల్లుటతో ప్రకృతి పరిణామం చెందనారంభిస్తుంది. అయితే దానికి ఏ విధంగా భంగం వాటిల్లుతుందనేది స్పష్టముగా చెప్పలేదు.

ప్రకృతి

మహత్తు (బుద్ధి)

అహంకారము

సాత్వీకఅహంకారము | తామసఅహంకారము | రాజసఅహంకారము

సాత్వీకఅహంకారము

జ్ఞానేంద్రియములు | కర్మేంద్రియములు | మనస్సు

చెవి, ముక్కు, నాలుక, నేత్రము, శరీరము, | నోరు, చేతులు, కాళ్లు, మలవిసర్జనావయవములు రెండు

తామసఅహంకారము

పంచతన్మాత్రలు | పంచభూతములు

శబ్దం, స్పర్శ, రంగు, రుచి, వాసన. | ఆకాశం, గాలి, అగ్ని, భూమి.

రాజసాహంకారము

తేజస్సు

ప్రకృతి పరిణామంలో ప్రథమోత్పత్తి గాంచినది మహత్తు. ఇది జీవియొక్క బుద్ధికాధారము. సాత్వీకబుద్ధికి: విధి నిర్వాహణము, జ్ఞానము, రాగ ద్వేష శూన్యత. రాజసబుద్ధికి: కామము, కోరికలు. తామసబుద్ధికి: అజ్ఞానము, అలసత్వం లక్షణములు. ఈ బుద్ధి సర్వ

ద్రష్ట దృశ్య, భేదముల కాధారమైన సమిష్టిశక్తి. ఇంద్రియ మనో అహంకారముల నడిపించు బుద్ధి వేరని తెలుపబడెను ప్రకృతి యొక్క అనంతర పరిణామమందు అంకారము జనించును. కావున అహంకారముకూడా భౌతిక పదార్థమేనని తెలుపబడెను. ఇతర వస్తువుల కుపాదాన కారణమగుటచే అహంకారము ఒక ద్రవ్యము అహంకార మూలముననే ప్రకృతి కర్మలన్నియు తన వేనని జీవాత్మ లేదా పురుషుడు తలచును. అహంకారమునుండియే జ్ఞానేంద్రియ ములు, కర్మేంద్రియములు, మనస్సు, పంచభూతాలు జనించు చున్నవి. వస్తు ప్రపంచమంతయు అహంకారమున కనంత పరి ణామమని చెప్పబడెను అహంకారము సత్వగుణ యుక్తమైన ప్పుడు సత్కర్మలు, రజోగుణ యుక్తమైనప్పుడు దుష్కర్మలు తమోగుణ యుక్తమైనప్పుడు విజ్ఞాన హీనకర్మ లొనర్తురు. వీరు ఇంద్రియములు ద్వారములు, మనస్సు ద్వార పాలకుడనిరి. వీరి దృష్టిలో ఇంద్రియములనగా అవయవములుగాదు. అవి మనస్సు ఉపయోగించు ప్రవృత్తులు, ప్రాణముకూడా ఇంద్రియ లక్షణమేననియు, ఇంద్రియములు లేని యెడల ప్రాణముండదనిరి. వీరి ప్రకృతి పరిణామమును నిశితముగా పరిశీలించినచో సర్వప్రపం చము భౌతిక మానసిక దశలన్నియు ప్రకృతి సంజాతమేనని అర్థ మగుచున్నది. కాని అనంతర సాంఖ్యులు ఉపనిషత్ వేదాంత దర్శన ప్రభావముచే ఆత్మ - పురుషుడును సాంఖ్యము లోనికి చొప్పింప ప్రయత్నించిరి. దీనివలన సాంఖ్యవిశిష్టత గోల్పోయినది.

పురుషుడు:— ప్రకృతి అనాత్మ స్వరూపము దానినుండి ఆత్మ లేక పురుషుడు సంభవించుట సాధ్యము కాదనిరి. సర్వ జీవులలో స్వయం నిర్ణయ నియమము (Free will) ఉన్నది. దీనినే ఆత్మ అంటారు. వీరు దానిని పురుషుడనిరి. ప్రకృతి వలెనే పురుషుడును స్వత సిద్ధము. అచేతన ప్రకృతియంతయు చైతన్యుడైన పురుషుని

కొరకే ఉన్నది. కాని ఆ సంగతి ప్రకృతికి తెలియదు. విజ్ఞాన హీనములయ్యు వృక్షములు ఫలములనెట్లిచ్చుచున్నవో అట్లే విజ్ఞానము లేకున్నను ప్రకృతి కర్మ చేయుచున్నది. నిత్య పరిణామ మొందుచున్నది. ప్రకృతికి చైతన్యంలేదు కావున దానంతట నది మార్పు నొందజాలదు. పురుషునికి చైతన్యం ఉంది కాని కదలిక లేదు. ప్రకృతిలోని కదలిక, పురుషునిలోని చైతన్యం కలిసి ప్రకృతి పరిణామానికి కారణమౌతున్నాయి. గ్రుడ్డివాని భుజాలపై కుంటివాడు ఎక్కి ప్రయాణం చేసినట్లు, ప్రకృతి, పురుషుల కలయికను వర్ణించారు. పరిణామమంతా ఉద్దేశ పూర్వక పరిణామం. అనంత సంఖ్యాకములగు జీవుల చలనముచే ప్రకృతి పరిణామం నడుచుచున్నది.

ప్రకృతి అచేతనము—పురుషుడు చేతనుడు.

ప్రకృతి సవికార నిత్యతగలది—పురుషుడు నిర్వికారుడు

ప్రకృతి త్రిగుణాత్మకము - పురుషుడు నిర్గుణుడు

ప్రకృతి దృశ్యము - పురుషుడు ద్రష్ట

జీవాత్మ పురుష ప్రకృతి మిశ్రమ రూపమనిరి. దైహికముగాను, మానసికముగాను, నైతికముగాను భిన్నత్వమున్నది. కావున ఆత్మలు అనేకమని చెప్పిరి. మోక్షమనగా పురుషునికి ప్రకృతితో సంబంధము తెగిపోవుటమే.

కర్మయు, సుఖదుఃఖములు ప్రకృతి వికారములు. ప్రకృతి వ్యాపారములకు చైతన్య ప్రకాశమున్నదని భావించి, పురుషుడు ప్రకృతి కర్మలన్నిటిని నిష్క్రియుడై అవలోకించుచుండియు, తన స్వభావమును మరచి, అజ్ఞాన వశమున తానే ఆలోచించుచుంటిననియు, కర్మచేయుచుంటిననియు సుఖదుఃఖముల పొందుచుంటినని నమ్మెను. ఇట్టి అజ్ఞాన విశ్వాసముచే పురుషుడు ఒక దేహమున బద్ధుడై తన యథార్థతను కోల్పోయి జీవించుచుండును. బుద్ధి ప్రకృతినుండి పుట్టు

టచే అచేతనమైనను చేతనమువలె కన్పట్టుచున్నది. ఎట్లన చంద్రు నికి కదలిక లేకున్నను, ప్రవాహమందు దాని ప్రతిబింబము చలించు చున్నట్లు కనబడును. బుద్ధిపురుష సంయోగాభాసమే అహంకారము. మనస్సులో ఉద్భవించు రూపములన్నియు పురుషుడు తనవేయని భ్రమించును. బుద్ధిదోషములన్నియు పురుషుని యందు ప్రతిఫలించు టచే బాహ్య ప్రపంచమున సుఖ దుఃఖముల లోనగుచున్నారు. బుద్ధికి దాని సహజ స్వచ్ఛత లభించినప్పుడు ప్రతి ఫలావకాశము నశించి మోక్షము లభించును. అవగా బుద్ధి ప్రకృతి యందు లీన మగును. బుద్ధి సహజముగా సాత్వికమైనను పూర్వ వాసనా సంబంధ దోషములచే వ్యక్తులలో రాజసమో, తామసమో, అధికమైయుండును. గ్రహించ వలసిన ప్రతి విషయమును మనము మన వ్యక్తిగతములగు భావములతో దర్శింతుము. ఒకరికి దుఃఖ మైనది మరొకరికి సుఖము కావచ్చును. మనము బుద్ధిని పవిత్ర మొనర్చి పూర్వ సంస్కారములను విదల్చినచో, మనకుగల భావములు నశించి, వస్తు సహజ సంబంధములను తెలుసు కొందుము.

ప్రకృతి పురుషుల సంయోగానికి ముందు ప్రకృతి సామ్యా వస్థలో ఉంటుంది. పురుష సాంగత్యముచే దానిలో పరిణామం ప్రారంభ మౌతుంది. ఒక చేలో నీళ్లుంటాయి. ప్రక్క చేనులోనికి ఆనీరు పోవాలంటె గట్టు తీసివేయాలి. అదేవిధంగా పురుషుడు అనే బాహ్య కారణం కదిపితేనే ప్రకృతి కదులుతుంది. ప్రకృతి తిరిగి సామ్యావస్థ నొందగా పురుషుడు మరలా ప్రకృతిపై ప్రభావం చూపుతాడు. తిరిగి పరిణామం ప్రారంభమౌతుంది. సర్వజీవులు ముక్తిపొందేవరకు ఈ విధానము జరుగుచునే యుండును, కావున జగత్పరిణామమునకు ఆద్యంత కారణము పురుషుడే. పురుషుడు ప్రకృతిపై చూపు ప్రభావము అయస్కాంతము ఇనుముపై చూపు

నట్టే. పురుషులందరూ కైవల్య ప్రాప్తి చెందిన మీదట పరిణామం చెందే ఈ ప్రపంచం నశిస్తుంది. అదే ప్రళయం అప్పుడు పరిణామం ఆగిపోతుంది. ప్రళయం తర్వాత సృష్టిలో తిరిగి సామ్యావస్థ నెలకొంటుంది. కొంత కాలానికి తిరిగి పురుష ప్రకృతి సంయోగము జరుగుతుంది. ప్రపంచం కదులుతుంది.

<u>జ్ఞాన సిద్ధాంతము:</u>— ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాల ద్వారా జ్ఞానం సంపాదిస్తాము. మనం కుర్చీని చూస్తాం. అది మన మనస్సు మీద కొన్ని భావాలను కల్గిస్తుంది ఈ భావాలను మనస్సు వర్గీకరణ చేస్తుంది. దీపపు కాంతికి, అద్దంలో ప్రతిబింబము ఏర్పడ్డట్లే భౌతిక వస్తువుల ప్రతిబింబాలు మనో ఫలకం మీద ఏర్పడతాయి. ఇది ప్రత్యక్ష ప్రమాణం. జ్ఞాన సంపాదనకు ప్రధానమార్గం న్యాయుల వలనే నిర్వికల్పక సవికల్పక జ్ఞానాల నంగీకరించారు.

సాంఖ్యులు ఆత్మను అంగీకరించారు. ఎన్ని జీవులున్నాయో అన్ని ఆత్మలున్నాయి. ఆత్మ ఎల్లప్పుడు చైతన్యయుత శక్తిగానే ఉంటుంది. ఆత్మ, చైతన్యం రెండూ ఒకటే. ఆత్మకు మార్పులేదు. చలనం లేదు. ఆత్మ శరీరం కాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు. శరీరసంబంధం ఆత్మకు కలిగినప్పుడే చలనం కల్గుతుంది. శరీర బంధం వదలగానే ఆత్మ తిరిగి కేవల చైతన్యంగా మారిపోతుంది. ఆ స్థితిని పొందటమే మోక్షము. మోక్షం వచ్చేవరకు ఆత్మ పునర్జన్మ ఎత్తుతూనే ఉంటుంది. మానవులకు వచ్చే కష్టాలు మూడురకాలు

(1) ఆధ్యాత్మిక - మానసిక శరీర క్లేశాలు.

(2) ఆదిభౌతిక-ఇతర మనుష్యులవల్ల, జంతువులవల్ల వచ్చే కష్టాలు

(3) ఆది దైవిక - దయ్యాలు, భూతాలవల్ల ఏర్పడే కష్టాలు.

సాంఖ్యవాదం దేవుని నిరాకరిస్తుంది. ప్రకృతిని నడిపించే అధినాథుడు దేవుడు అని అందామా, అది సరికాదు ఎందుకంటె

దేవుడు ఏపనీ చేయడు. నడిపించటం మాత్రం చేయవలసిన అవసరం దేవునికేముంది? ఏదో అవసరం ఉండి దేవుడు సృష్టిని సాగిస్తున్నాడందామా, దేవుడు కూడా మానవుని వలనే అసంతృప్త జీవి అన్న మాట. కనుక సృష్టికి దేవుడు కారణం కాదు. వాస్తవమైన ప్రపంచం కొన్ని శాశ్వత సూత్రాల కనుగుణంగా నడుస్తుంది. ఈ సూత్రాలను గ్రహించటమే మనపని. వాటిని ఎవరు నిర్మించారు, ఎందుకు నిర్మించారు, అన్న ప్రశ్నలు అర్థరహితం ప్రకృతి వలనే ఈ సూత్రాలు కూడా స్వయం సిద్ధములు.

స్వభావవాదం: — ఉపనిషత్తులు ఎంత ప్రాచీనమైనవో భౌతిక వాదం కూడా అంతే ప్రాచీనమైనది. పరలోకం లేదనే వాదం కఠోపనిషత్తులో ఉన్నది. పంచభూతాలే అన్నిటికి కారణమని శ్వేతాశ్వతర ఉపనిషత్తులో ఉన్నది. ఆ ప్రాచీన భౌతిక వాదం తర్వాతలో కాయత దర్శనంగా వెలువడింది. శ్వేతాశ్వతర ఉపనిషత్తులో చెప్పినట్లుగా ప్రతిదానికీ ''దాని స్వభావమే'' కారణమని చెప్పినారు. ఒక పద్యం ఇలా ఉంది

ముల్లును పదునుగా ఎవరు చేశారు?
మృగాలు పక్షులు అంతభిన్నంగా ఎందుకున్నాయి?
చెరకులో తీపి, వేపలో చేదు ఎలావచ్చింది?
ఇవన్నీ వాటి స్వభావం వల్ల వచ్చినాయి.

స్వభావవాదం ఆత్మను నిరాకరిస్తుంది. ప్రపంచానికి అతీతంగా ఏదీ ఉండదు. ఇదే స్వభావ వాదాన్ని శంకరుడు సాంఖ్యులకు అంటగట్టి వారే తన ప్రధాన ప్రత్యర్థులన్నాడు. ప్రకృతి సహజంగా అనేకమైన మార్పులను చెందడంవలన ఏర్పడిన పరిణామం వలన ఈ ప్రపంచం పరిణితి చెందింది. గడ్డి, నీళ్ళు, గోవు, మొదలైనవన్నీ ఏ నిమిత్త కారణం లేకుండా వాటి స్వభావం వలననే ఎలా కాలరూపాన్ని పొందుతాయో, అదే విధంగా ప్రకృతి కూడా

జానంతట అది మహత్తు, అహంకారము మొదలైన రూపాలలోకి మారుతుందని సాంఖ్యులంటారని శంకరుడు అన్నాడు. దీనిని బట్టి ప్రాచీన సాంఖ్యంలో ఆత్మ ప్రమేయం లేదని, అది అనంతర సాంఖ్యుల కూర్పనని అర్థమవుతుంది.

అంతేగాక అనంతర సాంఖ్యులు వేదాంత దర్శన పోలికతో అప్రధానుడైన పురుషుని ప్రవేశపెట్టడం వలన ప్రకృతి - పురుష సంబంధాన్ని సరిగ్గా వర్ణించ లేకపోయారు. రెండూ స్వయం సిద్ధములగుట అసంభవం. ప్రకృతి నుంచైనా పురుషుడు వచ్చివుండాలి లేదా పురుషుడు ప్రకృతిని సృష్టించి ఉండాలి. అంతేగాక సర్వజీవులకు మోక్షం ఒకేసారి ఎలా వస్తుంది. ప్రళయ మెలావస్తుంది. ఏది ఏమైనా పురుషుని మూలముగా సాంఖ్య తత్వ విశిష్టత దెబ్బతిని లోపభూయిష్టమైనది.

## యోగం

యోగాచారాలు అతి ప్రాచీనాలు. క్రీ.పూ. 3000 సం॥ల నాటినుండే ఉన్నాయి. శైవులు శాక్తేయులు దానిని హఠ యోగం గాను, తంత్ర శాస్త్రంగాను అభివృద్ధి చేశారు. జైన బౌద్ధ సాంఖ్య వైశేషికాలన్నీ యోగాన్ని అంగీకరించాయి. భూత శక్తులు ఏవో కలవనీ, నిగూఢమైన ఈ వైహిక మానసిక శక్తులను నియమనిష్ఠల ద్వారా ప్రకోపింప చేయవచ్చనే నమ్మకం యోగ శాస్త్రంలో ప్రబలంగా ఉంది. యోగభ్యాసం వలన లభించే అద్భుత శక్తుల వెనుక ఆదిమమైన ఆటవిక లక్షణాలున్నాయనే విషయం విదితమౌతుంది. కేవలం సంకల్ప మాత్రాన-దూరశ్రవణం దూరదృష్టి, ఆకాశగమనం సూక్ష్మరూపాన్ని పొందడం, మహాకాయాన్ని పొందడం, భూత భవిష్యత్ కాలాల్లోని విషయాలను గురించి తెలుసుకోవడం చనిపోయినవారితో సంప్రదించడం -

మొదలైన అద్భుత శక్తులను గురించి యోగం ప్రస్తావిస్తుంది. జన్మము చేతగాని, ఓషదుల వలనగాని, మంత్రముల వలనగాని, యోగ సమాధి వలనగాని ఆ సిద్ధులు లభించును. మతి స్థిమితము తప్పినప్పుడు, మందుల వల్లకూడా దానిని పొందవచ్చని ఆటవికులు కొందరు వాళ్ళు భావిస్తారు ఆధునిక మనస్తత్వ శాస్త్రరీత్యా కూడా ఇందులో కొన్ని నిజమేనని అంగీకరించడమైనది. వ్యాయామ శాస్త్రానికి పునాది యోగమే (నేను నాస్తికుడనైనను ఇందులో చాలావరకు పట్టుపరిచి పరిశోధించి నిజమేనని ఒప్పుకుంటున్నాను.)

క్రీ. పూ. 2వ శతాబ్దిలో పతంజలి యోగ సూత్రాల సంకలనము నకు ప్రత్యేక కృషి చేశాడు సాంఖ్యులు జ్ఞానమార్గం ద్వారా మోక్షాన్ని పొందవలెనని చెప్పగా, పతంజలి దానిని త్రోసిపుచ్చి యోగనిష్ఠల ద్వారానే అది సాధ్యమని చెప్పాడు. సాంఖ్యానికి-యోగానికి పెద్దభేదా లేదు, పురుష-ప్రకృతి సంయోగము వలన పరిణామం జరుగుతుందని సాంఖ్యులనగా, పతంజలి పురుషుని స్థానంలో ఈశ్వరుని ప్రవేశపెట్టి అంతా ఈశ్వర సంకల్పము వలనని చెప్పాడు. సాంఖ్యులు ప్రకృతి నుండి ప్రథమంగా మహాత్తు ఉదయించనదనగా, వీరు దానినే చిత్తము అన్నారు యోగమంటె చిత్తవృత్తి నిరోధమే. ఏదైనా వస్తువుతో చిత్తమునకు సంబంధం ఏర్పడినప్పుడు దానిని చిత్తవృత్తి అంటాము వస్తువులు, కోరికలు అనేక రకాలుగా ఉండబట్టి చిత్త వృత్తులు కూడా అనేక రకాలుగా ఉంటాయి. ఆత్మకు 5 క్లేశాలు సహజంగా ఉన్నవి. అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, అభినివేశాలు అనునవి. మనస్సుకూడా 5 అవస్థలను పొందుతూ ఉంటుంది ప్రమాణ, విపర్యయ, వికల్ప, నిద్ర, స్మృతి అనునవి. బాహ్యప్రపంచం పట్ల గల రాగద్వేష అభిమానాదులపై చిత్తవృత్తులకు మూలం. ప్రళయ కాలమందైనను పురుషుల చిత్తములు ప్రకృతిలో చేరి కొంతకాలం విశ్రమించి

పున స్సృష్టి కాలమున తమతమ అవిద్యలలో తిరిగి సృజించపడును, వీరినను సరించి ఈశ్వరుడు అవిద్య సృష్టికి కారణములు. యోగాభ్యాసంలో 8 అంగాలున్నాయి. (1) యమ (2) నియమ (3) ఆసనం (4) ప్రాణాయామం (5) ప్రత్యాహారం (6) ధారణ (7) ధ్యానము (8) సమాధి. యోగాభ్యాసమునకు వలయు ధర్మానుష్ఠాన సిద్ధిని కల్గించునవి యమనియమములు. అవియే బ్రహ్మచర్యము, అహింస, సత్య ప్రియత్వము, ఆర్జవము, దురాశా రహితులగుట మొదలగు వానిని పాటించవలెను. ఆసనం ఏకాగ్రతకు భౌతిక సహాయము నిచ్చును. పరుగెత్తుమనో, నిద్రించుచునో మనము దేనిపై మనస్సును లగ్నమొనరింప లేముకదా! ఆసనము అనగా కూర్చుండే పద్ధతి. ఆహార విషయములలో కూడా అనగా నరములకు ఉద్రేకమును కల్గించి తాపాగ్నినిగాని నిద్రా మాంద్యమునుగాని జనింపచేయు భోజనపానీయములను స్వీకరింపరాదని చెప్పబడెను. ప్రాణాయామం అనగా క్రమ విధానమున ఊపిరి పీల్చుచు విడుచుచు చేయు వ్యాయామం. ఇది చిత్తమును ప్రసన్నమొనర్చునని హఠయోగం దీనికి ఉన్నత స్థానం ఇచ్చింది. దీని వలన రహస్య శక్తులు కొన్ని కలుగునని ఎంచబడెను. నిజానికి మంత్రాలలో శక్తి లేదు. ఆ మంత్రాలను ఉచ్చరించునప్పుడు మన ఉచ్ఛ్వాస నిశ్వాసముల క్రమబద్ధీకరణ ప్రాణాయామమును కల్గించును కాన ఆశక్తులు లభించును. ఆమంత్రాల కూర్పు ఆ విధంగా ఉంటుంది. ఇంద్రియములను బాహ్య ప్రవృత్తి నుండి వెనుకకు మరలించి లోనికి తీసుకొను అభ్యాసమును ప్రత్యాహార మందురు. ఆధునిక మనస్తత్వ శాస్త్రంలో దీనిని (introversion) అంటారు. బాహ్యమునుండి వచ్చు సర్వ ప్రేరణములకు మనస్సును దృఢ సంకల్పముతో మూసివేయవలెను.

ధారణ మనగా చిత్తమును ఒకచోట కేంద్రీకరించుట.

అనగా చిత్త స్థాయి మామూలు జీవితములో భావములు వచ్చి పోవుచుండును. కాని నిలకడ కలిగియుండవు సమగ్రమగు నేకాగ్రతఒక్క క్షణ కాలము మాత్రమే నిలుచును. ఇతర భావములతో చలింపక ఏకధారగా నుండు భావమే ధ్యానము అనబడును. ధ్యానము సమాధిలో అంతమగును సమాధియందు 'నే'నను భావము పోవును. ఈ మూడింటిని ఒకే విషయముపై జొప్పించినప్పుడు దానిని 'సంయమ' మందురు. బాహ్యవిషయములపైగాని అంతరంగిక విషయములపైగాని, ఈ సంయమశక్తిని ప్రయోగించినప్పుడు అతీంద్రియ శక్తులు దూరదృష్టి, అదృశ్యమగుట, ఇతరుల భావముల తెలుసుకొనుట, మొన్నగునవి కలుగును. సాధకుడీ శక్తులచే నాకృష్టుడైనచో తన లక్ష్యమును గోల్పోవు ప్రమాదము కల్గును. ఈ ఆకర్షణములను నిరాకరించి మోక్షగామియై ముందుకు పోవలెను. మోక్షము లేక యోగసమాధి ఒక తన్మయావస్థ. ఇందు బాహ్య ప్రపంచ సంబంధము తెగిపోవును. పురుషుడు ప్రకృతినుండి విడివడి తన సహజ స్థితిని పొందును. సాధకుడు తుది మెట్టైన సమాధి చేరకున్నను పూర్వ సోపానములు విలువ లేనివి కావు ఏమెట్టు కామెట్టే ఫలితమునిచ్చును. ఆసనమువలన లభించు దేహ నిగ్రహము వలన శీతోష్ణములయెడ ఉదాసీన భావము ఏర్పడును మనము దేనిపై ధారణ నిలిపినను మనకు సమగ్రమగు అంతర్విజ్ఞానము లభించును. అవ్యక్త సంస్కారములుకూడా మనకు ప్రత్యక్షమై పూర్వజన్మ జ్ఞానము లభించును. దూరదర్శన, దూరశ్రవణములు కల్గును. అయితే ఇలాంటి అద్భుత శక్తులు ప్రథమంలో లభించినా యోగాన్ని అంతటితో విడువక మోక్షం వచ్చేవరకు సాగించాలని పతంజలి నంటాడు. దేవుడు సాధకునకు యోగక్రమంలో సహాయ పడతాడు అని మాత్రమే చెప్పాడు. దేవుడు ఒక పురుష విశేష మూర్తియే కాని, సృష్టికర్త, పోషకుడు

కాదు. మనుజుల కర్మల కాతడు శిక్షించుటగాని, కటాక్షించుట గాని చేయలేదు. అతడు ప్రజల అభ్యుదయమున కవరోధములు తొలగించి సాయపడును అయితే అనంతర యోగ గ్రంథములందు ఈశ్వరునికి ప్రముఖ స్థానమిచ్చిరి.

## పూర్వ మీమాంస B. C. 200

పూర్వ మీమాంస సూత్రాలను ప్రతిపాదించిన జైమిని క్రీ. పూ. 200 నాటివాడు. బౌద్ధజైన మతాల వలన వేదాలు, వైదిక కర్మకాండలు, యజ్ఞయాగాదుల పట్ల ఏర్పడిన నిరసన భావముల నిర్మూలించి వానిని పునరుద్ధరించుటే వీరి లక్ష్యము. ఈ సూత్రాలకు శబరస్వామి (క్రీ. పూ. 100) కుమారిలభట్టు, ప్రభాకర పండితులు (క్రీ. పూ. 700) వ్యాఖ్యానాలు రచించారు. వేదాలు పరమ ప్రమాణాలు. అవి ఎవరి చేతను రచింపబడలేదు. అవి సర్వకాల సత్యావస్థలకు వర్తించే నియమాలు. అవి దేవుడు వ్రాసినవి లేదా చెప్పినవికూడా కాదు. అవిస్వతః సిద్ధాలు. వైదిక కర్మలపట్ల గల అత్యాసక్తితో వీరు దేవునికూడా నిరాకరించారు. ప్రపంచానికి సృష్టికర్త అంటూ ఎవరూ లేరు. సృష్టికి ఆది అంతములు కూడా లేవు. సృష్టి, స్థితి, లయాదులనేవి కల్పిత భ్రమలు. సకల వస్తు సమన్వితమైన భౌతిక ప్రపంచము వాస్తవమైనది. ప్రమాణాలన్నీ ఇంద్రియాలపై ఆధారపడి ఉన్నాయి. దేవుడు ఇంద్రియ గోచరుడు కాడు. దేవుడున్నాడనటానికి ఏ విధమైన నిదర్శనం లేదు కాబట్టి తాను దేవుని నిరాకరిస్తున్నానని శబరుడు చెప్పాడు. నవన్యాయ వైశేషికులు భగవన్నిరూపణకు ఇచ్చిన వాదాలన్నిటిని వీరు ఈ విధంగా ఖండించారు.

(1) "కార్య కారణ వాదంలో కుమ్మరి కుండకు చైతన్య యుతుడైన కారణము. ప్రపంచంకూడా ఒక కార్యం కాబట్టి

దానికి కూడా చైతన్య యుతమైన కారణముండాలి. అటువంటి వాడే దేవుడు. అణుసమూహాల కలయిక వలన ప్రపంచాన్ని సృష్టిస్తాడు. యుగాంతంలో ప్రళయాన్ని కల్గిస్తాడు.''

ప్రతివస్తువుకూ ఆది అంతమూ ఉన్నాయి. అంత మాత్రాన సర్వ వస్తువులూ అనగా ప్రపంచమంతా ఒకేసారి ఆరంభమై ఒకే సారి అంతమౌతుందని చెప్పలేము. నిరంతరమూ వస్తూపోతూవుండే పద్ధతి మాత్రమే ఉన్నది. మనకు కనుపించే కారణం కాక కనుపించని మరొక కారణం ఉంటుందనుకోవాల్సిన అవుసరం లేదు. మన ఉనికికి మన తల్లి తండ్రులను చూస్తున్నప్పుడు, చూడని కారణాన్ని అంటె దేవుణ్ణి మనకు కర్తగా ఎందుకు భావించాలి? కుమ్మరే గనుక కుండను యదార్థమైన కారణమయితే కుండకు కారణము కుమ్మరే కాని దేవుడు కాడు. అలాగాకుండా ప్రపంచంలో ప్రతిదానికి దేవుడే కారణమైతే కుండకు కూడా దేవుడే కారణము కాని కుమ్మరి కాజాలడు కదా!

కావున వారి దృష్టాంతము సిద్ధాంతమునకే విరుద్ధముగా నున్నది

2. ''మానవుడు తాను చేసిన కర్మ ఫలాన్ని అనుభవించి తీరాలి. ఈ కర్మ ఫలితాన్నే వైశేషికులు అదృష్టము అని అన్నారు. ఇది చైతన్య రహితమైన జడపదార్థము. జడపదార్థంగా ఉండేది. ఏదీ మార్గ దర్శకం కాజాలదు. కనుక చైతన్యవంతమైనది మరొకటి దీనికి మార్గదర్శకంగా వుండాలి. అదృష్టం సమయానుకూలంగా జీవులకు కర్మ ఫలితాలను ఇవ్వ వలసి ఉండుటచేతను. అసంఖ్యాక జీవులకు, ఆ యా నిర్దిష్ట ఫలితాలను కలుగ చేసేందుకు మార్గదర్శిగా ఉండే చైతన్య రూపము శాశ్వతమైన సర్వజ్ఞత్వాన్ని కూడా కలిగి ఉండాలి. అది సర్వత్రా ఉండాలి. అట్టి చైతన్య రూపుడే దేవుడు.

ధర్మాధర్మములు బుద్ధి గల వ్యక్తులకు చెందినవి. ఒక వ్యక్తి

ఎంతటి ఘనుడైనను ఇంకొకని ధర్మాధర్మముల నెరుగజాలడు. ఇతరుల అదృష్టమగు పాపపుణ్యములు అప్రత్యక్షాంశము కాబట్టి దానిని దేవుడు తన మనస్సుతో గాని ఇంద్రియములతో గాని చూడలేడు. అంతేగాక వస్తుగతజ్ఞానం (జడపదార్థ అదృష్టం) శరీరంతో కలిసి ఉన్న మనస్సు వలననే వీలౌతే సాధ్యమవుతుంది. దేవుడు అశరీరుడు కనుక సాధ్యం కాదు. బహుశా ఇటువంటి జ్ఞానం దేవునిలో ఉంటుందని భావించినా ఆతని ఆధీనంలోనే అదృష్టం (సర్వజీవుల కర్మ ఫలితాలు) కూడా ఉంటుందని భావించటానికి వీలు లేదు. అలా భావించాలంటె దేవునికి - అదృష్టానికి ఏదో ఒక సంబంధము ఉండాలి. అది సంయోగ సంబంధముగాని, సమవాయ సంబంధముగాని కావాలి. రెండు ద్రవ్యాల మధ్యనే సంయోగ సంబంధం ఉంటుంది. దేవుని ఒక ద్రవ్యంగా భావించినా అదృష్టం అనేది ఒక గుణం కాబట్టి వాని మధ్య సంయోగ సంబంధం లేదు. ఒక ద్రవ్యానికి దాని గుణానికి సంబంధం ఉన్నప్పుడే సమవాయ సంబంధం ఉన్నదంటాము ఇక్కడ అదృష్టం అనేది దేవుని గుణం కాదు. అది ఇతర జీవుల ఆత్మలలో ఉండే గుణము కావున దేవునికి - అదృష్టానికి మధ్య సమవాయ సంబంధం కూడా లేదు. అశరీరమైన ఆత్మ దేనినీ సృష్టించ లేదు. ఈశ్వరుని కాక భౌతిక దేహము లేనిచో నాతనికి సృజన కాంక్షయే లేదు (ఆత్మ నిర్గుణం కాబట్టి) ఒకవేళ ఈశ్వరునికి దేహమున్నది అనుకుంటె, అతని దేహసృష్టికి ఇంకొక సృష్టికర్త యుండవలెను.

పోనీ ఈశ్వరుని దేహము నిత్యమన్నచో, పంచభూతములంకను సృజింప పడలేదు. కావున అతని శరీరము ఏ పదార్థములతో నిర్మింపబడినది? పోనీ అతని సృష్టి వ్యాపారమునకు పూర్వమే పదార్థమున్నచో మొదట ఈశ్వరుడేగాకుండా కొన్ని ద్రవ్యములున్నవని అంగీకరింప వలసి యుండును. దుఃఖ పూరితమైన లోక

సృష్టి చేయుటలో ఈశ్వరుని ఉద్దేశమేమి? పూర్వకర్మయే కారణ మనుటకు వీలులేదు. ఏలన అంతకు పూర్వము ఒక సృష్టిలేదు. కాబట్టి పూర్వకర్మయుండనేరదు కృపచే సృజించె ననుటకు వీలు లేదు. ఏలన కృపచూపవలసిన జీవులు అదివరకు లేవు. మరియు నాతని కృపయే సృష్టి కారణమైనచో సుఖ జీవులను సృష్టించి యుండవలెను. పోనీ దుఃఖాంశ లేనిదే సృష్టి అసాధ్య మనరాదు. ఏలన దేవుని కసాధ్య ముండరాదు. అట్లుగాక ఈశ్వరునికి నిర్బంధములున్నచో అతడు సర్వశక్తి సమన్వితుడెట్లా అవుతాడు! పోనీ వినోదము కొరకు సృజించెనన్నచో సంపూర్ణానంద స్వరూపి యెట్లగును మరియు చేసిన సృష్టిని నాశనము చేయు కోరికయు ఈశ్వరునికి అనుచితమే యగును. అణువులీశ్వరేచ్ఛచే వర్తించునన్నచో నాతనికా ఇచ్ఛ ఎట్లు జనించెను. అదృష్టము వలనది. ఆ ఇచ్ఛకు కారణమైనచో అదృష్టమే సృష్టికి కారణము కావచ్చుగదా! ఈశ్వరుని సంకల్పమే జగత్కారణ మన్నచో కర్మ సిద్ధాంతము నిరర్థక మగును. కావున దేవుడు లేడు.

జ్ఞాన సిద్ధాంతము:— జైమిని ప్రత్యక్ష, అనుమాన, శబ్దప్రమాణముల నంగీకరించెను కాని నైయాయికులు శబ్ద ప్రమాణానికి చివరి స్థాన మిస్తే వీరు ప్రథమ స్థానాన్ని ఇచ్చారు. వేదాలలో చెప్పింది పరమ ప్రమాణమని స్థాపించేటందులకే వీరు శబ్ద ప్రమాణానికి విశేష ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభాకరుడు ఉపమాన, అర్థాపత్తులను కూడా నంగీకరించగా కుమారిలుడు అనుపలబ్ధిని కూడా చేర్చెను.

ప్రత్యక్ష ప్రమాణము:— దీని విషయములు న్యాయ సిద్ధాంతములను అంగీకరించిరి. నిర్వికల్పక సవికల్పక దర్శనములను, సామాన్య విశేష, సంయోగ, సమవాయ సంబంధములను యథాతథంగా అంగీకరించిరి. కాని శ్రోత్రేంద్రియ విషయములో వీరి అభిప్రాయము

వేరు. దేశ, దూర, సామీప్యములు స్పర్శానుభవముల చేతనేగాక శబ్దము వలనకూడా ప్రత్యక్షముగా తెలియునది. దేశమునకు స్థానము దిక్కులుగలవు. ఇవి రెండును శబ్ద విశేషములుగా ప్రత్యక్షములే ఎందుకంటె మనము వినిన శబ్దము ఏదిశనుండి వచ్చినది, ఎంత దూరమునుండి వచ్చినది, ప్రత్యక్షముగా తెలుస్తుంది. సమీప శబ్దములు దూర శబ్దములు కంటె గట్టిగా వినపడును. యోగజా ప్రత్యక్ష దర్శనమును అంగీకరించలేదు.

<u>శ్రుతి ప్రమాణము</u> — ధర్మమొక భౌతిక పదార్థము కాదు కావున అది ఇంద్రియ గోచర విషయము కాదు. ఇతర ప్రమాణములు కూడా ప్రత్యక్షముపై ఆధారపడిన వగుటచే ధర్మ నిర్ణయమునకు పనికిరావు యజ్ఞము చేసినవాడు స్వర్గమునకు పోవును. ఈ విషయమును ప్రత్యక్ష అనుమాన ప్రమాణములచే నిర్ణయింపలేము. ఇట్టి జ్ఞానమును వేదములే చెప్పగలవు ఏకర్మలు శ్రేయఃప్రదములో అట్టి కర్మలందభిలాష కల్గించు వాక్యములే వేదసారము. అది సత్యః ప్రమాణము. వేదములిచ్చు జ్ఞానము దేశకాలవస్థ భంగములేనిది. అందలి శబ్దములు శాశ్వతములు. శబ్దములో అక్షరములుండును. అన్ని ధ్వనులు అక్షరరూపమున వినబడును. చెవి అక్షరములను దర్శించును. ప్రతి అక్షరము దర్శనము వెంటనే అదృశ్యమై ఒక సంస్కారమును దిగవిడుచును. వివిదాక్షరముల దర్శన సంస్కారములు చివరి అక్షర దర్శనముతో కలిసి శబ్ద భావమును కల్గించును దానికి శబ్దార్థము నిచ్చు శక్తి కలదు అందుచే శబ్దజ్ఞానమూలము అక్షరములే. అక్షరములకు శక్తియున్నది.

<u>అర్థాపత్తి:</u> — ఒక వ్యక్తి రోజురోజుకీ బలుస్తున్నాడు. కాని పగటి పూట ఉపవాసముంటున్నాడు. కనుక రాత్రిపూట భోజనం చేస్తున్నాడు అని అభిప్రాయ పడతాం. దీన్నే అర్థాపత్తి ప్రమాణం అంటారు. అతడు రాత్రిళ్ళు భోజనం చేయటం మనంచూడలేదు.

కనుక ప్రత్యక్షంకాదు రోజురోజుకీ బయటకి వెళ్ళి వారందరూ రాత్రి పూట మాత్రమే భోజనంచేస్తూ ఉంటారన్న సూత్రం ఏమీ లేదు. కనుక అనుమాన ప్రమాణము కాదు. ఈ వాస్తవ విషయాన్ని మనం ఊహించుతాం.

అనుపలబ్ధి:- ఇది వైశేషికుల అభావంలాంటిది. ప్రత్యక్ష ప్రమాణానికి విరుద్ధమైనది. అనుపలబ్ధి కొన్ని వస్తువులను మనం స్వయంగా చూసినందువల్ల అవి వున్నవి అని గుర్తిస్తున్నాము అలాగే కొన్ని విషయాలను మనం చూడనందువల్ల అవి అక్కడ లేవు అనికూడా గుర్తిస్తున్నాము. లేవు అని గుర్తించటం కూడా వ్యతిరేకార్థంలో జ్ఞాన సంపాదనే.

భావవాద ఖండన:— భావవాదం ఇంద్రియజ్ఞానం దోషపూరితమనియు, భావాలు మాత్రమే యదార్థమనియు, బాహ్య ప్రపంచం మిథ్య అనియు చెప్తుంది ప్రపంచమే మిథ్య అయినట్లయితే కర్మలు కర్మ ఫలితాలు అర్థరహితాలవుతాయి ప్రపంచం కనుక స్వప్నంలాంటిదయితే ఈ విధంగా క్రమంతో కూడుకున్న యజ్ఞయాగాదులు చేయకుండా నిద్రిస్తూ స్వాప్నిక జగత్తులోని ఆనందాన్ని అనుభవిస్తూ ప్రజలుండవచ్చు. యజ్ఞ కర్మకాండలను సమర్థించడానికై వీరు భావవాదాన్ని ఖండించటానికి పూనుకున్నారు.

(1) భావవాదులు మనస్సు - భావాలు తప్ప బాహ్యంగా ఏమీ లేదని చెప్తారు. జ్ఞాన గ్రహణకు మూలమైన పదార్థం కేవలం ఒక భావమే, మనం చూచే రకరకాలయిన రూపాలు జ్ఞానంయొక్క రూపాంతరాలే నన్నారు. ద్రష్ట, దృశ్యం రెండూ ఒకటే దీన్ని నిరూపించడానికి భ్రమలను, స్వాప్నికాంశాలను, రజ్జుసర్ప భ్రాంతిని ఉదహరించి, జాగ్రదావస్థలో ఉండే జ్ఞానానికి స్వప్నాల్లో ఉండే జ్ఞానానికి తేడా తెలుపటానికి ఏ విధమైన కొలబద్ద లేదు, కాబట్టి స్వప్నజ్ఞానం లాగానే జాగృత జ్ఞానంకూడా

మిథ్య. మనస్సుకు బాహ్యంగా ఉన్నదంతా మిథ్య అని అంటారు.

మనకెదురుగా గుడ్డ ఉన్నట్లయితే మనం గుడ్డనే చూస్తున్నాం కాని కుండను చూడటం లేదుకదా! ప్రత్యక్షం బాహ్య వస్తువులను చూపిస్తుందేగాని ఆలోచనను కాదు. అంతేగాక స్వప్నంలోనుంచి మేలుకువరాగానే స్వప్నజ్ఞానం మిథ్యగా కనుపిస్తుంది అట్లాగే భ్రాంతిజ్ఞానం సరి అయిన జ్ఞానం రాగానే తొలగిపోతుంది. ఈ విధంగా తొలగిపోయేటప్పుడు దానికి కారణాలుకూడా కన్పిస్తాయి. నిద్ర సరిగ్గా లేనందువల్ల స్వప్నాలు, కాంతి సరిగ్గాలేనప్పుడు భ్రాంతి ఉంటాయి. సర్వసాధారణంగా ఉండే జ్ఞానం ఆవిధంగా తొలగిపోవుటలేదు. కనుక అది దోషమైన కారణాలనుండి సంభవించుటలేదు. అంతేగాకుండా సాధారణంగా వుండే ప్రత్యక్ష జ్ఞానమంతా సుపరిచయమై నిశ్చయంగా ఉంటుంది. కుమారిలుడిలా అన్నాడు.

స్వప్నంలో కనుపించేది మిథ్య అని అందరూ అంగీకరిస్తున్నారు అయితే అలా అంగీకరించటానికి ఉన్న ఆధారమేమిటి? నిద్రలేచిన తర్వాత స్వప్నంలో చూసినవన్నీ మిథ్య అని తెలుసుకుంటాం కాబట్టి స్వప్నజ్ఞానం మిథ్య అని భావిస్తున్నాము. అంటె స్వప్నజ్ఞానాన్ని నిరాకరించటానికి జాగ్రదావస్థ జ్ఞానాన్ని సత్యమని అంగీకరిస్తున్నాం అటువంటప్పుడు వారి దృష్టాంతము వారి సిద్ధాంతానికే విరుద్ధంగా ఉంది. అంతేగాకుండా బాహ్యప్రపంచంలోని వస్తువులను గురించిన జ్ఞానం అంతా యదార్థమే. ఎదుకంటె జాగ్రదావస్థలోని యదార్థజ్ఞానం స్వప్నజ్ఞానాన్ని నిరాకరించినట్లుగా, జాగ్రదావస్థ జ్ఞానాన్ని నిరాకరించే మరోరకమైన జ్ఞానం లేదు కాబట్టి. దీనికి భావవాదులు జాగ్రదావస్థలోని జ్ఞానం సమాధి అవస్థలో నిరాకరింపబడుతుంది. కావున జాగ్రదావస్థ జ్ఞానంకూడా మిథ్యేనన్నారు. దానికి కుమారిలుడు యోగసమాధినే ఒక భ్రమ

అన్నాడు. అంతేగాకుండా స్వప్నానుభవం మాత్రమే దోషమనియు స్వప్న పదార్థాలు యదార్థ జగత్తులో ఉన్న వేననియు, స్మృతిజ్ఞానం మూలంగా నిద్ర లేచినప్పుడు జ్ఞప్తికి తెచ్చుకోవడమే.

భావవాదులు చెప్పినట్లుగా తెలుసుకొనే మనస్సు, తెలుసుకోబడే వస్తువు రెండూ ఒకటేనని చెప్పటానికి నిదర్శనం లేదని కుమారిలుడన్నాడు. ఒక వస్తువును చూచినప్పుడు ఆ వస్తువును చూచినట్లుగా జ్ఞానముంటుందే కాని, మన మానసిక స్థితిని గురించిన జ్ఞానం ఉండదు. ఉదాహరణకు మనం కొన్ని రంగులను చూస్తాం. అవన్నీ రకరకాల వస్తువులకు ఉన్నట్లు గ్రహిస్తామే కాని మన మనస్సుకు ఉన్నట్లు గ్రహించం. అంతేగాకుండా తెలుసుకొన్నదీ, తెలుసుకోబడేది రెండూ ఒకటే నట్లయితే. ఈ రెండింటిని గూర్చి విడివిడిగా చెప్పడంలో అర్థంలేదు.

ఒకతడవ కుండను చూస్తాము. మరొక తడవ గుడ్డను చూస్తాం. మరొకతడవ మరొదానిని చూస్తాం. భావవాదుల దృక్పథాన్ని అంగీకరిస్తే రకరకాలుగా కనిపించే ఈ విషయాల్లో ఉన్న భేదాలు వస్తువులలో లేవు. మన మనస్సులో ఉంది. ఇది హాస్యాస్పదము కాదా! వీటిని వివరించడానికి బౌద్ధులు నిరంతరమూ ప్రవహిస్తూ మనోజన్యమైన సంస్కారాల వలన రకరకాలైన మానసికావస్థలు ఉత్పన్నమౌతాయని, అవిజ్ఞాత జ్ఞేయాలుగా ద్వంద్వ పాత్రలు వహిస్తాయని చెప్పారు. జాగ్రదావస్థలో ఉండే ప్రత్యయాంశాలుకూడా వస్తురూపంలో ఉండేవాటి ప్రత్యయాలు కావని బౌద్ధులు అన్నారు. కాగా పూర్వజ్ఞానం లేకపోతే సంస్కారం అసంభవం వస్తువులేనిదే సంస్కారం అసంభవం అని కుమారిలుడు వాదించాడు.

2) అసత్ ఖ్యాతివాదం — మాధ్యమిక బౌద్ధులు
ఆత్మఖ్యాతివాదం — యోగాచార బౌద్ధులు

అనిర్వచనీయ ఖ్యాతివాదం — అద్వైత వేదాంతులు
అఖ్యాతి వాదం — ప్రభాకర, మీమాంసకులు
అన్యథాఖ్యాతి వాదం — కుమారిలుడు

లేని దాన్ని ఉన్నట్లుగా భావించడమే భ్రాంతి అని అసత్ ఖ్యాతి వాదులైన శూన్యవాదులంటారు. మనోగత భావాలను వస్తుగతంగా చూడటమే భ్రాంతి అని ఆత్మఖ్యాతి వాదులంటారు. తాత్కాలికంగా సృష్టించేదే అనిర్వచనీయమైన మిథ్యావస్తువే భ్రాంతి అని అద్వైతులంటారు. అక్కడ లేకపోయినప్పటికీ, తాడులో పాము ఉన్నట్లుగా భ్రాంతిని కలుగచేస్తున్నప్పుడు, ఇతరమైన ప్రత్యక్షాంశాల్లో కూడా యథార్థంగా గోచరించేది యథార్థం కాదనీ, ప్రతినిత్యమూ జాగ్రదావస్థలో జరిగే ప్రతిచర్య ఇలాంటిదేనని భావవాదుల సిద్ధాంతము. కావున మీమాంసకులకు భ్రాంతి జ్ఞానానికి యథార్థమైన జ్ఞానానికి మధ్యగల భేదాను నొక్కి చెప్పవలసిన అవుసరము వచ్చింది.

ప్రభాకర మీమాంసకులు అసలు భ్రాంతి అనేదే లేదన్నారు. అదే అఖ్యాతివాదం భ్రాంతి అనేది అసమగ్రంగా మనం గ్రహించే రెండు ప్రత్యక్షాంశాల మధ్య ఉన్న భేదా మాత్రమే. మొదట తాడును సరిగ్గా చూడం. అంటె తాడులో ఉండే ప్రత్యేకమైన అంశాలన్నింటిని సరిగ్గాచూడం. రెండోదశలో పాముని గుర్తుకు తెచ్చుకుంటాం. ఇదికూడ అసమగ్రంగా ఉంది. ఒక వస్తువును తథతనుండి విడలేసి జ్ఞప్తి చేసుకోవడం. ఈ రెండూ అసమగ్ర జ్ఞానాలు అయినప్పటికి అవి అభాసాలు కావనీ, మనోకల్పితాలు కావనీ, అనిర్వచనీయాలు కావనీ ప్రభాకరుని వాదం. లోపమల్లా రెంటికీగల వ్యత్యాసాన్ని గుర్తించకపోవడము మాత్రమే.

కుమారిలుడు భ్రాంతిజ్ఞానంకూడా యథార్థమనీ, అది ఏకైకానుభవమనీ వాదించాడు. యథార్థమైన ఒక వస్తువును మరొక

యదార్థమైన వస్తువులో చూచినంత కాలమూ భ్రాంతిజ్ఞానం యదార్థమే. దీనిని అన్యథాఖ్యాతి వాదం అంటారు. అందులో రెండు వస్తువులున్నాయి తాడు - పాము. తాడును తాడుగా చూడకుండా దానిని అసమగ్రంగా చుడటం భ్రాంతికాదు ఒక జ్ఞానంశాన్ని చూస్తున్నాం. భ్రాంతిజ్ఞానం సరియైన జ్ఞానంచేత సరిదిద్ద పడినప్పుడు అది క్రమంగా తొలగిపోయి ఇది పాము కాదు, తాడే. అనే యదార్థజ్ఞానం ఏర్పడుతుంది. అందువలన భ్రాంతి జ్ఞానంకూడా కొంతవరకు సంగతమైన పాక్షికజ్ఞానమే. ఒక వస్తుగత విషయాన్ని మరొక వస్తుగత విషయంలో చూస్తున్నాము. ఆ మేరకు మాత్రమే అది భ్రాంతి. పాము తాడులో లేకపోయినా, పాము అనేది నిజవస్తువే.

<u>ధర్మసిద్ధాంతం</u> :— దేవుణ్ని నిరాకరించిన వీరు దేవతలనికూడా నిరాకరించారు. వేదంలో ఉన్న దేవతలు ఇంద్రుడు, అగ్ని etc. అందరూ శబ్దమాత్రులేననియు, యజ్ఞయాగాది క్రతువులలో ఉచ్ఛరించడానికి ఉపయోగించే మంత్ర శబ్దాలే ఈ దేవతాస్వరూపాలు అని చెప్పారు. ఈ క్రతువులన్నీ దేవతల అనుగ్రహం కొరకై చేసే కర్మలు కాదు. ఇవన్నీ సహజంగాను, స్వయంగాను, వాటిలో ఉన్న శక్తులవలన ఫలితాలను ఇవ్వగలిగినందువల్ల, వీటిని మంత్రవిద్య కర్మలుగా భావించారు. భూమినిదున్ని గింజల నాటితే చేను పంటనిస్తుందికదా! అదేవిధంగా వైదికకర్మలను చేయటం వలన ప్రతిఫలం దాని అంతట అదేవస్తుంది. ఈ కర్మలు ప్రస్తుత జన్మలో ఫలితాలను ఇవ్వకపోయితే భవిష్యత్ లో ఇస్తాయన్నారు. దానికిగాను అపూర్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. కర్మచేయడం సమాప్తమైనప్పటికిని వాటి ఫలితాలు అపూర్వం అనే సూక్ష్మరూపంలో ఉండి కాలక్రమేణా ఫలితాలను ఇస్తాయన్నారు.

మోక్షసాధకు వైదిక కర్మలను నియమ నిష్ఠలతో ఆచరిం

చూపే మార్గం. విత్తనంలో మొక్కగా రూపొందే శక్తి అంత ర్భితంగా ఉన్నట్లే, ప్రతపనిలోను ఒక ఫలితం శక్తిరూపంలో ఉంటుంది. ఈ అంతర్గర్భితమైన శక్తి కొంత కాలానికి వికసించి క్రియాత్మకమైన శక్తిగా మారుతుంది అలాగే మంత్రాలలోను శక్తి ఉంది. కావున కర్మకాండల మూలమున పుణ్యంవస్తుంది. నిత్యకర్మలను అనాసక్తితో ఆచరిస్తే స్వర్గ నరకాల కతీతమైన మోక్షం లభిస్తుంది.

Note:- ఉపనిషత్తులు, లోకాయతులు, బౌద్ధ, జైన మతాల వలన యజ్ఞయాగాదులు నశించాయి. ఆ పిమ్మట ఉద్భవించిన సాంఖ్య, న్యాయ, వైశేషికాలలోను కర్మకాండల ప్రసక్తి లేదు. మరి పూర్వమీమాంస కాలంలో అవి మరలా ఎలాతలెత్తాయి?

మౌర్య సామ్రాజ్యకాలంలో బౌద్ధం రాజాదరణ పొందింది. ఆ పిమ్మట శృంగ, కణ్వ గుప్తరాజులు వైదికమత పునరుద్ధరణకు తోడ్పడ్డారు. అప్పటికే భారత దేశంలోని మేధావివర్గంలో హెచ్చుమంది జైన బౌద్ధాలవైపు మొగ్గారు. ఇక యజ్ఞయాగాదులు చేసేదెవరు? ఆర్యేతర, ఆటవిక తెగలకు చెందిన ప్రజలను, ఆర్య నాగరికతలో ఇముడ్చుకొని వారిలో వర్ణవిభజన ఏర్పరచి వైదిక మతాన్ని వ్యాప్తిచేయవలసిన అవసరం మరల ఏర్పడింది ఇది అనాదిగా జరుగుతున్న విధానమే. వేదాలలోని యజ్ఞయాగాదులు అలా వ్యాపించినవే. అనార్య తెగలలోని ప్రకృతి ఉపాసన, ఆర్యుల లోని యాగకర్మలు కలిసిపోయినవి. బ్రాహ్మణ పురోహితవర్గం ఆర్య అనార్య తెగల సమ్మేళనం వల్లన ఏర్పడింది. వారే అశ్వ మేధ, గోమేదాది యజ్ఞాలను తిరిగి పెద్ద ఎత్తున ప్రారంభించారు. వీరే పూర్వమీమాంసా ప్రవర్తకులు. బ్రాహ్మణ పురోహితులుగా మారిన తెగల పురోహితులు తెగల సంస్కృతియైన ప్రకృతి శక్తుల ఉపాసనను వేదమంత్రాలకు జోడించారు. కర్మకాండ

పెరుగుదల పురోహితవర్గ ప్రయోజనాలతో ముడిపడి ఉంది. వారికి అదే జీవనోపాధి.

## ఉత్తర మీమాంస – వేదాంత సూత్రములు A D. 200

వేదాంతమనగా వేదముల చివరి భాగమునందు అనగా ఉపనిషత్తులందు ప్రకటింపబడిన సిద్ధాంత సముచ్చయము అని అర్థము పరబ్రహ్మ తత్వమును వివరించునుగాను వేదాంత సూత్రములను బ్రహ్మసూత్రములని కూడా పిలుతురు. దేవుని గూర్చియు ప్రపంచమును గూర్చియు, జీవాత్మ సంసార పరివర్తనమును గూర్చియు మోక్షమును గూర్చియు నది అన్వేషణము చేసి, సిద్ధాంతములకు గన్పట్టు వైరుధ్యముల తొలగించి, వానిని ఏకసూత్ర బద్ధమొనర్చి, ముఖ్యముగా విరోధుల విమర్శలనుండి, కాపాడు నుద్దేశించి బాదరాయణుడు 555 సూత్రముల రచించెను. వానినే ఉత్తర మీమాంస లేదా వేదాంత సూత్రములందురు. ప్రతి సూత్రము రెండు, మూడు పదములుగలవే, అవి అర్థనిర్ణయములో భాష్యకారునకి పూర్ణ స్వేచ్ఛనిచ్చుటచే, అనంతర భాష్యకారులు శంకరుడు, భాస్కరుడు, రామానుజుడు, కేశవుడు, నీలకంఠుడు, మాధవుడు, వల్లభుడు, విజ్ఞాన భిక్షువు వారివారి దృక్పధముల ననుసరించి భాష్యముల నొసగిరి. రచనాకాలము క్రీ.శ. 200 సంవత్సరములు, వేదములు శాశ్వతమనియు, శాస్త్రము పరమప్రమాణము అనియు. తర్కము వలన పరమార్థ సత్యమును కనుగొనుట అసాధ్యమని ప్రకటించెను. శ్రుతి అనగా ఉపనిషత్తులనియు, స్మృతి అనగా భగవద్గీత, మహాభారతము, మనుస్మృతియున్నైయున్నవి

వేదాంత సూత్రములననుసరించి, సాంఖ్యము చెప్పిన ప్రకృతి - పురుషులు స్వతంత్రములు గాక ఏక వస్తు భిన్నరూపములే. అనంతమగు నిర్గుణ బ్రహ్మ పదార్థమే ఉపనిషత్తులు ప్రతి

పాదించిన పరమసత్యం. బ్రహ్మమే జగత్తునకు మూలము, ఆధారము, అంతము నేగాక జగత్తునకు ప్రధాన ఉపాధాన కారణము కూడానై యున్నది. సాధన సామాగ్రి లేకుండా అతడు సృజించ గలడు. బ్రహ్మ అస్తిత్వమునకు సాక్ష్యము సుషుప్త్యావస్థయే బ్రహ్మ అనగా అచేతన ప్రకృతియనిగాని, జీవాత్మయనిగాని తలుపరాదు. అతడు సర్వ ధర్మ స్వరూపియు, నాంతరంగిక ధర్మమును, మార్గ దర్శకుడై యున్నాడు. స్వేచ్ఛత, సత్యసంకల్పము, సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్వం మొదలగునవి యున్నియు నాతని గుణములు. విశ్వజ్యోతియు, విశ్వప్రాణమును, ఆత్మజ్యోతియు నాతడే పర మాత్మయే సర్వవస్తు మూలాధారమును, నిర్వికారభక్తి పూజార్హుడునై యున్నాడు. బ్రహ్మయే సర్వభౌతిక ద్రవ్యములను సృజించెను. ప్రకృతి భూత వ్యాపారముచే జగత్పరిణామము సంభవించు చున్నను, దానికా పరిణామ శక్తిని బ్రహ్మయే ఇచ్చి ఉన్నాడు. బ్రహ్మ అచేతన పదార్థములను, పంచభూతములను సృజించి వానిలో ప్రవేశించెనని చెప్పబడెను. కావున పంచభూతాంతర్వ్యక్తి యగు బ్రహ్మయే ఇతర వస్తూత్పత్తికి కారణమగుచున్నాడు.

ఒక వస్త్రమును మడతపెట్టినప్పుడు దాని స్వరూపమును సరిగ్గా వ్యక్తీకరించదు. మడత విప్పినచో దాని స్వరూపము సంపూర్ణముగా ప్రదర్శితమగును. రెండు సమయములలోను వస్త్ర మొకటేయైనట్లు, కారణ కార్యములొకటేయైనను, వాని గుణ ములుభిన్నములై గోచరించును. కుండ మట్టినుండి వేరుగానట్లే జగత్తుకూడా బ్రహ్మమునుండి వేరు కాదు. పరిమిత వస్తువులు బ్రహ్మరూపాంతరములుగా యదార్థములే. ప్రపంచము మిథ్యయు కాదు, స్వప్నదృశ్యము వంటిదియు కాదు. అది ఒక యదార్థ స్వరూపమై, సృష్టి స్థితి లయములను బ్రహ్మయందే కలిగియున్నది. అగ్నికి వేడియున్న రీతినే సృష్టిచేయుశక్తి శుద్ధ నిష్కల బ్రహ్మము

నకు గలదని బాదరాయణుడు విశ్వసించును. పర బ్రహ్మలీలకొరకు దానెట్టి మార్పును పొందకుండా ప్రపంచముగా పరిణమించును. ఇది ఎట్లు సాధ్యమో చూపనవసరము లేదని, శ్రుతి ప్రమాణమును శంకించుటకు మనకెట్టి అధికారము లేదు గావున విడిచిపెట్టెను.

జనన మరణములు శరీరసంబంధములు. జీవాత్మకర్త. ఆత్మ నిత్యము, అణుపరిమాణము కలదని చెప్పబడెను చందన తైలము కొంచెమైనను దేహమునంతను పరిమళింపచేసినట్లే, జీవాత్మ అణురూపిదైనను దేహమునంతను వ్యాపించియున్నది. బాదరాయణుడు పరబ్రహ్మ జీవాత్మలో నున్నదని అంగీకరించును కాని పరబ్రహ్మ స్వభావము జీవాత్మ లక్షణములచే సంగమ దోషము నొందదని వచించెను రవి, రవికాంతియువలె పరబ్రహ్మ, జీవాత్మ భిన్నములు, రవికాంతి మేఘములచే ఆచ్ఛాదింపబడినను, రవి కంటనట్లే, జీవాత్మకు కలుగు సుఖదుఃఖములు బ్రహ్మకంటవు. జీవాత్మ కర్మచేసి ఫలమనుభవించును. జీవాత్మ - పరబ్రహ్మకు గల సంబంధం ఎట్టిదో బాదరాయుని సూత్రములలో స్పష్టముగా వివరించలేదు. పలువురి భావములనుసమీక్షించి మాత్రమేయున్నాడు.

జీవాత్మ పరబ్రహ్మాంశమని యాశ్మరథుడు తలచెను.

సుషుప్తిలో జీవాత్మ తాత్కాలికముగా బ్రహ్మతో సంయోగము నొందునని ఔడులోమి మతము.

పరిపూర్ణ బ్రహ్మమే జీవాత్మ స్వరూపమని కాశకృష్ణుడు భావించెను.

బ్రహ్మకును, జీవునికిని గల భేదము నిత్యమైనదనియు, మోక్షానంతరము కూడా నీ భేదముండుననియు చెప్పినాడు. వ్యక్తుల కర్మయే మానవులలోని భిన్నతకు కారణము. సుఖదుఃఖములు దేవుని లీలలు కాదు. మానవుల పూర్వజన్మకర్మ దేవుని స్వాతంత్ర్యమును బంధించును. బ్రహ్మకు పక్షపాతము లేదు. కర్మక్రమము

ననుసరించి, జీవుల కర్మఫలితముల కనుగుణముగా సుఖదుఃఖముల నిచ్చుచున్నాడు. బ్రహ్మసూత్రములకు భాష్యములును వ్రాయుచూ, తానెట్టి మార్పును పొందకుండా బ్రహ్మము జగముగా పరిణమించు నని శంకరుడు బ్రహ్మము నిజముగా మార్పునొందెనని రామానుజ వల్లభులు వాదించిరి.

## శంకరుని అద్వైత సిద్ధాంతము A. D. 800

ప్రపంచమునకు మూలములు రెండు అని చెప్పునవి ద్వైత సిద్ధాంతములు ఉదా-సాంఖ్యుల ప్రకృతి-పురుషులు రెండు కాదు ఒకటే సత్యం. నిర్గుణ బ్రహ్మమే సర్వమూలము, సత్యము అని చెప్పునది అద్వైత సిద్ధాంతము. బాదరాయణ సూత్రాలకు శంకరుడు వ్రాసిన భాష్యము అద్వైత సిద్ధాంతానికి ప్రాతిపదికగా సర్వత్రా అంగీకరించ బడుతుంది. హిందూ తత్వ శాస్త్రంలోని వివిధ శాఖలకంటె ఉన్నతమైనదిగా శంకరుని అద్వైతం నేటి తాత్విక ప్రపంచంలో గుర్తింపబడుచున్నది. కావున దానిని లోతుగా పరిశీలించవలసిన అవసరముంది. బుద్ధుని తర్వాత నంతటి వినయశీలి, సద్గుణ సదాచార సంపన్నుడు,యతిశేఖరుడు శంకరుడేనని గుర్తింపబడ్డాడు ఆ నటికి శివభక్తులైన అడియారులు, వైష్ణవ భక్తులగు ఆళ్వార్లు దైవభక్తి ప్రచారము చేయుచుండిరి. జైన బౌద్ధములు క్షీణదశయందున్నవి మీమాంసకులు వేదోక్త కర్మాదిత్వమును జ్ఞాన సన్యాస మార్గములు నిష్ప్రయోజనములని ప్రచారము చేయుచుండిరి. క్రీ శ, 650లో భర్తృహరి, క్రీ. శ. 730లో గౌడపాదుడును అద్వైత సిద్ధాంతములను ప్రతిపాదించియుండిరి. శంకరుడును అద్వైతము మాత్రమే పరస్పర విరుద్ధ తత్వ భావసామరస్యమును కూర్చి సమన్వయింప సామర్థ్యము గలదని తలచెను. గౌడపాదుని అద్వైతములో గల ప్రధాన లక్షణములివి.

1. జీవబ్రహ్మైకత్వము

2. మాయావాదము
3. పరమార్థమును చెప్పుటకు కారణ ధర్మము నిరుపయోగమను నిర్ణయము
4. వ్యావహారిక పారమార్థిక జగద్విభాగము
5. మోక్షైక సాధనము జ్ఞానమే అను ప్రవచనము
6. పూర్ణ శూన్యతదురూహ్యమను ప్రకటనము.

స్వప్నమందు వలనే మెలుకువలో చూసినవస్తువులు అసత్యములు, మనకు దృశ్యమగుచున్నది ప్రతిదీ అసత్యమే. రజ్జువును సర్పముగా చూచుట ఎంత మిథ్యయో, రజ్జువుగా చూచుటయు నంతే మిథ్య. కలలున్నంతసేపు స్వప్నావస్థ నిజము. సుషుప్తి కలుగనంతవరకు జాగ్రదావస్థ నిజము. సుషుప్తిలో జాగ్రదావస్థయును అసత్యమే. సుషుప్తిలో వస్తువులన్నియు ఏకచైతన్య రాశిలో కరిగి కలిసిపోయినట్లగపడును. ఏఅనాదియగు మాయానిద్ర నుండి జీవిమేల్కొని, నిత్యము అద్వితీయమునగు ఆత్మ సాక్షాత్కారము గాంచునో ఆ అవస్థలో ఈ స్వప్న, జాగ్రత, సుషుప్తావస్థలు మూడును అసత్యములేయని తోచును.

జాగ్రత్ప్రపంచము లోని వస్తువులకు లక్షణములైన దేశ, కాల, నిమిత్త సంబంధములు పరమ సత్యములని మనము ఊహింపనవసరము లేదు. "ఏది స్వయం సంపూర్ణమో, ఏది స్వయం స్థితి కలదో, ఏది స్వయం సంభూతమో, ఏది కారణాంతర తాత్కాలిక స్థితికలదో, దేనిస్థితి అవిచ్ఛిన్నమై వెలయునో అదియే వస్తుస్వభావము. ఈ విధముగా పరీక్షించినప్పుడు జీవులు, బాహ్యవస్తు జగత్తుయు నిత్యస్థితి కలవి కాదనియు, ఆత్మ స్వరూప మాత్రములే అని స్పష్టమగుచున్నది వస్తువులన్నియు కారణ-కార్య సంబంధములతో మనకు గోచరించుచున్నవి. ప్రతిదానికి దాని కారణమును వెతుకుతూ పోయేట్లయితే అది నిత్యకారణ ముండవలెను. ఆ అది

నిత్యకారణమునుండి ఈ ప్రపంచ పరిణామము జరుగుచున్నదని అంగీకరించవలెను. అంటె ఆ ఆది నిత్యకారణము కూడా మార్పు చెందుచున్నది మార్పు చెందునది నిత్యమెట్లు కాగలదు? తాము స్వయముగా నిజములై (నిత్యములై) వస్తువులనుత్పాదించు వానిని మన మెచటచూడజాలము కావున కారణ-కార్యములు, అనిత్యములు పరస్పరాధారభూతములై, కలిసియే అదృశ్యమగును. సత్పదార్థము అసత్పదార్థమునకు కారణము కాజాలదు. అలానే అసత్పదార్థము సత్పదార్థమునకు కారణము కాజాలదు. అసత్పదార్థమనగా లేనిదే. ఏది ఉన్నదో అది లేకుండా నుండదు. ఏది లేనిదో అది ఎన్నడు నుండజాలదు. కనుక ఏదియు స్వయముగా గాని, అన్యముచేగాని జనించి యుండలేదు. ఉత్పత్తి, నాశనములు మిథ్యారూపములే. ఏదియును పుట్టను లేదు, నశింపను నశింపదు. కారణాది సంబంధములను త్రోసి పుచ్చి ప్రపంచాతీతులమైనగాని సత్యము లభింపను ఆత్మ ఒక్కటే సత్యమగు ద్రష్ట.

బాహ్య వస్తువులన్నియు అసత్యములని నిరూపించుటకు గౌడపాదుడు బౌద్ధ విజ్ఞాన వాదమునే స్వీకరించెను. మానవుని మనస్సులోనే జగత్తు ఉన్నది. యదార్థ జగత్తుగా గోచరించునదంతయు మానసిక సంస్కారసముచ్చయము మాత్రమేననియు, దాని కనుగుణముగా బాహ్య వస్తువులు లేవని ప్రకటించెను. "ఏది మొదట లేదో, చివర నుండదో అది మధ్యమందు కూడా లేనిదే" అను హేతువు వలనకూడా జగత్తు మిథ్య అని తెలుస్తుంది. దేనికి ఆది అంతములు కలదో అది నిత్యము కాజాలదు. మన కనుభవమగు జగత్తంతయు అనిత్యమగుటచే నిత్యమైన దేదో యుండవలెను. అదియే ఆత్మ అని ఉపనిషత్తులు చెప్పినవి. ఆత్మ అవిభాజ్యము. ఏలన అందు భాగములున్నచో నానాత్వముండును. సత్ అనగా జ్ఞానమే. కాకున్నచో అదిఏకము కాజాలదు. కావున

జ్ఞానమే సత్పదార్థము. కాని ఇది విషయావసరములతో కూడిన వ్యావహారిక జ్ఞానముకాదు ఇచట జ్ఞానము అనగా ఆత్మ ప్రకాశము, అది ఎన్నడు పుట్టనిది. నిద్రయు స్వప్నము లేనిది, తన్ను తాను ప్రకాశింప చేయునది స్వయం ప్రకాశము గలది. అదియే శుద్ధజ్ఞానము.

సత్పదార్థము మార్పు నొందునది కాదు. కావున పరిణామ మంతయు అసత్యం వ్యావహారిక దృష్టికి మాత్రమే సత్యం ద్రష్టకు దృశ్యమునకు భేదము లేదు. అవస్థాభేదరహితమగు ఆత్మ, దర్శించుటకు దానే తప్ప వేరొద్దియును లేదు. సృష్టిదైవ విభూతి యని కొందరందురు, కేవలం స్వప్నమాయ వంటిదని కొందరందురు. దైవ సంకల్పమని కొందరు వచింతురు. కాలమునునమ్ము వారు కాల సంభూతమని భావింతురు. సృష్టి భోగార్థమని కొందరు తలుతురు, వీటినన్నిటిని తిరస్కరించి సృష్టి దేవుని స్వభావమని గౌడపాదుడు చెప్పెను. ఇచట గౌడపాదుడు మాయ అనగా అద్భుతశక్తి అని అర్థములో వాడెను. అది ఆత్మస్వభావ మనెను. సత్య ప్రకాశ స్వరూపమగు నాత్మను, ఆత్మ స్వభావమైన మాయయె ఆచ్ఛాదించును, మానవ దృష్టికి సత్యము గోచరింపకుండ మరుగు పరుచు అనాది యగు విశ్వశక్తియే మాయ అనియు చెప్పబడెను అవ్యాకృత మగు నిర్గుణ బ్రహ్మ మాయతో కలిసి ఈశ్వరుడై, నానా జీవరాసుల నుదయింప చేయుచున్నాడు.

ఉపనిషత్తులలో పరబ్రహ్మను గూర్చి నిర్గుణ, సగుణ భేద వర్ణనలున్నవి. పర, అపరవిద్యాభేదము వలన వానికి సమన్వయము కూర్ప శంకరుడు యత్నించాడు. రెండును నిజములే. ముక్త పురుషునికి బ్రహ్మము నిర్విశేషలక్షణములలో నిర్గుణముగాను, సంసార బద్ధునికి సవిశేష లక్షణములతో సగుణుడైన ఈశ్వరునిగాను కన్పటును. ప్రతి వ్యక్తియు తన ఆత్మాస్తిత్వమును స్వీయాను

భవంలో నిత్యము గాంచుచునే యున్నాడు. అందుచే దేకార్టె (ఆధునిక తత్త్వవేత్త) వలెనే "నేను" లేనని ఎవ్వడూ తెలుప జాలడు. బుద్ధికిని దాని ప్రవృత్తికిని మూలాధారమై చిత్స్వరూపమున నున్న ఆత్మ వానికన్నిటికి భిన్నమై స్వతః ప్రకాశమై వెలుయుచున్నది. ప్రాణశక్తియు ఇంద్రియములు, అంతఃకరణము అహంకారము, ప్రవృత్తియు, ఆత్మ సంబంధులై ఆత్మపై ఆధారపడియున్నవి. బుద్ధి ప్రవృత్తి యగు విజ్ఞానము అనాత్మ రూపమగుట చేతను, అవిద్యా కలుషితమగుట చేతను విజ్ఞానము వలన ఆత్మ నెరుగుట దుస్సాధ్యము. నిత్యజ్ఞానస్వరూపమే ఆత్మలక్షణము ఆత్మయు జ్ఞానము నొక్కటే

'నేను'ను "నేను కానిదాని" నుండి వేరు చేయవలెను. బాహ్యజగత్తు, ఇంద్రియములు, దేహము, మనస్సు, అహంకారము మొదలగున వన్నియు నేను కాని దానిలో చేరును. ఎడ తెగక మారుచుండు మానసికావస్థల కాధారభూతమైన అహంకారమునకు సంబంధించిన 'నే'నను భావము ఆత్మ అని పొరబడరాదు. ఆత్మయందు ప్రవృత్తి లేదు. కాగా అహంకారము సర్వప్రవృత్తికి మూలము, దుఃఖహేతువు శంకరుని పరమాత్మ జీవాత్మయు కాదు. జీవాత్మ జాలమంతయు పరమాత్మపై నాధారపడియున్నవి. అంతఃకరణమునకు రూప వికారములున్నవి. వస్తువులను ప్రదర్శించు వికారమునకు వృత్తి అందురు. అంతఃకరణవృత్తులు నాలుగు విధములు, సంశయము, నిశ్చయము, గర్వము, స్మరణములు. సంశయావస్థలో నున్నదానిని మనస్సు అనియు, నిశ్చయావస్థలో నున్న దానిని బుద్ధి యనియు, గర్వములో నున్న దానిని అహంకారమనియు, ఏకాగ్రత స్మరణములతో నున్న దానిని చిత్తమందురు. ఈ అంతఃకరణము భిన్న వ్యక్తులలో భిన్నముగా నుండుటచే వారి జ్ఞానములును భిన్నములే వారి పూర్వ సంస్కారముల వలన భిన్న

పరిణామములలో వర్తించును.

జ్ఞానాధారములుగా ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణ ముల నంగీకరించెను శబ్ద ప్రమాణమునకు విశేష ప్రాధాన్యం ఇచ్చాడు. వేదములు అపౌరుషేయములు, దైవ సంకల్ప రూప ములు ప్రత్యక్షమునందు లేదా నేత్రమును ఒక విషయముపై నిలిపినపుడు అంతఃకరణము ఆ విషయము నొద్దకు పోయి దానిని ప్రకాశింపచేసి, దాని రూపమునొంది దానిని గ్రహించును. అంత రంగిక ప్రవృత్తిచే భౌతిక స్పందనములు మానసిక వృత్తులుగా మారునని తెలుపబడెను. శంకరుని తత్వములో మూడు విధము లగు అస్తిత్వము కలదు

(1. పారమార్థికమైన బ్రహ్మ పదార్థము
(2) వ్యవహారికమైన దేశ కాల నిమిత్తమగు బాహ్యవస్తుప్రపంచం
(3) ప్రాతి భాసికమైన భ్రాంతి (రజ్జు సర్ప భ్రాంతి)

కార్యకారణ వాదము:— నూనె, నూనెగింజలనుండి మాత్రమే వస్తున్నది. అంటే కార్యమైన నూనె అవ్యక్త రూపంలో కారణ మైన నూనెగింజలలో ఉన్నదన్న సాంఖ్యుల సత్కార్య వాదము నంగీకరించెను. ఏలన అదివరకు లేనిదేదియు క్రొత్తగా జనింపదు. కారణమందు కార్యముగా మారు అతిశయశక్తి ఒకటున్నదని చెప్పబడెను. కారణ కార్యములు ఒకే వస్తువుయొక్క రెండు రూపములు. మూల వస్తువు మారదు. బాహ్య రూప భేదములే మారుచున్నవి. మట్టి కుండయందు నిలిచియే ఉన్నది. ఒకే నటుడు భిన్న పాత్రల వేషముల నాడినను, నొకే వ్యక్తి. కారణ-కార్య ములు అభిన్నములు. మార్పు అనునది అవస్థా భేదమేగాని వస్తు పరివర్తనములేదు. కారణ కార్యములకు అభేదమే శంకరుడంగీక రించిన వాదము. కారణమే నిజమైన వస్తు స్వరూపము అనియు కార్యము తదాభాస మాత్రమేననియు చెప్పనగును. దీనినే వివర్త

కాదంటారు, వివర్త మనగా తలక్రిందులగుట. దేశకాల ద్రవ్య పరిమితములగు జగత్తు బ్రహ్మ యొక్క వివర్తరూపం. మూల ద్రవ్యం పరబ్రహ్మము. కుండ మట్టిపై నాధారపడును కాని మట్టి కుండపై నాధారపడదు అలానే జగత్తు బ్రహ్మపై ఆధారపడును గాని బ్రహ్మ జగత్తుపై నాధారపడ లేదు.

బ్రహ్మపదార్థము:— సర్వ వస్తువులు పరిణామ వశములను బౌద్ధ భావముతో శంకరుడేకీభవించుచు, ఈ పరిణామ జగత్ గర్భస్థమై ఒక ఇంద్రియాతీతమగు సత్యమున్నదని నిశ్చయించెను. అన్యాధారముతో నిమిత్తములేని ఒక సత్పదార్థముండి తీరవలెను. కాల్పనిక వస్తువులైనను నిరాధారముగా వియన్మధ్యమున గాలిలో నెగుర జాలవు. సర్వ జగత్ మూలమే బ్రహ్మపదార్థము లేదా పరబ్రహ్మ లేదా శుద్ధ చైతన్యము. కారణ లక్షణమును స్వభావమనియు, సామాన్యమనియు, కార్యమును అవస్థ లేదా విశేష మనియు చెప్పినాడు. ఈ సామాన్యములన్నియు మహాసామాన్యము లేదా బ్రహ్మ స్వభావములో నిమగ్నమై యున్నవి. బ్రహ్మ ఒక ద్రవ్యము కాదు, కాని సర్వమూలము. దేశగతము కాదు, కాని సర్వదేశములందు వ్యాపించియున్నది. బ్రహ్మము కారణము కాదు తద్భిన్నమును కాదు. దాని స్వభావము అనిర్వచనీయము. దేశకాలగతమై ఇంద్రియ గోచరమగుచున్న ప్రపంచమునకు భిన్నమైనది. పరిమిత మానవుడు బ్రహ్మ నెరుగ గల్గినచో అతనిబుద్ధి అనంతమైనా కావలయు లేదా బ్రహ్మము పరిమితమైనా కావలయును. కావున దానినిగూర్చి ఎట్టి తర్కజ్ఞానమును సంపాదించలేము. అది వ్యవహారిక దృష్టికతీతమైన పారమార్థిక శుద్ధజ్ఞాన చైతన్యము వ్యవహారజ్ఞానము అంతఃకరణ వికారమే బ్రహ్మ నిర్గుణమే యైనను, సచ్చిదానందములు దాని స్వరూప లక్షణములనియు, సృష్టికర్తృత్వాధికములు దాని తటస్థ లక్షణము

లనియు చెప్పవచ్చును. బ్రహ్మయే తర్క-కల్పితములగు మూస లలో గరిగించి పోసిన ఈశ్వరుడగును. అవిద్యయే సృష్టి కర్తృత్వము మొదలగు లక్షణములను బ్రహ్మకు ఆరోపించును.

ఈశ్వరుడు:— సగుణ బ్రహ్మ రూపమగు ఈశ్వరాస్తిత్వమును నిరూపించుటకు ఏ తర్క-వాదములు పనికి రావనియు శ్రుతియే దానికి ప్రమాణమని వక్కాణించెను. సాంఖ్యులు చెప్పినట్లు ప్రకృతి జగత్కారణము కాదు. ఏలన ప్రకృతి అచేతనము. కుమ్మరి చేతిలో మట్టి అనేక రూపముల నొందుటకు అనుగుణమై యున్న రీతినే జడపదార్థమైన ప్రకృతియు నొకవివేకవంతుని వశమై నడుపబడు చున్నది. అనంత జన్మములనుండి వచ్చుచున్న కర్మఫలములను అనుభవించుటకు అనుగుణమైన రంగముగా చేయుటే సృష్టిప్రయో జనము. ప్రకృతి ఇట్టి కార్యము చేయలేదు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తి సమన్వితుడు. ప్రకృతికి ఆత్మయు, సృష్టికి మూలధర్మ మును, జగచ్చలన శక్తియు చైతన్యదాతయు, సర్వవస్తు జీవ కారణ మనియు చెప్పవచ్చును. చైతన్యమును, ప్రవృత్తియు ప్రపంచకారణములై యుండవలెను. ప్రపంచ రచనాక్రమము ఒక వివేకము గల యజమానిని సూచించుచున్నది. మీమాంసకులు, మనవుల కర్మ ఫలముల నొక క్రమరీతిని అనుభవించుటకు కార ణము అపూర్వ మందురు. అపూర్వము అనాత్మ రూపమగుటచే దాని ప్రవృత్తికి ఇంకొక ఆత్మశక్తి అవుసరమని శంకరుడు ఖండిం చెను. పలునాస్తిక ప్రశ్నలకు ఈ విధముగా చెప్పియున్నాడు.

1) పరిశుద్ధాత్మ స్వభావుడగు నీశ్వరుడు కలుషము నాత్మవిరహిత మగు ప్రపంచమునకు కారణము కాజాలడన్న వాదమునకు, జడము లైన నఖ కేశాదులు జీవచైతన్యముగల మన శరీరమునుండి ఉత్పత్తి మగుటలేదా! అని సమాధాన మిచ్చెను.

2) ప్రపంచము ఈశ్వరుని వలన పుట్టి ఈశ్వరుని యందే చేరు

చున్నచో అట్లు చేరునప్పుడు ప్రపంచ గుణములైన జడత్వము, ద్రవ్యత్వము, మౌఢ్యము, కాఠిన్యము, పరిమితత్వము పొందలగునవి ఈశ్వరునిలో చేరి ఈశ్వరుని కలుషిత మొనర్చును కదా! అను ఆక్షేపణమునకు, కార్యములు కారణములో చేరునప్పుడవి తాని విశేషలక్షణములను దిగవిడచి స్వర్ణాభరణములు స్వర్ణములో కలియునట్లు, సమస్త ప్రపంచం ఈశ్వరునిలో చేరునని చెప్పెను.

3) ప్రపంచమీరీతిగా విశేషలక్షణములను గోల్పోయి. ఈశ్వరునిలో లయమందిన తర్వాత పునఃసృష్టిలో జీవులలో భేదము లేల? అను ప్రశ్నకు పూర్వజన్మ కర్మఫలములని చెప్పెను.

4) కొందరికి దుఃఖము కొందరికి సుఖమును కల్గించువాడు అధర్మపరుడు అన్న ఆక్షేపణమునకు కూడా కర్మ సూత్రమునే వచించెను జీవుల కర్మల కనుగుణమైన సృష్టినీశ్వరుడు చేయుచున్నాడు. పూర్వకర్మ ఫలానుభవ రంగమే లోకము కావున ఈశ్వరుడు ఆ భేదములకు కారణము కాదు. వనములోని మొక్కలు తమ తమ సత్వములనుబట్టి పెరుగును. వనరక్షకుడు బాధ్యుడు కాడు. శంకరుడు ఈశ్వరుని వర్షముతో పోల్చెను. వర్షము అన్ని మొక్కలకు సమానముగానే కురియును కాని బీజబలమునను సరించి మొక్కలు వివిధరీతులలో పెరుగును.

5) ఆది సృష్టియందు జీవులకు పూర్వకర్మ ఫలములంటూ ఉండుటకవకాశము లేదుకదా! అప్పుడు దుఃఖము లేకుండా ఈశ్వరుడేల సృజించలేదు? అన్న ప్రశ్నకు ప్రపంచమునకు ఆది లేదు. అంతము లేదు అందులో సృష్టి లయాదుల వివిధ ఘట్టములు మాత్రమే. పుణ్యాపాపములు లేకుండా ఎవ్వడు జన్మింపడు. జన్మించినవాడు పుణ్యాపాపములు చేయకుండానుండడు. సృష్టికాది లేదు. ప్రతిజీవి ప్రస్తుత జన్మమునకు ఒక పూర్వజన్మ కారణము. కల్పాంతమందుకూడా కర్మసూత్రము వర్తించును.

6) ఈశ్వరుడు స్వతంత్రుడైనచో నాతనికి సృజించనవసరము లేదు. ఒక ఉద్దేశముతోగాని కోర్కెతోగాని లోకమును సృజించె నన్నచో నాతడు పరిపూర్ణుడు కాడు. దేవుడే ఏకైక కారణ మైనచో, కార్యమైన ప్రపంచము లేదా సృష్టియంతయు ఒక్క సారే కనప్పట్టవలెను. కాని భిన్న దశలతోకూడిన క్రమపరిణా మమునే మనము చూచుచుంటిమి కదా! అను ప్రశ్నకు — బాహ్యమునుండి ఏ కర్మయు నిర్ణయింపబడదు. కర్మకు వెనుకనున్న ముఖ్యోద్దేశము దానిని నిర్ణయించును. ఈశ్వరునికర్మ ఎట్టిప్రయో జనము లేని స్వభావసిద్ధమైన లీలయని చెప్పబడెను. మనుజుడు ఊపిరి పీల్చుట విడుచుట స్వాభావమైన రీతినే దైవస్వభావము యొక్క బాహ్య ప్రసరణమే సృష్టి అనవచ్చును. దేవుడు సృష్టిచేయకుండా నుండజాలడు. ఆనందాతిశయముచే ఈశ్వరుడు తన శక్తి చైతన్య ముల నావిష్కరించినాడు. తృణ బ్రహ్మ పర్యంతముగల సర్వ జీవరాసులు నా దేహమే అని గీతాకారుడు చెప్పియున్నాడు. కార్యకారణములొకటే యైనట్లు ఈశ్వరుడు జగత్తునొకటే అంటే అవి రూపములలోగాని బాహ్య పరిణామము వికారములలోగాని సమానములు గావు. వానియందున్న బ్రహ్మ పదార్థముచే నవి సమానములు.

ఈశ్వరునికి జీవాత్మకు గల సంబంధము వస్తువు దాని ప్రతి బింబమునకు గల సంబంధము వంటిది. ప్రతిబింబమునకు ఎట్టి దోషము కల్గినను, వస్తువునకంటనట్లే జీవాత్మ దుఃఖానుభవంతో ఈశ్వరుడు భాగస్వామి కాడు. ప్రకృతికి మూలాధారము లేదు. కనుక అది ఈశ్వరునిలో ఒక అంశగా తెలుపబడినది. ప్రకృతి సమన్వితుడగు ఈశ్వరుడు ప్రపంచమునకు ముఖ్యకారణము. జీవాత్మమూలమున నాతడు ప్రకృతిలో ప్రవేశించినాడు. భిన్న కార్యములు ఒకే కారణమునుండి ఉదయించునవియు, ఒకేభూమి

నుండి భిన్నలక్షణములుగల శిలలు లోహములు నెట్లుత్పన్నము లగుచున్నవో అట్లే ఒక ఈశ్వరునినుండి భిన్న వస్తువులు, భిన్న జీవులుద్భవించునని చెప్పబడెను. నూతన దృక్పథమునుండి చూచి నచో ప్రపంచ పరిణామమునకు హేతువు చూపవలసి యున్నది. మార్పులేని బ్రహ్మ దానికి కారణము కాజాలదు. పరిణామ జగత్తునకు అచేతన ప్రకృతి కారణము కాజాలదు. కావున ఒకటే ఉపాయమున్నది నిత్యత్వమును, పరిణామమును రెంటిని తనలో కల్గిన సగుణ బ్రహ్మ లేక ఈశ్వరుని మనమంగీకరించటయే. మూల మున ఏకమగు నిర్గుణ బ్రహ్మపదార్థము బహిర్గతమై, ఈశ్వర, జీవ ప్రకృతి ప్రపంచత్రయమై సృష్టిరూపము తాల్చుచున్నది. ఈశ్వ రుడు బ్రహ్మయొక్కయు ప్రకృతి యొక్కయు మిశ్రమ రూపము. ఈశ్వరుడు శుద్ధచైతన్యముకాదు. స్వీయజ్ఞానముగల వ్యక్తి. బ్రహ్మకును జగత్తునకు మధ్యవర్తియై రెంటి స్వభావములు కలిగి యుండు వాడే ఈశ్వరుడు.

జగత్తుమిథ్య - మాయ - అవిద్య :— శంకరుని దృష్టిలో ఏది యదార్థమైనదో అది మార్పులేనిది, స్వయం సమృద్ధమైనది. కాని బాహ్యప్రపంచమున ప్రతివస్తువు తన పరిమితత్వము నేగాక ఇంకొక వస్తువుపై ఆధారపడియుండు వైరుధ్యమును కూడా ప్రదర్శించు చున్నవి. అంతేగాక ప్రతివస్తువు తన రూపమునుండి వేరు రూప ముగా మార్పుచెంద ప్రయత్నించుచున్నది. కావున ఈ లక్షణ మొకటియే బాహ్యప్రపంచం యథార్థం కాదని మాయనని నిరూ పింప సమర్థమైనది. దేశకాల నిమిత్తములను మూసలలో పోసిన మన అనుభవము సత్యము కాదు. సత్యము సర్వకాలికము నిత్యత గలది. నిత్యమగు నెద్దానికి అది యుండదు. అది కలదేదియు నిత్యము కాదు. మార్పునొందునది పరివర్తనాత్మకమగు జగము నిజము కాదు. ఈశ్వరుని లక్ష్యము అసత్పదార్థమును జయించి,

సత్యదార్థముగా గావింపచూచును. ఈ సంఘర్షణమే ప్రపంచ పరిణామక్రమము. సృష్ట్యాది నుండియు వెలుతురు చీకటిపై దండయాత్ర చేయుచునేయున్నది. కాని చీకటి నెన్నడు తొలగింపలేదు. పారద్రోలగలదు. ఈశ్వరునియందు కూడా అసద్రూపమున్నది. బ్రహ్మమే నిజమైన సద్రూపము. ప్రపంచమునకు స్థిత్వము లేదు, లేకపోనూ లేదు. అందుచే అనిర్వచనీయము. దృశ్యమాన ప్రపంచమునకు సత్తే మూల కారణము కావలెను. ఏలన మరొద్దియు లేదు. కాని ప్రపంచము యదార్థము కాదు. కావున అది సత్తుయొక్క వికల్పమని లేదా మాయ అని చెప్పబడెను.

సత్యమగు బ్రహ్మకు, అసత్యమగు జగత్తునకు గల సంబంధమెట్టిది? బ్రహ్మమే జగత్తు అనియు కాదనియు కూడా చెప్పవలసియున్నది. జగత్తు బ్రహ్మమే ఏలన బ్రహ్మేతరమేమియు లేదు. జగత్తు బ్రహ్మకాదు ఏలన జగత్తునకుగల జనన లయాధికములు బ్రహ్మకు లేవు. కొన్ని అవరోధములచే ఆచ్ఛాదింపబడిన అపరిమిత వస్తువే పరిమితవస్తువు. మాయచే ఆవరించబడిన బ్రహ్మయే ప్రపంచం. కావున బ్రహ్మ జగత్ సంబంధం అనిర్వచనీయం. అపరిమితమగు బ్రహ్మము పరిమిత జగత్తును సృజించెనన్నచో పరిమితత్వ దోషము బ్రహ్మకును వర్తించును. బ్రహ్మజగత్సంబంధం కార్యకారణ సంబంధంకూడా కాజాలదు. ఏలన దేశకాలగతములగు భిన్నదశారూపములకే కారణకార్య సంబంధము అన్వయించును. జగత్తు పరమాత్మనుండి ఎట్లుద్భవించినదో మనమూహింపలేము. మాయావి తన ఇంద్రజాల శక్తిచే నొక వృక్షమును శూన్యమునుండి సృజించును. వృక్షము మన ఎదుటనున్నమాట నిజమే. అది ఎట్లు వచ్చినదో మనకు తెలియదు. గావున మాయ అందుము. రజ్జువు సర్పముగా గోచరించునట్లే బ్రహ్మ జగత్తుగా గోచరించునని మాత్రమే చెప్పగలము.

మాయ అనగా ఒక విభాగించుశక్తి, పరిమితత్వము నుద్భ వింపచేయునియతి, రూపరహితమగు దానికి రూపకల్పనము చేయు సూత్రమని నిర్వచింపబడెను. మాయ పరమాత్మయొక్క లక్షణమే. మాయతో కలిసిన పరమాత్మయే ఈశ్వరుడగును అగ్ని యందు ఉష్ణమువలె ఈశ్వరునియందు మాయ ఉన్నది. మాయ లేకున్నచో జగత్ దృశ్యము కారణహీనమగును. బ్రహ్మవలె మాయ నిజంకాదు. గగనకుసుమంవలె అసత్యంకాదు. కావున అనిర్వచనీయము. అది బ్రహ్మయొక్క వృత్తిరూపమై ప్రపంచ హేతువగుచున్నది. సత్యమును కప్పిపుచ్చి అసత్యమును ప్రద ర్శించునది. అనేకత్వముతో కూడిన ప్రపంచం, ఏకసత్యము నాచ్ఛాదించుచున్నది. అవ్యక్తరూపముననున్న ప్రపంచమును వ్యక్తమొనర్చు స్వగతమైన ఈశ్వరుని శక్తియే మాయ. మాయ భౌతికాధారము. అది అనేక వికారములను పొంది ప్రకృతి క్రమ మునుదయింప చేయుచున్నది. సాంఖ్యుల ప్రకృతివలెగాక ఇది దేవునిపై ఆధారపడియున్నది. అది ఈశ్వరుడు తనపై కల్పించు కొనిన పరిమిత్వాకారూపము. ప్రపంచం సహేతుకాస్తిత్వము లేనిది, మిథ్యాస్వరూపమగుటచే మాయ అనిరి.

అనేకత్వ దర్శనమునకు కారణము దేశకాల నిమిత్త ధర్మ ముల ననుసరించి పనిచేయు బుద్ధియే, అవిద్యాశక్తియే మనల సంసార ప్రవాహమున త్రోయుచున్నదని చెప్పబడెను. ఏకము అద్వితీయమగు బ్రహ్మపదార్థము ననేకముగా విచ్ఛేదించు పరిమిత మానవాత్మ యొక్క మానసిక లోపము అవిద్య. వస్తువులను యదాస్థితిలో చూడజాలని మనస్సుయొక్క వక్రతయే అవిద్య. రజ్జువును రజ్జువుగా గుర్తించినంతనే సర్పదృశ్య మదృశ్యమైనట్లే బ్రహ్మదర్శనముతో జగద్రూపము అంతరించిపోవును. ఇచట జగత్తు నిర్మూలింపబడుటలేదు. అది వేరొక రూపమున గోచరిం

చును. బాహ్య ప్రపంచం అసత్యమేగాని భ్రాంతికాదు. జీని కేవలము అసత్పదార్థముకాదు. బౌద్ధుల విజ్ఞానవాదాన్ని ఖండిస్తూ అన్నం తిన్నప్పుడు కడుపునిండుతుంది రాయి తగులునప్పుడు నొప్పి కల్గుతుంది. ఇవన్నీ మిథ్య కాదు కావున బాహ్య ప్రపంచ యదార్థతను అంగీకరించలేమనడం తప్పు. కావున సత్యాన్ని వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం అని విభజించాడు. స్వప్న జగత్తునకంటె అధికమైన యాదార్థ్యం వ్యావహారిక ప్రపంచమునకు గలదు. అయితే బ్రహ్మజ్ఞాన ప్రాప్తిలో వ్యావహారిక జ్ఞానం మిథ్య అని తెలియును.

జీవాత్మయే విజ్ఞానాత్మయు పరిణామ గతముయై యుండగా, పరమాత్మ ఎట్టి మార్పులకు వశముకానిది. మూలరూపములలో జీవాత్మయు, పరమాత్మయు నొక్కటే. సర్వ ప్రవృత్తులకును జీవాత్మయే కర్త. కొందరు జీవాత్మ అణుపరిమాణం కలదనియు లేనిచో దేహాంతరయానము వీలుకాదందురు. కాని శంకరుడు జీవాత్మ అణుపరిమాణము కలదైనచో అది దేహమంతయు వ్యాపించియుండు వేదనలను గ్రహించుట సాధ్యముకాదన్నాడు. రామానుజుడు తలచినట్లు జీవాత్మ బ్రహ్మలో భాగముకాదు ఏలన బ్రహ్మ దేశకాలాతీతమగుటచే విభాగించరానిది. వల్లభాచార్యు డూహించిన విధముగా జీవాత్మ బ్రహ్మయొక్క వికారమును కాదు, ఏలన బ్రహ్మము నిర్వికారమైనది. సృష్టిక్రమమును చెప్పిన వేదములు, పంచభూత సహితమైన సృష్టినే చెప్పినవిగాని ఆత్మ సృజించబడెనని చెప్పలేదు, కావున జీవాత్మ ఈశ్వరుని సృష్టి కాదు. జీవాత్మయే పరమాత్మ. అది పరమాత్మ స్వరూపమే కాకున్నచో జీవమోక్షమును చెప్పు శ్రుతి వాక్యములును నిరర్థకములగును, ఉపాధులవలన జీవాత్మలు ప్రవృత్తి పరములగుచున్నవి. జీవ బ్రహ్మ సంబంధమును అఖండాకాశము, ఘటా

కాశములతో పోల్చినాడు కుండలోకూడా ఆకాశమున్నది. కుండను పగులగొట్టినప్పుడు కుండలోని ఆకాశము మహా ఆకాశములో కలియును. ఆదేవిధముగా దేశకాల నిమిత్తములైన ఉపాధులను నిర్మూలించినచో జీవుడే బ్రహ్మమగును. ఒక కుండలోని ఆకాశము ధూమధూళి పూరితములైనను, ఇతర కుండలలోని ఆకాశముల కంటని రీతినే ఒక జీవికి కలుగు సుఖదుఃఖములు ఇతర జీవుల కంటవు. ఉపాధి భేదమునుసరించి ఒకే ఆకాశమనేక నామములను పొందుచున్నను, దాని కెన్నడు మార్పులేదు ఘటోత్పత్తి నాశములతో, ఆకాశము ఉత్పత్తి నాశనములు పొందుటలేదు

Note:- అద్వైతానికి నాగార్జునిని శూన్యవాదానికి పోలిక లున్నాయి. సత్యాని వ్యవహారికసత్యం, పారమార్థికసత్యం అని శంకరుని విభజన, నివృథి సత్యం, పారమార్థికసత్యం అని నాగార్జునిని విభజన. మిగిలిన భావాలన్నీ ఒక్కటే. అయితే అంతిమ పారమార్థిక సత్యం బ్రహ్మ అని అద్వైతం చెప్పగా శూన్యం అని నాగార్జునుడన్నాడు. అంతకుమించి పెద్దగా భేదాల్లేవు.

## రామానుజుని విశిష్టాద్వైతం A D, 1000

మనదుఃఖములందు పాలుపంచుకొని, వాని నుపశాంతి ఒసగ జాలని ఏ తత్వ సిద్ధాంతమైనను సామాన్య మానవులకు రుచించవు. నిశ్చలము నిర్వికారమునగు శంకరుని నిర్గుణబ్రహ్మము ఎట్టి కర్తృత్వ ప్రభావములు లేనిదగుటచే దానియందు ప్రజలకు పూజ్యభావ ముదయించుట కష్టము. ప్రపంచము ఒక మిథ్యా దృశ్యము అను వాదముకూడా జనులకు రుచించలేదు. మనము దేవునికి మనబాధల మొరపెట్టుకొన్నప్పుడు మనకు తెలియని తావునుండి కృపా హస్తము చూపెట్టి రక్షించుచున్న భావము అద్వైత మందులేదు. సత్యం, శివం, సుందరం నైన భగవంతుడు సర్వమానవకోటి

మీద ప్రేమ ధారల ప్రసరించు చున్నాడన్న భావం ఏమత విశ్వాసమునకైనా ఆవశ్యకము మీమాంసకుల కర్మవాదం ద్విజులకే ప్రాధాన్యత కల్గియుండుటచే మిగిలిన సామాన్య ప్రజానీకమునకు భక్తిమార్గమే ఆధారమై యున్నది ఈ కారణము చేతనే వైష్ణవ, శైవ, శాక్తేయములుద్భవించినవి. వీని దృష్టిలో వర్ణజాతి పదవీ భేదములకు ప్రాముఖ్యము లేదు. దేవుని బిడ్డలుగా అందరూ సమానమే అనునది వీరిసిద్ధాంతము. తాత్విక సిద్ధాంతములను ప్రాకృత జనవిశ్వాసములతో మేళవించి వర్ణించు నానాభావ సమన్విత పురాణములు వెల్వడినవి. ప్రతిపురాణమున విష్ణువునకో, శివునికో పూర్ణాధిపత్యమొసగి వర్ణించినవి. వీరు సాంఖ్యుల ప్రకృతిని దేవుని భార్యగా చేసిరి.

రామానుజుడు క్రీ. శ. 1037 లో శ్రీ పెరుంబుదూరులో జన్మించెను. ఆళ్వారులను పేరుతో పన్నెండుగురు వైష్ణవ భక్తులు క్రీ. శ. 500 నుండి 900 వరకు జీవించి విష్ణుభక్తిని ప్రచారంచేసి అనేక ప్రబంధాలు రచించియున్నారు. వీరిలో అన్నికులాలవారు స్త్రీలు (గోదాదేవి) కూడానున్నారు. రామానుజుడు కూడా విష్ణుభక్తుడై బ్రహ్మసూత్రములకు భాష్యము వ్రాసెను. అదియే వైష్ణవులకు శ్రీభాష్యమయ్యెను. రామానుజుడు భగవంతుడే సర్వమనియు, జీవులు అందరూ నాతని యధీనులనియూ చెప్పెను. జడజగత్తు, జీవులు పూర్తిగా బ్రహ్మస్వరూపములు కాదు. ఏలన బ్రహ్మము ఎట్టిలోపమును లేని నిత్య పరిపూర్ణుడు. జగత్పదార్థము జడము. జీవులు అవిద్యాదుఃఖదూషితులు కాని వీటి మూటికిని ఏకత్వమున్నది. జడజగత్తును, జీవులను దేవుని శరీరము. బ్రహ్మమునకు వేరుగా వానికస్తిత్వము లేదు. జీవాత్మయు, జడజగత్తు ఈశ్వర భిన్నము లేగాని, ఈశ్వరుని దేహముండేయుండి ఈశ్వరాధీనములై యున్నవి. కావున అతనిసిద్ధాంతము అద్వైతమేగాని

ఒక విశేషముతో కూడియున్నది. ఏకమైన పరమాత్మయొక్క అనేకత్వమును అంగీకరించును కాన 'విశిష్టాద్వైత'మైనది. ఈ సిద్ధాంత ఆవిర్భావమునకు మూలములైన ఇతర సిద్ధాంతములను గూర్చి ముందుగా తెలుసుకుందాము.

[భాస్కరుడు :— క్రీ. శ. 900 కాలమున భాస్కర భాష్యమును బ్రహ్మసూత్ర భాష్యమును రచించెను. భేదాభేదవాదం (Unity and difference) ను ప్రకటించెను. ప్రపంచం వాస్తవం. మాయ కాదు పరిణామం వాస్తవం. పరిణామానికి ముందు బ్రహ్మ ఏకత్వమై అవిభక్తంగా ఉంటాడు. పరిణామం పూర్తిఅయిన తర్వాత బ్రహ్మలోనుండి అనేక రూపాలతో విభేదాలతో ప్రపంచం ఏర్పడుతుంది ఏకత్వంనుంచి భిన్నత్వం వస్తుంది. కారణమూలరూపములలో వస్తువులు అభేదములు. కార్యరూపములలో భేదములు. రెండును సమానముగా సత్యములే. జడజగత్తు నిజముగానున్నదనియు, నది బ్రహ్మలక్షణ యుక్తమే యనియు అతని వాదము. జడపదార్థము బ్రహ్మముపై వర్తించినప్పుడు, దేహేంద్రియ రూపమగు ఉపాధిగామారి జీవోత్పత్తి కారణమగును. ఉపాదులు మాయాకల్పితములు కావు యదార్థములే సహజముగా జీవాత్మ బ్రహ్మముతో నేకమే గాని ఉపాధివశమున వేరైయున్నది. సముద్రము - సముద్రతరంగాలు, అగ్ని - అగ్నిరవ్వ ఎలా భిన్నములు అభిన్నములై కూడా ఉన్నవో అలాగే జీవ బ్రహ్మలమధ్య భేదాభేద సంబంధమున్నది. బ్రహ్మమునకు, ఉపాధులకు గల సంబధ జ్ఞాన లోపముచే సంసారమేర్పడినది. జీవాత్మల పునర్జన్మము తన్మూలమున కలుగు దుఃఖములను బ్రహ్మకూడా నిజముగా అనుభవించునని తలచినాడు.]

పదార్థం — పరిణామం :—

పదార్థం అనాదిసిద్ధం, వాస్తవం, పరబ్రహ్మలో ఒకభాగం పర

బ్రహ్మలో చైతన్యరహితమైన జడపదార్థం (అచిత్), చైతన్య సహితమైన ఆత్మ (చిత్) అంతర్భాగాలు ఉదాహరణకు మానవ శరీరం భౌతిక పదార్థము. శరీరానికి చైతన్యాన్నిచ్చి నడిపిస్తున్నది జీవాత్మ. జీవాత్మ, శరీరం రెండూ మానవుని అంతర్భాగాలే కదా! శరీరాన్ని శరీరాంతర్భాగమైన జీవాత్మ నడిపించినట్లే పరబ్రహ్మ ప్రపంచాన్నంతా నడిపిస్తున్నాడు. ప్రళయ కాలంలో పదార్థం సూక్ష్మరూపంలో అవిభక్తంగా పరబ్రహ్మలో భాగంగా ఉంటుంది. అదే ప్రకృతి. ఈ అవిభక్త ప్రకృతి పరిణామక్రమంలో నిప్పు నీరు భూమి అను మూలపదార్థాలుగా రూపొందుతుంది. వీటి వివిధరకములైన కలయికలవల్ల ఇతర వస్తువులన్నీ ఏర్పడుతాయి. ఈ మూడు మూలపదార్థాలకేగాక సత్వం, రజస్సు, తమస్సు అను మూడు మూల స్వభావాలుకూడా ఉన్నాయి ప్రపంచములోని ప్రతి వస్తువులోను ఈ మూలపదార్థాలు మూల స్వభావాల్లూ ఏదో ఒక నిష్పత్తిలో కలిసిఉంటాయి ఈ పరిణామమంతా సాంఖ్యుల పరిణామవాదాన్ని గుర్తుకు తెచ్చినా, రామానుజుని ప్రకృతి స్వతంత్రశక్తిగాదు. పరబ్రహ్మలో అంతర్భాగంకాగా సాంఖ్యుల ప్రకృతి స్వతంత్రమైనది. మార్పు వాస్తవమనీ, భిన్నత్వం మార్పుకు చిహ్నమనీ చెప్పాడు.

పరబ్రహ్మ ఒక ద్రవ్యం. పదార్థం, ఆత్మలు ఆ ద్రవ్యానికి గల విశేషణాలు. పరబ్రహ్మకు - పదార్థానికి ఆత్మకుగల సంబంధం అవయవి అవయవములకు గల సంబంధం వంటిది. అవయవి ఎల్లప్పుడూ కొన్ని అవయవములతో కూడుకొని ఉంటుంది. [అవయవి అంటే శరీరము - అవయవములు శరీర భాగములు]. అవయవి, అవయవముల మధ్య ఐక్యత, విభేదంకూడా ఉన్నాయి. విభేదం ఉన్నంత మాత్రాన వాస్తవికతకు భంగంరాదు. విభేదాలు మూడు రకాలు. స్వజాతీయ, విజాతీయ, స్వగత భేదాలు. (ఒకేజాతికి

చెందిన రెండు వస్తువులకుగల భేదం స్వజాతీయ భేదం (ఒక ఆవుకు మరొక ఆవుకు). విరుద్ధజాతులకు చెందిన రెంటిమధ్య గల భేదం విజాతీయ భేదం (ఒక ఆవుకు మరొక గుర్రానికి) పరబ్రహ్మకు సాటి వచ్చే వస్తువు మరొకటిలేదు కనుక పై రెండు భేదాలు బ్రహ్మలో లేవు కాని పరబ్రహ్మలో స్వగత భేదం ఉన్నది. నిరాకార నిర్గుణ పరబ్రహ్మకు - సాకార సగుణ ఆత్మలకు, నిర్జీవమైన ప్రకృతికి గల భేదమే స్వగతభేదం. కాని వీని మధ్య భేదం కంటె ఏకత్వమే బలవత్తరమైనది. కనుకనే రామానుజుని సిద్ధాంతాన్ని విశిష్టాద్వైతం అని వ్యవహరిస్తున్నారు. వైరుధ్యాలు లేనిది వాస్తవికత అన్న శంకరుని సిద్ధాంతానికి వ్యతిరేకంగా వస్తవికత వైరుధ్యాలతో విభేదాలతో కూడుకొని ఉంటుందని రామానుజుడు ప్రతిపాదించాడు.

<u>జ్ఞానసిద్ధాంతము</u> :— ఇంద్రియాలు మనల్ని మోసంచేసాయి. కావున ఇంద్రియజ్ఞానం పరమప్రమాణంగా అంగీకరించలేము అనునది శంకరుని జ్ఞానసిద్ధాంతము. ఇందుకు విరుద్ధంగా విజ్ఞానమంతా నిజమైన దేనని రామానుజుడన్నాడు. తాడును పాముగా చూచే మాటనిజమే నిజానికి అది పూర్తిభ్రమకాదు. పాము, తాడు రెండూ కూడా నిప్పు, నీరు, భూమి అను మూడు మూలపదార్థముతో ఏర్పడినవే. వాటి నిష్పత్తిలోగల తేడాలవల్ల రెండు రూపాలేర్పడి ఉన్నాయి. తాడును పాముగా గ్రహిస్తున్నామంటే, రెండింటిలో గల సామాన్యంగా ఉన్న పదార్థాలను గుర్తిస్తున్నాం అయితే కొన్ని బాహ్యకారణాలవల్ల ఆ కొద్దిపాటి భ్రమ ఏర్పడుతున్నది వాస్తవిక మూలపదార్థాలను మనము గుర్తిస్తున్నాము. అలానే ఎండమావులను చూసి సెలయేళ్ళని భ్రమిస్తున్నాము. సూర్యకిరణాల ప్రసరణలోని నీటి మంచును చూస్తున్నాం. అంతవరకు వాస్తవమే. ఆ నీటి మంచును సెలయేరుగా భావించటం

మాత్రమే భ్రమ. కాని ఆచరణలో ఎండమావి దప్పిక తీర్చలేదు. ఆచరణే విజ్ఞానానికి గీటురాయి. జ్ఞానమంతయు వస్తువుల నావిష్కరించును. వస్తువులు నిత్యముగా నుండవు కావున వస్తువులు లేవనుట విచిత్రవాదమని రామానుజునభిప్రాయము కావున శంకరుని జగన్మిథ్యావాదము సమంజసము కాదు.

ఉపనిషత్తులు అనేకత్వాన్ని నిరాకరించినమాట నిజమే. దాని అర్థం ఇతర వస్తువులు అసలు లేవని కాదు. పరబ్రహ్మకంటె భిన్నమైన స్వతంత్ర పదార్థాలులేవు అని మాత్రమే అర్థం. పరాధీనమైన వస్తువులు అనేకము ఉన్నాయి. పదార్థం, తద్వస్తువులు, ఆత్మలు పరబ్రహ్మపై ఆధారపడి యున్నాయి. ప్రపంచములోని ప్రతివస్తువు పరిణామశీలం. పరిణామ శీలమైనదేదీ వాస్తవం కాదని శంకరుని సిద్ధాంతం. పరిణామం మార్పు సహజమనీ అది వాస్తవికతాలక్షణమనీ రామానుజుని సిద్ధాంతం. ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాల మూడింటినీ అంగీకరిస్తూ అద్వైతుల వలనే శబ్ద ప్రమాణానికి విశేష ప్రాధాన్యమిచ్చారు. సాధ్యమైనంతవరకు అద్వైతుల అవాస్తవిక వాదనలను తిరస్కరించి హేతువాద ధోరణిని ప్రదర్శించారు.

శంకరుని అవిద్యను గురించి మాట్లాడుతూ నిర్గుణబ్రహ్మ మాయతో ఆవరించబడి ఈశ్వరుడగుచున్నాడు అని అంటాడుకదా! అవిద్యాస్వరూపమును సహేతుకముగా వర్ణింపజాలము. మరియు బ్రహ్మముకూడా అవిద్యావశుడైనచో మనకు, నిర్గుణ బ్రహ్మకు తేడా ఏమిటి? సర్వము అసత్యమనవలెను శంకరుడు చెప్పినట్లు ప్రతిదీ సత్యము కాదు, అసత్యము కాదు, అనిర్వచనీయం అని చెప్పుట సమంజసము కాదు మనమును, జగత్తును, బ్రహ్మకు వేరై యుండుట నిజమని నమ్ముటయే యదార్థమగు అవిద్యయైయున్నది. నిజమునకు జీవాత్మ, జగత్తులు అసత్యము కాదు. ఏకమగు పరబ్రహ్మ

అనేకము కాఁగోరెను. పంచభూతాత్మకమగు జగత్తు నుదయింపచేసి, చేతన జీవవర్గమును, దేవ మనుష్య రాక్షసాది దేహములలో వాని అర్హతలననుసరించి ప్రవేశపెట్టి, తుదకు తానే స్వేచ్ఛావశమున ఈ జీవన వర్గములో ప్రవేశించి జీవాంతరాత్మయై, ఈ వర్గము లన్నిటికి వస్తుత్వ నామధేయత్వ సామర్థ్యములను కల్పించెను. జీవ మీవిధముగా పరమాత్మ ప్రతిబింబము.

ఆత్మ - కర్మ - మోక్షం :— ఎరుకగల ఆత్మ నిత్యము కావున జ్ఞానము నిత్యమైనదే. జ్ఞానము స్వయముగా అపరిమితమయ్యు, వృద్ధిక్షీణతలు పొందగలదు. కర్మవశమున వివిధావసరముల కనుగుణముగా సంకోచమునొంది, భిన్నేంద్రియముల మూలమున భిన్నరూపము లొందుచుండును. దేవుడు శంకరుడు చెప్పినట్లు నిర్గుణుడు కాదు. జ్ఞానము, శక్తి, కరుణ దేవుని ముఖ్యలక్షణములు. కరుణావశుడై లోకమును సృజించి నియమములను స్థాపించి మోక్షార్థులందరకు సాయపడుచుండును. జీవులు, జడపదార్థము, ఈశ్వరునియందే కలవై, ద్రవ్యమునకు గుణములవలె, పూర్ణవస్తువులో నంతర్భాగములై, ఆత్మకు దేహమువలె సంబంధమును కలిగియున్నవి. పరబ్రహ్మాంశమైనను జీవాత్మ యథార్థము, అనన్యము, నిత్యము, బుద్ధిజ్ఞాన సహితము, నిరవయవము, నిర్వికారము, సగోచరము, అణుస్వరూపమునైనది. సుఖదుఃఖ పరిభాగములవలన జీవులు అనేకములని స్పష్టమగుచున్నది. మోక్షసిద్ధివరకు జీవులు ప్రకృతిబద్ధములు, జడపదార్థ యుక్తమైన శరీర సంబంధము జీవాత్మ-ఈశ్వర సంబంధమును గుర్తింపకుండ చేయును. ప్రళయ కాలమందుకూడా వానికి పూర్వజన్మల కర్మఫలముపోదు, వాని కర్మలననుసరించి తిరిగి సంసారములోనికి నెట్టబడును. మోక్షము వచ్చువరకు జీవులకు దేహసంబంధము తప్పదు. జీవాత్మ సుఖదుఃఖములు ఈశ్వరునికంటవు. మోక్షసాధనకు భక్తిభావం ప్రధానం. దేవుని

దయఉండాలి. జీవులు మూడురకాలు నిత్యులు, కర్మకు అతీతులు, వీరు శాశ్వతంగా వైకుంఠములో నుంటారు. ముక్తులు స్వయంకృషి ద్వారా, జ్ఞానం, భక్తి మార్గాలద్వారా మోక్షం సాధిస్తారు. బద్ధులు అజ్ఞాన మోహితులై ఎల్లప్పుడు సంసార చక్రంలో పరిభ్రమిస్తూ ఉంటారు. ఆళ్వారుల వైష్ణవమతం కులభేదాలను నిరసించింది. భక్తికి ప్రాధాన్యతనిచ్చింది. ఉత్తర హిందూ దేశములోని వైష్ణవులు కులభేదాలను ఖండించలేదు తాత్విక చర్చకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ రెంటినీ రామానుజుడు సమన్వయపరచాడు.

## మహాభారతము - భగవద్గీత

ఆర్యులకు మతవ్యాప్తికై అనార్యులను తమలో కలుపుకొనుట తప్పనిసరి అయినది. ఆ నూతన జాతుల మనోభావముల కనుగుణముగా ప్రాచీన వైదిక విజ్ఞానము ప్రచండ పరివర్తనము చెందవలసి వచ్చినది. లేకున్న వారిని ఆర్యులుగా మార్చు కార్యక్రమము కొనసాగదు. అది విస్తరించి నూతనరూపము తాల్చవలెను. లేదా నశించి అదృశ్యము కావలెను. ఆర్యులు విస్తరించుటకే సంసిద్ధులైరి. బౌద్ధ యుగారంభమునకు పూర్వము ఆ మత మార్పిడి ఉధృతముగా జరిగినది. కావున నూత్న జాతుల విశ్వాసములు, చిహ్నములు, కథలూ, గాథలూ తీసుకొని ఆర్య బ్రాహ్మణులు భాషాంతరముల నందు గిల్పించి వారి నానందింపచేసెను. వారి దేవతల నాతడంగీకరించి వైదిక విజ్ఞానముతో సమన్వయింప ప్రయత్నించెను దాని ఫలితముగా వెలువడినవే మహాభారత భాగవతములు ఆర్య ప్రభావముచే నీ పద్ధతులన్నియు నెట్లు కల్పితములై పోషింపబడినవనగా నేడు అవి వేదములనుండి ఉదయించినవి కావని నమ్ముటకు అసాధ్యముగానున్నవి.

భారత యుద్ధం క్రీ పూ. 1200 సం॥ల కాలములో జరిగి

యుండవచ్చు ద్రౌపది బహు భర్తృత్వము, భీముడు రక్తము త్రాగుట, కృష్ణుని గోపికారాసక్రీడలు, పశుపాలన మొదలగున వన్నియు, విషయమున కాదిరూపం అనార్యమని తెలియుచున్నది. కాని వ్యాసుడు ఆ కథను ఆర్యకథగా మార్చివేసినాడు. ఆనాటికే ప్రజలలో సాంఖ్యతత్వము పూర్తిగా రచింపబడకున్నను విశేష వ్యాప్తిలో నున్నదని తెలియుచున్నది వేదములనాటి దేవతలైన ఇంద్రాగ్ని వాయువుల ప్రభావము తగ్గిపోయి త్రిమూర్తులు ప్రథమ స్థాన మాక్రమించిరి. కృష్ణుడు ఇంద్రుని ఓడించుటయే దీనికుదాహరణ. ఉపనిషత్తుల నిర్గుణ బ్రహ్మము సాకార నారాయణుడయ్యెను. సాకార ఈశ్వరునిగా వర్ణించుటకు కృష్ణుడే సరియైన వ్యక్తి అని భారత రచయిత తలచాడు. అది భగవద్గీతకు అభినవ వైష్ణవ మతమునకు నాందియైనది. కృష్ణుడు పరమేశ్వరుడుగా గుర్తింప బడిన క్రమ విధానము భారతము చెప్పుచున్నది. అవైదిక శాఖలు హెచ్చు పెరుగుచున్న కాలమున వానిని ప్రతిఘటించుటకు నొక వ్యక్తిని లోకోత్తర పురుషునిగా చిత్రించవలెనని మహాభారత కర్త ఆలోచించినట్లు తెలుస్తున్నది.

మహాభారత మందలి నారాయణీయ ప్రకరణములో నర నారాయణులను చూచుటకు నారదుడు బదరికాశ్రమమునకు పోయిన కథకలదు, అచట నారాయణుడు కొన్ని పూజలు చేయుచుండుటగాంచి, సర్వజగత్కర్తయైన యీతడు దేనినికోరి అట్టికర్మ నాచరించవలసి వచ్చెనని నారదుడడుగగా, తనకు నిత్యరూపమైన అవ్యక్త నిర్గుణ బ్రహ్మమును ధ్యానించుచున్నానని బదులుచెప్పెను.

గోపికలతో రాసలీల కృష్ణుని దైవత్వమున కనుచితముగా కన్పట్టుటచే దానికర్థాంతరములు గల్పించవలసి వచ్చినది. పరీక్షిత్తు నదే సందేహము వ్యక్తపరుచగా శుకయోగి, అపవిత్ర పదార్థము లను దహించుటచే అగ్ని అపరిశుద్ధము కానట్లే, మతసూత్రముల

నుల్లంఘించుట, సాహసకార్యములొనర్చుట దేవతలకు పాపహేతువులు కాదు శివుని వలె మనం విషం మ్రింగితే వెంటనే చస్తాం. కావున మన మట్టి కార్యములు చేయరాదు. బ్రాహ్మణుని యుక్తి దానితో నాగలేదు. గోపికలనగా పాండిత్యముతో నిమిత్తం లేక దేవుని భక్తితో గొల్చిన మానవులు. మురళీగానమే దేవుని పిలుపు. నీతి విరుద్ధ ప్రవర్తనములును, ఆత్మదైవ సంబంధములుగా చమత్క-రింపబడినవి.

తన యుగమునందున్న ఉపనిషత్తులు, బౌద్ధమతం, సాంఖ్య యోగతత్వములును గీతాగ్రంథకర్త హృదయమున పనిచేసినవి. వాటినన్నిటిని ఒక దివ్యజ్యోతిగా సమన్వయించి కేంద్రీకరింప చేసినాడు. దీని రచనాకాలం గురించి భిన్నాభిప్రాయములు కలవు. క్రీ పూ. 400 నుండి 200 మధ్యకాలంలో ఉండవచ్చు. భారతీయ విజ్ఞానములో గీతకు అసమాన ప్రజాదరణ కల్గినది. ఇందలి మోక్ష సందేశము అని సులభమైనది. ధనికులు మాత్రమే యజ్ఞ యాగాదులొనరించ గలరు సంస్కృతి గలవారే జ్ఞానమార్గము ననుసరింప గలరు. కావున అందరకు అందుబాటులోనున్న భక్తి మార్గమును గీత బోధించినది అర్జునుడు సంశయాత్ముడై కర్తవ్య పరాయణుడైన తరుణములో సాక్షాత్తు భగవంతుడగు కృష్ణుడు బోధించిన నీతియే భగవద్గీత. ఆత్మను గురించి తెలుసుకొనుటయే ముక్తి అని ఉపనిషత్తులు, ప్రకృతినుండి విడవడుటయే ముక్తి అని సాంఖ్యులు; యజ్ఞ కర్మకాండముల వలననే ముక్తిగల్గు అను మీమాంసకులు. హృదయమును భక్త్యావేశ మొనర్చినచో బ్రహ్మదర్శనానందం కల్గునని చెప్పు భక్తిమార్గ విధానములు; యోగాభ్యాసముతో చిత్తనిగ్రహము వలననే ముక్తివచ్చునని చెప్పు యోగభావములు నాకాలమున వ్యాపించియుండగా వాటినన్నిటిని సమన్వయింప గీత ప్రయత్నించినది. జీవిత సమస్యల

పరిష్కరించి సత్క్రమ కర్మానుష్ఠాన మార్గమును సూచించుటయే ప్రధానోద్ధేశముగా గల్గినది

1) ఆత్మ పుట్టుకలేనిది, నాశనము లేనిది, స్థిరమైనది, అనాది యైనది. దేహము నశించినను అది నశింపదు. దానిని ఆయుధములు ఛేదింపజాలవు. అగ్ని దహింపనోపదు, ఉదకము తడుపజాలదు, వాయువు ఎండింపనేరదు. సర్వవ్యాపకమైనది, ఇంద్రియములకు గోచరము కానిది దీన్ని తెలుసుకొన్నవాడు శుద్ధ బ్రహ్మస్వరూపుడై, సర్వజ్ఞత్వముకల్గి నిత్యానందము కల్గియుండు. పుట్టినవానికెట్లు చావునిశ్చయమో అటులనే మృతి చెందినవానికి పునర్జన్మ నిశ్చయము. దేహము చంపబడును గాని దేహిచంపబడదు. మనుజుడు జీర్ణవస్త్రమును విడిచి నూతన వస్త్రముల ధరించునటులనే జీవుడు జీర్ణ శరీరమును విడిచి నూతన శరీరమును ధరించును. ఒకనికి శరీరమున్నది, ఇంకొకనికి శరీరము లేదు అను భేదముతప్ప చచ్చినవానికి బ్రతికియున్నవానికి భేదమేమియు లేదు. జీవునకు ప్రతిజన్మ యందును జాతి, మత, నామరూపాది భేదములు కల్గి వానికనుగుణములగు ధర్మము లేర్పడియుండుట స్వధర్మాచరణమే జన్మసాఫల్య సాధనము. కావున అర్జునా! యుద్ధం చేయుము.

2) లోకమున జ్ఞానులు, పామరులు కూడా కర్మలు చేయుచుందురు. పామరులు స్వలాభాపేక్షతో కర్మములు చేయుదురు. కావున కర్మ బద్ధులగుదురు. జ్ఞానులట్లుకాక తాముచేయు కర్మలు నిష్కామ బుద్ధితో చేసి ఈశ్వరార్పణ ఒనర్తురు కావున అవి వారికి బంధహేతువులుగా నేరవు, నీవు చేసిన నిష్కామకర్మ ఎంత స్వల్పమైనను వ్యర్థమైపోదు ఆ వాసన జన్మజన్మమునకు వెంటవచ్చును. కోరికలతో కార్యములు చేయువానికి బుద్ధి స్థిరముగా నుండదు. కర్మము చేయుటయందే నీకు స్వాతంత్ర్యము, ఫలములందు నీకు స్వాతంత్ర్యము లేదు. కర్మములను చేయుటకు వాని ఫలములను

హేతువులుగా నుంచుకొనవద్దు. కర్మములను వదలకుము, ఫలాపేక్షతో కార్యములు చేయకుము. ఫలాపేక్షతో చేయు కర్మము కంటె నిరపేక్షతో ఈశ్వరార్పణముగా చేయు కర్మవలన కర్తకు విశేషఫలము లభించును. కావున జయాపజయములను వదలి నిశ్చయబుద్ధితో యుద్ధం చేయుము.

3) ఎప్పుడు మనుజుడు మనస్సున నాటియుండు సమస్తకామములను పూర్తిగా విడిచిపెట్టి ఆత్మయందే మనస్సును చేర్చి సంతుష్టి నొందునో అప్పుడు స్థితప్రజ్ఞుడు లేదా జీవన్ముక్తుడు అనబడును. విషయములను మనస్సుచే ధ్యానించుటచేత వానియెడ సంగము కల్గును సంగమువలన కామము, కామమువలన క్రోధము, క్రోధమువలన మోహము, మోహమువలన స్మృతిభ్రంశము, దానివలన బుద్ధినాశనము తద్వారా స్వరూప నాశనము గలుగు. కావున ఎవడు సమస్తమైన కోరికలను విడిచి, బాహ్యవిషయములందేమాత్రం అభిలాష లేనివాడై, అహంకార మమకారములను విసర్జించి సంచరించునో వాడు పరమ పురుషార్థమగు మోక్షము పొందును.

4) పరధర్మము కంటెను స్వధర్మము మిన్న. తన ధర్మమును చక్కగా జరుపుచు చచ్చుటయైనను మేలగు కాని పరధర్మమునందు ప్రవేశింపరాదు. కావుననే గదా భీష్మ, ద్రోణ, కర్ణులు దుర్యోధనుని పక్షమున పోరాడుచున్నది. ప్రతి వారును తమ తమ స్వధర్మములను తెలుసుకొనవలయును. ప్రతి మనుజునికి వానిజ్ఞానము, శక్తి, పురాకృత కర్మము, ఋణానుబంధములు మొదలగువానిననుసరించి స్వధర్మమేర్పడియుండు.

5) కర్మయోగుల కెల్లరకు భగవంతుడాదర్శము. ఆయనకు నిర్బంధము లేమియు లేకున్ననూ సదా కర్మలు చేయుచునే యున్నాడు. సృష్టి, స్థితి, లయ రూపములగు వాని కార్యములవిచ్ఛిన్నముగా

పొగుతున్నవి. నడుమ నడుమ ప్రపంచమునందు ధర్మము క్షీణించి నప్పుడు భూలోకమున అవతరించి ధర్మ సంస్థాపనము చేయు చున్నాడు. కేవలము లోక సంగ్రహార్థమై ఆయన ఇంతపని చేయుచున్నాడు అటులనే వివేకి ఫలాపేక్ష లేనివాడై లోక కళ్యాణము కొరకు తాను కర్మల చేయుచు ఇతరులచే చేయించ వలెను.

6) మనుజుని స్థూల, సూక్ష్మ దేహములు ప్రకృతి పదార్థము లైన పంచభూతములచే కూర్పబడినవి. పంచభూతములు కూడా సత్వ, రజో, తమో గుణములై యుండు ప్రతి మనుజుడు తన ప్రకృతి గుణముల కనురూపమైన కర్మములు చేయును. కామము, ఆశ, క్రోధము రజోగుణయుక్తమైన మానవుని యందుండును. పొగచే అగ్ని కప్పబడినట్లును, మాలిన్యముచే అద్దము కప్పబడి నట్లును, గర్భములోని శిశువు మావిచే చుట్టబడినట్లును, అజ్ఞాన ముచే ఆత్మ గప్పబడియుండును. ప్రకృతి గుణములచేత కర్మలు చేయబడుచుండినను, అహంకారముచేత మానవుడు తానే చేయు చున్నానని తలుచును. కావున శ్రేష్టమైన ఆత్మను తెలుసుకొని, ఆత్మచేత బుద్ధిని, బుద్ధిచే మనస్సును, మనస్సుచే ఇంద్రియములను జయించి దుఃఖ కారణములైన కామక్రోధముల జయింపుము.

7) కర్మఫలాపేక్ష విడిచి తన ధర్మము నెవడు పాటించునో వాడే సన్యాసి, యోగి. అంతేగాని కేవలము కర్మలను విడిచిన వాడు సన్యాసి కాడు. తపస్సు చేయువారి కంటెను, జ్ఞానులకంటెను, కర్మలు చేయువారి కంటెను. యోగి అధికుడు. మనస్సును విషయ ములపై మరల్పనీయక ఏకాగ్రతతో ఆత్మ సాక్షాత్కారము నొందిన వానికి మన్ను, రాయి, బంగారము సమానముగా గాన నగును. యోగి తాను సమస్త భూతముల యందున్నాడనియు సమస్తభూతములు తనయందున్నవనియు తెలుసుకొనును. మనుజు

నికి మనస్సే బంధువు, శత్రువు కూడాను. మనస్సును జయించిన వానికి బంధువగును, జయించని వానికి శత్రువగును. చంచలమైన మనస్సును వశపర్చుకొనుటకు యోగాభ్యాసమే మార్గము.

8) సృష్ట్యాదినందు ఏకము అద్వితీయమునగు పరబ్రహ్మమునుండి పరాప్రకృతి, అపరాప్రకృతి అని రెండు ఉద్భవించె అపరాప్రకృతి లేదా మూల ప్రకృతినుండి మహత్తు, దానినుండి అహంకారము, దానినుండి పంచభూతములు జనించినవి. దీనికి చైతన్యము కల్గించునది పరాప్రకృతి లేదా చిచ్ఛక్తి. ఈ రెంటను కూడినగాని ఏ వస్తువయిన కలుగనేరదు. కేవలము జడప్రకృతి ప్రపంచ కారణము కాదు కావుననే ప్రపంచమంతయు పరబ్రహ్మమయమై యున్నదని చెప్పబడుచున్నది. సమస్తమైన ప్రపంచముయొక్క ఉత్పత్తికిని నాశనమునకును నేనే కారణమైనవాడను. నా కంటె అన్యమగు వస్తువేదియు లేదు. దారమునందు పూసలు ఏవిధముగా గ్రుచ్చబడి యున్నవో ఆ ప్రకారము సమస్త పదార్థములు నా యందు గ్రుచ్చబడి యున్నవి.

9) క్షేత్ర క్షేత్రజ్ఞులు, ప్రకృతి - పురుషులు, క్షరము - అక్షరములు, ఆత్మ - అనాత్మలు, నిత్యము - అనిత్యం సత్యాసత్యముల జ్ఞానము తెలిసినవాడే జ్ఞాని. ఈ శరీరము క్షేత్రమనియు దీని నెరుగువాడు క్షేత్రజ్ఞుడనియు చెప్పబడును. ఎచట ఒక భీజమును ప్రతిష్టించిన యెడల నది అంకురించి క్రమముగా పెరిగి వృక్షమై పుష్పించి ఫలించి మరల భీజోత్పత్తి చేయునో అట్టి స్థలము క్షేత్రమనబడును. విత్తనము భూమిలో నాటబడిన పిమ్మట నది చుట్టూనున్న మట్టి, నీరు, ఎండ, వాయువుల తోడ్పాటుతో అంకురించును. మొలచిన తర్వాతకూడా కర్షకుడు వ్యవసాయము చేసినగాని చక్కగా పెరుగదు.

ఆవిధముగానే భగవంతుని భీజమనెడు ఆత్మను శరీరమనెడు

క్షేత్రములో ఉంచిన యెడల నది అంకురమగును. పిమ్మట చుట్టు నున్న శీతోష్ణములు సుఖ దుఃఖములు మొదలగు అనుభవముల ద్వారా జీవుడభివృద్ధి నొందును. పిమ్మట ధర్మాధర్మ బోధకము లగు శాస్త్రములందు విధింపబడిన సంస్కారముల వలన పురోభి వృద్ధిగాంచు. కావున బీజమునకు క్షేత్రమునకుగల సంబంధమెట్టిదో జీవునకును శరీరమునకును గల సంబంధ మట్టిదని ఎరుగుము. సమస్త శరీరముల యందుండెడి ఆత్మను నేనే అని చెప్పియున్నాడు. అంటె పరమాత్మ అంశయే జీవాత్మ అని అర్థము. ఈశ్వరునియందు గల శక్తి, జ్ఞానము మొదలగు గుణములన్నియు జీవునియందు కూడా నున్నవి. కాని అవి పరమాత్మలో పూర్ణ ప్రకాశములై యున్నవి, జీవునియందు అణిగి అజ్ఞానము చే కప్పబడి యున్నవి.

10) సర్వవ్యాపకమగు మూల ప్రకృతి నాకు యోనియై నున్నది. దానియందు నేను గర్భదానము చేయుదును. అందువలన సమస్త భూతములు పుట్టును. సమస్త యోనులందే ప్రాణికోట్లు ఉత్పత్తి యగుచున్నవో వాని కన్నిటికి మూల ప్రకృతి యోనియు, నేనే బీజప్రదుడునగు తండ్రియునై కూడా యున్నాను. సూర్యునినుండి అనేకకోట్ల కాంతి కిరణములు వెలువడినట్లు సృష్ట్యాది నందీశ్వరుడు తనలోనుండి అనేక కోట్ల కణముల వెలువరించి వాని నన్నిటిని మూల ప్రకృతి యందు ప్రతిష్ఠ చేసెను. ఒక్కొక్క కణమునకు ఆ ప్రకృతి నుండి ఒక్కొక్క ఉపాధి ఏర్పడినది. అట్టి ఉపాధిచే ఆవరించబడిన ఒక్కొక్క కణము ఒక్కొక్క జీవుడయ్యెను. భగవంతుడీ విధముగా జీవుడిగామారి ప్రకృతిబద్ధుడయ్యె ప్రకృతినుండి పుట్టిన సత్వరజో తమో గుణములు జీవుని బంధించుచున్నవి. ఇదియే సంసారబంధం. దీనినుండి విముక్తియే మోక్షం.

11) ప్రకృతి పురుషులు రెండూ అనాది. సమస్త వికారములు గుణములును ప్రకృతివలన పుట్టినవి. వికారములనగా మార్పులు.

లోకములోని పదార్థము లన్నియు సర్వదా మారుచుండును. రూపములు మారుచుండును. బంగరము ఒక్కటే కాని ఎన్ని విధములైన ఆభరణములుగా మారుచున్నది. ఈ మార్పులు వికారములన్నియు ప్రకృతికి సంబంధించినవేగాని ఆత్మకు సంబంధించినవి కాదు గుణములనగా సత్వరజోతమోగుణము లోకములోని సద్గుణ, దుర్గుణ, మిశ్రమ గుణములన్నియు, ఆ మూడు గుణములు వివిధ పాళ్లలో కలయికవల్ల ఏర్పడినవే పురుషుడు ప్రకృతితో సంబంధపడి యున్నప్పుడు ప్రకృతివలన పుట్టెడు గుణములు కలిగి యుండు సుఖ దుఃఖములన్నియు ప్రకృతివలన పుట్టినవే మనుజుడు చేయు కర్మలన్నియు వాని గుణముల ననుసరించి యుండును. సత్వ గుణయుక్తులు పుణ్యకార్యములు చేయుదురు. రజోగుణయుక్తులు కామ క్రోధాది పూరితులై యుందురు తమోగుణయుక్తులు అవివేకులై మాంద్యులై యుందురు. వారు చేయుకర్మల కనుగుణముగానే మరుజన్మలుండును.

12) జ్ఞానియొక్క లక్షణము లేవనిన:—

i) అమానిత్వమ్ - తాను గొప్పవాడనియు ఇతరులెవ్వరూ తనకు సాటిరారను దురభిమానము లేకుండుట

ii) అదంభిత్వమ్ - తాచేసిన దానధర్మములను తానే ప్రకటించు దంభము లేకుండుట.

iii) అహింస - ఏ ప్రాణికిని ఏ విధమైన బాధను కలుగ చేయకుండుట.

iv) క్షాన్తి - తన కపకారమును చేసినను సహించుకొని యుండుట.

v) ఆర్జవమ్ — మనోవాక్కాయ కర్మలందు ఏకరీతిగానుండుట.

vi) ఆచార్యోపాసనమ్ — సద్గురువు నాశ్రయించి సేవించుట.

vii) శౌచమ్:— మనస్సు నిర్మలముగా నుంచుకొనుట.

viii) స్థైర్యమ్ – పూనుకొన్న కార్యమునుపట్టుదలతో సాధించుట.

ix) ఆత్మనిగ్రహః – ఇంద్రియములను మనస్సును కట్టుబాటం దుంచుట, అహంకారము లేకుండుట

x) కుటుంబ సభ్యులయందు మమకారము లేకుండుట, క్లేశములకు భీతినొందకుండుట.

xi) భగవంతునియందు అనన్యమైన భక్తి, ఎల్లప్పుడు నాత్మజ్ఞానముతో నుండుట

పై గుణములు కల్గిన వాడే జ్ఞాని. ఇక్కడ భగవద్భక్తికూడా జ్ఞానికి ఆవశ్యకమని చెప్పబడినది.

13) అట్టి జ్ఞానముచే నెఱుగదగిన బ్రహ్మము యొక్క స్వరూప మెట్టిదనిన అది బ్రహ్మాండమంతయు నిండి సర్వము నాకరించి యున్నది. లోకమునందలి సమస్త ప్రాణులందు అంతర్యామిగా నుండుటవలన సమస్త ప్రాణుల అవయవములు బ్రహ్మమునకు ఉపాధులై యున్నవి సర్వభూతములందుండి ఆయా శరీరావయవముల ద్వారా వ్యాపారములు జరిపించుచున్నది. ఆ బ్రహ్మయే నిర్గుణమయ్యు గుణముల ననుభవించునది, సర్వభూతముల లోపలను వెలుపలనూ కూడా నున్నది. అతిసూక్ష్మమగుటచే తెలియరానిది, అజ్ఞానులకుదూరముగాను, జ్ఞానులకు సమీపముగాను ఉండునది, వాస్తవముగా అపరిమితమైనను బాహ్యదృష్టికి విభక్తముగా కన్పట్టునది, భూతముల రక్షించునదియు, ప్రళయకాలమున సంహారము చేయునదియు, అపరా ప్రకృతికంటె అతీతమైనది, జ్ఞాన స్వరూపమైనది, జ్ఞేయ స్వరూపమైనది, జ్ఞానముచే పొందతగినది. అదియే ఈశ్వరుడు లేదా పరమాత్మ అని చెప్పబడెను.

14) సమస్త భూతములు క్షరములు, క్షరఅనగా నశించునది. కూటస్థుడు అక్షరము. అక్షరమనగా నాశనములేనిది. క్షరాక్షరములను రెంటికంటె విలక్షణమైన ఉత్తమ పురుషుడు పరమాత్మయై

మూడు లోకములందు వ్యాపించి సమస్తమును భరించుచున్న వాడు. నేనట్టి క్షరాక్షరములకంటె అతీతుడైన వాడను, లోకములలోను వేదములలోను పురుషోత్తముడని ప్రసిద్ధి చెందియున్న వాడను. ఎవడు నన్నీ ప్రకారముగా పురుషోత్తమునిగా నిశ్చయముగా తెలుసుకొనునో వాడే సర్వము నెరిగినవాడు.

15) మనుజుడు స్థూల, సూక్ష్మ, కారణములని మూడు శరీరములు ధరించి భూలోకమున సంచరించుచుండును. స్థూల శరీరము కొంత కాలమునకు నశించును. (మరణము) పిమ్మట వాడు సూక్ష్మ, కారణములను రెండు శరీరములు ధరించినవాడై పరలోకమున సంచరించుచుండు. కొంతకాలమునకు అనగా స్వర్గ నరకములను భవించిన తర్వాత సూక్ష్మ శరీరము సయితము నశించగా జీవుడు కేవలము కారణ శరీరమును ధరించి భూలోకమును చేరును. అట్టి స్థితిలో వాడు కూడస్థుడనబడును. వాడు నిత్యుడును, నాశరహితుడై యుండు. మరల కొంత కాలమునకు యథాప్రకారము సూక్ష్మ స్థూల శరీరముల పరిగ్రహించి భూలోకమున జన్మించు. కావున క్షరమగు స్థూల శరీరమునకు. అక్షరము వేరు (మూలము) నైయున్నది చెట్టును నరికినను వేరు మూలముగా ఎలా చిగుర్చునో అట్లే జీవుడు మరణించిన తర్వాతకూడా పునర్జన్మ లెత్తుచుండును.

16) సర్వభూతముల హృదయములందు భగవంతుడున్నాడు. జాతి, వర్ణ, లింగ భేదము లేక అందరి హృదయములందున్నాడు. సాధువులందున్నాడు, దుష్టులయందున్నాడు, జ్ఞానులయందున్నాడు, అజ్ఞానులయందున్నాడు, బ్రాహ్మణులయందున్నాడు. చండాలుర యందున్నాడు. స్వామి సన్నిధానమును చేరి ఆయన దర్శనము చేసి కొన గోరువారు దూరదేశములకు పోనక్కరలేదు. ఇంద్రియముల నిగ్రహించి అంతర్ముఖుడై హృదయములోనికి పరికించిన అచట

భగవంతునికనుంగొననగు. సర్వ వేదములు చదువుటయు భగవంతుని తెలిసి కొనుటకే. ఎన్ని శాస్త్రములు చదివినను ఎంత పాండిత్యము సంపాదించినను భగవంతుని తెలిసి కొనక పోయినయెడల అంతయు నిరర్థక మగును. అట్లు తెలుసుకొనుటయే పురుషోత్తమ ప్రాప్తి.

17) జీవుడు భగవంతుని అంశమై యున్నవాడు. సూర్యునికి సూర్యకిరణమునకును, అగ్నికి అగ్నిరవ్వకు, సముద్రమునకు - పాత్రి లోనికి తీసుకొన్న సముద్ర జలమునకు ఎట్టి వస్తుభేదము లేదో అట్లే పరమాత్మకును జీవాత్మకును వస్తుభేదము లేదు

18) జీవుడు శరీరము విడిచి వెళ్లిపోవునప్పుడు ఈ మనస్సును, ఇంద్రియములను వాసనా రూపముగా తీసుకొని వెళ్ళును. మరల వేరొక శరీరమును గ్రహించునప్పుడు పూర్వవాసనా రూపముతో శరీరమున ప్రవేశించు. మరల యథా ప్రకారము వాని సహాయము వలన, విషయముల ననుభవించుచుండు. పరిమళమైన పువ్వు మీదుగా గాలివచ్చునప్పుడు దాని వాసనను గాని ఎట్లు తీసుకొని వచ్చునో అదే విధముగా జీవుడు చేయును.

పువ్వు దూరముగా నున్నప్పుడే మనకు సువాసన వస్తుంది. కారణము దానియొక్క అతి సూక్ష్మ అణువులు గాలిలో కొట్టు కొని రాబడి ముక్కును సోకుచున్నవి. ఆ సువాసన ఆ అణువులందు ఉన్నది. ఈ విధముననే ఇంద్రియములు మనస్సు నశించినను, వానికి స్థాన భూతములగు ఒక్కొక్క అణువును జీవుడు విడువక నిరంత రము తన స్వాధీన మందుంచుకొని తానెచటికి బోయిన, అక్క డకు తనతో గూడా కొనిపోవుచుండు.

<u>Note:-</u> ఇక్కడితో భారతీయ తత్వ శాస్త్ర పురోభివృద్ధి అంత మయింది. వివేకానందుడు చైతన్యుడు మొదలైన వారు కొన్ని మెరుపులు మెరిపించుటకు ప్రయత్నించారు. కాని దాదాపుగా నూతన సిద్ధాంతా లేమీ వెలువడ లేదు. కాగా యూరప్ ఖండంలో

మాత్రం ఆధునిక తత్వ శాస్త్రం వివిధ పుంతలను త్రొక్కుతూ శరవేగంతో పరుగు లెట్టింది. ఇప్పుడు వానిని గూర్చి తెలుసుకుందాము.

## థామస్ హాబ్స్ ఇంగ్లండు 1588-1679

ప్రపంచములో ఏదైతే లేఉన్నదో అదంతా పదార్థమే Matter ఏదైతే కనబడుతున్నదో అదంతా చలనమే. చలనానికి ఆది కారణం లేదు. అనాది, అనంతం, ఒక వస్తువు చలనం మరొక వస్తువుపై పని చేసి దాని చలనానికి కారణ మవుతుంది, ఇదే కార్య-కారణ సిద్ధాంతము లో మనకు కనిపిస్తుంది. శూన్యస్థలం అనేది లేదు. మొత్తం స్థలం పదార్థంతో నిండిఉంది. అణువుల మధ్య ఖాళీస్థలంవలె కనపడేదికూడా ఈథర్ అనే సూక్ష్మ పదార్థంతో నిండిఉంది. ఈథర్ ద్వారానే ఒక వస్తువు చలనం మరొక వస్తువుకు సంక్రమిస్తుంది. కనుక చలనం ప్రవాహ సదృశ్యమైనది.

మనకు జ్ఞానం ఎలాకలుగుతున్నది? సమస్తజ్ఞానం. ఇంద్రియానుభవం ద్వారానే సిద్ధిస్తున్నది. బాహ్య వస్తువు చలనం మన ఇంద్రియాలపై పనిచేస్తుంది. తద్వారా ఇంద్రియాలలో చలనం కల్గుతుంది. వీటినే సంవేదనలు [Sensations] అంటాము. ఈ సంవేదనలు నాడులద్వారా మెదడుకు వెడతాయి. దానినుండి ప్రతి స్పందన జరుగుతుంది. అపుడు మనకు వెలుపల ఒకానొక వస్తువున్నదన్న జ్ఞానంకల్గుతుంది. రంగు, రుచి, వాసన, ధ్వని అన్నీ స్వతహాగా ఆయా వస్తువులలోని గుణాలు కావు. ఆయావస్తువులు మన ఇంద్రియాలపై పనిచేసినప్పుడు కలిగే సంవేదనలే ఆయాగుణాలుగా అభాసిస్తున్నాయి. సంవేదనలకు కారణం బాహ్యవస్తువే కాని సంవేదనలు బాహ్యవస్తు లక్షణాలుకావు. కనుక బాహ్య ప్రపంచంవేరు. మనకు ఇంద్రియ గోచరమయ్యే ప్రపంచం వేరు.

మనస్సు అంటేమిటి? మెదడులో కలిగేస్పందనే మనస్సు. దానిలో కలిగే ప్రతిస్పందనే ఆలోచన. జ్ఞానం సంపాదించేశక్తితో పాటు ప్రేరణ కల్గించే శక్తికూడా మనస్సుకుఉంది. ఈ శక్తివల్ల మనస్సు శరీరానికి చలనం కలుగ చేస్తుంది. ప్రతిప్రాణి సుఖాన్ని కోరుతుంది, బాధను నిరాకరిస్తుంది. దాని ఫలుగుణంగానే మన శరీరం చలిస్తుంది. అలాగే రాగద్వేషాలకు కూడా. మనస్సులో ఇంద్రియ జ్ఞానం యొక్క ప్రతిబింబాలు [Impressions] ఆలోచన రూపంలో ఒకదాని తర్వాత ఒకటి వచ్చి పోతుంటాయి. వీటిని క్రమ పద్ధతిలో అమర్చితే జ్ఞానం (Knowledge)గా పరిణమిస్తుంది.

ఇతని గ్రంథాలన్నిటిలోకి ప్రసిద్ధమైనది అతని రాజకీయ సిద్ధాంత గ్రంథము ''లెవియథాన్'' ప్రతి మానవుడు స్వీయ సుఖానికై ప్రయత్నిస్తాడు. తన ప్రాణభద్రతకు, స్వసుఖానికి ఏ వస్తువు అవసరమో, దాన్ని ఏ విధంగానైనా సంపాదించడానికి యత్నిస్తాడు అలా ప్రయత్నించడం అతనికి ప్రకృతి ప్రసాదించిన హక్కు దానికి [Right of nature] (సహజమైనహక్కు) అని పేరు పెట్టాడు. స్వీయసుఖమే పరమార్థము కనుక మానవుడు సహజముగా స్వార్థపరుడవుతాడు. స్వసుఖంకోసం ప్రయత్నించడంలో ఒకరినుండి ఒకరు లాక్కోవడానికి, ఒకరిపై ఒకరు అధికారం చలాయించడానికి పోటీపడటంలో సంఘర్షిస్తారు. బలవంతుడిదే న్యాయం. అదే మనవులసహజస్థితి [State of nature] ఆ స్థితిలో న్యాయాన్యాయాలు ధర్మాధర్మాలు ప్రసక్తిలేదు శాసనంలేదు. దానిని కృతయుగం లేదా ప్రాకృతయుగం అనికొని పేరు పెట్టవచ్చు. కాని ఆ స్థితిలో ప్రాణభద్రత లేకుండా పోతుంది. నిరంతర యుద్ధభీతి ఉంటుంది. సుఖాన్ని పొందలేరు, దానినుంచి స్వీయరక్షణకు సకల ఉపాయాలు ఆలోచిస్తారు. ఆ స్థితిలో వారు శాంతికి అభిముఖులవుతారు. దీన్ని [Firt law of nature] గా వర్ణించాడు. అయితే శాంతిస్థాపనకు ఏమి

చేయాలి. ప్రతివ్యక్తి తన స్వేచ్ఛలో కొంత భాగాన్ని త్యాగం చేయ వలసి ఉంటుంది. ఇందుకోసం వారు ఒక ఒప్పందానికి వస్తారు. Second law of nature అలా వదులుకున్న స్వేచ్ఛను రాజు కిస్తారు. శాసనాలు ఏర్పరుచుకుంటారు.

## దేకార్ట్ - ఫ్రాన్స్ - 1596-1650

ఇతనికి ఆధునిక తత్వ శాస్త్ర జనకుడు (Father of modern philosopy) అనే పేరువచ్చింది. ప్రముఖగణిత వేత్త, కార్టీజియన్ కో ఆర్డినేట్ జమెంట్రీ పితామహుడు. భావవాదం, భౌతిక వాదంలను రెంటినీఒప్పుకున్నాడు. భావ వాదులు మనస్సు, ఆత్మమాత్రమే సత్యం, తక్కిన దంతా మిథ్యఅనిఅంటారు. కాగా భౌతిక వాదులు పదార్థం మాత్రమే సత్యం తక్కినదంతా మిథ్య అని అంటారు, ఈ రెండు వాదాలను సమన్వయించి అంగీకరించినవాడు దేకార్ట్. జ్ఞానం ఎలా లభిస్తుంది. సందేహం ద్వారానే లభిస్తుందన్నాడు. నాకు నేను స్పష్టంగా (Clearly) విశదంగా (Distinitly) దర్శించ గలిగిన దే యదార్థం అవుతుంది, సత్యం అనేది స్వతః సిద్ధమైనదిగా ఉండాలి, ఇందుకోసం ఎవరో ఏమో చెప్పారని గాక ప్రతి విషయాన్ని సందేహించాలి. సందేహమే సత్యాన్వేషణకు సరియైన సాధనం.

ఉదాహరణకు ఈ బాహ్య ప్రపంచం నిజంగా ఉన్నదా? నాదైనందిన జీవితము నిజమైన దేనా? నాశరీరంయదార్థంగా ఉన్నదా? ఏమో చెప్పలేము నాకు అనేక భావాలు వస్తున్నాయి. అవన్నీ నిజమేనా? ఏమో కాక పోవచ్చు. నా ఎదురుగా నున్న వస్తువులు నిజమని, వాటిని నేను చూస్తున్నాని ఎలా చెప్పగలను. ఎందు కంటె కలలు వస్తాయి కలలలో ఇవేవస్తువులను చూస్తాము. ఇవే పనులు చేస్తాము, ఇవేభావాలు భావిస్తాము, కాని అవన్నీ నిజం కాదుగదా! అలాగే మేలుకొని ఉన్నప్పుడు చూసేవి కూడా నిజం కాదేమో! ఈ సమస్త ప్రపంచం కూడా స్వప్నప్రపంచం వంటిదే

సేమో! (అద్వైత భావనలు) అయితే స్వప్నంలో చూసేవి నిజం కాకపోయినా, స్వప్నం రావటం నిజం. అలాగే భౌతిక ప్రపంచం నిజంకాకపోయినా, దాన్ని గురించి నేను భావించటం నిజం. నా ఆలోచనలో సత్యం ఉన్నా లేకపోయినా నేను ఆలోచించటం నిజం. కనుక ఆలోచన ఉంది, ఆలోచించే మనస్సువుంది. అంటే నేనున్నాను. “నేను ఆలోచిస్తున్నాను, కనుక నేనున్నాను”(I think there fore I am) అనునది ఇతని సుభాషితం.

నేనెవరిని! నేను సందేహించే, ఆలోచించే వస్తువును, అంటె మనస్సును. నాకు శరీరం లేకపోయినా మనస్సు లేకపోవడం జరుగదు. ఏందుకంటె మనస్సు ఉందా లేదా అని సందేహించేది కూడా మనస్సే అది లేకపోతే సందేహమే లేదు. నేను లేకపోతే “లేను” అనే ఆలోచనే కలుగదు. కనుక నేను స్పష్టంగా విశదంగా ఉన్నాను. అంటే సందేహముతో బయలుదేరి సందేహాతీతమైన ఒక స్వతఃసిద్ధ సత్యాన్ని కనుగొనటం జరిగిందికదా! సరే ఇంత స్పష్టమైన విశదమైన సత్యాలు ఇంకా ఏమైనా ఉన్నాయా? ఉన్నాయి. ఒకటి దేవుడు, రెండు నా శరీరము అంటే భౌతిక ప్రపంచం.

నేను (మనస్సు) వున్నానని సందేహాతీతంగా తేలిపోయినప్పటికిని, నన్ను సందేహం నీడవలె వెన్నాడుతూనే వుందే! నా ప్రతిభావం సందేహ బాధితం అవుతూనే వుందే! అంటే నా అస్తిత్వము పరిపూర్ణము, నిర్దుష్టం [Perfect] కాదన్నమాట! నా అస్తిత్వం [Perfect] కాదంటే [Perfect] అయినది. ఏదో ఉండాలి కదా! అదే దేవుడు అంటే దేవుడు సత్యస్వరూపుడు, పరిపూర్ణతామూర్తి మానవలక్షణాలైన సందేహం, అనిశ్చితి, అస్థిరత, అశాశ్వతత్వం, క్రోధం సుఖదుఃఖ విస్మయాలు ఏవీ దేవునికి లేవు అవన్నీ దోషాలు ఇవి దోషాలని నేను తెలుసుకోగలుగుతున్నాను అంటే ఇవి

లేని దివ్యమూర్తి వేరే ఉండి ఉండాలి. అతనే లేకపోతే ఈ లక్షణాలు లేని దైవభావం నాకెలా స్ఫురిస్తుంది దైవమే నాలో దైవభావాన్ని ప్రవేశపెట్టిఉండాలి. కనుకనే దైవం ఉన్నాడనే భావం నాకు స్పష్టంగా విశదంగా కనుపిస్తుంది. కార్యం సత్యమైతే కారణం సత్యం కాకపోదు. ఇక్కడ దైవభావం కార్యం కాగా, దైవము కారణము నాలో దైవభావం నిశ్చయంగా నిజంగా ఏర్పడి ఉంది కనుక దానికి కారణమైన దైవంకూడా అంతే నిశ్చయంగా నిజంగాఉండి ఉండాలి.

ఇకపోతే భౌతిక ప్రపంచం ఉన్నదా? భౌతిక ప్రపంచంలో భాగమే నాశరీరం. ఎందుకంటె అదికూడా భౌతిక పదార్థ నిర్మితమే. దాన్ని ఎలా నిరూపించడం? అది మాయ కావచ్చుకదా! ఎందుకంటె బాహ్య ప్రపంచ జ్ఞానం మనకు ఇంద్రియాల ద్వారా లభిస్తున్నది, మన ఇంద్రియాలు అజ్ఞానాన్ని కల్గించవచ్చుగదా! మనకు సంవేదనలు Sensations కల్గుతాయి. అవి భ్రమలు కావచ్చు. కనుక పంచేంద్రియాల ద్వారా లభించే జ్ఞానం నిజమైంది కాకపోవచ్చు. అయినప్పటికీ బాహ్య భౌతిక ప్రపంచం నిజంగా ఉన్నదనే భావం మనలో గాఢంగా పాతుకొనిఉంది. దేవుడే మనలో ఆ భావాన్ని ప్రవేశపెట్టి ఉండాలి. బాహ్యజగత్తు నిజంగా లేకపోతే అలాంటి భావాన్ని ఆయన ఎందుకు కల్గిస్తాడు? లేకుండా అలాంటి భావాని కల్గిస్తే ఆయన మోసపూరితుడు అవుతాడు కదా! కాని ఆయన పరిపూర్ణుడు మోసం చేయడు. కనుక బాహ్యజగత్తు నిజంగా ఉన్నది. మనకు ఇంద్రియానుభవ జ్ఞానం, నిజంగా ఉనికిలోనున్న బాహ్యజగత్తువలనే కలుగుచున్నది.

అయితే మరి మనకు అప్పుడప్పుడు భ్రమ ఎందుకు కల్గుతుంది? తాడును చూసి పాముని ఏందుకు పొరబడుతున్నాము. జ్ఞానేంద్రియాలు మనలను ఎందుకు మోసం చేస్తున్నాయి? కాని

కిలా చెప్పాడు, మనకుగల అవగాహనశక్తి పరిమితం. కాని నిర్ణయ స్వేచ్ఛ అనవధికం. అంటే ఒక విషయం గురించి వాస్తవం బదులు అవాస్తవాన్ని, మంచికి బదులు చెడును ఎంచుకొనే శక్తి మనకు సంపూర్ణంగా ఉంది. ఆ నిర్ణయ స్వేచ్ఛా శక్తిని నిగ్రహించుకొని దాన్ని మన అవగాహన శక్తికిలొంగివుండేటట్లు చేయడంలో మన వైఫల్యం వల్లనే మన ఇంద్రియానుభవాలు మనలను మోసం చేస్తున్నాయి. కాని అదే సమయంలో పొరపాట్లను దిద్దుకొని సత్యాన్వేషణలో ముందుకు సాగిపోయే శక్తిని కూడా దేవుడు మనకిచ్చాడు.

పోతే మనస్సు, శరీరం వేరు వేరు అని భావించాడు. వాటికి పరస్పర సబంధంలేదు. శరీరం భౌతిక వస్తువు. రంగు, రుచి, వాసన ధ్వని మొదలైన లక్షణాలు బాహ్య వస్తువులలో స్వతః సిద్ధంగా లేవు అవి భాహ్యవస్తువు జ్ఞానేంద్రియాలద్వారా మనలో కల్గించే సంవేదనలు మాత్రమే. బాహ్య వస్తువుకి విస్తృతి (Extension) ఉంటుంది కాని మనస్సుకు విస్తృతి లేదు. అది స్థలాన్ని ఆక్రమించదు మనస్సు లక్షణం ఆలోచించడం ఆలోచనకు స్థల, విస్తృతులతో నిమిత్తంలేదు. అందుచేత మనస్సు, శరీరం పూర్తిగా భిన్నమైనవి. అయితే దేహానికి బాధ కల్గితే మనస్సుకు ఎలా తెలుస్తున్నది? దానికిలా చెప్పాడు. దేహం, మనస్సు రెండూ రెండు గడియారాల వంటివి. ఒకటి Time చూపిస్తుందనుకోండి. అదే Time కి రెండోది గంటలు కొడుతుందనుకోండి. అదే విధంగా పరస్పర సంబంధం లేక పోయినా, పరస్పర సమన్వయంతో పని చేసేటట్లు మనస్సును, శరీరాన్ని దేవుడు ఏర్పాటుచేశాడు.

దేహానికి మనస్సుతో సంబంధంలేదని చెంప్పటంవల్ల అతడు తన కాలంలో జరుగుతున్న భౌతిక విజ్ఞాన శాస్త్రాలను పూర్తిగా సమర్ధించడానికికూడా వీలు కల్గింది. మరొకప్రక్క మనస్సుకు

శరీరంతో సంబంధం లేదని చెప్పటంవల్ల భావవాదాన్ని సమర్థించ డానికికూడా వీలుకల్గింది. ఈ ద్వైతవాదంద్వారా రెండు విరుద్ధ వాదాలకు ఒకేసారి కారకుడయ్యాడు.

## స్పినోజా — Spain - 1632-1677

రామానుజుని విశిష్టాద్వైతమును పోలి ఉంటుంది. ఇతని తత్వ సారాంశం జగమంతా ఈశ్వర మయం. ఏది సత్యం? సత్ ఒక్కటే సత్యం. సత్ అంటే ఉండటం ఉనికి (Existance) అదే దేవుడు లేదా ప్రకృతి (Nature) సత్ ని ఎలా నిర్వచించాలి ఏకమేవాద్వితీయమ్ అది కానిది ఏదీలేదు. అదొక్కటే ఉన్నది. దాని ఉనికికి మరొకటి ఏదీ ఆధారంకాదు. ఏదీ కారణంకాదు. కాని అన్నిటికి అదే ఆధారం. అదే కారణం. సత్ ఒక్కటే ఉండేటట్లయితే అది అనంతం [Infinite] అయి ఉండాలి. అనంతం కాకపోతే అది కానిది మరొకటి ఉండవలసింది. అదినిత్యం, Eternal అయి ఉండాలి. లేకపోతే దానికిముందు తర్వాత మరొకటి ఉండవలసి వస్తుంది ఉన్నది అదొక్కటే కనుక వేరేతత్వం ఉండటానికి వీలు లేదు. అది స్వయంసిద్ధం, స్వయంభువం[Self cristant self isured] అయిఉండాలి. లేకపోతే దాని సృష్టికి మరొకటి కారణం కావలసి వస్తుంది. అది కానిదిలేదు కనుక అదీ కుదరదు. దానికి సంకల్పము [will] అనేది లేదు. ఇలా చేయాలి అని సంకల్పించి ఏదో ప్రయోజనం ఆశించి ఏపనీ చేయదు. ప్రయోజనాన్ని ఆశిస్తుందంటే దానికి కోర్కె ఉన్నదన్నమాట. ఏదో కొరత అయినప్పుడు మాత్రమే తనకు లేనిదానికోసమే కోర్కె కల్గుతుంది. కాని తనకంటె వేరే ఏదీ లేనప్పుడు తాను సర్వసంపూర్ణం అయివుంటే కోర్కెగాని సంకల్పంగాని ఎందుకు కల్గుతుంది కనుక సత్ అనేది అనంతం, నిత్యం, స్వయంభువం, సంకల్ప

రహితం, సర్వస్వతంత్రం, సర్వ సంపూర్ణం అయిన పరమ తత్వం. దాన్నే దేవుడన్నాడు.

సత్ అనేది అనంతం కనుక, దాని లక్షణాలుకూడా అనంతంగా ఉంటాయి. అయితే వాటిలో మనం గ్రహించగలిగేవి రెండే లక్షణాలు. ఒకటి మనస్సు, ఆలోచన రెండవది పదార్థము, విస్తృతి. డెకార్ట్ మూడు తత్వాలను ప్రతిపాదించాడు, దేవుడు, మనస్సు, పదార్థం (శరీరం) మనస్సును శరీరాన్ని సృజించినది దేవుడే అయినప్పటికీ అవి రెండూ స్వతంత్ర తత్వాలని అభిప్రాయపడ్డాడు దీనిని స్పినోజా ఖండించాడు. మనస్సు, విస్తృతి [Mind, matter extension] అనేవి ఒకే పరతత్వం దేవుని యొక్క లక్షణాలు మాత్రమే అవి దేవుడిపై ఆధారపడినవి. కనుక స్వతంత్రమైనవి కావు. అయితే దేవుని లక్షణాలలో ప్రతి ఒక్కటీ అనంతమైనవి కనుక ఆలోచన లేదా మనస్సు, విస్తృతి లేదా పదార్థము కూడా అనంతమైనవి. అవి ఒకదానిపై ఒకటి ఆధారపడినవి కావు. దేనికదే స్వతంత్రమైనది. అవి ఒక నాణానికి గల రెండు ప్రక్కలవలె దేవుని యొక్క రెండు భిన్నాంశలు అవి ఒకదానికొకటి సమాంతరమైనది. బొమ్మవుంటే బొరుసు ఎలాఉంటుందో, మనస్సుఉంటే విస్తృతికూడా ఉంటుంది ఒకదానికొకటి కారణం కాకపోయినా రెండూ అనంతంగా శాశ్వతంగా కలిసే ఉంటాయి. ఆలోచన ఉన్నచోట విస్తృతిఉంటుంది. అలాగే విస్తృతి ఉన్నచోట ఆలోచన ఉంటుంది. ఈ రెండు భిన్నలక్షణాలద్వారా దేవుడు (సత్) తనను తాను అనేక విభిన్నరూపాలు [Model]లో అభివ్యక్తం చేసుకుంటున్నాడు. ఆలోచన అనే లక్షణం, అనంతమైన మనస్సులుగా భావాలుగా సంకల్పాలుగా అభివ్యక్తమవుతున్నది విస్తృతి అనేలక్షణం, అనంతమైన చలనాలుగా, స్తబ్దత [Rest] గా అంటే భౌతికమైన సమస్త వస్తు ప్రపంచంగా అభివ్యక్త మగుచున్నది.

ఈ అభివ్యక్తి [Monifestation] నే స్పినోజా దేవుని రూపాలు (Model) గా పేర్కొన్నాడు.

విశ్వానికి అంతం లేదు ఆది అనాద్యనంతం, (Space time) దృష్ట్యా దానికి అవధులు లేవు. సత్ అనేది స్థల కాలాలకు అతీతం విశ్వంలోని ప్రతి వస్తువు పరస్పరం కార్య కారణ సంబంధం కల్గినవి ఒకవస్తువు మరొక వస్తువుకు కారణమవుతుంది. దానికి వేరొకటి కారణం. ఇలా ఈ కార్యకారణ సంబంధం అనంతంగా సాగుతుంది. కనుక మనం చూస్తున్న ఈ నక్షత్రాలు, గ్రహాలు, కొండలు, సెలయేళ్ళు, జంతువులు, మానవులు వీటన్నిటినీ దేవుడు పనికట్టు కొని సృజించాడని అనుకోరాదు. దేవుని ప్రకృతి లేదా స్వభావం ఈ సమస్త వస్తువులుగా అభివ్యక్త మవుతున్నా ఇవన్నీ ఒకదాని నుంచి ఒకటీ ఆవిర్భవించినట్టివి. వీటికి ఆదికారణం అనేది లేదు, వీటి మధ్యగల కార్య - కారణాల హారం అనంతమైనది, కొన్ని నిర్దిష్ట భౌతిక సూత్రాలను అనుసరించి ఇవన్నీ ఏర్పడుతున్నాయి. అలానే ఆలోచనకూడా. ఒక ఆలోచన మరొక దానికి కారణం. ఇదికూడా ఒక Chain ఏ ప్రత్యేక ఆలోచనకు దేవుడు ప్రత్యక్ష కారణం కాదు ప్రతిదీ ఒక నియమాన్ని ఒకసూత్రన్ని అనుసరించి ఏర్పడుతున్నది. ఈ కారణాన్న మానవునికి యదేచ్ఛ (Freewill) కూడా లేదు. ఒక ఇచ్ఛ మరొక దానికి కారణం. ఒక ఆలోచన మరొక దానికి కారణమవుతున్నది. మనఆలోచన మనకు తెలుస్తున్నది కనుక, మనం యదేచ్ఛగా దాన్ని సంకల్పించినట్లు భ్రమపడుతున్నాము. కాని మనకు తెలిసినా తెలియకపోయినా, దానికి మరొక ఆలోచన, దానికి మరొక సంకల్పం కారణమయి ఉండి తీరతాయి. అందుచేత ప్రపంచంలోని ప్రతి సంఘటనను, ప్రతి వస్తువును, మానవుని ప్రతి ఆలోచనను ప్రాకృతిక సూత్రాల (Nature laws) ప్రకారం అవగాహన చేసుకోవటం సాధ్యమే విజ్ఞాన

శాస్త్రాల దృష్టినుంచి దేనినైనా ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా అర్థం చేసుకోవచ్చు అంతా దేవుడి లీల దయ అనుకోనక్కర లేదు.

మనలను మనం ప్రేమించుకోవాలంటే ఇతరులను ప్రేమించాలి. అసూయ, ద్వేషం కూడదు. స్నేహంవల్ల సుఖం కల్గుతుంది సత్యాన్ని తెలుసుకోవటంవల్ల సుఖం కలుగుతుంది ఈ ప్రపంచ మంతా ఈశ్వరమయం తనలో, ఎదుటివానిలో, సర్వంలో దేవుడున్నాడు. తాను చనిపోయినా, అంటే ప్రత్యేక దేహిగా కొనసాగకపోయినా, దేవుని అనంత శరీరం కొనసాగుతుంది. తాను భాగమైన దేవుని అనంతత్వం కొనసాగుతుంది. దీన్ని గ్రహిస్తే దుఃఖము లేదు. మరణ భయము లేదు. మృత్యువు అమరత్వానికి దారి. దేవుని అనంతత్వంపట్ల సరియైన అవగాహన (Knowledge) పెంపొందించుకుంటే, నిజమైన జ్ఞానం (జ్ఞానయోగం) ద్వారా అనంత తత్వాన్ని ప్రేమించగల్గితే మనకు ఆనందం కల్గుతుంది. అదే సత్-చిత్-ఆనందం. సచ్చిదానందస్థితి అదే అమరత్వం.

## లైబ్నిజ్ — జర్మనీ 1646

జగమంతా శక్తిస్వరూపం అన్నది ఇతని సారాంశం. ప్రపంచంలో ప్రతి వస్తువుకు ప్రతిఘటనశక్తి (inertia) ఉన్నది. అందుకే ప్రతివస్తువు పరిమితమైనది ప్రతివస్తువుకు స్వతంత్ర వ్యక్తిత్వం individuality వుంటుంది. అందువల్ల అది ఇతర వస్తువుల ప్రభావాన్ని నిరోధిస్తుంది ఏకస్థలంలో ఏక కాలంలో రెండు వస్తువు లుండలేవు. ఒకటే ఉండగలదు. కనుక ప్రతివస్తువులో నిరోధక శక్తి ఉన్నది. అందుచేత ప్రతి వస్తువుకు వ్యాప్తితోపాటు శక్తి కూడా ఉన్నది. అలాగే మనస్సు చూడండి మనస్సు అంటే ఆలోచనల సమాహారం ఒక ఆలోచనలోకి మరొక ఆలోచన చొరబడలేదు. ఒక ఆలోచన తర్వాత మరొకటి రావలసిందే.

దానికి కూడా నిరోధకశక్తి ఉన్నది. అందుచేత మనస్సుకు కూడా ఆలోచనతోపాటు శక్తి ఉన్నది. అందుచేత భౌతిక పదార్థంలోను, మనస్సులోను కూడా శక్తి (force) అనేది ఉన్నది. నిజానికి ఉన్నది శక్తి ఒక్కటే. అదే పరమతత్వం, యదార్థం. దాని లక్షణాలే మనస్సు, పదార్థం. అయితే శక్తి ఒకటిగా ఉండదు. అది అనేకంగా అసంఖ్యాకంగా ఉంటుంది. ప్రపంచంలో శక్తి కేంద్రాలు Centre of force ఒకటి కావు, అనంతం. ఈ శక్తి కేంద్రాలకే మోనాడ్ అని పేరు పెట్టాడు. మోనాడ్ అంటె యూనిట్ మనం దానిని చిద్బిందువు అని పిలువవచ్చు. (చిత్ Consciousness + శక్తి బిందువు) శక్తి అనంతమైన చిద్బిందువుల రూపంలో ఉంటుంది. అనంతమైన చిద్బిందువుల చే ఈ విశ్వం నిర్మితమైంది. ఈ చిద్బిందువులు భౌతిక బిందువులు కావు (Physical Pts.) భౌతిక బిందువులకు విస్తృతి ఉంటుంది. కాని చిద్బిందువులు పార భౌతిక బిందువులు [Meta Physical Pts.]. అవి అణువులు కావు. అణువులకు భౌతికత్వం ఉంది.

ప్రకృతిలో నిరంతరత్వం (Continuity) ఉన్నది. అంటే Spaceలో గాని, Timeలో గాని ఖాళీలు లేవు. శూన్యం లేదు. కనుక చిద్బిందువుల మధ్య కూడా ఖాళీ లేదు. అవి ఒకదాని ప్రక్కన ఒకటి సహజీవనం చేస్తాయి. ప్రతిదానికి దేని వ్యక్తిత్వం దానికి ఉంటుంది. ఒకదాన్ని పోలి మరొకటుండదు. వాటిమధ్య మనం కనిపెట్టలేనంత సూక్ష్మ భేదం మాత్రమే ఉంటుంది. ప్రతి చిద్బిందువు అచ్ఛేద్యం, నిత్యం, అనశ్వరం దానికి ఆది అంతములు లేవు. అయినప్పటికి చిద్బిందువులు ఒకదాన్నొకటి తమ ప్రత్యేక దృష్టి నుంచి ప్రతిఫలిస్తాయి. అందుచేత ఏ ఒక్క చిద్బిందువును తీసుకున్నా దానిలో విశ్వస్వభావమంతా స్వల్పంగానైనా ప్రతిబింబిస్తూ ఉంటుంది. అవి విశ్వదర్పణాలు. ప్రతిదీ ఒక సూక్ష్మజగత్తు. అవి

విశ్వవ్యాప్తమైనవి ఒకదానిలో ఒకటి చొరబడలేదు ఎందుకంటె అలా చొరబడగల్గితే Space లో ఖాళీలు ఏర్పడుతాయి. ఇది నిరంతరత్వ Continuity సూత్రానికి విరుద్ధం. నిరంతరంగా అనంతంగా చిద్బిందువులు ఉండటంవలననే స్థలకాలాలు ఏర్పడుతున్నాయి. ఈ విషయంలో ఐన్‌స్టైన్ సాపేక్షసిద్ధాంతానికి దగ్గరగా వచ్చాడు. అలాగే శక్తి మోనాడ్ యూనిట్లుగా వుంటుందని ప్రతిపాదించటంలో Max Flank Quantum theory కి దగ్గరగా వచ్చాడు. Max Flank కూడా శక్తి ప్రత్యేకం, సంపూర్ణం అయిన యూనిట్లు క్వాంటాలలో ప్రసరిస్తుందని చెప్పాడు కదా!

చిద్బిందువులన్నీ ఒకేవిధమైన శక్తి కేంద్రాలయితే సజీవ నిర్జీవ పదార్థాలుగల ప్రపంచం ఎలా ఏర్పడింది. కొన్నిటికి స్పృహ ఉంది కదా! ప్రకృతిలో నిరంతరత్వం ఉన్నప్పుడు స్పృహ ఒకచోట ఉండి మరొకచోట వుండకుండా వుండటానికి వీలులేదుకదా! కాని నిర్జీవ పదార్థాలలో స్పృహ లేదు కదా! దానికిలా చెప్పాడు. నిరంతరత్వ సూత్రప్రకారం Zero నుంచి అనంతం (Infinite] వరకు స్పృహ చేతన శక్తి ఉండవలసిందే అనంతమైన స్పృహ, స్వయం స్పృహ చేతనకలవాడు దేవుడు Super Monod దేవుని నుండి ప్రారంభమై చిచ్ఛక్తి క్రమంగా అవరోహణ క్రమంలో తగ్గుతూవస్తుంది. మానవునిలో చిచ్ఛక్తి కొంత వుంటుంది. అతనిలో స్వయంస్పృహ, జ్ఞాపకశక్తితోపాటు వివేచనకూడా ఉంది. జంతువులలో స్వయం స్పృహ జ్ఞాపకశక్తి మాత్రమే ఉంటుంది. వృక్షాలలో స్పృహ చాలా స్వల్పంగా ఉంటుంది. నిర్జీవ వస్తువులలో స్పృహ పూర్తిగా అస్పష్టంగా దాదాపు వుండీలేనంత స్వల్పంగా ఉంటుంది. కాని అసలు లేకుండాపోదు. Zero చిచ్ఛక్తి అనేస్థితిలేదు. నిర్జీవ పదార్థములో చిచ్ఛక్తి ఏమాత్రం ఉంటుందంటే వాటి స్థలంలోకి వేరే వాటిని రానివ్వకుండా ఉండేంతవరకే. అక్కడనుండి పై శ్రేణులకు

పోతున్నకొద్దీ అత్యంత సూక్ష్మ భేదాలతో చిచ్ఛక్తి పెరుగుతూ ఉంటుంది. ప్రతివస్తువులోను ఒక చిద్బిందువు ప్రబలస్థితిలో వుంటుంది. దాని చుట్టూ తక్కిన చిద్బిందువులు గుంపులుగా చేరుతాయి. ఆ ప్రబల చిద్బిందువు కారణంగానే ఆవస్తువు ఆకృతి, స్వభావం మొదలైనవి ఏర్పడుతాయి మానవులలో మనస్సే ప్రబలమైన చిద్బిందువు. దాని చుట్టూ శరీరానికి సంబంధించిన చిద్బిందువులు గుమికూడుతాయి.

స్పినోజా ఈ ప్రపంచంలో ప్రతి సంఘటనకు మరొకటి కారణమన్నాడు. కార్య-కారణ సూత్రాన్ని ప్రతిపాదించాడు. అయితే ఒకటి మరొకదానికి కారణమన్నంత మాత్రంలో అదే ఎందుకు కారణం కావాలో, మరొకటి కారణం ఎందుకు కారాదో బోధపడటం లేదు. మన ఎదుట ఈ మహావిశ్వం ఉన్నది. అది ఆవిధంగానే ఎందుకున్నది. మరొకవిధంగా ఎందుకు లేదు. మరొక విధంగా వుండకపోవటానికి తార్కికంగా ఏ కారణం కనబడుట లేదు. విశ్వంలోపల ఎంత వెదికినా అటువంటి కారణం కనబడదు. కనుక దానికి కారణం విశ్వం వెలుపల విశ్వానికి అతీతంగా ఉండాలి. అటువంటి కారణమే దేవుడు. ఈ విశ్వం ఈ విధంగా వుంటటానికి మరొకవిధంగా లేకపోవటానికి తగిన సమర్థ కారణం దేవుడే దేవుడు పరిపూర్ణుడు కనుక సృష్టించడానికి వీలున్న విశ్వాలన్నిటిలోకి ఉత్తమ విశ్వాన్నే సృష్టించాడు. మనదే ఉత్తమ విశ్వం ఇదే ఉత్తమ విశ్వం అయితే దీనిలో ఇంత చెడు ఎందుకున్నది సుఖ దుఃఖాలు ఎందుకున్నవి. దేవుడు దయాసముద్రుడైతే ఇవి లేకుండా ఉండాలికదా! చెడును పరిహరించడానికి దేవుడికైనా సాధ్యం కాదంటాడు. దేవుడు అనంతుడు Infinite కాగా విశ్వంలో మానవులు, ప్రతివస్తువూ పరిమితమైనవి. పరిమితమంటె చెడు. కనుక చెడను తొలగించాలంటె పరిమితత్వాన్నే తొలగించాలి. అప్పుడు

విశ్వమే ఉండదుకదా! పైగా కష్టసుఖాలు మంచీచెడులు ఇవన్నీ మన పరిమిత మానవదృష్టినుంచి మాత్రమే తప్ప అవి స్వతః సిద్ధ గుణాలుకావు విశ్వం దృష్టినుంచి చూస్తే మంచీచెడూ ఏవీలేవు. అనంతుడైన దేవునికి అన్నీ ఒకటే అంతేకాదు చీకటి ఉన్నప్పుడే వెలుతురు విలువ. అలాగే వర్ణచిత్రంలో అంతా ఒకటేరంగు అయితే బొమ్మే ఉండదు. ఆలానే చెడువుంటేనే మంచి తెలుస్తుంది. దేని విలువ దానిది. ప్రపంచంలో దేన్ని ఏ ఉన్నత ప్రయోజనం కోసం దేవుడు సృష్టించాడో, ఏ సంఘటన ఏ ఉత్తమ లక్ష్యంకోసం జరుగుతున్నదో పరిమిత గ్రహణశక్తిగల మానవుడు తెలుసుకోలేడు.

దేకార్త్, స్పినోజా, లైబ్నిజ్ బుద్ధివాదులు Rationalists. బౌద్ధిక వివేచన ద్వారానే సత్యాన్ని సందర్శించగలమన్నది వీరి సిద్ధాంతం, ఈ వాదాన్ని ఖండిస్తూ మరొక శాఖ, అనుభూతివాదం బయలుదేరింది ఇంద్రియానుభూతి ద్వారానే మనకు జ్ఞానం Knowledge లభిస్తుందని వీరి వాదం. వీరిలో జాన్ లాక్, జార్జి బర్కిలీ, డేవిడ్ హ్యూమ్ ముఖ్యులు

## జాన్‌లాక్ – ఇంగ్లండ్ – 1632–1704

మనిషి జన్మించినప్పుడు అతని మనస్సు ఖాళీ పలకవలె, తెల్ల కాగితంవలె వుంటుందని లాక్ వాదం. జన్మతోనే అన్ని భావాలు మానవ మనస్సులో నిక్షిప్తమై ఉండేటట్లయితే శిశువులు పరమజ్ఞానులు కావాలి అటవికులు కూడా సకల విజ్ఞాన పారంగతులు కావాలి. విద్యార్జనకు అర్థమే ఉండదు. అలాగే నీతి సూత్రాలు కూడా స్వతః సిద్ధమైనవి కావు. విశ్వజనీనమైన నైతికత్వం లేదు. మంచి-చెడు దేశకాల పాత్రలనుబట్టి మారతాయి. ఒకరికే భిన్నకాలాలలో మంచి చెడు తారుమారవుతాయి. ఒకరి

దేవుడు మరొకరికి కాదు. అసలు దేవుడనే భావమే ఎరుగని జాతులుండవచ్చు కదా! స్వతః సిద్ధ భావాలనేవి లేవు. ఇంద్రియానుభూతి ద్వారానే మనకు భావాలు కల్గుతాయి. జ్ఞానం రెండు రకాలుగా వస్తుంది జ్ఞానేంద్రియాల ద్వారా, వివేచన ద్వారా. బాహ్యజగత్తును గురించి జ్ఞానేంద్రియాల ద్వారా మనకు భావాలు కల్గుతాయి. అలా కల్గిన భావాలను గురించి మనస్సు వివేచిస్తుంది, తర్కిస్తుంది, విశ్లేషిస్తుంది, భావిస్తుంది, సంకల్పిస్తుంది. అది ఇంద్రియ జ్ఞానం, ఇది వివేచన జ్ఞానం.

కంటితో రంగు చూస్తాము, చెవితో ధ్వని వింటాము, నాలుకతో రుచి, ముక్కుతో వాసన చూస్తాము, చర్మంతో వేడి చలి, మెత్తన, గట్టి మొదలైన గుణములను తెలుసుకుంటాము. మన వివేచనతో నిమిత్తం లేకుండా ఈ విధంగా వచ్చే ఇంద్రియ భావాలను ప్రాథమిక భావాలు Simple ideas అని అంటారు. ఈ ప్రాథమిక భావాలు వెంటనే తొలిగిపోవు ఎదురుగా వస్తువు లేకపోయినా అది కల్గించిన భావం మనస్సులో మిగిలిపోతుంది. వాటిని గురించి మనస్సు వివేచిస్తుంది. ఆయా భావాల మధ్య సాదృశ్యాలను, విభేదాలను మననం చేస్తుంది. విశ్లేషణ చేస్తుంది. ఆ విధంగా సంక్లిష్ట భావాలు Complex ideas ఏర్పడుతాయి ఉదా:— ఒక వస్తువును చూస్తాము. అలాంటిదే మరొక వస్తువును చూస్తాము. ఆ రెండింటిని మనస్సు పోల్చుకొని "జంట" అనే భావాన్ని ఏర్పరచుకుంటుంది, జంట అనేది బాహ్యప్రపంచంలో లేదు. అక్కడ ఉన్నవి రెండు వేర్వేరు వస్తువులు మాత్రమే. కాని మనస్సు వాటిని పోల్చిచూసి జంట అనే భావాన్ని కల్పించుకుంటుంది. అలాగే స్థలం అనేభావం స్పర్శద్వారా, చూపుద్వారా కల్గుతుంది. అలాగే మనలో కలిగే భావాలమధ్య అంతరాన్ని [duration] బట్టి కాలం అనేభావం కల్గుతుంది. స్థలాన్ని నిరవధికంగా పొడిగించటం

ద్వారా అనంతత్వం [Infinity] అనే సంక్లిష్ట భావం ఏర్పడుతుంది. కాలాన్ని అనంతంగా పొడిగించటం ద్వారా నిత్యత్వం [Eternity) అనే సంక్లిష్టభావం ఏర్పడుతుంది. నిజానికి అనంతత్వం, నిత్యత్వం అనే భావాలు బాహ్యప్రపంచంలో కనబడేవి కావు అవి కేవలము వివేచన ద్వారా మనస్సు సృష్టించుకొన్న భావాలు. అలాగే శక్తి అనేభావం. ఇది ఇంద్రియ గోచరం కాదు. కాని నిప్పువద్ద మైనము ఉంచితే కరగటం చూస్తాం. దానిబట్టి ఉష్ణశక్తిని మనస్సు ఊహిస్తుంది. అలాగే సౌందర్యం. ఒకవస్తువు మనకు ఆనందాన్ని కల్గిస్తుంది. దాన్ని సుందరవస్తువుగా గ్రహిస్తాము. ఆ విధంగా ఆనందం కల్గించే అనేక సందర్భాల అనుభవం తర్వాత వాటిని సాధారణీకరించి సౌందర్యం అనేభావం ఏర్పరుచుకుంటాము. అలాగే సుఖం, దుఃఖం, మంచి, చెడు మొదలైన సాధారణీకరాలన్నీ సంక్లిష్ట భావాలకు దాహరణ.

మనం ఇంద్రియాల ద్వారా చూసేది గ్రహించేది ఆయా వస్తువుల యొక్క భావాలు, ప్రతిబింబాలు, ఆభాసలే (Appearences) తప్ప అసలు వస్తువులు కావు. మనకు ఇంద్రియానుభూతిలోకి వచ్చేది అసలు వస్తువులతో కూడిన జగత్తు కాదు. ఆ జగత్తుయొక్క ఆభాస మాత్రమే వస్తువుకు రెండు రకాలైన గుణాలుంటాయి. [Primary, Se.ondary] వస్తువుకు గల విస్తృతి, సంఖ్య, చలనం, స్తబ్దత, ఘనత్వం, ద్రవ్యరాశి, ఆకారం పరిణామం మొదలైన వన్నీ దాని మౌలికగుణాలు (Primary Qualities). ఇవి వస్తువును స్వతహాగా అంటిపెట్టుకొని ఉంటాయి. ఈ గుణాలు లేని వస్తువు నూహించలేము ఇవి కాక ఆభాసిక గుణాలు (Secondary) వస్తువుల్లో ఉన్నట్లు కన్పిస్తాయి. కాని నిజంగా ఉండవు. ఉదా:- గులాబీ ఎర్రగా ఉంది. కాని వాడిపోతే ఎరుపుపోయి నలుపు వస్తుంది. అంతేకాక గ్రుడ్డివాడికి, మనకైనా చీకటిలో ఏ రంగు

కన్పించదు. కనుక రంగు అనేది వస్తువుల్లో ఉన్నట్లు కనబడే ఆభాస గుణం మాత్రమే. అది వస్తువులో లేకపోయినా, మన మనస్సు ఇంద్రియానుభూతి ద్వారా ఆ వస్తువులో ఉన్నట్లు కల్పించుకుంటు న్నది. అలాగే ధ్వని, వాసన, రుచి, వేడి, చల్లన వగైరా. ఒక పాట వింటాము, అది శ్రావ్యంగా వున్నదనుకుంటాము. కాని శ్రావ్యత ఆ ధ్వనిలో నిజంగా లేదు చెవిటి వాడికి ధ్వనే లేదు. ఒక పువ్వు వాసనచూస్తాము. అది సువాసనగా ఉన్నదనే భావము కల్గించేది మన మనస్సే. జలుబు చేసినప్పుడు ఏ వాసనారాదు కనుక వాసన అనేది పువ్వులో స్వతహాగా లేదు. ఈ విధంగా ఆభా సిక గుణాలన్నీ మన ఇంద్రియాల స్థితిపై ఆధారపడినవే తప్ప వస్తుతహా లేవు. అవి మౌలికమైనవి కావు.

మనకు అనంతకోటి భావాలు కల్గుతాయి. ఈ భావాలకు ఆధారం ఏమిటి? వాటంతట అవి కలుగవుకదా! ఏదో బాహ్య వస్తువు లేదా పదార్థం ఆ భావాలను మనలో కల్గిస్తున్నది. ఆ పదార్థం భౌతికం కావచ్చు లేదా అభౌతికం కావచ్చు. మొత్తంపై ఏదోపదార్థం తనంతటతాను స్వతః సిద్ధంగా లేకపోతే దానికి సం బంధించిన భావం మనలో కలుగదు. ఆ పదార్థం ఏమిటని అడిగితే మనం ఇదమిత్థమని మాటలలో చెప్పలేము. దాన్నే (Substance) అని లాక్ అన్నాడు.

నిశ్చయజ్ఞానం అనేది అంతః ప్రబోధం (Intution) ద్వారా కల్గుతుంది. ఉదాహరణకు నేను ఉన్నాను అనే జ్ఞానం అంతః ప్రబో దం వల్లనే కల్గుతుంది. దీనికి వేరేరుజువులక్కరలేదు. అది తిరుగు లేని నిశ్చయజ్ఞానం. అలాగాక తార్కికమైన రుజువులద్వారా కూడా నిశ్చయజ్ఞానం లభించవచ్చు.

## బిషప్ జార్జి బర్క్లీ — ఇంగ్లండు 1685—1753

లాక్ భావాలు, మనస్సు, పదార్థం ఉన్నాయని చెప్పగా,

బర్క్లీ ఉన్నది. మనస్సు, భావాలే మాత్రమేనని అన్నాడు. ఉనికి = ఎరుక (To be is to be Perceived) అన్నది ఇతని సుభాషితం. మనకు మనోగోచరం కావటంలోనే వస్తువుకు ఉనికి వుంటుంది. అంటే మనకు గోచరించకపోతే వస్తువు లేనట్లే. మనకు లభించే జ్ఞానము అంతా అనుభూతి ద్వారానే వస్తున్నదని, మన అనుభూతిలోకి వచ్చేవి భావాలు మాత్రమేనని ఇతడు కూడా అంగీకరించాడు. అలాగే వేడి, చల్లదనం, రంగు, రుచి, వాసన, ధ్వని మొదలైన ఆభాసిక గుణాలు ఆయా వస్తువులలో లేవని, మన మనస్సులోనే ఆయాగుణాలకు సంబంధించిన భావాలు ఉత్పన్నమవుతాయి అని లాక్ని అంగీకరించాడు.

వేడి అంటె ఏమిటి? చేయి చురుక్కుమంటుంది. ఇదొక అనుభూతి. ఇది మన మనస్సుకే తెలుస్తుంది. కనుక వేడి అనేది మన మనస్సులోని ఒక భావమే తప్ప నిజంగా వస్తువులో లేదు. అలాగే పైన చెప్పిన గుణాలన్నీ మానసికమైనవే. ఒక చేతిని బాగా వేడిగానున్న నీటిలోను, రెండవ చేతిని బాగా చల్లగా ఉన్న నీటిలోను ముంచి, రెండు చేతులను ఒక్కసారిగా గోరువెచ్చని నీటిలో ముంచండి వేడిచేతికి గోరువెచ్చని నీరు చల్లగా ఉంటుంది. చల్లని చేతికి గోరువెచ్చని నీరు వేడిగా ఉంటుంది. అంటే గోరువెచ్చని నీరు ఒకే సమయంలో చల్లగాను, వెచ్చగాను కూడా ఉన్నట్లా? ఇది ఎలా సంభవము. దీన్నిబట్టి వేడి చల్లదనం అనేవి మన ఇంద్రియాల స్థితిపై ఆధారపడిన భావాలని తెలియటంలేదా! అవి వస్తువులలో లేనట్లేగదా! అలాగే రుచి, చేదు, సుఖం, దుఃఖం అన్నీనూ.

కాని లాక్ చెప్పిన పరిమాణం, ఆకారం మొదలైన ప్రాథమిక గుణాలు వస్తువులోవుండి మనకు భావాల రూపంలో అందుతున్నాయన్న వాదాన్ని ఇతడు తిరస్కరించాడు. ఆభాసికగుణాలు,

మౌలిక గుణాలు అని రెండు రకాలు లేవని, అన్నీ ఆభాసిక గుణాలేనన్నాడు, పరిమాణం, ఆకారం మొదలైనవి కూడా ఆభాసికాలేనన్నాడు. ఉదాహరణకు మనకు అరమైలు దూరంలో ఒక తాటి చెట్టువుంది. అది చాలా చిన్నదిగా కన్పిస్తుంది. దగ్గరకు పోతే ఎత్తుగా కన్పిస్తుంది. అంటె మనం ఉన్న దూరాన్ని బట్టి తాటిచెట్టు పొడుగు మారుతూవుంది. టేపుపెట్టి కొలిస్తే దాని అసలు ఎత్తు తెలుస్తుంది కదా అనవచ్చు. కాని దూరాలను బట్టి పొడుగు మారే లక్షణం తాటి చెట్టుకువలె టేపుకు కూడా వర్తిస్తుంది కదా! చీమ మనకు చిన్నదిగా కన్పిస్తుంది అంతకంటె చిన్న ప్రాణికి చీమ పెద్దదిగా కన్పిస్తుంది. మరి ఈ రెంటిలో ఎవరి అభిప్రాయం నిజం. కనుక సైజు, పరిమాణం లాంటి గుణాలు వస్తువుకు స్వత-హాగా చెందినవి కాక, చూసేవ్యక్తి మనోధర్మమును బట్టి ఉంటుందని, అవికూడా ఆభాసిక గుణాలేనని తేలుతుంది కదా! ఒక వస్తువు నున్నగా ఉన్నదని అనుకుంటాము. కాని మైక్రోస్కోపులో చూస్తే దాని ఎగుడు దిగుడులు కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. అలాగే రూపాయి నాణెం గుండ్రంగా ఉన్నదనుకుంటాము. కాని ఒకకోణం నుంచి చూస్తే Ellipticalshape లో కన్పిస్తుంది. అందుచేత ఆకారంకూడా ఆభాసికగుణమే. అలాగే ఒకవస్తువు కదులుతూవుంటే ఒకరికి అది నెమ్మదిగాను, వేరే కదిలే వాహనంలోనున్నవాడికి, ఆ వస్తువే వేగంగా కదులుతున్నట్లు అన్పిస్తుంది. కనుక చలనం కూడా చూసే వాడినిబట్టి ఉంటుంది. వస్తువులోని ద్రవ్యరాశి (Mass) ఏపరిస్థితులలోనూ మారదని మనము అనుకుంటాం. కాని వస్తువు వేగాన్నిబట్టి ద్రవ్యరాశి మారుతుందని ఐన్‌స్టీన్ నిరూపించాడు. వస్తువు వేగం పెరుగుతున్నకొద్దీ దాని ద్రవ్యరాశి పెరుగుతుంది.

ఇకపోతే మనకు ఇంద్రియానుభూతులు (పరిమాణం, ఆకా

రెం. రంగు, రుచి) కలుగుతున్నాయంటే వాటిని మన మనస్సులో ఉత్పత్తిచేసే బాహ్యవస్తువు ఏదో ఒకటి ఉండాలి, దానినే Substance అని లాక్ వాదం కాగా బర్క్లీ— అలాంటి Substance లేదా పదార్థం లేదా Matter ఏమీ లేవన్నాడు. మన మనస్సు తెలుసుకోగల్గినది భావాలను మాత్రమే అయినప్పుడు, అనుభూతి ద్వారానే భావాలు కలుగుతున్నప్పుడు మన అనుభూతిలోకి రాని పదార్థం ఏదో ఉందని మనం ఎలా అంగీకరించాలి? అందుచేత లాక్ ఊహించినట్లు భావాలను మనలో కల్గించే గుణాలకు ఆధారంగా ఏదో అజ్ఞాత పదార్థం, ఎక్కడో మనకు తెలియకుండా ఉన్నదనే అభిప్రాయం తప్పు అటువంటి పదార్థం లేదు. ఉన్నదంతా మనస్సే అంటే మన మనస్సు తెలుసుకోగలిగిన దాని కంటె భిన్నమైనదేదీ స్వతహాగా, స్వతంత్రంగా దానంతట అది లేదని ధృవపడుతుంది ఒక వస్తువు ఉన్నదీ అంటె దాన్ని మన మనస్సుతో గ్రహిస్తున్నామనమాట. మనం తెలుసుకోగల్గిన మేరకే ఆ వస్తువు, దాని యాదార్థ్యం ఉన్నది. అంతకు మించి భౌతిక వస్తువేదీ లేదు. మన చైతన్య పరిధిలోకి వచ్చిన మేరకే ఆ వస్తువుకు యదార్థ్యం ఉన్నది. ఉనికి = ఎరుక To be is to be Perceived. అంటె మనం చూడకపోతే ప్రపంచం లేనట్టేనా! అని ప్రశ్న వస్తుంది. నేను నాగదిలో కూర్చుని ఉంటాను మధ్యలో అవలకు వెళతాను. అప్పుడు నా గది లేనట్టేనా! అలా కాదంటాడు బర్క్లీ. నేను ఆ గదిలో లేకపోయినప్పటికి, ఆ గదిలో ఉండేవుంటే అది నా చైతన్య పరిధిలోకి వచ్చేదని నాకు తెలుసు కనుక. ఆ గది యదాప్రకారముగా కొనసాగుతుంది. లేదు నేను ఆ గదిని చూడకపోయినా సర్వాంతర్యామి అయిన దేవుడు ఆ గదిని చూస్తూనే ఉన్నాడు కనుక అది యథాప్రకారంగా కొనసాగుతుంది. ఈ ప్రపంచాన్ని దేవుడు నిరంతరము గమనిస్తూనే

ఉన్నాడు కనుక ప్రపంచం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది దేవుడు కూడా లేకపోతే ప్రపంచం లేనట్లే కాని ప్రపంచం ఉంది కనుక దేవుడుండి తీరాలి. మనస్సు లేనిదే ఏ వస్తువూ లేదు. ఆ మనస్సు నీది కావచ్చు, నాది కావచ్చు, దేవునిది కావచ్చు.

మనస్సుకు తెలిసేవి భావాలు మాత్రమేనని, వస్తువులు కాదని అనేటట్లయితే మనం భావాలను తింటున్నామా! భావాలను తాగుతున్నామా! భావాలు తొడుక్కుంటున్నామా! అని ప్రశ్న వస్తుంది. దానికి మనం తినేది, తాగేది, ధరించేది మన మనస్సుకు వెలుపల స్వతంత్ర అస్తిత్వములేని, మనస్సుకు తెలిసినంత మేరకే నిజమైన అస్తిత్వం కల, ఇంద్రియాల అనుభవ పరిధిలోకి వచ్చే వస్తువులను మాత్రమేనంటాము. ప్రఖ్యాత ఆంగ్ల సాహిత్యవేత్త డాక్టర్ జాన్సన్ ఒక పెద్ద బండరాయిని కాలితో తన్ని భౌతిక వస్తువు లేదనే వాడికి ఇదే నా సమాధానం అని అన్నాడు.

## డేవిడ్ హ్యూమ్ – ఇంగ్లండు 1711 – 1776

ఇతడు ఇంకా ఒక అడుగు ముందుకు వేసి, పదార్థం లేదు, మనస్సు లేదు, ఉన్నది కేవలం మన మానసిక స్థితులు [Mental stales] మాత్రమేనన్నాడు. మనస్సుకూడా మన అనుభూతిలోకి రాదు కనుక లేదు మనలోనికి చూసుకున్నప్పుడు మనస్సు గురించిన జ్ఞానమేదీ కలుగదు, ఏ క్షణంలో చూసినా మనకు ఏదో ఒక ప్రత్యేకానుభూతి, ఏదో ఒక సంవేదన, ఏదో ఆలోచన, ఏదో ఒక భావం మాత్రమే గోచరిస్తుంది వేడి, చల్లదనం, రంగు, రుచి, ప్రేమ, ద్వేషం, సుఖం, దుఃఖం. ఇలాంటివే మనకు అనుభూతమవుతాయి. ఇవన్నీ మానసిక స్థితులు. వీటినే మనం తెలుసుకొనేది. ఈ మానసిక స్థితుల మూటనే [Bundle of Perceptions]

మనం మనస్సు అని పిలుస్తున్నాము. మనస్సు అనేది ఒక పేరు తప్ప మరేదీ కాదు. మన మానసిక స్థితులే తప్ప మన మనస్సు అనుభూతికి రాదు కోపించటంతప్ప కోపించే మనస్సులేదు. బాధ తప్ప బాధపడే మనస్సులేదు ఇలాగే వివిధ అనుభూతులు తప్ప అనుభూతిచెందే మనస్సులేదు. భౌతిక ప్రపంచ అస్తిత్వానికి బర్క్లీ దేవుడిని సహాయంగా తెచ్చుకున్నాడు. ఇంద్రియానుభూతి ద్వారానే మనకు వివిధ భావాలు కల్గుతున్నాయి. అనుభూతిలోకి రాని దేవుని ఉనికిని ఎలా నిర్ధారణ చేయగలమని ప్రశ్నించాము.

ఈ మానసిక స్థితులు రెండురకాలు. ఇంద్రియానుభవం ద్వారా మనలో కలిగే సంవేదనలనే ఇతను Impressions అన్నాడు. వీటిలో కోర్కెలను, ఉద్రేకాలను కూడా చేర్చాడు. రెండవ రకానికి చెందిన మానసిక స్థితులను Ideas అని పేర్కొన్నాడు. ఇవి మన ఆలోచనలు, భావాలు, జ్ఞాపకాలు, ఊహలు మొదలైనవి. సంవేదనలు అనుభూతికి చెందినవి. భావాలు ఆలోచనకు సంబంధించినవి. అయితే భావాలు సంవేదనలనుంచే వస్తాయి. సంవేదనలు లేనిచో వాటికి సంబంధించిన భావాలే కలుగవు. పుట్టుకతో గ్రుడ్డివానికి రంగు అనేభావం కలుగదు. అలాగే చెవిటి వాడికి ధ్వని అనేభావం కలుగదు. అయితే మన యదార్థ అనుభూతిలోకి రాని కొన్ని భావాలు (రెక్కల గుర్రం, బంగారు పర్వతం) కలుగవచ్చుకదా అని ప్రశ్నించవచ్చు అయితే రెక్కలను, గుర్రాలను మనం చూస్తున్నాం. బంగారాన్ని, పర్వతాన్ని విడిగా చూస్తున్నాము. ఈ సంవేదనలను అనుసంధించటం ద్వారా రెక్కల గుర్రం, బంగారు పర్వతం అనే భావాలను ఏర్పరచుకుంటున్నాము.

ఇతడు కార్యకారణ సూత్రాన్ని కూడా తిరస్కరించాడు. మనకు కలిగే ఇంద్రియ సంవేదనలు దేనికది విడివిడిగా వస్తాయి.

ఒక సంవేదనకు మరొక సంవేదనకు ఎట్టి సంబంధం లేదు. ఒకటి మరొకదానికి కారణం కాదు. మన సంవేదనలు ఒక క్రమంలో కలిసికట్టుగా వస్తాయి. అలా రావటంవల్ల ఒక సంఘటన మరొక దానికి కారణం అవుతున్నదని భావిస్తాము. ఫలానా పని చేస్తే ఫలానా ఫలితం కల్గుతుందని ఊహించుకుంటాము. కాని నిజానికి ప్రకృతిలో అటువంటి సంబంధమేమీ లేదు. అనుభూతివాదం ప్రకారం మనకు యథార్థంగా అనుభవమైన దానికే గదా అస్తిత్వం ఉన్నది. కాని మనకు రెండు సంఘటనల మధ్య, రెండు సంవేదనల మధ్య, ముందు వెనుక అనే క్రమంతప్ప మరేవిధమైన సంబంధం మనకు అనుభూతం కావటం లేదు. కావున కార్యకారణ సంబంధం ఒక మనోభావం మాత్రమే! ఊహాకల్పన! నిజం కాదు ఉదా: ఒక బంతిని పైకెగరవేస్తే నేలమీదపడుతుంది, బంతిని ఎగరవేయటం అది నేలమీద పడటం వేర్వేరు సంఘటనలు కాని అవి ఎప్పుడూ కలిసికట్టుగా రావడంవల్ల భూమి బంతిని ఆకర్షించడం కారణమని, బంతి నేలపై పడటం ఫలితమని మనం స్వీకరిస్తాము. ఈ విధంగా కార్యకారణ సంబంధమును మనం కల్పించుకుంటున్నామే తప్ప అట్టి సంబంధం నిజంగా ఆ సంఘటనల మధ్య లేదు.

Note:- Science ప్రకారం ఈ వాదం తప్పు అని ప్రత్యేకంగా చెప్పనవసరము లేదు.

## కాంట్ — జర్మనీ — 1724–1804

వాయు ధూళి ప్రపంచానికి మూలకారణమన్న నెబ్యులర్ థియరీకి ఖగోళసిద్ధాంతాన్ని నిర్మించిన విజ్ఞానవేత్త. కాంట్ దేవుడిని అన్వేషించడానికి బయలుదేరి మానవుని కనుగొన్నాడు. ఆ కాలానికి బుద్ధివాదం అనుభూతివాదం ప్రబలంగా ఉండేవి బుద్ధివాదం ప్రకారం ఇంద్రియానుభూతివల్ల నిశ్చితమైన, స్పష్టమైన

జ్ఞానము లభిచదు అది విశ్లేషణ ద్వారానే లభిస్తుంది. మన మనస్సులో స్వతసిద్ధ భావాలు ఉంటాయి. వాటిని విశ్లేషించి, సంశ్లేషించి మనం నిశ్చితజ్ఞానం సంపాదించవచ్చు కాని వీరు జ్ఞానార్జనలో అనుభవానికి గల పాత్రను అలక్ష్యం చేశారు. నిజానికి అనుభవాతీతమైన జ్ఞానం ఉన్నప్పటికీ, మొదట అనుభవంతోనే జ్ఞానార్జన ప్రారంభమవుతుంది. కాగా అనుభూతివాదం ప్రకారం జ్ఞానమంతా అనుభవం నుంచే వస్తుందన్నారు. మనస్సులో స్వతఃసిద్ధ భావాలేమీ ఉండవని, ప్రారంభంలో మన మనస్సు ఖాళీపలక వలె ఉంటుందని, అనుభవానంతర జ్ఞానం తప్ప అనుభవాతీత జ్ఞానం లేదని అంటారు. అనుభవాలనుంచి వచ్చే జ్ఞానంలో కూడా నిశ్చితత్వం Certainity లేదు, సార్వత్రికత Universality లేదు, అవశ్యకత Necessity లేదు, కార్య-కారణత్వం లేదు అంటారు. మన అవగాహన Understanding ను కేవలం అనుభవానికి పరిమితం చేయటం అనుభూతివాదుల పొరపాటు అనుభవం వల్ల ఏది ఉన్నదో అది మనకు తెలుస్తుంది, కాని అది అలాగే ఎందుకుండాలి, వేరొక విధంగా ఎందుకు ఉండకూడదు అనేది తెలియదు. అలాగే నిశ్చిత జ్ఞానం అనేది లేదని ఎలాచెప్పగలం! ఇంద్రియానుభవానికి మించిన జ్ఞానం ఎందుకుండకూడదు. అనుభవాతీత జ్ఞానం ఎందుకుండకూడదు. అనుభవాతీత జ్ఞానానికి నిశ్చితత్వం, సార్వత్రికత, అవశ్యకత ఎందుకుండరాదు. రెండు రెళ్ళు నాలుగు. ఇది నిశ్చిత జ్ఞానం ఈ రోజు నిజమయి రేపు కాకపోదు, కావున సార్వత్రికం. అనుభవాతీతం కూడా. దాన్ని అనుభవానికి ఎప్పుడు వర్తింపచేసినా నిజమయి తీరుతుంది అలాగే విశ్వంలో ప్రతివస్తువు ఇతర వస్తువును ఆకర్షిస్తుందనే సత్యం అనుభవం ద్వారా సాధించిన సూత్రం కాదు. అలాగే ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన కాంతి వక్రీభవన సూత్రం (బరువైన ఖగోళవస్తువు సమీపంలోంచి కాంతికిరణాలు

ప్రయాణం చేసేటప్పుడు అవి ఒక మేరకు విధిగా వక్రీభవిస్తాయి) ఇది అనుభవాత్పూర్వ ప్రతిపాదన. కాంట్ ఈ రెండు భావాలను సమన్వయపరచ ప్రయత్నించి ఒకటో భావాన్ని ప్రవేశపెట్టాడు అనుభవాత్పూర్వ జ్ఞానం సాధ్యమా! సాధ్యమయితే ఎలా సాధ్యపడుతున్నది?

ఆలోచించటం మనస్సు లక్షణం. మనస్సు ఆలోచిస్తున్నదంటే తాను కాని దాన్నిగురించి — అంటే బాహ్య ప్రపంచాన్ని గురించి ఆలోచిస్తున్నదని అర్థం. కనుక మనస్సు వెలుపల ఒక బాహ్యప్రపంచం ఉండి తీరాలి. బాహ్యప్రపంచం రెండురకాలు ఒకటి విషయజగత్తు (Phenomenal world) అంటే ఇంద్రియాల ద్వారా మనకు తెలిసే ప్రపంచం అది రంగు రుచి, వాసన బరువు, ఆకృతి మొదలైన గుణాలతో కూడిన వస్తు ప్రపంచం ఇవన్నీ ఇంద్రియాలకు తెలిసే గుణాలు తప్ప వస్తువులో నిజంగా లేవు ఆభాసికగుణాలు. ఇది కాక వాస్తవజగత్తు ఏ యదార్థ వస్తువు లేకుండా ఆభాసిక గుణాలు వాటంతటవి బయలుదేరి మన ఇంద్రియాలకు గోచరించవు కదా! అందుచేత ఆ గుణాలవెనుక వాటికి ప్రేరకాలైన యదార్థవస్తువులుండితీరాలి. దాన్ని లాక్ Substance అంటే, కాంట్ నూమినా Noumena అని పేరు పెట్టాడు. నూమినా అంటే thing - in - itself అంటె తనలో తాను వుండే వస్తువు లేదా పదార్థము అది అతీతం. ఇంద్రియానుభవమునకు అందనిది, యదార్థమైనది మన ఉపనిషత్తులు పేర్కొన్న బ్రహ్మపదార్థం లాంటిది. ఇంద్రియాలకు, మనస్సు అవగాహనకు అందే విషయగుణాలన్నిటిని, ఇదికాదు, ఇదికాదు అంటూ తొలగిస్తూపోగా చివరకు ఏది మిగులుతుందో దాన్ని కాంట్ నూమినాగా పేర్కొనవచ్చు అది మనకు అజ్ఞాతమే కాదు అజ్ఞేయ కూడా, అంటే తెలియపడరానిది. కావున ఇతడు అజ్ఞేయవాది [AGNOSTIC]

విషయజగత్తును గురించిన జ్ఞానం మనకు రెండువిధాలుగా వస్తున్నది. ఒకటి ఇంద్రియానుభూతి ద్వారా, రెండు బుద్ధి అవగాహన [Understanding] ద్వారా ఇంద్రియానుభవాంతర జ్ఞానంలో ఆవశ్యకత లేదని ఇంతకుముందే తెలుసుకున్నాం. అనుభవాత్పూర్వ జ్ఞానమే నిజమైన జ్ఞానం ఇది ఎలా లభిస్తుంది అనేది ప్రశ్న. సమస్తమైన జ్ఞానం మనకు ప్రతిపాదనల రూపంలో లభిస్తుంది రెండు భావ శకలాలను జోడించి సమన్వయించినప్పుడే జ్ఞానం లభిస్తుంది. ప్రతిపాదనలు రెండురకాలు.

విశ్లేషణాత్మక ప్రతిపాదన (Analytic Judgement) విశ్లేషణ అంటే విడతీయటం. సంశ్లేషణాత్మక ప్రతిపాదన (Synthetic Judgement). సంశ్లేషణ అంటే కలపటం.

ఉదా :- పుస్తకంలో పేజీలుంటాయి. ఈ వాక్యంలో అర్థ విశ్లేషణ మాత్రమేవుంది. ఇది విశ్లేషణాత్మక ప్రతిపాదన. పేజీలుంటేనేగదా పుస్తకం అవుతుంది అయితే ఆ పుస్తకం ఎలాంటిదో తెలియదు ఈ ప్రతిపాదన అనుభవాత్పూర్వ ప్రతిపాదన. "ఈ పుస్తకం కాళిదాస నాటకం" అన్నామనుకోండి. ఆ వాక్యంలో పుస్తకం, కాళిదాసు నాటకం అనే రెండు భావాలను కలపడం ద్వారా ఆ పుస్తకం గురించి ఆదివరకు తెలియని క్రొత్తవిషయం తెలుస్తున్నది. ఇది సంశ్లేషణాత్మక ప్రతిపాదన. అనుభవానంతర జ్ఞానంకూడా! అయితే సంశ్లేషణాత్మక ప్రతిపాదనలన్నీ అనుభవానంతరము కనుక అవి మనకు నిశ్చితమైన, సార్వత్రికమైన జ్ఞానాన్ని ఇవ్వలేవు. ఆ పుస్తకం కాళిదాసు నాటకమే కానక్కరలేదు. మరొకటేదైనా కావచ్చు. కావున ఇప్పుడు రెండు విషయాలున్నాయి విశ్లేషణాత్మక ప్రతిపాదన అనుభవాత్పూర్వమైనా - అందులో సార్వత్రిక గుణమున్నా - దానివల్ల జ్ఞానం లభించదు. సంశ్లేషణాత్మక ప్రతిపాదన అనుభవానంతరమై క్రొత్త జ్ఞానం

లభించినా - అది సార్వత్రిక నిశ్చితజ్ఞానం కాదు. కనుక సార్వత్రిక నిశ్చితజ్ఞానం కావాలంటే సంశ్లేషణాత్మక అనుభవాతృర్వ ప్రతిపాదనను మనం సాధించవలసి ఉంటుంది. అదే శాస్త్రీయ విజ్ఞానానికి Scientific knowled e కి పునాది అవుతుంది. ఎందుకంటె దానిలో సంశయానికి తావులేదు. ఒకనాడు నిజమై మరొకనాడు కాకపోదు. మరి ఇటువంటి సశ్లేషణాత్మక అనుభవతృర్వ ప్రతిపాదనలు ఉన్నాయా! అంటే ఉన్నాయనే అన్నాడు. త్రిభుజంలోని మూడు కోణముల మొత్తం 180°. త్రిభుజం, 180° అనే భావకలాలను కలుపగా ఈ సంశ్లేషణాత్మక ప్రతిపాదన వచ్చింది. అంతేకాక అది అనుభవానికి ముందే కేవలం వివేచన ద్వారా వచ్చింది. అది సర్వకాల సర్వావస్థలలోను నిజమై తీరుతుంది. సరే ఈ ప్రతిపాదనలు ఎలా సాధ్యమవుతున్నాయి?

ఇంద్రియానుభూతి మనకు రెండు అంచెలలో కల్గుతుంది. మొదటిదశలో ఏదో ఇంద్రియ సంవేదన మాత్రమే కల్గుతుంది, అది ఇంద్రియాలకు కలిగే ప్రాథమిక ప్రేరణమాత్రమే. రెండవ దశలో అది ఇంద్రియానుభూతిగా మారుతుంది. సంవేదనలను ఏకసూత్రంలో బంధించి, అపాదించి, వస్త్వనుభవంగా మార్చ గలిగిన శక్తి మనస్సుకు మాత్రమే ఉంది. మనస్సు లేకపోతే సంవేదనలు, అనుభవంగా మారలేవు. ఇందుకుగాను మనస్సు (స్థలం - కాలం) అను రెండు సాధనాలను ఉపయోగిస్తుంది. వాటిని Pure intutions అన్నాడు. Pure అంటే అనుభవతృర్వమైన [a priori]. Intution అంటె అంతరంగిక జ్ఞానం. స్థలం - కాలం అనేవి అటువంటి అంతరంగిక జ్ఞానం యొక్క రూపాలుగా కాంట్ భావించాడు. అవి బాహ్య ప్రపంచంలో ఉండేవి కావు. అనుభవానికి ముందే మన మనస్సులో ఉన్నాయి. మానవ మనస్సు నిర్మాణంలోనే అవి సహజ అంతర్భాగాలు. అవిలేనిదే మానవ

మనస్సే లేదు బాహ్యవస్తువుల జ్ఞానాన్ని సంపాదించడానికి మనస్సు వాటినుపయోగిస్తుంది. మనకు గలిగే ఇంద్రియ సంవేదనలపై స్థలకాలాలను మన మనస్సు ఆధ్యారోపిస్తుంది అప్పుడు సంవేదనలు అనుభవంగా మారతాయి ఉదాహరణకు పచ్చద్దాల కళ్ళజోడుతో లోకమంతా పచ్చగానే కన్పిస్తుంది అలాగే మనస్సు కూడా స్థలం - కాలం, అనే రెండద్దాల కళ్ళజోడుతో వస్తుప్రపంచాన్ని చూస్తుంది. దానితో వస్తుప్రపంచం స్థలకాలాలలో ఒక పద్ధతిలో క్రమంలో అమరినట్లు కన్పిస్తుంది నిజానికి పచ్చవస్తువులు లేనట్లే, వస్తుప్రపంచంలో నిజంగా పద్ధతి, క్రమం లేవు. చేసికదిగా గందరగోళంగా వచ్చే సంవేదనలే ఉన్నాయి. వాటిని స్థలం - కాలం అనే అంతరంగిక జ్ఞానరూపాలు ఒక క్రమంలో తీర్చిదిద్ది మనస్సుకు అందిస్తాయి. మనస్సుకు ఈ కళ్ళజోడు స్వతః సిద్ధంగా వుండటంవల్లనే ఆ వస్తువు అక్కడుంది. ఇది ఇక్కడుంది అది అప్పుడు జరిగింది. ఇది ఇప్పుడు జరిగింది. అనే జ్ఞానం మనకు కల్గుతుంది.

ఇంద్రియానుభూతితోనే మనజ్ఞానం సమగ్రం, సంపూర్ణం కాబోదు ఇంద్రియానుభూతి జ్ఞాన సంపాదనకు ముడి సరుకును మాత్రమే అందిస్తుంది. ఇంద్రియానుభూతి, జ్ఞానంగా పర్యవసించాలంటే మనకు మరొక కళ్ళజోడు అవుసరము. దానికి Categories అని పేరుపెట్టాడు. ఇవి మొత్తం 12 అని సిద్ధాంతీకరించాడు. ఈ 12 వర్గాలు మనమనస్సులోనే ఉంటాయి. వాటి సహాయంతోనే ఇంద్రియానుభూతుల్ని, మనస్సు వర్గీకరించి అర్థం చేసుకొంటుంది. వీటిని Principles of Understanding అంటారు. వీటిని తిరిగి 4 గ్రూపులుగా విభజించవచ్చు.

Quantity (సంఖ్య)
- Unity ఏకత్వం
- Plurality బహుళత్వం
- Totality సామా

సంఖ్యాత్మకంగా ఏ వాక్యం చెప్పాల్సివచ్చిన దీనిలోనికి వచ్చి తీరుతుంది. ఉదా.- అశోకుడు భారత చక్రవర్తి. అది ఏకత్వంలోకి వస్తుంది, కొందరు మానవులు తెల్లగా ఉంటారు, అది బహుళత్వం. మానవులందరు మర్త్యులు. ఇది సామస్త్యం.

Quality (గుణం) {
- Reality యథార్థ్యం
- Negation ఖండన
- Limitation పరిమితత్వం

వస్తుగుణానికి సంబంధించిన ఏవాక్యమైనా దీనిలోకి వస్తుంది.

Relation సంబంధం {
- ద్రవ్యం Substance
- కార్య - కారణత్వం Courality
- పారస్పర్యం Reciprocity

ఇవి వస్తువుల మధ్య సంబంధాన్ని తెలియచేస్తాయి

Modality సంభావ్యత {
- సాధ్యతా సాధ్యతలు
- అస్తిత్వం - అస్తిత్వ రాహిత్యం
- ఆవశ్యకత - వైకల్పికత

కనుక మనం ఏది ఆలోచించినా, ఏ వాక్యం చెప్పినా, ఏ ప్రతిపాదన చేసినా, అది ఈ 12 వర్గాలలోకి వస్తుంది.

సమీక్ష:— బాహ్యప్రపంచం రెండు రకాలుగా వుంటుంది. ఒకటి యథార్థవస్తువు నూమీనాతో కూడినది. అజ్ఞేయం ఇంద్రియానుభవంలోకి రాదు. రెండవది నిత్యం చూస్తున్న విషయ ప్రపంచం. ఇదే మన ఇంద్రియానుభవంలోకి వచ్చి మనచేత అవగాహన చేసుకోబడేది. అందుచేత బాహ్యప్రపంచం స్వతఃసిద్ధంగా దానంతట అదివుంది. దానికి కర్త ఉన్నాడో లేడో మనకు తెలియదు. ఉంటే ఆ కర్త ఎవరో తెలియదు. మనకు సంవేదనలు పంపించటం వరకే బాహ్యప్రపంచం పని, ఆ సంవేదనలను స్థల

కాలావస్థితం చేసి, కార్యకారణ సంబంధం, సంఖ్య, గుణం, సంభావ్యత మొదలైన పద్ధతుల ద్వారా అవగాహన చేసుకొనేది మాత్రం మన మనస్సే. ఇందులో దేవుని ప్రమేయం లేదు. ఈ అవగాహన పద్ధతులు అనుభవం ద్వారా వచ్చేవి కావు అనుభవానికి ముందే మన మనస్సులో ఉన్నాయి ఇక్కడ ఒక ముఖ్య విషయం. మన మనస్సు నిర్మాణంలో ఉన్న స్థలం - కాలం, పన్నెండు అవగాహన సూత్రాలు Categories మనకు దృశ్యమానమవుతున్న విషయ ప్రపంచానికే తప్ప యదార్థ ప్రపంచం నూమీనాకి వర్తించవు. కాని మన మనస్సు అలా ఊరుకోదు గదా! కుతూహలంకొద్దీ వాటిని యదార్థ ప్రపంచానికి కూడా వర్తింప చేయటానికి ప్రయత్నిస్తుంది అప్పుడు కొన్ని పరస్పర వైరుధ్యాలు ఎదురవుతుంటాయి. ఆ వైరుధ్యాలను పరిష్కరించడం మనవల్ల కాదు. వీటినే విరుద్ధ ప్రతిపాదనలు (Antinomy) అంటారు. విరుద్ధ ప్రతిపాదనలలో దేనికదే నిజమేననిపిస్తుంది. కాని ఒకటి నిజమైతే రెండవది కావటానికి వీలు లేదు.

1) స్థల - కాలాలతో చూస్తే జగత్తుకు ఆది - అంతము ఉన్నాయి
   స్థల - కాలాలతో చూస్తే జగత్తుకు ఆది - అంతము లేవు.

2) పదార్థాని (Matter) ను అనంతంగా విభజించవచ్చు.
   పదార్థం ఇక విభజించటానికి వీలు లేని అత్యల్ప శకలాలైన అణువులతో నిర్మింపబడినది.

3) కార్య - కారణ గొలుసు అనంతమైనది.
   కార్య - కారణ గొలుసుకు ఆది కారణం ఉంది. అనంతం కాదు

4) ప్రపంచానికి కారణమైన దేవుడున్నాడు.
   ప్రపంచానికి కారణమైన దేవుడు లేడు.

వీటిలో ప్రతిదానికి రుజువులున్నాయి. కాని ఒకటి నిజమైతే రెండవది నిజం కావటానికి వీలు లేదు. ఈ విరుద్ధ ప్రతిపాదనలు

వీర్పడటానికి కారణం. అనుభవగోచరమైన విషయజగత్తు వర్తించే కార్య - కారణత్వాది అవగాహన సూత్రాలను, అనుభవగోచరం కాని యదార్థ జగత్తుకు వర్తింపచేయాలని అత్యాశకొద్దీ ప్రయత్నించటమేనని కాంట్ అభిప్రాయపడ్డాడు. యదార్థజగత్తు ఎలా వుంటుందో మనకు తెలియదు. ఒక వస్తువు తెలిసిందీ అంటే అది విషయవస్తువేగాని యదార్థవస్తువు కాదు. భౌతిక ప్రపంచమునకు ఆధారంగా దానికి అతీతంగా ఉండే శాశ్వత సత్యాన్ని కనుగొనటానికి పారభౌతిక శాస్త్రం ప్రయత్నిస్తుంది. కాని అట్టి శాశ్వత సత్యం మానవ మనస్సుకు ఎన్నడూ అందదు. అంటే అది లేదని కాదు. అది వివేచనకు అందదని మాత్రమే కాంట్ అభిప్రాయము. కాని అది విశ్వాసానికి నిశ్చయంగా అందుతుందని అభిప్రాయపడ్డాడు.

ప్రపంచ యదార్థ్యం లేదా దైవం మన నైతిక ప్రవర్తన (కర్మయోగం) ద్వారా, నైతిక సంకల్పంద్వారా మనకు గోచరించే అవకాశం ఉంది, ఎందుకంటె నైతిక సంకల్పం అనేది మనకు ఇంద్రియగోచర ప్రపంచంనుంచి సమకూరటం లేదు. అలాగే మన మనస్సు దాన్ని కల్పించటం లేదు. మరి ఎలావస్తుంది. ప్రపంచానికి ఆధారంగా, భూమికగా వున్న అవాఙ్మానసగోచరమైన పరమసత్యమే నైతిక సంకల్పాన్ని మనలో కల్గిస్తుంది. అందుచేత ఆ నైతిక సంకల్పం ద్వారానే మనకు పారభౌతిక సత్యం గురించిన ప్రత్యక్షజ్ఞానం - చూచాయగానైనా లభిస్తుంది. ఇంతకీ నైతిక సంకల్పం అంటే ఏమిటి?

మనం చేసే పనులు రెండురకాలు. కోరికలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు - వీటి ప్రేరణతో చేసే పనులు ఒకరకం. అలాగాక కర్తవ్య దీక్షతో చేసేపనులు మరొకరకం. సుఖం, స్వలాభంకోసం చేసేవి మొదటిరకం. స్వార్థం అనేది లేకుండా విద్యుక్త ధర్మం

కోసం చేసేవి కొంతవరకం. ఏపరిస్థితిలోనైనా మనకు అనేక ప్రత్యామ్నాయాలు ఎదురవుతాయి వాటిలో ఇదీ మనకర్తవ్యం, ఇదీ మన విధ్యుక్తధర్మం అని మన అంతరాత్మ ఒక ప్రత్యామ్నాయమును ప్రబోధించినప్పుడు, మన ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండా దాని లాభనష్టాలతో, కష్టసుఖాలతో ప్రమేయం లేకుండా, ఆచరించడానికి నిశ్చయించుకోవడంలోనే మన నిర్ణయ స్వేచ్ఛ [Free will] వ్యక్తమవుతుంది అది కేవలము మన విధ్యుక్త ధర్మం అయినందునే దాన్ని స్వేచ్ఛగా ఎంచుకుంటున్నాము. అలా ఎంచుకోవకుండా వుండే స్వేచ్ఛ మనకున్నది. కాని అది మన కర్తవ్యమైనందున ఎంచుకున్నప్పుడు అది నైతిక కార్యం, ఉత్తమ కార్యం, అవుతున్నది. ఈ కర్తవ్య పాలనను — ఈ విధ్యుక్త ధర్మనిర్వహణను — కాంట్ క్యాటిగారికల్ ఇంపరేటివ్ Catigorical imperative అని అన్నాడు. అంటే నిరపేక్ష కర్తవ్యం, ఏ పనినైతే మనం ఏ అన్య ప్రయోజనాన్ని ఆశించి చేయమో, కేవలం అది కర్తవ్యం కనుకనే చేస్తామో, అది నిరపేక్ష కర్తవ్యం — క్యాటిగారికల్ ఇంపరేటివ్, అయితే ఏది కర్తవ్యము అన్న ప్రశ్న వస్తుంది

ఈ ధర్మ సందేహము వచ్చినప్పుడు — ఆ పరిస్థితులలో ప్రపంచంలోని ప్రతి మానవుడు ఎలా ప్రవర్తించాలని నీవు కోరతావో, ప్రతివాడు ఎలా ప్రవర్తిస్తే లోకకళ్యాణం జరుగుతుందని నీవు భావిస్తావో నీవుకూడా అలాగే చేయి. అంటే నీకొక నీతి సూత్రము అన్యులకొక నీతి సూత్రము లేవన్నమాట ఒక నీతి సమస్య ఎదురైనప్పుడు అందరూ ఎలా ప్రవర్తిస్తే సముచితం కాగలదని నీతి కాగలదని నీవు భావిస్తావో, నీవుకూడా అలాగే ప్రవర్తించాలి. అదే నీకు కర్తవ్యం అవుతుంది, సార్వజనీన నైతిక సూత్రం అవుతుంది.

ఒరులేయవి యొనరించిన

నరవర! అప్రియము తన మనంబున కగుదా

నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పదముల కెల్లన్ !

విదురుడు, ధృతరాష్ట్రునితో ఇతరులు ఏ పని చేస్తే మనకు అప్రియంగా ఉంటుందో, ఆ పనిని ఇతరులకు మనం చేయకపోవడం అన్ని ధర్మములలోనికి ఉత్తమ ధర్మం అని చెబుతాడు.

కావున మన నిరపేక్ష కర్తవ్య నిర్వహణ ద్వారా సత్యాన్ని చూచాయగానైనా తెలుసుకొనవచ్చు. ఎందుకంటె మన కర్తవ్యం విశ్వజనీనం, దేశకాలాబాధితం, అనుభవాత్పూర్వం, అనుభవాతీతం అందుచేత దేశకాలాబాధితమైన పరమసత్యం, మన నైతిక నిరపేక్ష కర్తవ్యాచరణలో తన్ను తాను అభివ్యక్తం చేసుకుంటుంది.

## హెగెల్ – జర్మనీ 1770–1831

కాంట్ ప్రపంచానికి ఆధారభూతమైన యదార్థ సత్యం అజ్ఞేయమని, తనలో తాను వుండే విషయము Thing - in - itself అన్నాడు. కాని హెగెల్ పారమార్థిక సత్యం జ్ఞేయమేనని భావించాడు. లోకంలో అనేక వస్తువులున్నాయి. విడివిడిగా కన్పిస్తున్నాయి. కాని నిజానికి ప్రపంచం ఒకదానితో ఒకటి సంబంధంలేని విడివిడి వస్తువుల సమూహం కాదు ప్రపంచం ఒక సంయుక్త పదార్థం. ఒక ఏకత్వం [Unity] ఒక వస్తువుతో ఇంకొకటి అంగిక (Organic) సంబంధం కలిగి ఉన్నాయి. అవి మిథ్య కాదు నిజంగా ఉన్నాయి. కాని అవి సంపూర్ణవస్తువులు కావు. పాక్షిక వాస్తవాలు– ప్రపంచ వస్తువులు, ఏక ప్రపంచ సంపూర్ణ సత్యంలోని అంతర్భాగాలు. అటువంటి అంతర్భాగాలుగానే వాటికి అస్తిత్వం, వాస్తవత్వం ఉంది ఉదాహరణకు ఒక కుర్చీని తీసుకోండి. దానికి 4 కాళ్ళు, ఒక చెక్క వుంటాయి. అవన్నీ కలిస్తేనే కుర్చీ అవుతుంది. ఆ వివిధ భాగాలను ఒకానొక ఆలోచనలో, ఒక క్రమంలో, ఒక

పద్ధతిలో అమర్చితే కుర్చీ అవుతుంది. కుర్చీకి దాని భాగాలకు అంగిక సంబంధం ఉన్నది. కుర్చీలో ఆయా భాగాలు అమరి ఉన్న విధానం వెనుక ఒక ఆలోచన, ఒక హేతువు, ఒక తర్కం [Logic], ఒక క్రమం [Order] ఉన్నది. అవన్నీ ఉన్నదే అంటే ఆలోచన, భావం, హేతువు, తర్కం, క్రమం ఉన్నదే వస్తువు అవుతుంది. వాస్తవం అవుతుంది. ఇలానే మానవ శరీరంలో కాళ్ళు, చేతులు, గుండె, తల మొదలగునవి ఉన్నాయి. అవన్నీ ఒకానొక పద్ధతిలో క్రమంతో వుంటేనే మానవ శరీరం ఏర్పడుతుంది. ఆ క్రమం వెనుక హేతుబద్ధత వున్నది. ఆ హేతుబద్ధత వల్లనే దానికి వాస్తవత్వం సిద్ధిస్తుంది.

ప్రపంచంలోని ఏ వస్తువు దానికది ఏకైక యదార్థం కాదు, అన్నీ సాపేక్ష యదార్థాలే, పరిమిత వాస్తవాలే. కుర్చీలోని విడి భాగాలతో పోలిస్తే కుర్చీ సంపూర్ణ వాస్తవంగానే భాసిస్తుంది. కాని దాన్ని తయారు చేయటానికి వడ్రంగి, పనిముట్లు కావాలి. అందుచేత అది పాక్షిక వాస్తవం. ఇటువంటి అసంఖ్యాకమైన పరిమిత సాపేక్ష వాస్తవాలతో కూడిన వ్యవస్థే విశ్వం. అదే సంపూర్ణ వాస్తవం, కేవలత్వం. ఈ పరిమిత సాపేక్ష వాస్తవాల మధ్య అంగిక సంబంధం అంటే క్రమభద్దత, హేతుభద్దత లేనిదే ప్రపంచం ఏర్పడదు.

"అందుచేత వాస్తవమైనదంతా హేతుబద్ధమైనది The real is rational. హేతుబద్ధమైనదంతా వాస్తవమైనది. The rational is real. అందుచేత ప్రపంచ వాస్తవత్వాన్ని తెలుసుకోవాలంటే దాని హేతుబద్ధతను తార్కికత్వాన్ని తెలుసుకోవాలి.

ప్రపంచం చైతన్యవంతమైనది. స్తబ్ధమైంది కాదు. పరిణామగతమైనది. మార్పు చెందుతున్నది. ప్రపంచంలోని వస్తువులు, ఆలోచనలు అన్నీ మారుతున్నాయి. ఏదైనా మారుతుంది

అంటే తనకు వ్యతిరేకమైన రూపం ధరిస్తుంది ఆ వ్యతిరేకత, వైరుధ్యంనుంచి ఏకీకృతమైన వస్తువు వస్తుంది. పరిణామక్రమంలో క్రింది దశ తన వాస్తవత్వాన్ని పైదశలో సాక్షాత్కరింప చేసుకుంటుంది. క్రిందదశ పైదశ కోసమే పైదశ వైపు పురోగమిస్తుంది. ఉదా :- విత్తనం నుంచి చెట్టు పరిణామంలో అభివ్యక్తమయ్యే ప్రతి దశలోనూ దాని క్రింది దశలన్నీ గర్భితంగా వుంటాయి. ఈ పరిణామం అనంతంగా సాగుతుంది. చివరకు ఏ చరమ దశలో అనంత పరిణామదశలు సమస్త వైరుధ్యాలు సమన్వయమై, అదే సమయంలో అంతర్నిహితమై వుంటాయో! అదే కేవలత్వం (Absolute). ఈ పరిణామం గతితార్కిక పద్ధతిలో జరుగుతుందని చెప్పాడు. గతి అంటే గమనము. దానికి సంబంధించిన తర్కం కనుక గతితర్కవాదం [Dielectic]. ఇందులో వాదము, ప్రతివాదం - సమన్వయ వాదం ఉంటాయి. హెగెల్ తన గతితర్క వాదన్ని ఇలా ప్రారంభిస్తాడు.

ఏది యాథార్థ్యం అనే ప్రశ్నకు సమాధానంగా శుద్ధసత్ [Pure being] లేదా శుద్ధ అస్తిత్వం [Pure Existance] అని ప్రతిపాదిస్తాననుకోండి ఎందుకంటె ప్రపంచంలో అనంతకోటి వస్తువులున్నాయి. ఈ ఒక్కటిలో ఏదీ సంపూర్ణ వాస్తవం కాదు అన్నీ పాక్షిక వాస్తవాలేనని ఇంతకుముందే అనుకున్నాము. కాని వీటి అన్నిటిలోను సామాన్య గుణం ఒకటి వుంది. అది అస్తిత్వం - ఉండటము అనేది. అందుచేత శుద్ధ అస్తిత్వం అనేది అంతిమ యాదార్థం అని ప్రతిపాదించటం జరిగింది. (వాదము)

అయితే శుద్ధ అస్తిత్వానికి ఏ లక్షణాలు ఉండవు. అది నిర్గుణం అన్నమాట, మరి ఏ లక్షణాలు, ఏ గుణాలు లేనిదాన్ని గురించి ఆలోచన ఎలా సాధ్యం! అది లేనిదానితో సమానమే కదా! అందుచేత అంతిమ యదార్థ్యం నాస్తిత్వం [Nothingness]

లేకపోవడం కావాలి కాని అదే యదార్థం అంటున్నాము కనుక లేకపోవడము కూడా వున్నదన్నమాట. (ప్రతివాదం)

మరి ఇది వైరుధ్యం కాదా! యదార్థం, ఉన్నదీ - లేనిదీ కూడా ఎలా అవుతుంది? ఈ సమస్యకు పరిష్కారము ఏమిటి? దీనికి సమన్వయంగా హెగెల్ పరివర్తన [Becomeing] ను ప్రతిపాదిస్తాడు. అంటే ఉన్నది, లేనిదిగా పరివర్తన చెందుతున్నదన్నమాట. యదార్థం అనేది క్రిందటిక్షణంలో తాను ఏది కాదో ఈ క్షణంలో అదే అవుతున్నది. ఈ క్షణం తాను ఏది అయిందో, మరుక్షణంలో అది కాకుండా పోతున్నది. అంటే యాదార్థ్యం తాను తానగా వుంటూ, తాను కానిదిగా పరివర్తన చెందుతున్నది. ఆ విధంగా అస్తికి - నాస్తికి సమన్వయంగా పరివర్తన (Becomeing) ను ప్రతిపాదించాడు. (సమన్వయవాదం)

కాని యాదార్థ్యం పరివర్తన చెందుతున్నదంటే పరివర్తన చెందే వస్తువు ఏదో ఉండాలి కదా! ఈ విధంగా గతితర్కం సాగి సాగి బహుళత్వం, ఏకత్వం, రాశి, గుణం, కొలత ... మొదలైన పెక్కు వాదాలను ప్రతిపాదిస్తూ పోతాడు. చివరకు విశ్వంలోని సమస్త ద్వంద్వాల మధ్య, పాక్షిక వాస్తవాల మధ్యగల వైరుధ్యాలన్నీ పరిష్కారమై, వాటినన్నిటిని తనలో నిక్షిప్తం చేసుకొన్న ఏ అంతిమ సమన్వయ వాదం Ultimati synthesis సిద్ధిస్తుందో దాన్ని హెగెల్ సర్వసమగ్ర సంపూర్ణ సత్యంగా భావించి దానికి కేవల భావం అని పేరుపెట్టాడు. పరమాత్మ అనండి, బ్రహ్మపదార్థం అనండి ఏ పేరుపెట్టినా ఆ కేవలభావమే కేవలభావంలో వాస్తవ ప్రపంచపుగతి తార్కిక పరిణామం అంతా గర్భితమై ఉంటుంది. దీని అర్థం ప్రపంచ సృష్టికి ముందే దేవుడున్నాడని, దేవుడు ప్రపంచాన్ని సృష్టించాడని కాదు. సృష్టినిత్యం అనాది, అనంతం. సృష్టి దేవుని బాహ్యరూపం. కేవల భావానికి స్వీయ

వ్యక్తీకరణమే [Self manifestation] విశ్వం కేవలభావం బాహ్య ప్రకృతిలో, చరిత్రలో, మానవ సమాజ పరిణామంలో, మానవుని ఆలోచనలో తనను తాను వ్యక్తం చేసుకొంటూ సంపూర్ణమైన స్వీయజ్ఞానం (Self Consciousness) వైపు పురోగమిస్తుంది. పరివర్తన లేకపోతే కేవలభావం కాంట్ చెప్పినట్లు తనలో తాను [Thing-in-itself] గా వుండిపోతుంది. పరివర్తన చెందుతూ అది తన వెలుపల [not-of-itself] ఉంటుంది, ఒకే సమయంలో తాను తనలోపల, తన వెలుపల వుండటం మధ్యగల వైరుధ్యం అంతిమ దశలో సంపూర్ణమై తనకొరకు తాను (for-itself) వుంటుంది. అంటే తనను గురించి తాను సంపూర్ణ స్వీయ స్పృహ కల్గివుంటుంది. ఆతని లాజిక్‌లో తార్కిక పరిణామంలో కేవలభావం శుద్ధసత్ [Pure being]గా ప్రారంభమై అనంతదశలను అధిగమించి శుద్ధచిత్ (Pure Consciousness) గా పర్యవసిస్తున్నది. శుద్ధచిత్ అంటే కేవలస్పృహ, అదికానిది ఏదీ లేదు. కనుక అది తనను గురించే ఆలోచించాలి సమస్త విశ్వంలోనూ ఈ విషయాన్ని తెలుసుకో గల్గింది మానవుని ఆలోచన కనుక కేవలభావంకూడా మానవుని స్వీయ స్పృహలోనే తననుతాను తెలుసుకొనే దశకు పురోగమిస్తున్నది. మానవుడు తన పరిమిత మనస్సుద్వారా తాను కేవలత్వపు అనంత స్వీయస్పృహలో భాగమని తెలుసుకుంటాడు.

## కమ్యూనిష్టు ప్రవక్త కారల్ మార్క్స్ – జర్మనీ 1818-1883

ఇప్పటివరకు నడచిన సమాజ చరిత్ర అంతా వర్గ సంఘర్షణల చరిత్ర. దేశ దేశ కార్మికులారా! ఏకంకండి అని ఎలుగెత్తి అరచిన మొదటి మనిషి. మార్క్సిజం అనే నూతన రాజకీయ సాంఘిక సిద్ధాంతాలకు మూలకర్త. నేడు ప్రపంచంలో కమ్యూనిజం లేని దేశమే లేదు. అలాగే పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలపై

మార్క్సిజం పరోక్ష ప్రభావాన్ని చూపించింది పెట్టుబడిదారీ వ్యవస్థలోని దారుణ లోపాలను, మార్క్స్ ఏంగెల్స్, లెనినలు పేర్కొనడమేగాక అది పతనం కావడం తథ్యమన్నారు. అది హెచ్చరికగా తీసుకొని వారు పేర్కొన్న అనేక లోపాలను తొలగించుకుని, అనేక ఆర్థిక సంస్కరణలను అమలుచేసి, పెక్కు పెట్టుబడిదారీ దేశాలు విప్లవ సంక్షోభ ప్రమాదంనుంచి తప్పించుకున్నాయి. ఇతనిపై హెగెల్ ప్రభావం హెచ్చు.

ప్రపంచ పరిణామ క్రమాన్ని కనుగొనటానికి ఏకైక సాధనం గతితర్కం అన్న హెగెల్ వాదనను అంగీకరించాడు. హెగెల్ ప్రపంచమంతా భావమయం, ఉన్నది ఒక్కటే యదార్థం. అదే కేవలభావం. ఈ భౌతిక ప్రకృతి అంతా, కేవలభావం తనకోసం తనను తాను సాక్షాత్కరించుకొనడానికి చేసే ప్రయత్నమని చెప్పాడు. యదార్థం నిత్యచలనశీలం, పరిణామశీలం అని అన్నాడు. కాగా మార్క్స్ హెగెల్ కేవలభావమును ఖండించి దానినే పదార్థం (Matter) అన్నాడు. దాంతో హెగెల్ గతితార్కిక భావవాదం కాస్తా మార్క్స్ గతితార్కిక పదార్థవాదం అయింది. గతితార్కిక పురోగమనానికి కేవల భావం చోదకశక్తి అన్న హెగెల్ సిద్ధాంతాన్ని ఖండించి, ప్రపంచ పురోగమనానికి చోదకశక్తి (motes force) చలనశీలమైన భౌతిక పదార్థం [Matter in Motion] అని అన్నాడు. జడపదార్థం అనేది లేదు. పదార్థం అంతా చలనస్వభావము కల్గినదే. పదార్థం స్వభావతహా పురోగమిస్తుంది. హెగెల్ వాదాన్ని తిరగేసి దాన్ని కాళ్ళమీద నిలబెట్టానని చెప్పుకున్నాడు. పదార్థమే యదార్థం.

ప్రదార్థం ప్రాథమికమైనది. అంటె అది అనాదిగా స్వతః సిద్ధంగా స్వాయంభువంగా నున్నది. అది గతితార్కిక ప్రక్రియలో పరిణామం చెందుతూ అంతకంతకు ఉన్నతోన్నత రూపాలు

చెందింది. ఒకానొక దశలో అది సేంద్రియ పదార్థంగా మారి జీవకోటి ఉదయించింది. జీవరాశికూడా ఉన్నతోన్నత దశలను అందుకుంటూ చివరకు మానవుడు ఆవిర్భవించాడు. మానవుని మెదడు భౌతికపదార్థం పొందిన అత్యున్నతరూపం. ఈ మెదడే మన చైతన్యానికి, ఆలోచనలకు, సమస్త మనోవ్యాపారానికి ఆధారభూతమైన ఇంద్రియం. భావవాదులు చెప్తున్నట్లు మన మనస్సు భౌతికప్రపంచానికి కర్తగాదు. మనస్సు లేకపోయినా, చైతన్యం లేకపోయినా పదార్థ ఉంటుంది. కాని పదార్థము లేనిదే మనస్సు లేదు.

మానవులు సామూజికంగా వస్తువులను ఉత్పత్తి చేసేటప్పుడు తమ ఇష్టానిష్టాలతో నిమిత్తంలేకుండా అనివార్యముగా కొన్ని పరస్పర సంబంధాలకు లోనవుతారు. ఈ ఉత్పత్తి సంబంధాలన్నిటిని కలిపిచూస్తే అదే ఆర్థికవ్యవస్థ. భౌతిక జీవితానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తిచేసే విధానమే సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక జీవిత విధానాలను స్థూలంగా నిర్ణయిస్తుంది. మానవుల మనుగడ పద్ధతిని నిర్ణయించేది వారి మనోవ్యాపారం కాదు. నిజానికి వారి సాంఘిక జీవన విధానమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.

సోషలిస్టు దేశాలలో వ్యక్తిస్వేచ్ఛ మృగ్యమని అంటారు. కాని పెట్టుబడిదారీ దేశాలలో వ్యక్తి స్వేచ్ఛగా కన్పించేది నిజానికి స్వేచ్ఛ కానే కాదని మార్క్సిస్టుల అభిప్రాయం. కార్మికులే కాదు పెట్టుబడిదారుల సైతం గుడ్డిగా పనిచేసే ఆర్థికశక్తుల ప్రభావానికి లోనై తమకుతామే సంకెళ్ళు తగిలించుకొంటున్నారని వారు అంటారు. కమ్యూనిజంలో అలాగాక వ్యక్తిస్వేచ్ఛ అనేది పోటీకి దారితీయకుండా అన్యోన్య సహకారానికి దారితీస్తుందని, ఆర్థిక శక్తులు మానవులను బానిసలుగా చేయడంగాక మానవులే ప్రణా

ళిశా బద్ధమైన వ్యవస్థీకరణ ద్వారా ఆర్థిక శక్తులను తమ చెప్పు చేతలలో వుంచుకొంటారని మార్క్సిస్టులు విశ్లేషిసారు.

## షోపెన్ హూవర్ — పోలెండు — 1788—1860

ప్రపంచం నా భావం — The world is my idea అన్నది ఇతని సుభాషితం. తనచుట్టూ ఉన్న ప్రపంచం తన భావంగా మాత్రమే ఉంది. అంతకుమించిన యదార్థ్యం దానికి లేదు. కాంట్ తత్వంపట్ల ఇతనికి ప్రగాఢ విశ్వాసం. అయితే నూమినా అజ్ఞేయమన్న దానితో విభేదించాడు. నేను కేవలం బుద్ధిజీవిని మాత్రమే. ఈ ప్రపంచం, దానిలోని వస్తువులు స్థల - కాలాల లోను, కార్యకారణత్వంలోను ఒక క్రమంలో అమరి ఉన్నట్లు కన్పించేమాట నిజమే. అయితే నా అంతరాంతరాలలోకి చూసు కొన్నప్పుడు నా నిజస్వరూపం నాకు గోచరిస్తుంది. నా శరీరం కొన్ని పనులు చేస్తుంది. నా మనస్సు కొన్ని ఆలోచనలు చేస్తున్నది. వీటివెనుక, వీటికి అంతర్యాభూతంగా ఏదోశక్తి ఉన్నది. దాన్ని ఇచ్ఛ [will] అన్నాడు. మనబుద్ధికి అందనిదిగా, తనలో తాను అజ్ఞేయంగా వుండే వస్తువుగా కాంట్ వదలివేసినది. అదేనని హూవర్ అభిప్రాయపడ్డాడు. ఇచ్ఛామూలం మిదం జగత్.

నా శరీరం కదలికలకు, నా ఆలోచనలకు వెనుక ఉన్నది నా ఇచ్ఛ. నా సంకల్పం అన్నమాట. ఆ ఇచ్ఛ అనేది నా సమస్తమైన ~~కార్యకలాపాలలోను వ్యక్తమగుచున్నది. నా కోర్కెలుగా, ఉద్రే~~కాలుగా, నా ఆరాటంగా, నా పోరాటంగా వ్యక్తమగుచున్నది. అలాగే మొత్తం ప్రపంచంలో కూడా ఇచ్ఛ వ్యక్తమగుచున్నది. నా శరీరం ఇచ్ఛకు బాహ్యరూపం. అలాగే మొత్తం ప్రపంచం దాని ఇచ్ఛకు బాహ్యరూపం. ఇచ్ఛకు వాస్తవీకరణమే (Objectification) ప్రపంచం. ప్రాణం లేని రాయిలో కూడా ఇచ్ఛ ఉన్నది. అయితే ఆ

నిర్జీవదశలో ఇచ్ఛకు స్వయం స్పృహ లేదు. వృక్ష ప్రపంచంలో ఇచ్ఛకు స్వయంస్పృహ స్వల్పంగా ఉంటుంది. ఆ దశలో ఇచ్ఛ ప్రాణ శక్తిగా వ్యక్తమవుతుంది. మొక్క తాను జీవించాలని నేలలోకి వేళ్ళుతన్ని నీటిని పీల్చుతుంటుంది. తనను తాను పునరుత్పత్తి చేసుకొని తనజాతిని కొనసాగించాలని విత్తనాలను కాలుస్తుంది వీటన్నిటిలో ఇచ్ఛ వ్యక్తమగుచున్నది. జంతుప్రపంచంలో మరింత ఉన్నత పరిణితదశలో ఈ జీవనేచ్ఛ వ్యక్తమవుతుంది. మానవునిలో అది పూర్తి స్వయంస్పృహతో వ్యక్తమవుతుంది.

బుద్ధి, హేతువు, తర్కం, స్పృహ, కేవలభావం, కర్మ ఇవన్నీ పైపై తత్వాలు. వీటికి మూలాధారంగా వుండి వీటిని నడిపించేది ఇచ్ఛ. మనం ఒకానొక వస్తువును కోరుతున్నామంటే అది హేతుబద్ధమైనదని కాదు. కోర్కవలన కోరుతున్నాము. కాని అలా కోరడానికి ఒక హేతువును, కారణాన్ని సృష్టించుకుంటున్నాము. జంతువులు కారణాలతో నిమిత్తం లేకుండానే వస్తువులను కోరుతాయి. సచేతన ప్రపంచంలో జీవనేచ్ఛ ప్రధానమైనది. తిండి తినాలని కోరుతాము. కామతృప్తిని కోరుతాము. బ్రతకాలన్న కోరికతో, మన మనుగడను మన సంతానంలో కొనసాగించాలన్న ఇచ్ఛతో వాటిని కోరుతున్నాము. ప్రపంచం ఇచ్ఛాసృష్టి. కాని ఇచ్ఛకు కారణం లేదు, గమ్యం లేదు, అర్థం లేదు, ప్రయోజనం లేదు. అది ఒక అంధశక్తి, స్వాయంభువం, అనంతం, స్థలకాలాలకు కార్యకారణ సంబంధాలకు అతీతం అయితే ఇచ్ఛవల్ల ప్రపంచానికి, మానవునికి దుఃఖమేగాని ఆనందం లేదు. ప్రపంచం దుఃఖమయం. ఈ దుఃఖానికి ఇచ్ఛ కారణం. గౌతమ బుద్ధుని ప్రభావం ఇతనిపై చాలా ఉన్నదని చెప్పుతున్నాము. బుద్ధుడు కూడా కోరికలే దుఃఖానికి మూలకారణం, ప్రపంచం దుఃఖమయమని చెప్పాడుగదా! ఇచ్ఛ అంటే కోరిక. తీరని కోరిక

బాధకలిగిస్తుంది. తీరని కోరికకూడా బాధకలిగిస్తుంది. ఎందుకంటె దేనివల్ల కోరిక తీరిందో దానిపట్ల అనాసక్తి కలుగుతుంది. అనాసక్తి వల్ల విసుగుదల కలుగుతుంది. దానినుండి తప్పించుకోడానికి మరొక దాన్ని కోరడం జరుగుతుంది. ఇది అనంతంగా సాగుతుంది. తెలివి తేటలవల్ల, విజ్ఞానంవల్ల, ఆలోచనలవల్ల కూడా దుఃఖ నివృత్తి కాదు. ఆలోచన, ఊహాశక్తి, ఎక్కువైనకొద్దీ దుఃఖం ఎక్కువవౌతుంది. మృత్యువుకంటె మృత్యుభీతి ఎక్కువ దుఃఖ కారణం. జీవితం తుచ్ఛమైనది. లోకంలో ఎక్కడైనా చూడండి. ఒకరితో ఒకరు బ్రతుకుకోసం, స్వార్థంకోసం, సుఖంకోసం, సంపదకోసం పోటీ, పోరాటం. ఈ పోరాటం, ఘర్షణ దుఃఖకారణం.

ఇచ్ఛను అణచివేయడానికి జయించడానికి ఒక మార్గం తాత్త్విక దృక్పథం జీవితాన్ని వివేకంతో వివేచించాలి. కోరికలను జయించాలి. మనస్సు గుఱ్ఱంలాంటిది. దాన్ని వివేకం, వివేచన అనే పగ్గాలతో నిగ్రహించాలి. మనోవికారాలు, ఉద్రేకాల స్వభావాన్ని తరచిచూచి అర్థం చేసుకుంటే వాటిని నిగ్రహించవచ్చు. కళా సౌందర్యాస్వాదనకూడా ఇచ్ఛను జయించడానికితోడ్పడుతుంది. దానివల్ల మన సంకుచితావరణను దాటి విశ్వావరణలో ప్రవేశించ గలుగుతాము Mental divertion ఉంటుంది. ఇచ్ఛను జయించడానికి, మతం భక్తిభావంకూడా ఒక మార్గము. కఠోర నియమ బద్ధమైన జీవితంద్వారా, సర్వసంగ పరిత్యాగంద్వారా, సంసార వైముఖ్యం ద్వారా ఇచ్ఛను నశింపచేస్తే అదే నిర్వాణం ఇచ్ఛారాహిత్య స్థితి, జీవన్ముక్తస్థితి, కేవల ఆనంధస్థితి. దాన్ని వర్ణించడానికి మాటలు, భావాలు చాలవు. అది అన్నిటికి అతీతస్థితి.

## నీషే - జర్మనీ 1844—1900

దేవుడు చనిపోయాడు (God in dead) అన్నాడు. తన

కాలపు పండితులు, మఠాధిపతులు, రాజ్యాధినేతలు తిరుగులేని నిజాలుగా భావించే విలువలను తలక్రిందులుగా నిలబెట్టాడు. హూవర్ చెప్పినట్లు జీవనేచ్ఛ ప్రపంచ మూల సూత్రం. అయితే ఆ ఇచ్ఛ దుఃఖానికి కారణం కనుక జీవనేచ్ఛ మోక్షేచ్ఛగా మారాలన్న హూవర్ వాదాన్ని ఖండించి జీవనేచ్ఛ మానవుని నడిపించాలన్నాడు. దానినే శక్తిసాధనేచ్ఛ [Will to power] అన్నాడు. జీవితం దుఃఖమయమే కాని దుఃఖానికి జీవితంలో ప్రధానస్థానమున్నది. బాధానుభవం మనిషికి అవసరం. మానవునిలోని గొప్పగుణాలు బాధల నుంచే బహిర్గతమవుతాయి. విధిని, దేవుడిని ఎదిరించి, స్వేచ్ఛ సాధించాలి. బాధల వల్లనే మనిషి బలవంతుడవుతాడు. బాధల కొలిమిలో కాలి కాలి మనిషి ఇచ్ఛ శక్తిమంతమవుతుంది. మానవుడు సూపర్ మాన్ కావాలి. ఉన్నదంతా ఇహలోకం ఒక్కటే పరలోకం లేదు. జీవితాన్ని ప్రేమించాలి. భూలోకాన్ని, జీవితాన్ని నిందించటం పాపం. మానవుడు జీవితాన్ని అర్థవంతం చేసుకోవాలి. న్యాయం, హేతువు, దయ, మంచితనం ఇలాంటి భావాలతో జీవితాన్ని కలుషితం చేయరాదు.

శక్తికోసం మానవుడు ఏదైనా చేస్తాడు. చేయాలి. అది తోటి మానవులపై ఆధిక్యం కావచ్చు; ప్రకృతిపై కావచ్చు; దుఃఖం, బాధలు, మృత్యువు, జీవితంపై కావచ్చు; ఇతరులతో పోటీ – కళలలో, యుద్ధంలో, అధికారంలో, మేధాశక్తిలో, ఇంద్రియ నిగ్రహంలో, బాధాసహిష్ణుతలో ఆధిక్యం – అదే చోదక శక్తి. ప్రాణికి మనుగడకోసం పోరాటం Struggle for existance అని డార్విన్ అన్నాడు. అంటే ప్రాణి తన పరిసరాలకు అనుగుణంగా పరిణామం చెందడానికి ప్రయత్నిస్తుంది. కాని ఇది సరికాదు. మనుగడకోసం పోరాటం అంటే పరిసరాలపై పోరాటం. ప్రాణి తాను పరిసరాలకు అనుగుణంగా వుండటానికి కాక, తనకు

అనుగుణంగా పరిసరాలను మార్చుకోవటానికి పోరాటం సాగిస్తుంది. అలా పోరాడి విజయం సాధించిన ప్రాణులే జీవిస్తాయి.

ఎంతసుఖం అనుభవించగలడో అంత బాధలను అనుభవించ గల శక్తి స్థైర్యం కలవాడు కావాలి. సౌఖ్యం కాదు ముఖ్యం. ఆధిక్యంముఖ్యం శక్తికోసం సుఖాలను కాలదన్నగలగటం ముఖ్యం. అది ఎంత బాధ కల్గించినా చివరకు అదే నిజమైన ఆనందంకల్గిస్తుంది. బాధారాహిత్యం సుఖంకాదు. బాధలనుంచి శక్తిని సాధించడం ఆనందం కల్గిస్తుంది అలాంటి Super Man గా తయారు కావా లంటే మానవజాతి తన ఇప్పటి విలువలన్నిటిని వదలివేయాలి. క్రొత్త విలువలు సృష్టించుకోవాలి.

## విలియం జేమ్స్ - అమెరికా - 1842-1907

యూరోపియన్లది చాలావరకు ఆదర్శవాదంతో, భావ వాదంతో కూడిన తత్వచింతన. కాని అమెరికన్లది నూటికి నూరు పాళ్ళు వ్యక్తివాదం, వస్తువాదం, వాస్తవికవాదం, విస్తరణవాదం, పారిశ్రామిక వ్యాపారవాదం, దానిపై ఆధారపడిన ప్రజాస్వామ్య వాదం. నేలవిడిచి సాము వారితత్వంలో లేదు. ఇక్కడ ఇప్పుడు Here & now అన్నది వారితత్వం. అందువల్ల ప్రాగ్మాటిజం అనే నూతన సిద్ధాంతానికి శ్రీకారం చుట్టారు. దాన్ని వాస్తవికవాదం లేదా ఫలితాత్మకవాదం అనికూడానంటారు, ఒకభావం, ఒక సిద్ధాంతం, ఒక ప్రతిపాదన, ఒకవిశ్వాసం — ఏదైనాసరే ఆచరణ సాధ్యమైనదా ? ఉపయోగకరమైనది ఔనా కాదా? సరైన ఫలితమిస్తుందా లేదా? అని ఆలోచించాలి. అవును అనుకుంటే అదే సత్యం అంటే Utility usefulness లేని ఏ వాదమైనా నిరుప యోగం, సత్యం కానేరదు.

మన జ్ఞాన సమస్తానికి ఇంద్రియానుభవమే ఆధారమన్న అనుభూతి వాదుల సిద్ధాంతాన్ని అంగీకరించాడు. కాని ఇంద్రి

యానుభవం వేరు వేరు స్వతంత్రమైన ముక్కలుగా (Bits) మన మనస్సులోకి ప్రవేశిస్తుందన్న వాదాన్ని తిరస్కరించాడు. మన చేతన లేదా చైతన్యం వేర్వేరు ఇంద్రియానుభవాల శకలాలతో మార్చినది కాదు. అది అవిచ్ఛిన్నమైనది. ఒక ఎడ తెగని ప్రవాహం లాంటిది. అంటే మన అనుభవం ఒక చైతన్యస్రవంతి Stream of consciousness అన్నమాట not a bundle of independent experiences ఉదాహరణకు ఒక పుస్తకం ఉన్నదనుకోండి. దాని మందం, ఆకారం, నునుపుదనం, రంగు ఇత్యాది భావశకలాలు దేనికదిగా మన మనస్సులోకి ప్రవేశించవు. అవన్నీ ఒక్కసారిగా వాటి మధ్యగల పరస్పర సంబంధాలతోసహా, ప్రవాహంలా మన మనస్సులోకి ప్రవేశించి పుస్తకం అనేభావాన్ని చేతనకు అందిస్తాయి. అలాగే ఆలోచనకూడా వేర్వేరు భావశకలాల పరంపర కాదు. అది భావాల పరస్పర సంబంధాల వ్యవస్థ. ప్రతిభావం పాక్షికం సాపేక్షం. ఇలాంటి అనంత సాపేక్ష పాక్షిక భావాల మధ్యగల సంబంధాలే మనకు అనుభవ గోచరమవుతున్న విశ్వం. ఇంద్రియ మనోగోచర జగతికి అతీతంగా, సత్యపదార్థం నూమినాగాని, కేవలభావం గాని, ఏవీ లేవు. అనుభవానికి మించిన ప్రకృతి సూత్రాలు, కేవల సత్యాలు లేవు. అనుభవం అనేది ఎప్పటికీ సంపూర్ణం కాదు కనుక సత్యంకూడా సంపూర్ణం కాదు. అది ఒక పరివర్తనక్రమం. ఒక ప్రాసెస్ [Process] అలాగే లోకంకూడా నిత్య పరివర్తన శీలమైనది.

ప్రపంచం సర్వసంపూర్ణం కాదు. లోకంలో ఎంతో దుర్మార్గముంది. దాన్ని మెరుగుపరచవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉన్నది. పూర్తిగా బాగుపరచ లేకపోయినా దోషాలను తగ్గించవచ్చు. మానవుని కృషి అందుకు తోడ్పడం చేస్తుంది. తన కృషి ఫలిస్తుందన్న ఆశ మనిషిని ఉత్తేజపరచి ముందుకు నడిపిస్తుంది.

ఒక్కొక్కరు ఒక్కొక్క దృక్పథంనుంచి లోకాన్ని చూస్తారు. అందుచేత లోకంలో ఏకత లేదు అనేకత ఉంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా సత్యం దర్శనమిస్తుంది. కావున వ్యక్తులు వారి వారి దృక్పథాల ప్రకారం లోకాన్ని మరమ్మత్తు చేయడానికి ప్రయత్నించాలి ఈ విధమైన కృషి వైవిధ్యం వల్లనే లోకం ముందుకు సాగుతుంది ఈ కృషి విడివిడి వ్యక్తుల విషయంలో విఫలమైనా దాని సామూహిక ఫలితం వల్ల లోకం శ్రేయోభిముఖంగా పురోగమిస్తుంది. ఇందులో దేవుని సహాయంకూడా మనకు లభిస్తుంది. అతనికి ఒకే దేవునిపై విశ్వాసం లేదు. 43 గ్గురో, 20 లక్షల దేవుళ్ళో ఎందుకు ఉండకూడదు? అని ప్రశ్నిస్తాడు. అందుచేత ఎవరి దేవునిపై వారు విశ్వాసం పెంచుకొని లోకకళ్యాణానికి కృషి చేయాలి. అందుకే సత్యం అనేది సార్వకాలికం, సార్వజనీనం కాదు అది నిరంతర పరిణామశీలం, ఒక విధానం, విశ్వాసం నేడు సత్యం కావచ్చు, రేపు గాకపోవచ్చు. కావున సత్యాన్ని ఎప్పుడికప్పుడు అన్వేషించాలి నిరంతరం సత్యాన్ని సృష్టించాలి. సత్యం వేరే ఎక్కడో పారిభాషికంగా లేదు దాన్ని మన అవసరాలకు అనుగుణంగా సృష్టిస్తాము.

### అస్తిత్వవాది కీర్క్‌గార్డ్ – డెన్మార్క్ 1813–1855

హేతువాదులు [Rationalists] విశ్వం కొన్ని సూత్రాలకు నియమాలకు కట్టుబడి నడుస్తుందని అంటారు. వాస్తవమైనదంతా హేతుబద్ధం అని హెగెల్ అన్నాడు. కాంట్ విశ్వజనీనమైన నీతి కాటగారికల్ ఇంపరేటివ్‌ను ప్రవచించాడు. కాని వారు human individuality మానవ ప్రత్యేకతకు స్థానమివ్వలేదు. దీనిని అస్తిత్వవాదులు తిరస్కరించారు. సమస్త ప్రపంచం అర్థరహితమైనది అసంబద్ధమైనది. (world is absurd). ప్రపంచంలోను, జీవితంలోను హేతుపరత్వం లేదు. ఇదీ మానవస్వభావం అని సర్వకాలా

లకు సర్వమానవులకు వర్తించే నియమం లేదు. ప్రతిమానవ వ్యక్తి తాను చేసే పనులద్వారా తన స్వభావాన్ని అప్పటి కప్పుడు సృష్టించుకుంటూ పోతాడు. నా ప్రత్యేకత (Individuality) నాదే. కనుక ప్రపంచానికి మూల సూత్రం వ్యక్తిత్వపు అద్వితీయత [Uniqueness of individual] మానవుడు స్వస్వతంత్రుడు. మానవునికి నిర్ణయస్వేచ్ఛ [free will, freedom of choice] ఉన్నది.

మానవుడు నిత్యజీవితంలో చేయవలసి వచ్చే ప్రతినిర్ణయం బాధాపూరితమైనదే, బాధ్యతతో కూడుకొన్నదే. ఇది చేయడమా? అది చేయడమా? either/or! ఈ సమస్య మానవునికి ప్రతిఘట్టంలోను ఎదురవుతుంది. అంటే జీవితం, నిర్ణయం చేయవలసిన అవసరం [Choice] రూపంలో మానవుడిని సవాలు చేస్తుంది. ఆ సవాలుకు జవాబు ఇవ్వడంలో, రెండు ప్రత్యామ్నాయాలు తనను ఎదుర్కొన్నప్పుడు, దేనినో ఒకదాన్ని ఎంచుకోవడంలో, మానవుని అస్తిత్వం వాస్తవరూపం ధరిస్తున్నది. ఆ స్తిత్వం అనేది ఎక్కడో ఏదో భావలోకంలో లేదు. దానికి శాశ్వత నిర్దిష్టరూపం లేదు. అది ప్రతిక్షణం, ఇప్పుడు ఇక్కడ వ్యక్తి చేసే నిర్ణయంలో ఆచరణలో నిహితమై ఉంటుంది. అటువంటి నిర్ణయస్వేచ్ఛ మానవుని కుంది.

ఈ నిర్ణయ స్వేచ్ఛ, భీతి[dread]తోనూ, కంపన trembling)తోనూ కూడినది. ఎందుకంటె ఒక ప్రత్యామ్నాయాన్ని కాదని మరొకదానిని ఎంచుకోవడంలో వ్యక్తి ఒకానొక అజ్ఞాత భవిష్యత్ లోకి దూకుతున్నాడన్నమాట. ఆ నిర్ణయ ఫలితాలు ఎలా ఉంటాయో, సుఖమిస్తాయో, దుఃఖమిస్తాయో తెలియదు. నిర్ణయ బాధ్యత నిర్ణయ ఫలితాల బాధ్యత అతనిదే. విధిపైకి, నీతి సూత్రాలపైకి ఇతరులపైకి బాధ్యత త్రోసి వేయడానికి వీలులేదు. కనుకనే వ్యక్తి అస్తిత్వానికి వాస్తవ తారూపం ఇచ్చేది ఈ నిర్ణయ

స్వేచ్ఛ కనుక అస్తిత్వం అనేది క్షణక్షణ పరివర్తనా స్వభావం కలిగినది తనంతటతనకు మాత్రమే అనుభవైన వేద్యం అయ్యే తన పరిమిత అస్తిత్వంలోనే వ్యక్తి ఉంటాడు. అతడు ఏకాకి మనిషి వ్యక్తిగా జన్మించి, వ్యక్తిగా పెరిగి, వ్యక్తిగా ప్రవర్తించి, వ్యక్తిగా బాధలు అనుభవించి, వ్యక్తిగా నిర్ణయాలుతీసుకొని, వ్యక్తిగా జీవించి, వ్యక్తిగా మరణిస్తాడు. కనుక ఆత్మ పరత్వం ఒక్కటే నిజం.

మానవునికి దేవునితో సంబంధం ఉంది. ఇతడు ఈశ్వర వాది, వ్యక్తిపరిమితుడు, దేవుడు అనంతుడు. తన పరిమితత్వం వల్ల దేవునికి దూరమై దుఃఖానుభవం పొందుతాడు. ఈ వియోగం వల్ల మానవునికి ఆందోళన కల్గుతుంది దానివల్ల నిస్పృహ జనిస్తుంది. నిస్పృహనుండి విముక్తుడు కావడానికి వ్యక్తికి నైతిక జీవనం, ఆధ్యాత్మిక జీవనం తోడ్పడుతాయి. మానవ జీవన యాత్రలో మూడు దశలుంటాయి.

1. సౌందర్యోపాసన, సుఖానుభవం మొదలైన వానికి చెందినదశ
2 నైతిక నిష్ఠకు కర్తవ్య పాలనకు చెందిన దశ
3 దివ్య జీవన మార్గం. ఆధ్యాత్మికదశ.

ఒక దశనుంచి మరొకదశకు పరివర్తన అనేదికూడా వ్యక్తి స్వేచ్ఛగా తనంతటతాను చేసే నిర్ణయాల ద్వారా జరుగుతుంది. మూడవదశ తాత్విక నిర్వచనానికి లొంగని అనుభవైక వేద్యమైన పరివర్తన అది అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక (Mystical) అనుభవం.

## బెర్గసన్ – ఫ్రాన్స్ – 1859–1941

భావవాది. ఇతని భావాలు సిద్ధాంతాలు శాస్త్రవేత్తలను కూడా ఆలోచింప చేస్తాయనటంలో సందేహంలేదు. అనగనగా ఏ వేయ్యికోట్ల సంవత్సరాల నాడో విశ్వపరిణామానికి పూర్వ దశలు ప్రారంభమైనాయి. ఆ తర్వాత వాయు - ధూళి మేఘాలు

గురుత్వాకర్షణ శక్తితో కదించుకుపోగా గ్రహాలు భూమి ఏర్పడ్డాయి. భూమిమీద అనుకూలపరిస్థితులు రాగానే, అత్యంత సంకీర్ణమైన జీవపదార్థాలు ఏర్పడ్డాయి. అవి అంతకంతకు సంకీర్ణ దశలకు పురోగమిస్తూ పోగా పోగా చివరకు మానవరూపం అవతరించింది. జీవపదార్థం మొదటినుంచీ లేదు. నిర్జీవ భౌతిక పదార్థంలో ఒకానొక దశలో వచ్చిన అనుకూల పరిస్థితుల సహాయంతో భౌతిక పదార్థంనుంచే జీవోత్పత్తి జరిగింది. అంతేకాదు భౌతిక పదార్థమే జీవంగా మారింది. ఇది ఈనాడు అధిక సంఖ్యాక శాస్త్రజ్ఞులు అంగీకరిస్తున్న భౌతికవాద విజ్ఞాన సిద్ధాంతము. ఇది కట్టుకథ అని ఖండించాడు. పదార్థం భౌతికమైనది. ప్రాణం Life అభౌతికమైనది. భౌతికమైనది అభౌతికమైన దానికి ఎలా కారణము అవుతుంది? భౌతికంనుంచి అభౌతికం ఎలా ఉద్భవిస్తుంది? లూయీ పాశ్చర్ అనేక ప్రయోగాలు చేసి నిర్జీవ పదార్థంనుంచి జీవం సృష్టి కాదని, జీవంనుంచే జీవం సృష్టి అవుతుందని నిరూపించలేదా? అని అడిగాడు.

అలాగే మెదడు అనేది ఆలోచించే అవయవమని, మనస్సు అంటూ వేరే ఏమీ లేదని భౌతిక వాదులు వాదిస్తారు. మెదడు ఒక మాంసపు ముద్ద అంటే భౌతికపదార్థం. కాని మనస్సు, ఆలోచన, భావం, చైతన్యం అభౌతికమైనవి. భౌతికమైన మెదడు అనే మాంసపు ముద్దనుండి అభౌతికమైన ఆలోచన ఎలా సృష్టి అవుతుంది? మెదడుకు మనస్సుకు మధ్య సంబంధం ఉండవచ్చు. అవి పరస్పరాశ్రితాలు కావచ్చు. కాని మెదడే మనస్సు కాదు. మెదడులో జరిగే ప్రతిమార్పును భౌతికశాస్త్రం ప్రకారం గుణించవచ్చు. క్వాంటిఫై చేయవచ్చు. ఎందుకంటే మెదడుకు ఆకారం ఉంది, విస్తృతి ఉంది. కాబట్టి భౌతిక పదార్థానికి వర్తించే ప్రకృతి సూత్రాలన్నీ దానికి వర్తిస్తాయి. కాని ఆలోచనకు విస్తృతి

ఉంటుందా! దానికి భౌతిక సూత్రాలు వర్తింప చేయగలమా! ప్రేమ, సౌందర్యం, అనుభూతులను క్వాంటిఫై Quantify చేయగలమా! ప్రేమకు సౌందర్యానికి, ఆలోచనలకు పొడుగు వెడల్పున్నాయా! అలాగే "నేను" అనే అహంకారానికి ఒక భౌతిక పదార్థం ఎలా ఆధారభూతమవుతున్నది, కారణమవుతుంది. మనస్సు, ఆలోచన, చైతన్యం, అహంకారం మొదలగునవి మెదడును తమకు ఒక వాహనంగా, ఒక సాధనంగా చేసుకుంటే చేసుకోవచ్చు. కాని మెదడే మనస్సు కాదు. అలాగే జీవం అనేది భౌతిక పదార్థాన్ని తనకు ఆధారంగా చేసుకోవచ్చు. కాని భౌతిక పదార్థమే జీవానికి, ప్రాణోత్పత్తికి కారణం కాదు.

భౌతికవాదం నియతి వాదానికి దారితీస్తుంది. అంటే విశ్వంలో ప్రతిదీ నియంత్రితమై ఉంటుందని భౌతికవాదం చెప్తుంది. ఒకానొక కారణం ఒకానొక ఫలితానికి దారితీస్తుంది. అది మరొకదానికి కారణమవుతుంది. ఈ విధంగా కారణ - కార్య చక్రం అనంతంగా సాగుతుంది. ఇందులో యాదృచ్ఛికతకు తావు లేదు. స్వాతంత్రేచ్ఛ free will కు అసలే స్థానం లేదు. ప్రపంచంలో ప్రతిది అంతకు ముందున్న దానిచేత నియంత్రితమైతే, సృజనాత్మకత [breatinity] కు స్థానం ఎక్కడ. ప్రతిది మరొకదాని ఫలితం అయితే, అలా వెనక్కి పోగా పోగా, చివరకు అన్నిటికి మూలం వాయుధూళి మేఘం అవుతుంది. అంటే షేక్స్పియర్ నాటకాలు, ఆయన శిల్పం, అన్నిటికి ఆదికారణం నిర్జీవ వాయుధూళి మేఘం కావాలి అంటె, ఇన్ని వేల కోట్ల సంవత్సరాల తర్వాత, ఇన్ని పరిణామ దశల ఫలితంగా ఒకానొక కాలంలో షేక్స్పియర్ అనే వాడు జన్మిస్తాడని, ఆతడు ఫలానా నాటకాలు వ్రాస్తాడని ఆనాడే అంటే వాయు ధూళి మేఘంలోని మార్పులలోనే నిర్ణయిస్తుందన్న మాట. కార్య - కారణ సూత్రాన్ని విశ్వసిస్తే అంతేమరి. కాని ఇది హాస్యాస్పదం, అసంబద్ధం కాదా!

కాబట్టి విశ్వానికి మూలకారణం భౌతిక నిర్జీవ పదార్థం కాదు. ప్రాణశక్తి, లైఫ్ force లేదా ఇలాన్ వైటల్ [Elan vital]. ఆ ప్రాణశక్తే అసంఖ్యాక రూపాలు ధరించింది, పరిణామం చెందింది. భౌతిక పదార్థాన్ని తనకు వాహిక (Vehical) గా చేసుకొని, నిరంతర సృజనాత్మకతతో ముందుకు సాగిపోతున్నది ఈ ప్రాణశక్తే. డార్విన్ చెప్పినట్లు జీవపరిణామం, యాంత్రికంగా గాని, యాదృచ్ఛికంగా గాని జరుగలేదు. ప్రపంచానికి ఆధారం, అంధశక్తి blind force కాదు. అది నిత్య సృజనాత్మక ప్రాణశక్తి. అదే విశ్వ పరిణామానికి, జీవపరిణామానికి కారణం కనుక దీనిని సృజనాత్మక పరిణామవాదం అని అన్నాడు. (Creative evolution).

తత్వవేత్తలలో అధిక సంఖ్యాకులు "సత్" ను గురించి వివేచించారు. ప్రపంచంలో ప్రతిదీ క్షణక్షణము మారుతున్నది. అయితే నిరంతరంగా జరిగే ఈ మార్పునకు ఆధారంగా మార్పులేనిది మారనిది ఏదో ఉన్నది. దానికోసమే తత్వవేత్తల నిరంతరాన్వేషణ. దాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా భావించారు. నీరు, వాయువు, అగ్ని, పదార్థం, కేవలభావం, అణువులు ఇలా భావించుకుంటూ పోయారు. కాని నిత్య నిరంతర పరివర్తన అడుగున పరివర్తనకు అతీతమైన "సత్" పదార్థం ఏదో ఉన్నదనే వాదాన్ని తిరస్కరించాడు. ప్రపంచంలో మార్పుతప్ప మరేమీ లేదని, మార్పుఒక్కటే సత్యమని అతనివాదం.

అతని దృష్టిలో ఒక వస్తువు మరొక వస్తువుగా మారడం అనేది లేదు. పరివర్తన చెందేవస్తువు, పరివర్తిత వస్తువు అంటూ లేవు. ఉన్నదల్లా మార్పుఒక్కటే. being అనేది లేదు. becomeing ఒక్కటే ఉన్నది. హెరాక్లిటస్ గాని మన గౌతమ బుద్ధుడు కూడా అదే చెప్పారు. ఏ వ్యక్తి ఒకేనదిలో రెండుసార్లు స్నానం చేయలేడు. ఒక వేళ నది కదలకుండా నిశ్చలంగావున్నది అనుకున్నా,

మొదటిసారి స్నానం చేసినప్పటికి, రెండవసారి చేసినప్పటికి కొంత కాలం గడచిందికదా! అందుచేత మొదటిసారి స్నానం చేసిన నది గంట క్రితమునది. రెండవసారి చేసినది గంటతర్వాతది ఆ రెండూ ఒకటికావు (atleast time is changing). మార్పులేదీ మార్పుచెందీ లేదు. మార్పుఒక్కటే ఉన్నది అంటూ మార్పును ప్రవాహం (flow)తో పోల్చాడు. అయితే నిన్నటి కుర్చీ నేడుకూడా ఒకటిగానే ఉన్నదే అనవచ్చు.

మనం ప్రపంచాన్ని స్థాలికదృష్టి [Spatial terms] తో చూస్తున్నాము. కాని స్థలం ఎంతనిజమో, కాలంకూడా అంతే నిజమైనది స్థలంలో మార్పు లేనట్లు, చలనం లేనట్లు కన్పించవచ్చు. కాని కాలంలో మార్పుఉంది. కాలం నదీప్రవాహం లాంటిది. అది క్షణక్షణం మారుతుంది. కాబట్టి నిన్న కుర్చీ ఈనాటి కుర్చీ ఒక్కటికాదు. కాలమే మార్పు మార్పే కాలం కాలం అవిచ్ఛిన్నమైనది. కాని మనదైనందిన వ్యవహారాలకోసం కాలాన్ని విభజించి సెకండ్లుగా, గంటలుగా, సంవత్సరాలుగా వాడుకుంటున్నాము. ఇది కల్పితకాలం. ఎందుకంటే మన నిత్యవ్యవహారం కోసమే ఇది ఒక సెకండు, ఇది రెండవసెకండు అని కాలాన్ని ముక్కలుగా విడగొడుతున్నాము. నిజానికి ఒకటవ సెకండుకు, రెండవ సెకండుకు మధ్య అరసెకండు ఉంది. ఒకటవ అరసెకండుకు రెండవ అరసెకండుకు మధ్య పావుసెకండు ఉంది. ఇలా సెకండును అనంత విభాగాలుగా విభజించుకుంటూ పోవచ్చు. నిజానికి అది శుష్కప్రయాస కాలం నిరంతరమైనది. అందుకని అసలైన కాలం real time మనస్సుకు మాత్రమే తెలుస్తుంది అది మనకు ''గడుస్తూండటము''గా అనుభవంలోకి వస్తుంది. దానికి బెర్గ్సన్ duration అని పేరుపెట్టాడు. అది అవిభాజ్యం, అవిచ్ఛిన్నం, ప్రవాహసదృశ్యం. కాలం గతిస్తున్నకొద్దీ భూతకాలం పెరుగుతూ ఉంటుంది.

30

ఈ రాశీభూత కాలం, జ్ఞాపకాల రూపంలో భద్రపరచబడి వుంటుంది. కాని బాహిరమైన యాంత్రిక కాలంలో జ్ఞాపకం అనేది ఉండదు. ఒక్క-క్షణం తర్వాత ఇంకొకటి వస్తుంది. "గతము గతించె ఎన్నటికి కన్నుల గట్టదు" అన్నట్లు పోయిన క్షణాలు తిరిగిరావు. కాని మానసిక కాలం అలా కాదు. అది జ్ఞాపకాల రూపంలో వెనక్కి, ఊహల రూపంలో ముందుకు. ద్యూరేషన్ రూపంలో వర్తమానంలోకి ఎటుపడితే అటు కదులుతుంది. మనం మనస్సు అట్టడుగు పొరలతో ఉన్న జ్ఞాపకాలన్నైనాసరే, మన నిత్య వ్యవహారానికి అవసరమైనప్పుడు అవసరమైన వాటిని, పైకి త్రవ్వి తీసుకొనివచ్చి ఉపయోగించుకుంటాము.

మనస్సు అంటె ఆలోచనల సమాహారము. అదికూడా నిశ్చలంగా ఉండదు మారుతూఉంటుంది. మనస్సు పనిచేస్తున్నంతసేపు చైతన్యం ఉంటుంది, అంటే నేను అనే స్పృహ ఉంటుంది. అంటె చైతన్యంకూడా మారుతూ ఉంది. మార్పు duration మనస్సు. చైతన్యం ఇవన్నీ ఒక్కటే. వీటిని బుద్ధిద్వారా, వివేచన ద్వారా, తర్కంద్వారా తెలుసుకోలేము. నేరుగా ప్రత్యక్ష జ్ఞానం ద్వారానే, అపరోక్షానుభూతి ద్వారానే తెలుసుకుంటాం. ఈ ప్రత్యక్ష జ్ఞానాన్నే బెర్గ్సన్ ఇంట్యూషన్ [intution] అన్నాడు. ప్రపంచానికి ఆధారభూతమైన జీవశక్తి లేదా Elanvital కూడా నిరంతర ప్రవాహ సదృశ్యమైనది. నిత్య పరిణామ స్వభావం కల్గినది.

మరి జీవశక్తి ఒక్కటే సత్యమైనప్పుడు ఈ భౌతిక ప్రపంచం గ్రహాలు, ప్రకృతి, కొండలు, నదులు శరీరం మొదలగునవన్నీ ఎక్కడనుండి వచ్చాయి? ఇవన్నీ మనబుద్ధి కల్పించినవేనంటాడు. అయితే మనబుద్ధిచేత కల్పితమైనవే అయినా నిజంగా ఉన్నాయంటాడు, జీవశక్తి Primary కాగా, భౌతిక పదార్థం secondary.

జీవశక్తి తన ఆత్మసాక్షాత్కారం కోసం, భౌతిక పదార్థాన్ని తనకు వాహనంగా, సాధనంగా సృష్టించింది. అంటె గతితార్కిక పద్ధతిలో జీవశక్తి తనకు విరుద్ధమైన భౌతిక పదార్థాన్ని సృష్టించుకొని ఉండాలి. ఈ రెండింటి మధ్య వైరుధ్యమే. సృజనాత్మక పరిణామంగా భాసిస్తుంది. అందుచేత నాణానికి ఒకేవైపు ఉండటం అసంభవం అయినట్లు, జీవశక్తి, భౌతికపదార్థం రెండూ మొదటినుంచే ఉండి ఉండవచ్చు. ఆ రెండింటి మధ్య నిరంతర సంఘర్షణే సృజనాత్మక పరిణామం. ఇలాన్ అంటె అర్థం బలంగా ముందుకుచొచ్చుకుపోయేశక్తి. ఇలాన్ వైటల్ అంటే జీవం ఇంకా ఇంకా ముందుకు పైపైకి చొచ్చుకొని, ఛేదించుకొని, పురోగమించేశక్తి జీవోద్గమనశక్తి అని అర్థం. అలా చొచ్చుకుపోవడం మామూలుగా అప్రయత్నంగా జరిగే పని కాదుకదా! దానికి శక్తిని ఉపయోగించాలి. శక్తిని ఎప్పుడు ప్రయోగిస్తాము. ప్రతిఘటించేది ఏదో ఉన్నప్పుడే శక్తిని ప్రయోగిస్తాము. అదే భౌతికపదార్థం. జీవం తన ఉద్గమనానికి అడ్డుపడే వస్తువును తొలగించగల తన శక్తిని నిరూపించుకోవడానికిగాను, తానే భౌతిక పదార్థమనే ప్రతిఘటనను సృష్టించుకొన్నది. ఆ విధంగా తనకు ప్రతిఘటనను తానే సృష్టించుకోవడం జీవశక్తి మౌలిక స్వభావంగా మనం భావించవచ్చు ప్రతిఘటన లేనిదే చొచ్చుకుపోవాలనే ఇచ్ఛ నెరవేరదు. ఆ ఇచ్ఛా పూర్తి కోసం జీవశక్తి, జడపదార్థాన్ని సృష్టించింది. [మనం కూడా ఒక్కొక్కసారి మన శత్రువును రెచ్చగొట్టి ఘర్షణకు పురికొల్పి, ఘర్షించి ఓడిపోవటమో గెలవటమో చేస్తూ ఉంటాం] కనుక దానిని జీవపదార్థ సైకాలజీగా భావించవచ్చు. అంటె జీవశక్తి ఎప్పుడైతే ఉందో దానికి విరుద్ధ జడపదార్థం కూడా అప్పుడే ఉన్నదన్నమాట అదికూడా అనాది. వాటిమధ్య సంఘర్షణ అనాది. తనను ప్రతిఘటించే జడపదార్థపు సంకెళ్ళనుంచి విముక్తమై సం

పూర్ణ స్వేచ్ఛ పొందాలని జీవశక్తి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంది. ఆ ప్రయత్నం పూర్తిగా నెరవేర లేదనటానికి నిదర్శనం మనచుట్టూ ఉన్న నిర్జీవ ప్రపంచం పూర్తిగా విఫలం కాలేదనటానికి నిదర్శనం, మనచుట్టూవున్న వృక్ష జంతు జీవ రాసులు. అవి అంతకంతకు ఉన్నతమైన దశలకు పరిణామంచెందటం, ఆ పరిణామంలో భాగంగా ఒక వైపు సహజాతాలను (Instinct) మరొకవైపు బుద్ధి [intellect] ని పెంపొందించుకోవడం, ఈ రెండింటి సహాయంతో నిరంతర పురోగమన యాత్రను సాగించటం జీవశక్తి విజయానికి నిదర్శనాలు. ఇతడు జీవపరిణామాన్ని జలయంత్రంతో పోలుస్తాడు. జల యంత్రంలో నీరు పైకి ఎగచిమ్మబడుతూ ఉంటుంది. పైకి పోతున్న నీరు జీవశక్తి. క్రిందపడుతున్న నీరు భౌతికపదార్థం.

అనాటికి రెండు పరిణామ వాదాలున్నాయి. డార్విన్ "తన పరిసరాలకు అనుగుణమైన అవయవ నిర్మాణం ఏ జీవికైతే ఉన్నదో ఆ జీవి మాత్రమే జీవన సమరంలో గెలుపొంది, మనుగడ కొనసాగించి తన సంతతిని వృద్ధి చేసుకుంటుంది. పరిసరాలకు అనువైన అవయవ నిర్మాణం జీవికి యాదృచ్ఛికంగా లభిస్తుంది". అని అన్నాడు. కాగా లామార్క్ - ప్రతిజీవి తన పరిసరాలకు అనుగుణమైన అవయవాలను పెంపొందించుకొనడానికి ప్రయత్నిస్తుంది. తనకు తాను పరిసరాలకు అనువుగా పరిణామం (adaption) చెందించుకోజూస్తుంది. ఆవిధంగా తాను పొందిన మార్పులను తన సంతతికి వారసత్వంగా అందజేస్తుంది. అలా అందజేయడంలో కృతకృత్యమైన జీవజాతే అభివృద్ధి అవుతుంది " అని అన్నాడు. ఈ రెండింటిలోనూ జీవపరిణామాన్ని నిర్ణయించేది పరిసరాలే. వీటిని తిరస్కరించి బెర్గ్‌సన్ సృజనాత్మక పరిణామ వాదాన్ని ప్రతిపాదించాడు. Creative evolution పరిసరాలుకు అనుగుణంగా మార్పుచెందడమే పరిణామ లక్ష్యమైతే, జీవ పరిణామం ఎప్పుడో ఆగిపోయి ఉండవల

సింది. అలాకాక పరిణామం ఇంకా ఇంకా ఉన్నతోన్నత దశలకు పురోగమిస్తుందంటే అటువంటి పురోగమనం జీవశక్తి సహజ స్వభావమై ఉండాలి. పురోగమనానికి అంతిమగమ్యం లేదు. అలాగే పురోగమనం గుడ్డిగా జరుగుతున్నదనటం కూడా అర్థంలేనిది. జీవ పరిణామక్రమాన్ని చూస్తే ఒకనిత్య నూతనత్వం ఒకక్రమం, ఒక సృజనాత్మకత కన్పిస్తున్నాయి. అందులో జీవశక్తి సంపూర్ణ స్వాతంత్రముతో యథేచ్ఛగా పనిచేస్తుంది. అది ఒక కళాకారుని సృజనాత్మకతను పోలినది. కవి తన నవల ఇతివృత్తాన్ని స్థూలంగా ముందే ఎంచుకొన్నప్పటికి ఇతర వివరాలన్నీ వాస్తవంగా రచనా క్రియ సందర్భంలోనే నింపుతాడు. అది నూతనసృష్టి అవుతుంది. అందులో సృజనాత్మకత ద్యోతకమవుతుంది. అలాగే ప్రతిభగల ఏ గాయకుడైనా క్రిందటి కచేరీలో వేసిన సంగీతాన్నే మరొక కచేరీలో వేయడు. క్రొత్త సంగీతాలను అప్పటికప్పుడు సృష్టిస్తాడు. అది వారి స్వతంత్రేచ్ఛ (free will) పై ఆధారపడి ఉంటుంది.

జీవ పరిణామం రెండు ప్రధాన మార్గాలలో జరిగింది. వృక్ష మార్గాన్ని మొదటగా ఎన్నుకున్న జీవశక్తి తనశక్తిని వృక్షాలలో నిక్షిప్తంచేసి పదిల పరచటానికే తన పరిణామాన్ని పరిమితం చేసుకుంది. వృక్షాలవలె స్థావరంగా వుండే జీవితంలో భద్రతఉన్నా స్వేచ్ఛలేదు అది తృప్తి కలిగించలేదు. కనుక జీవశక్తి జంగమ జీవితంవైపు పురోగమించింది. అవి నేలపైన, నీటిలోను చలన స్వేచ్ఛను సంపాదించుకున్నాయి. స్వేచ్ఛాచలనం పక్షులలో పరాకాష్ఠనొందింది. జంతుప్రపంచంలో పరిణామం తిరిగి రెండు మార్గాలలో పురోగమించింది. ఒకటి సహజాతం [instinct] కల్గినవి. ఇది పుట్టుకతోనే వచ్చే జ్ఞానం దీనివల్ల జీవి అప్రయత్నంగా తన జీవిత యాత్రను కొనసాగించ కల్గుతుంది. ఇది చీమలు తేనెటీగలు మొదలగు కీటక జాతులలో పరాకాష్ఠ పొందింది, అయితే ఈ

సహజాతజ్ఞానంలో జీవికి స్వాతంత్ర్యం లేదు స్వస్వరూపజ్ఞానం లేదు. పరిణామక్రమంలో ఈ సహజాతజ్ఞానమే మానవునిలో ఇంట్యూషన్‌గా రూపొందింది. దీనిలో మానవుని స్వేచ్ఛ [free will) అత్యున్నత స్థితిని చేరుకుంది. తన్ను తాను తెలుసుకోగలిగిన సహజాతమే ఇంట్యూషన్, కాగా జంతుప్రపంచంలో పరిణామం అనుసరించిన రెండవమార్గం బుద్ధిమార్గం. ఇది ఆలోచన, వివేచన, తర్కం, విశ్లేషణ ద్వారా పరిసర ప్రపంచాన్ని అవగాహన చేసుకొనడానికి ఉపయోగపడే సాధనం. ఇది మానవునిలో పరాకాష్ఠనొందింది

బెర్గ్‌సన్ బుద్ధిని సినీ కెమెరాతో పోల్చి జీనో కదలని బాణం పారడాక్స్‌ని ఛేదిస్తాడు. సినీకెమెరా కదులుతున్న వస్తువులను ఫోటోతీస్తుంది. వస్తుచలనాన్ని సెకండుకు 16 ఫ్రేములుగా విడగొట్టి 61 ఫోటోలు తీస్తుంది. ఏ ఒక్క ఫోటోచూసినా మనకు వస్తుచలనం కన్పించదు కదలని బొమ్మ మాత్రమే కన్పిస్తుంది. కాని అదే ఫిలిమ్‌ని ప్రొజెక్టర్ మీద ఎక్కించి సెకండుకు 16 ఫ్రేముల వేగంతో తిప్పితే తెరపై బొమ్మ కదులుతున్నట్లుగా కన్పిస్తుంది. ఏది నిజం, వస్తుచలనమా, చలనరాహిత్యమా! వస్తుచలనమే నిజం. చలిస్తున్న వస్తువునే సినీకెమెరా ఫోటోలు తీసింది. అయితే వస్తుచలనాన్ని కొన్ని స్తబ్దస్థితులుగా విడగొట్టి ఫోటోలు తీసింది అలానే చలనం, మార్పు తప్ప మరేమీ లేని జీవశక్తిని, బుద్ధి స్తబ్ద జడపదార్థంగా, ఆ పదార్థాన్ని విభిన్న వస్తువులుగా పృథక్కరించి [Separate] చూపిస్తుంది కాబట్టి బుద్ధి చూపించేది భ్రాంతిమయ చైతన్యస్రవంతి రూపాన్ని కనుక మనం చైతన్యస్రవంతి లేదా జీవశక్తిని ఇంట్యూషన్ ద్వారానే గ్రహించగలము.

## జీన్ పాల్ సార్త్ర్ - ఫ్రాన్స్ 1905–1980

ప్లేటో "భావం" మాత్రమే యదార్థం, భౌతిక ప్రపంచం

ఒక ఆభాస మాత్రమేనన్నాడు. భావానికి భౌతికరూపం వస్తువు. మానవభావం, గోభావం సత్యం ప్రత్యేక మానవుడు, ప్రత్యేక గోవు మిథ్య అసత్యం ఎందుకంటె భావవాదంలో భావానికి తప్ప వస్తువులకు స్థానంలేదు. భౌతిక శరీరధారియై, సుఖదుఃఖాలకు లోనయ్యే ప్రత్యేక మానవుడు ఆభాసమాత్రమే. మానవ భావం, మానవజాతి మానవత్వం. ఇవే సత్యం ఇది దారుణమని అస్తిత్వ వాదులంటారు. అసలు సత్యం మానవ భావం కాదు. మానవుడే అంటారు. ఏ మానవవ్యక్తిని సాధారణీకరించడానికి వీలులేదు. నేను, నీవు, ఆమె, అతడు, ఇతడు, ఎవరికివారే. ఎవరి ప్రత్యేక వ్యక్తిత్వం వారిదే. భావవాదం మానవుడిని మానవజాతి అనే మందలో ఒకడుగా పరిగణిస్తుంది. కాగా అస్తిత్వ వాదం ప్రతి మానవుడికి ప్రత్యేక విశిష్టస్థానం ఇచ్చి గౌరవిస్తుంది. అస్తిత్వం ప్రథమం

సార్త్ర తన గ్రంథం "Being and nothingness" లో అస్తిత్వం మూడు రకాలుగా ఉంటుందని పేర్కొన్నాడు.

1. Being for itself :— అంటె తనకొరకు తాను అయిన అస్తిత్వం. డెకార్ట్ కూడా I think therefore I am అని అన్నాడు. ఆలోచన, చేతన ఉన్నమాట నిజమే. ఆలోచించడానికి చేతనతో గ్రహించడానికి ఒక యదార్థ వస్తువు కావాలి. All consciousness is consciousness of something చేతన అనేది శూన్యం ఆ శూన్యాన్ని నింపటానికి ఏదో వస్తువు కావాలి. ఈ పద్ధతిలోనే మనం మనస్సుతో, చేతనతో, ఆలోచనతో బాహ్యప్రపంచాన్ని గ్రహిస్తాము ఇది మానవ చేతన లేదా మనస్సు. దీన్నే శూన్యత nothingness గా సార్త్ర భావించాడు. తాను ఉన్నానని తెలిసి ఉండటమే చేతన, చైతన్యం కలిగి ఉండటమే చేతన అయినప్పుడు దేన్ని గురించిన చేతన అని ప్రశ్నవస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం అస్తిత్వం రెండవరూపం.

2) Being - in - itself :— తనలోపల తాను అయిన అస్తిత్వం ప్రపంచంలోని జడపదార్థములు, తాము ఉన్నామని తమకు తెలియని వస్తువులు, తాము ఉన్నామని తెలిసినా అలా తెలిసినట్లు తెలుసుకోలేని జంతువులు ఈ శ్రేణిలోకి వస్తాయి.

3) Being - for - others :— ఈ శ్రేణిలోకి మనలను పోలిన - తాము ఉన్నామనే విషయం తెలిసి ఉండటమే కాక, అలా తెలుసునన్న విషయం కూడా తెలిసిన మానవులు వస్తారు.

ఈవిధంగా మొదటిశ్రేణి అస్తిత్వం (మానవచేతన), రెండవ మూడవ శ్రేణుల అస్తిత్వం (బాహ్యప్రపంచం)తో సంబంధం పెట్టుకుంటే తప్ప మానవునికి సంపూర్ణత లేదు. అంటే మానవ చేతన శూన్యతతో కూడినది. దాన్ని మానవుడు తన చర్యలతో, ఆలోచనలతో, అనుభవాలతో, వస్తుత్వంతో, నింపగోరుతాడు. శూన్యచేతన లేకపోతే మానవుడు బాహ్యప్రపంచాన్ని గుర్తించడం కాని, అనుభవంలోకి తెచ్చుకోవడం కాని కుదరదు ఈ కార్యక్రమంలో అతడు తానుచేసే పనులద్వారా తన స్వభావాన్ని నిర్ణయించుకుంటాడు. అంటే మానవ స్వభావం, వ్యక్తిత్వం ఆది నుంచి తమంతట తాము నిర్ణయమైనవి కావు బాహ్యపరిస్థితులు, ఇతరుల వత్తిడిద్వారా కూడా నిర్ణయమైనవి కావు మానవుడు తన చర్యలద్వారా ఆలోచనలద్వారా ఎప్పటికప్పుడు తన వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని నిర్ణయించుకుంటాడు. నిర్మించుకుంటాడు. ఈ విధంగా అతడు సర్వస్వతంత్రుడు.

మానవ జీవితం చీలుదారుల కూడలివంటిది కూడలిలో నిలబడిన మానవుడు ఏదో ఒకదారి ఎంచుకోవలసిందే ఫలానా దారిని వెడితే ప్రయోజనం చేకూరుతుందని, అది నైతికమని, విద్యుక్త ధర్మమని సలహా ఇచ్చేవారికి కొరత లేదు. మతవిశ్వాసాలు, నైతిక సూత్రాలు, గురువుల ఉపదేశాలు, నిపుణుల నిర్ణ

యాలు - ఎన్నో సలహాలు అందుతాయి. కాని బాధ్యత మాత్రం మనిషిదే. ఈ నిర్ణయ స్వేచ్ఛవల్ల మనిషి తాను చేసే ప్రతిపనికి తానే బాధ్యుడవుతున్నాడు. దేవుడు ఇలా రాసిపెట్టాడు; కనుక నేను ఫలానా విధంగా ప్రవర్తించాను. నా తప్పేమీ లేదు అని అనటానికి వీలులేదు. ఎందుకంటె దేవుడనేవాడు లేడు. మానవునికి గల నిర్ణయస్వేచ్ఛ కారణంగా దేవుని అవసరం లేకుండా పోతున్నది. దైవశాసనం నిర్దిష్టవిధంగా ఉండేటట్లయితే మానవుడు ఎంచుకోడానికి ఇన్ని మార్గాలు ఉండవు ఒక్కటే మార్గముంటుంది. అదే దైవశాసనం. దేవుడనేవాడుంటే బాగుండేదే. కాని మన దురదృష్టవశాత్తూ దేవుడు లేడు. మనమే నిర్ణయించాలి. కాబట్టి మానవుడు తాను చేసే ప్రతి నిర్ణయాన్ని చాలా బాధ్యతతో చేయవలసి ఉంటుంది.

అంతేకాదు మనం ఒకపని చేశామంటే, ఒక నిర్ణయం చేశామంటే అది మన ఒక్కరి పక్షాన్నే కాదు. మొత్తం మానవ పక్షాన్నే చేస్తున్నామని అర్థం. మనం ఒకనిర్ణయం ఎందుకు చేస్తాము. అది విలువైన నిర్ణయం, ప్రయోజనకర నిర్ణయం అనే కదా! అందుచేత ఆ నిర్ణయాన్ని ఇతరులుకూడా గ్రుడ్డిగా అనుసరించే ప్రమాదం ఉంది. కనుక మనం నిర్ణయం సరైనది చేయకపోతే ఇతరులనుకూడా తప్పుదారి పట్టించిన వారమవుతాము. ఒకవైపు భావవాదంతో విశ్వజనీనసత్యం లేదంటూనే ఈ విధంగా చెప్పి సార్త్, కాంట్ విశ్వజనీన కాటగారికల్ ఇంపరేటివ్‌కు దగ్గరగా వచ్చాడు. మానవునికి గల ఈ ఇచ్ఛా స్వాతంత్ర్యమువల్ల ఏదికర్తవ్యం అని నిర్ణయించుకోవలసి వచ్చినప్పుడు అతనికి భీతి, ఆందోళన, ఆవేదన కలుగుతాయని ఇంతకుముందే తెలుసుకున్నాము. వీటినుండి తప్పించుకోడానికి అతడు ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నంలో అతడు ఆత్మవంచన Bad faith కు లోనవుతాడు అని

పాత్ర అంటాడు. తన నిర్ణయస్వేచ్ఛ అంతులేనిదని, తన చర్యలకు బాధ్యత తన ఒక్కడిదేనని, తాను లోకంలో ఒంటరినని తెలుసుకున్నప్పుడు అతనికి భయం కల్గి తాను నిజంగా అంత స్వతంత్రుడిని కానని తనను తాను వంచించుకుంటాడు

ఆత్మవంచన రెండు రకాలు. మనిషి తాను నిజంగా స్వతంత్రుడిని కానని భావిస్తాడు. తనకు మార్పులేదని పూర్వ నిర్దిష్ట పరంపరాగత స్వభావం ఉందని, దానినుంచి తప్పించుకోలేనని అనుకుంటాడు. తాను ఇలాతప్ప ప్రవర్తించలేనని, తనకు పుట్టుకతో వచ్చిన స్వభావమో, గత చర్యలపట్ల అలవడిన స్వభావమో నిర్దిష్టము ఉంది కనుక అలాగే ప్రవర్తిస్తానని, తనను తాను నమ్మించుకుంటాడు. అది అబద్ధమని ఆత్మవంచన అని తెలిసికూడా నిర్ణయ స్వేచ్ఛాబాధ్యతనుంచి తప్పించుకొనే నిమిత్తం అలా భావిస్తాడు. తానొక అచేతన వస్తువులాంటి వాడినని, గాలి ఎటువీస్తే అటు ఎగిరిపోయే కాగితం ముక్కలాంటి వాడినని తలుస్తాడు.

ఉదాహరణకు ఒక అమ్మాయి ఒక యువకునితో మొదటిసారిగా ఏ రెస్టారెంటుకో వెళ్ళడానికి ఒప్పుకుంటుంది. ఆ యువకునికి తనపట్ల ఏ ఉద్దేశంవుందో ఆమెకి తెలుసు. ఇప్పుడే కాకపోయిన మరికాసేపటికి ఏదో ఒక నిర్ణయానికి రాకతప్పదనికూడా తెలుసు. కాని అంతత్వరగా నిర్ణయానికి రావలసిన అవుసరం లేదన్నట్టుగా ప్రవర్తిస్తుంది. తన స్నేహితుని ప్రవర్తన మర్యాదగా ఉన్నదా! లేదా! అని గమనిస్తూ ఉంటుంది. నీవు చాలా అందంగా ఉన్నావు సుమా! అని అతడు అంటే అందులో సెక్సు సంబంధమైనదేమీ లేదని నమ్మాలని ప్రయత్నిస్తుంది తాను అతనిలో బలమైనకోర్కె కల్గిస్తున్నాను అని ఆమెకి తెలుసు. కాని అటువంటి కోర్కె అతనికున్నదని తనకు తెలియనట్లే నటిస్తుంది. కాని ఆదేసమయంలో అతడు తనను కేవలం ఒక స్నేహితురాలుగా

మాత్రమే పరిగణిస్తున్నాడని తెలిస్తే చాలా కోపం వస్తుంది. ఆమెకి పూర్తి సంతృప్తికరంగా ఉండాలంటే అతని వైఖరి తన పూర్తి వ్యక్తిత్వాన్ని, తన వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించేదిగా ఉండాలి, అదే సమయంలో ఆ వైఖరిలో తన శరీరంపట్ల కోర్కె కూడా మిళితమై ఉండాలి. ఇంతలో అతడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటాడు. దానితో ఆమె వెంటనే ఏదో ఒక నిర్ణయానికి రావలసిన అవసరం ఏర్పడుతుంది. ఆ చేతిని అలాగే వదిలేస్తే అతని కోర్కెని అంగీకరించినట్లవుతుంది. లాగేసుకుంటే తమ ఇరువురి మధ్యా నడుస్తున్న సందిగ్ధ మాధుర్యం కాస్తా ఎగిరిపోతుంది. అందుచేత ఆమె ఒక నిర్ణయానికి రావలసిన ముహూర్తాన్ని వీలైనంత వాయిదా వేయడానికి నిర్ణయించుకుంటుంది. తన చేతిని అలానే ఉంచుతుంది. కాని గమనించనట్లే నటిస్తుంది. పైగా ఏవో ఉదాత్త గంభీర విషయాలను గురించి, తన చిన్నతనం గురించి, తన వ్యక్తిత్వము గురించి ఇంటలెక్చువల్ గా మాట్లాడటం ప్రారంభిస్తుంది తానొక ప్రత్యేక వ్యక్తినని నిరూపించాలని ఆమె తాపత్రయం. ఆ ప్రయత్నంలో ఆమె శరీరం, మనస్సు వేరైపోయి ఆమె చేయి అతని చేతులమధ్య అంగీకార - అనంగీకారముల మధ్య ఒక అచేతన వస్తువులా మిగిలిపోతుంది. ఇదంతా ఆత్మ వంచనేనంటాడు. అలాగే హోటల్ లో waiter అతి వినయం అందరం చూసేఉంటాము. అదికూడా అతని ఆత్మవంచనే.

మానవుడు తనకుగల సంపూర్ణమైన, అవధులు లేని, అనంతమైన నిర్ణయస్వేచ్ఛ వల్ల తన భవిష్యత్ ను ఎలా కావాలంటే అలా మార్చుకోవచ్చు. ఇది సకల చరాచర జగత్తులో మానవుడి కొక్కడికే ప్రకృతి ప్రసాదించిన వరం. అలాగే శాపంకూడా.

# ముగింపు

నేటి ఆధునిక వైజ్ఞానిక ప్రపంచంలో ఎవరో ఏదో చెప్పారని దానిని యథాతథంగా అంగీకరించడము మాని, బుద్ధిద్వారా, తర్కంద్వారా, విచేచన ద్వారా. ప్రయోగరీత్యా ప్రతిదాన్ని కనుగొనటానికి ప్రయత్నించాలి వైజ్ఞానిక దృక్పథాన్ని అలవరుచుకోడానికిముందు మన మనస్సులకు పట్టిన తరతరాల బూజును దులపాలి. మూఢ విశ్వాసాలను పారద్రోలాలి. బేకన్ మానవాభ్యుదయాన్ని ఈ 4 ఐడిగూల జీలు అవరోధిస్తున్నాయన్నాడు.

**Idols of tribe:**—ఇవి తరతరాలుగా జీర్ణించుకుపోయిన అపోహాలు అజ్ఞానంవల్ల మానవుడు తన సౌకర్యం కోసమే సమస్త విశ్వం ఏర్పాండిందని భావిస్తాడు. ప్రపంచానికి ఒక పూర్వ నిర్దిష్ట ప్రయోజనం కలదని, దానికి ఆదికారణం ఏదో ఉందని భ్రమ పడతాడు లోకంలో వాస్తవంగా ఉన్న దానికంటె ఎక్కువ క్రమబద్ధత ఉన్నదని ఊహించుకుంటాడు. మానవుని మనస్సుకు ఒక బలహీనతఉంది ఎవరో పూర్వులు చెప్పారని, తనకు అనుకూలంగా ఉన్నదనిగాని ఒకానొక అభిప్రాయానికి మన మనస్సు వచ్చిన తర్వాత, దాన్ని సమర్థించే నిదర్శనాలను వెదకటం ప్రారంభిస్తుంది. తన అభిప్రాయాలకు వ్యతిరేకమైన విశేషాలు తారసిల్లినా వాటిని అలక్ష్యం చేస్తుంది, లేదా ఏదోకుతర్కంతో తిరస్కరిస్తుంది. ఈ దౌర్బల్యాలను పడగొడితే గాని సత్యాన్ని దర్శించ లేము.

**Idols of love:**— ప్రతి వ్యక్తికి ఒక సొంత గుహ own opinionn ఉంటుంది. దానిలోకి చొరబారే వెలుగు వికీర్ణమై, వివర్ణమై పోతుంది. కొన్నిరకాల ఊహాగానాలకు కొందరు వ్యక్తులు అంకితమై పోతారు. వాటిని తామే కనిపెట్టామని చెప్పి వాటిని ఆరాధించడం మొదలు పెడ్తారు. అలాంటివారు తత్వశాస్త్రరంగంలోకి అడుగుపెడ్తే తమ తాత్విక దృక్పథాన్ని తమ అభిమాన దురభిమానాలకు అనుగుణంగా మలచుకుంటారు. పితాగరస్ ప్రపంచా

నికి మూలం సంఖ్యలేనదనడం దీనికి నిదర్శనము. అలాగే అరిస్టాటిల్ విజ్ఞాన శాస్త్రాలను తన లాజిక్‌కు శాఖలుగా చేశాడు. దానితో ఆ సైన్సులు ఎందుకూ కొరగాకుండా పోయాయి. మానవునికి, కోతులకు పోలిక కనిపెట్టికూడా పరిణామవాదం అతని తత్వసిద్ధాంతానికి వ ం కనుక మానవుడు అనాదినుంచే ఉన్నాడన్నాడు

మాటల నిరంకుశత్వం.— తర్కంద్వారా తిమ్మిని బమ్మిని చేయాలనుకోవడం భాషా ప్రతిభవల్ల ఎదుటివారిని బురిడీ కొట్టించడం, నిర్వచనాలవల్ల సత్యం దొరకదు. కేవలత్వం, అనంతత్వం, ఆదికారణం, పూర్ణవాస్తవికస్థితి ఇత్యాది పదాలను తొలగించాలి.

జాతీయదురహంకారం:— పాతొకవింత క్రొత్తొకరోత అన్నట్లుంటారు చాలామంది. వీరు ఈ నాటి విజ్ఞానమంతా వేదాలలోను ఉపనిషత్తులలోను ఉన్నాయనియు పుష్పక విమానాన్ని నేటి ఆధునిక విమానాలతోను, పురాణాలలో వర్ణించిన బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం లను నేటి అత్యాధునిక క్షిపణులతోను పోల్చుతారు. ఇది మన సంకుచితత్వానికి జాతీయ దురహంకారానికి నిదర్శనం.

మతం:— ప్రపంచంలో క్రైస్తవ మతారంభము తర్వాత విజ్ఞాన శాస్త్రాలు, తత్వశాస్త్రము పూర్తిగా మరుగున పడ్డవి దాదాపు 1500 సంవత్సరాలు ఆ మతం రాజ్యమేలింది. మత మౌఢ్యం అత్యంత ప్రమాదకరం. భూమి గుండ్రంగా ఉన్నదన్నందుకు గలీలియో కళ్లు పీకించారు. ఇక్కడ ఓల్టేర్ మత మౌఢ్యాన్ని ఖండిస్తూ అన్నమాటలు చెప్తాను 1) నేను నమ్మినట్టు నమ్ము, లేకపోతే దేవుడు నిన్ను శిక్షిస్తాడు అంటూ ఈ రోజు బయపెట్టేవాడు; నేను నమ్మినట్టు నమ్ము, లేకపోతే చంపేస్తాను అని రేపు నిన్ను బెదిరించడా వెనుకాడడు — వోల్టేర్.

నవీన యుగారంభముతో పాశ్చాత్య దేశాలలో తత్వ

శాస్త్రము వివిధ పుంతలను త్రొక్కుతూ పయనించ నారంభించగా భారత దేశములో మాత్రమే నిస్పృహ రాజ్యమేలుతుంది. శంకరుని అద్వైతము తర్వాత మనదేశంలో ఆవిర్భవించిన నూతన విశిష్ట సిద్ధాంత మేమీ లేదు. కాగా పాశ్చాత్య దేశాలలో ప్రాగ్మాటిజం అనుభూతివాదం, అస్తిత్వవాదం మొదలగు నూతన దృక్పథాలు అనేకం వచ్చాయని తెలుసుకున్నాము. మన దేశంలో ఇప్పటి వరకు చేతన పదార్థము, అచేతన పదార్థము, పురుషుడు-ప్రకృతిల మధ్యగల సంబంధ బాంధవ్యములు. కర్మ - పునర్జన్మ - ఆత్మ- ప్రళయం - దైవంల చర్చల సుడిగుండాలలో మన దర్శనాలన్నీ కొట్టుమిట్టాడినాయి. నవీనభౌతిక విజ్ఞానాన్ని ఆసరాగా తీసుకుంటే గాని మనం ఆ సుడిగుండములో నుండి బయటపడలేము. ఐన్‌స్టీన్ పదార్థము శక్తిగా రూపాంతరం చెందగలదని నిరూపించాడు. $E=mc^2$ matter can be converted into Enegy అంతేగాక అణువులలో కూడా న్యూక్లియస్ చుట్టూ ఎలక్ట్రానులు నిరంతరం పరిభ్రమిస్తున్నాయని. నిరూపింపబడింది. అంటే అణువులకు స్వతసిద్ధ చలనముంది. ప్రపంచంలో అచేతన పదార్థమంటూ ఏమీ లేదు. ఉన్నదంతా చేతన పదార్థమే కాబట్టి సమస్త ప్రపంచానికి మూలం అణువులతో నిర్మితమైన పదార్థం ( Matter ) అని నిస్సందేహంగా దృవీకరించవచ్చు. మనం శూన్యం అని పిలిచే స్థలంలో కూడా ఈథర్ అనేసూక్ష్మ పదార్థంతో నిండి వుంది. లేనిచో సూర్యకాంతి మనదగ్గరకు చేరలేదని అంగీకరించదగినది. కావున ప్రపంచానికి మూలకారణంగా, అనంతమైనది. ఆది అంతములు లేనిది, స్వతసిద్ధమైనదిగా "పదార్థం" ఒక్కటే కన్పిస్తుంది. సృష్టికర్త అంటూ ఎవరూ లేరు. స్వతసిద్ధ పరిణామ క్రమంలో సమస్త విశ్వం ఏర్పడుతుంది. ఆ పరిణామం అలా సాగుతూనే వుంది. ప్రళయం పునఃసృష్టి అంటూ ఫుల్‌స్టాప్‌లు కామాలు ఏమీ లేవు.

అలాగే పదార్థంతో పాటు కాలం కూడా ఆది అంతములు లేనిది, నిత్య ప్రవాహరూపమైనది. విభాగించరానిది. మన మానసిక స్థితుల మధ్య డ్యూరేషన్ గా అనుభవంలో ఉండేది. స్వతంత్ర ద్రవ్యం కాదు

కాని మానవుడు, నిత్య జీవితంలో వచ్చు సుఖదుఃఖములకు, అదృష్టదురదృష్టములకు పూర్వజన్మములో చేసిన పాపములు లేక దేవుడు కారణమని మన సమస్త దర్శనములు సెలవిచ్చాయి అవి కాలానుగతంగా వస్తాయి కనుక కాలమనే విధి వ్రాత అని కూడా కొందరనమ్మకము కొన్ని ఉదాహరణలను చూస్తే నిజమేమో అనిఅనిపించక మానదు.

1) ఒకసారి అదృష్ట దేవతకు శనికి పేచీ వచ్చిందట. ఒక నిష్ట దరిద్రుడు దారిలో నడుస్తూవుంటే అదృష్టదేవత దారిలో డబ్బు మూటను వుంచుతుందట. అప్పటివరకు క్రిందచూస్తూ నడుస్తున్న ఆ దరిద్రుడు శని ప్రభావముచే అక్కడికి వచ్చేసరికి కళ్లు మూసుకొని నడువవలెనన్న కోరికతో కళ్లు మూసుకొని డబ్బు సంచిని తన్నుకుంటూ వెళ్ళిపోతాడు, అదృష్ట దురదృష్టం లను మనం నిత్య జీవితంలో అనుభవిస్తూనే ఉంటాము. ఏమిటి వాటికి దేనితోనైనా సంబంధంఉందా? ఉంటె ఎలాంటి సంబంధం? తార్కికంగా మనకు ఎలాంటి సంబంధం కన్పించుటలేదే? ఇంకొక రష్యన్ కథ నాకు గుర్తుకువస్తుంది.

2) ఇద్దరు వ్యాపారస్థులు కలసిప్రయాణం చేసి రాత్రికి ఒకసత్రంలో బసచేస్తారు. రాత్రిపూట ఒకదొంగ డబ్బు ఎక్కువగానున్న ఒక వర్తకుని చంపి. ఆకత్తిని రెండవ వర్తకుని దిండుక్రింద ఉంచి వెళ్ళిపోతాడు మరునాడు రక్షకభటులు వచ్చి రెండవ వర్తకుని హంతకునిగా నెంచి చెరసాలలోవేస్తారు. పదిసంవత్సరముల తర్వాత ఖైదీలు తాము అక్కడకు ఎలా వచ్చిందీ ఒకరి నొకరికి వివరించుకుంటూ

వుంటారు అప్పుడు ఆ హత్య చేసినదొంగ కూడా వేరే నేరముపై వచ్చిఅక్కడే వుంటాడు. ఈ వర్తకుడు తాను నిరపరాధినని జరిగింది, జరిగినట్లుగా వివరిస్తాడు. అది విని ఆ దొంగ ఆ రోజు ఆ హత్య చేసింది తనేనని చెప్పి పశ్చాత్తాపంతో ఆ వర్తకుడు నిరపరాధియని జైలర్‌కు విన్నవిస్తాడు. జైలర్ చక్రవర్తికి విన్నవించగా చక్రవర్తి వర్తకుని విడుదలకు ఆజ్ఞాపత్రం పంపిస్తాడు. కాని ఆ పత్రము వచ్చేసరికి ఈ వర్తకుడు చనిపోయి వుంటాడు.

కాని నిజానికి సుఖదుఃఖములు గాని అదృష్టదురదృష్టములుగాని నాణెమునకు బొమ్మా బొరుసూ వంటివి. నాణెమును ఎగుర వేసినప్పుడు బొమ్మో, బొరుసో ఏదో ఒకటి పడుతుంది రెండికి అవకాశము Probability ఒకటే, సమానమే అంతేగాని బొమ్మ పడుటకు ఏదో దేవుడు లేక పూర్వజన్మ ఫలము కారణము కాజాలవు అదే విధముగా మన జీవితములో వచ్చే సుఖ దుఃఖాలకు అదృష్ట దురదృష్టములకు ఏ అదృశ్య శక్తి కారణము కాదు. మన జీవితము ఒక నాణెము వంటిది అని అనుకుంటె, కాలము వివిధ ఘటనల సముదాయము. ప్రతిసారి ఏదో ఒకటి పడుతున్నట్లుగానే సుఖదుఃఖాలు ఏదో ఒకటి కల్గుతుంటాయి. అంతకు మించి వేరే సంబంధమేమీ మనకు కన్పించుట లేదు.

సామాన్య ప్రజలను నైతికమార్గంలో ఉంచటానికని చెప్పి పాప - పుణ్యములు స్వర్గ - నరకములు, కర్మ పునర్జన్మలను మన పూర్వీకులు సృష్టించినవేగాని అవి నిజము కాదు. కాని ఆ కాలము పోయి అవన్నీ వక్ర రీతిలో అర్ధంచేసుకోబడుతున్నాయి. తప్పులు చేసి దేవుని క్షమించమని అడిగేవారు ఎంతమంది లేరు. అంతే గాకుండా వానిని నమ్మనివారు ఇంకా ఎక్కువ తప్పులు చేయుటానికి అవకాశం ఉంది. పునర్జన్మ, పూర్వజన్మ ఫలితములైన అదృష్టం లేవంటున్నానేగాని మంచి - చెడూ లేవనుట లేదు మనం

నిత్యం చేస్తున్న మంచి చెడు కర్మల ఫలితాలను మరుజన్మదాకా ఎందుకు ఈ జన్మలోనే అనుభవిస్తున్నాము మన నిత్య జీవితానికి కూడా To every action there is an equal and opposite reaction అన్న ప్రాథమిక భౌతిక సూత్రం వర్తిస్తుంది. మనం సంఘంలో జీవిస్తున్నాం నీవు మంచి వాడవైతే అందరూ నీకు మంచే చేస్తారు. దుర్మార్గుడవైతే ఎవరూ నీకు సహాయం చేస్తారు. ఈ రియాక్షన్ direct గా కన్పించక పోయినా పరోక్షంగా నైనా పనిచేస్తుంది. నీ మంచి, చెడుపనుల మీదనే సంఘం రియాక్షన్ ఉంటుంది. మనం చేసిన తప్పొప్పుల ఫలితాన్ని తప్పకుండా ఏదో ఒక కాలంలో ఏదో ఒక రూపంలో ఈ జన్మలోనే అనుభవిస్తాము కావున ఎల్లప్పుడు మంచిగానే ఉండాలి.

మనం పుట్టిన కాలమే మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. అని జోతిష్కులంటారు. గ్రహాల ప్రభావం మన నిత్య జీవితంలో వుంటే ఉండవచ్చు అయితే దానిలో దేవుని సంబంధ మేమీ లేదు. పున్నమి నాడు సముద్రపు ఆటు పోటుల పెరుగుదలను చూస్తున్నాము అంటే చంద్రుని ప్రభావం సముద్రంపై ఉన్నట్లే కదా! కాని ఇదంతా జ్యోతిష్యం అనకుండా ఖగోళ శాస్త్రమంటె బాగుంటుంది. న్యూటన్ రెండు పదార్థముల మధ్యగల ఆకర్షణ శక్తిని సూత్రీకరించాడు కదా! $F = \frac{g\, m_1\, m_2}{d^2}$

ఇకడ g గురుత్వాకర్షణశక్తి, $m_1 m_2$ అనునవి ఆపదార్థముల ద్రవ్యరాశులు, వాటిమధ్యదూరం "d". మనం పుట్టినప్పుడు, ప్రతిగ్రహ ప్రభావాన్ని ఆ గ్రహం ఆ క్షణంలో ఉన్న దూరాన్నిబట్టి నిర్ణయించవచ్చునేమో దీన్నిగురించి ఇప్పటికి మనకు పూర్తిగా తెలియకపోయినా రాబోవు విజ్ఞానవేత్తలు కనుగొనగలరేమో! అహంకారమును, ఆశ లేదా కోరికల నణచుకున్నచో ఎక్కువ భాగము దుఃఖములు నశిస్తాయి. అయినా అటువంటి వారికి కూడా avidents

మూలంగా గాని అకారణ దుఃఖాలు కల్గుతుంటాయి. వాటి నివారణకు యోగాభ్యాసం ద్వారా సుఖ దుఃఖాలపై సమానంగా ప్రతిఫలించే చిత్తవృత్తిని అలవర్చుకొనడమే మార్గం. మనస్సుయొక్క శక్తి అమోఘం యోగాభ్యాసం ద్వారా అతీంద్రియ శక్తులు కల్గుతాయుంటారు. కొంతమందిని పరిశీలిస్తే నిజమనిపిస్తుంది. దీనిమీద ఇప్పుడు ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. మనకు నిత్య జీవితంలో కలిగే warning thoughts, warning dreams, Transmediation in protism మొదలగునవి.

## పరిశీలించిన గ్రంథములు


విశ్వదర్శనము — నండూరి రామమోహనరావు

భారతీయ తత్వశాస్త్రము — డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ 5 Volumes

భారతీయ తత్వశాస్త్రము — ఏటుకూరి బలరామమూర్తి

భారతీయ తత్వశాస్త్రము — దేవీచంద్ర చటోపాధ్యాయ

బౌద్ధం — రాహుల్ సాంకృత్యాయన్.


SRI VENKATESWARA CENTRAL LIBRARY TIRUPATI

మానవత్వానికి మించిన దైవంలేదు.

ముద్రణ :—

శ్రీ విజయ సాయి ప్రింటర్స్, ఏర్పేడు.